

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 311

బుధవారం 1-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మన ఊరు మన బడి | మన బస్తీ మన బడి

సర్కారు బడులలో సకల వసతులు

పాఠశాల విద్యాశాఖ తెలంగాణ ప్రభుత్వం

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రూ.7289.54 కోట్లతో దశలవారీగా 12 రకాల మౌలిక వసతుల కల్పన

పాఠశాల విద్యాశాఖ

తెలంగాణ ప్రభుత్వం

మన ఊరు మన బడి | మన బస్తీ మన బడి

సర్కారు బడులలో సకల వసతులు



రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో రూ.7289.54 కోట్లతో

దశలవారీగా 12 రకాల మౌలిక వసతుల కల్పన

- భవనాలకు మరమ్మతులు మరియు రంగులు • కిచెన్ షెడ్స్
- అదనపు తరగతి గదులు • కాంపౌండ్ వాల్స్
- టాయిలెట్లు మొదలగు వసతుల నిర్మాణం • మంచి లైటింగ్
- సరిపడా ఫర్నిచర్ • గ్రీన్ చాక్ బోర్డులు
- డిజిటల్ తరగతులు • పచ్చని పరిసరాలు
- పరిశుభ్రమైన తాగునీరు • ఉన్నత పాఠశాలల్లో డైనింగ్ హాల్స్
- విద్యుత్ కోసం సోలర్ ప్యానల్స్



గౌ.శ్రీమతి. పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి

విద్యాశాఖ మంత్రివర్యులు



అధునాతన వసతుల పాఠశాలలు - బడి పిల్లల భవితకు బంగారు బాటలు

జారీచేసినవారు : కమీషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

కేరళలో యూనివర్సిటీ విద్యార్థినులకు అధికారికంగా బహిష్టు సెలవులు లభించాయి. ఆ వరుసలో దేశంలోనే మొదటిసారిగా కొట్టాయంలోని ఒక సిబిఎస్ఇ స్కూలు తన విద్యార్థినులకు బహిష్టు సెలవు ప్రకటించింది. అంతేకాదు తన స్కూలులో ఈడేరే వయసు అమ్మాయిల కోసం 'ప్యూబర్టీ ల్యాబ్'ను ఏర్పాటు చేయనుంది. పుష్పవతులైన అమ్మాయిలకు ఈ ల్యాబ్‌లో సూచనలు సలహాలు ఇవ్వడమే కాదు ప్యాడ్స్ వాడకం కూడా తెలుపుతారు. విద్యార్థినుల అటెండెన్స్‌లో తప్పనిసరి శాతాన్ని సవరిస్తూ యూనివర్సిటీల్లో, హైస్కూళ్లలో ఇలాంటి సెలవు ఇవ్వడాన్ని ప్రతి రాష్ట్రం ఆలోచించాల్సి ఉంది.

చర్చనీయాంశం

ఈ సెలవు అవసరమే



మనిషి నాగరికుడు కావడం అంటే తను నివసించే సమాజాన్ని స్నేహపూరితంగా, వేదనా రహితంగా, ఎవరికీ ఇబ్బంది కలగని రీతిలో నిర్మించుకోవడమే. ప్రతి సమూహపు ప్రజాస్వామికమైన డిమాండ్లను పరిష్కరించుకుంటూ వెళ్లడమే. సమస్యలను గుర్తించి వాటిని పరిగణిస్తూ పోవడమే. ఈ సమాజం మహిళా స్నేహితంగా ఉండాలని మహిళలు ఏనాటి నుంచో కోరుకుంటున్నారు. ముఖ్యంగా వారి దైహిక సమస్యలను, పరిమితులను గుర్తించి ఆ మేరకు అన్ని రంగాలు, విధానాలలో ఎరుక ప్రదర్శించమని అంటున్నారు. ఉద్యోగాల్లో స్త్రీలు మెటర్నిటీ లీవు పొందడానికి సుదీర్ఘ కాలం పట్టింది. ఆ తర్వాత ఎన్నో ఏళ్ల పోరాటానికి ఫలితంగా ఇటీవల అనేక సంస్థలు బహిష్టు సెలవులు స్త్రీలకు మంజూరు చేస్తున్నాయి. దానికి కొనసాగింపుగా తాజాగా కేరళ ప్రభుత్వం యూనివర్సిటీ విద్యార్థినులకు అధికారికంగా బహిష్టు సెలవులు మంజూరు చేసింది. ఇది చాలా గొప్ప స్త్రీ పక్ష నిర్ణయం.

■ ఆమె లీడర్ అయ్యాక

కేరళలోని కొచ్చిన్ యూనివర్సిటీ మొన్నటి జనవరి 11న తన యూనివర్సిటీ విద్యార్థినులకు బహిష్టు సెలవలు ఇస్తున్నట్టుగా ప్రకటించింది. దానికి కారణం ఆ యూనివర్సిటీలో డిసెంబర్‌లో స్టూడెంట్ ఎలక్షన్లు జరిగి ఎస్.ఎఫ్.ఐ తరఫున నమితా జార్జ్ అనే విద్యార్థిని స్టూడెంట్ యూనియన్‌కు చైర్ పర్సన్‌గా ఎంపిక కావడం. పాలక్కడ్‌కు చెందిన 23 ఏళ్ల నమిత ఆ యూనివర్సిటీలో లా ఫైనల్ ఇయర్ చదువుతోంది. తనలాంటి విద్యార్థినుల ఇబ్బంది గమనిస్తూ రావడం వల్ల తాను లీడర్ అయిన వెంటనే విద్యార్థినులకు బహిష్టు సెలవులు ఎంత అవసరమో వివరిస్తూ ఆమోదం కోసం యూనివర్సిటీకి లేఖ రాసింది. యూనివర్సిటీ వెంటనే ఈ లేఖను పరిగణించి జనవరి 11న బహిష్టు సెలవులు ప్రకటించింది. అంతేకాదు తన యూనివర్సిటీలో 18 ఏళ్లు పైబడిన విద్యార్థినులకు 2 నెలల ప్రసూతి సెలవు వాడుకునే వెసులుబాటును ప్రకటించింది. విద్యార్థినుల తరఫున చేయదగ్గ కనీస నిర్ణయంగా యూనివర్సిటీ ఈ చర్యను వ్యాఖ్యానించింది.

> సెలవు అవసరమా అని కొట్టాయంలోని స్కూలు యాజమాన్యాన్ని అడిగితే 'ఆరోగ్యం బాగలేకపోతే పిల్లలు ఎలా బడికి రారో బహిష్టు సమయంలో కూడా అలానే రారని అర్థం చేసుకుంటే సరిపోతుంది' అన్నారు.

■ కదిలిన ప్రభుత్వం

కొచ్చిన్ యూనివర్సిటీ విద్యార్థినులకు బహిష్టు సెలవులు ప్రకటించాక దానికి వచ్చిన స్పందన చూసి కేరళ ప్రభుత్వం స్పందించింది. కేరళలోని మొత్తం 14 యూనివర్సిటీల్లో విద్యార్థినులకు బహిష్టు సెలవు, ప్రసూతి సెలవు మంజూరు చేసింది. యూనివర్సిటీల్లో సెమిస్టర్లు రాయడానికి 75 శాతం హాజరు అవసరం. కాని విద్యార్థినులకు ఇక మీదట 73 శాతం హాజరు ఉంటే సరిపోతుంది. 2 శాతం బహిష్టు సెలవుల కింద పోతుంది. ఈ నిర్ణయం వెలువడటం వెనుక అక్కడి ఉన్నత విద్యాశాఖ మంత్రిగా ఒక మహిళ డాక్టర్ ఆర్.బిందు ఉండటం కూడా ఒక కారణం కావచ్చు.

■ స్కూళ్ల మాట ఏమిటి?

ఈ నిర్ణయం వెలువడ్డాక జూనియర్ కాలేజీల్లో, స్కూళ్లలో విద్యార్థినుల బహిష్టు సెలవుల గురించి చర్చ వచ్చింది. వారిని పరిగణనలోకి తీసుకోవడానికి ప్రభుత్వం తగిన విధానం కోసం అధ్యయనం చేస్తోంది. ఈలోపు కొట్టాయంలోని 'లేబర్ ఇండియా పబ్లిక్ స్కూల్' అనే సిబిఎస్ఇ స్కూలు తన స్కూల్లోని విద్యార్థినులకు బహిష్టు సెలవులు తనకు తానుగా మంజూరు చేసింది. అంతేకాదు 'ప్యూబర్టీ ల్యాబ్' పేరుతో ఒక ల్యాబ్‌ను తెరిచి ఈడేరే పిల్లల కోసం బహిష్టు క్లినిక్, శుభ్రత శిక్షణ, ప్యాడ్‌ల తయారీ, లైంగిక ఆరోగ్యం గురించి అవగాహన అందుబాటులోకి తేనుంది. 'తెలిసీ తెలియని వయసులో బహిష్టు సమయంలో ఆడపిల్లలకు ఎన్నో భయాలు, ఆందోళనలు, మానసిక, శారీరక సమస్యలు ఉంటాయి. వాటిని నివృత్తి చేసే వ్యవస్థ అవసరం' అని ఆ స్కూలు యాజమాన్యం చెప్పింది.

■ అతి ముఖ్యమైన సమస్య

కేరళలోనే కాదు దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఆడపిల్లలు హైస్కూల్లో డ్రాపవుట్స్ కావడానికి బహిష్టు సమస్య, టాయిలెట్ల సమస్య ముఖ్య కారణాలని ఎన్నో అధ్యయనాలు చెప్పాయి. శానిటరీ ప్యాడ్స్‌ను ఉచితంగా ఇచ్చే ప్రయత్నాలు ఇంకా పూర్తి స్థాయి జరగడం లేదు కాని కదలిక వచ్చింది. టాయిలెట్ల సమస్య కూడా కొన్ని రాష్ట్రాల్లో సమర్థంగా కొన్ని రాష్ట్రాల్లో అంతంత మాత్రంగా తీరుతోంది. విద్యార్థినులు బహిష్టు మూడు రోజులు తీవ్ర ఇబ్బందితో స్కూల్‌కు రాలేకపోతే హాజరుకు భయపడి అసలుకే ఎగనామం పెట్టవచ్చు. అదే బహిష్టు సెలవు ఉంటే ధైర్యంగా పెట్టుకునే వీలు ఉంటుంది. ఈ సెలవు అవసరమా అని కొట్టాయంలోని స్కూలు యాజమాన్యాన్ని అడిగితే 'ఆరోగ్యం బాగలేకపోతే పిల్లలు ఎలా బడికి రారో బహిష్టు సమయంలో కూడా అలానే రారని అర్థం చేసుకుంటే సరిపోతుంది' అన్నారు. నిజమే. జ్వరం వస్తే స్కూలుకు పోనట్టు పిరియడ్స్ సమయంలో ఇబ్బంది ఉంటే స్కూలుకు పోని వీలు విద్యార్థినులకు ఉండాలి.

స్త్రీల గురించి ఆలోచించే కొద్ది ఎన్ని మార్పులు వ్యవస్థలో రావాలో మెల్లమెల్లగా అర్థమవుతోంది. విద్యార్థినులకు ఈ సౌకర్యం ఎంత అవసరమో ప్రతి ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకుంటే ఆడపిల్లల చదువు మరింత సౌకర్యంగా కొనసాగుతుందనడంలో సందేహం లేదు.

రికార్డ్

**పాటలు అందరూ పాడతారు కానీ గానకోకిలలు కొందరే అవుతారు.
అలాంటి గానకోకిలలలో కూడా ఒకరో ఇద్దరో మాత్రమే సంగీత సామ్రాజ్ఞులు అవుతారు.
ఆ సంగీత సామ్రాజ్ఞి అల్కా యాజ్ఞిక్.
గత మూడేళ్లుగా ఆమె పాటలు యూట్యూబ్‌లో అత్యధికంగా స్ట్రీమ్ అవుతూనే ఉన్నాయి.
ఈ సంవత్సరం అది రికార్డులకే రికార్డుగా మారింది.
2022 వ సంత్సరంలో ఏకంగా 15.3 బిలియన్ల స్ట్రీమ్స్ సాధించింది అల్కా.
అంటే సగటున రోజుకు 42 మిలియన్లు... మన లెక్కల్లో చెప్పాలంటే
రోజుకు నాలుగు కోట్ల 20 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఆమె ఛానెల్‌ను వీక్షించారు.
అదేమైనా సాధారణమైన విషయమా?
కానే కాదు.. అందుకే ఆమె గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో యూ ట్యూబ్ స్ట్రీమింగ్‌లో ప్రథమ స్థానం సాధించి 2022వ సంవత్సరానికిగానూ మోస్ట్ స్ట్రీమ్డ్ ఆర్టిస్ట్‌గా పేరు తెచ్చుకుంది.**

యూ ట్యూబ్‌కి అల్కా కిరీటం

నాలుగో ఏట భజన గీతాలు పాడటంతో ఆరంభమైన ఆమె గానకౌశలం అనగ అనగ రాగమతిశయిల్లుచుండు అన్నట్లు సెలయేళ్లు, నదులు తమ దిశలను మార్చుకుంటూ ప్రవహించినట్లు ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఒడుపులను అందిపుచ్చుకుంటూ సరికొత్త రికార్డులను సృష్టిస్తూనే ఉంది.



యూట్యూబ్ లో గాయనీగాయకులకు ఉండే ఫాలోయింగ్ అసాధారణం. నేటితరం చాలా వేగంగా యూట్యూబ్ డిజిటల్ మాధ్యమాల వేదికపై దూసుకుపోతున్నారు. అయితే సీనియర్ గాయణీమనుల్లో అల్కా యాగ్నిక్ గత వరుస మూడు సంవత్సరాలుగా యూట్యూబ్ లో స్థిరంగా రాణిస్తున్న గాయనిగా రికార్డులకెక్కారు.

గిన్నిస్ రికార్డ్స్ ప్రకారం అల్కా యాగ్నిక్ గత సంవత్సరం 15.3 బిలియన్ యూట్యూబ్ స్ట్రీమ్ లను సంపాదించారు. సగటున రోజుకు 42 మిలియన్లు.. ఇది అసాధారణం. గత మూడు సంవత్సరాలుగా అల్కా పాటలను యూట్యూబ్ తన సందర్శకులకు మళ్లీ మళ్లీ వినిపిస్తూనే ఉంది.

ఏక్ దో తీన్ ...

1966 మార్చి 20 న కోల్‌కతాలో జన్మించిన అల్కా 1980 లలోనే సినీ నేపథ్య గాయనిగా తన ప్రస్థానం ప్రారంభించినా ఆ దశకం చివరలో వచ్చిన నాటి మేటి క్లాసిక్ చిత్రం తేజాబ్‌లో మాధురీ దీక్షిత్‌కు పాడిన ఏక్ దో తీన్ .. పాటతో మొదటి హిట్టు కొట్టింది. అప్పట్లో ఈ పాట దేశవ్యాప్తంగా ఎక్కడ ఏ ఫంక్షన్ జరిగినా తప్పనిసరిగా వినిపించిన ఒక హుషారైన గీతం అంటే అతిశయోక్తి కాదు. ఈ పాటకు అల్కా యాగ్నిక్ ఫిల్మ్ ఫేర్ అవార్డును అందుకున్నారు.

ఆ తర్వాత నుంచి ఆమె ఎందరో సహ గాయకులతో, సంగీత దర్శకులతో పాడుతూ ఉత్తమ నేపథ్య గాయనిగా వేలాది పాటలు పాడి అత్యధిక ఫిల్మ్‌ఫేర్ అవార్డులను గెలుచుకుని రికార్డుల పంట పండించిన ఘనత తను సొంతం చేసుకుంది. తాజాగా అన్ని రికార్డులనూ తిరగరాసింది. విశేషమేమిటంటే ఆమె పాటలు భారతదేశంలోనే కాదు, పాకిస్థాన్‌లో అయితే ఏకంగా 683 మిలియన్ స్ట్రీమ్స్ సాధించడం, ఇటీవలి కాలంలో యూత్‌ను ముఖ్యంగా టీనేజర్స్‌ను ఒక ఊపు ఊపేస్తున్న కొరియాకు చెందిన బీటీఎస్ బృందాన్ని కూడా అల్కా ఈ రేసులో వెనక్కు నెట్టేయడం మరో విశేషం.

యూట్యూబ్ ఆమెకు కిరీటాన్ని అలంకరించడం కాదు.. యూట్యూబ్‌కే ఆమె మకుటాయమానంగా శోభిల్లుతోందంటే అది ఆమె గానమాధుర్యం గొప్పతనమే కాదు, సంగీతానికున్న క్రేజు, మోజు కూడా!

బ్యూటిప్స్

ముడతలకు జాగరీ వాష్

బెల్లంతో తయారు చేసిన ఫేస్ వాష్ యాంటీ ఏజింగ్‌గా పనిచేసి ముడతలను కనిపించనియ్యదు.




- చిన్న బెల్లం ముక్క తీసుకుని ఒక గిన్నెలో వేసి, సరిపడా నీళ్లుపోసి మరిగించాలి. బెల్లం కరిగిన తరువాత టీస్పూను శనగపిండి, టీస్పూను పెరుగు వేసి చక్కగా కలుపుకోవాలి.
- ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఏడు నిమిషాలపాటు గుండ్రంగా మర్దన చేయాలి. తరువాత ఇరవై నిమిషాలపాటు ఆరనిచ్చి చల్లటి నీటితో కడిగేయాలి. ముఖాన్ని తడిలేకుండా తుడుచుకుని మాయిశ్చరైజర్ లేదా అలోవెరా జెల్ రాసుకోవాలి.
- ఈ ఫేస్ వాష్‌ను వారానికి రెండుసార్లు క్రమం తప్పకుండా వాడడం వల్ల ముఖం మీద సన్నని గీతల్లా కనిపించే ముడతలు తగ్గ ముఖం పడతాయి.

స్ఫూర్తి

రాట్నం వడకడం అనేది సాంకేతిక విషయం కాదు. స్వాతంత్ర్య ఉద్యమంతో ముడిపడి ఉన్న విలువైన చారిత్రక జ్ఞాపకం. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రతీక్ష సోనీకి ఆ చారిత్రక జ్ఞాపకాల సమహారం అంటే ఇష్టం. వాటి నుంచి స్ఫూర్తి పొంది నలుగురికి సహాయపడడం అంటే ఇష్టం...


ప్రతీక్ష సోనీ



బాపూజీ బాటలో..

మధ్యప్రదేశ్‌లోని ఖరగ్‌పూర్‌కు చెందిన ప్రతీక్ష సోనీ బాల్యం నుంచి బాపూజీ గురించి వింటూ పెరిగింది. రాట్నం వడకడం ద్వారా స్వదేశీ ఖాదీ ఉద్యమానికి ఊపిరులూదిన మహాత్ముడి గురించి ఎన్నో కథలు విన్నది. అలా తనకు తెలియకుండానే రాట్నం వడకడంపై ఆసక్తి మొదలైంది. చివరికి అదే తన ఉపాధిగా మారింది.

'మహాత్ముడు మాకు ఉపాధి కల్పించాడు. ఇంటి దగ్గరే రాట్నం వడుకుతూ ఎలాంటి ఆర్థిక సమస్యలు లేకుండా ఉంటున్నాం. ఇదంతా ఆ మహాత్ముడి దయ' అంటుంది పద్దెనిమిది సంవత్సరాల ప్రతీక్ష.

ఆర్థికంగా బలహీనంగా ఉన్న 93 మందికి పైగా మహిళలకు రాట్నం వడకడం నేర్పించి సొంత కాళ్ల మీద నిలబడేలా చేసింది ప్రతీక్ష.

'ఒకరోజు కూలి దొరికి, మరొక రోజు దొరకక ఆర్థికంగా ఇబ్బందులు పడేదాన్ని. అప్పులు చేయాల్సి వచ్చేది. ఇలాంటి పరిస్థితులలో ప్రతీక్ష నాకు కొత్త దారి చూపించింది' అంటుంది ఇద్దరు పిల్లలకు తల్లి అయిన సుమిత్ర.

ఇరవై సంవత్సరాల విమల పట్నంలో ఉద్యోగం చేయడానికి వెళ్లింది. అయితే మూడు నెలలు గడవకుండానే తాను అక్కడ ఉండడం కష్టమనే విషయం అర్థమైంది. తన జీతంలో సగం డబ్బులు ఇంటి అద్దెకే పోయేవి. అలా అని ఊరుకెళ్లలేని పరిస్థితి. అక్కడ ఏ పని దొరకని పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రతీక్ష గురించి తెలుసుకుంది.

రాట్నం వడకడం నేర్చుకొని ఎలాంటి ఆర్థిక ఇబ్బందులూ లేకుండా ఊళ్లోనే ఉంటుంది విమల.

ఇటీవల నేపియ పట్టణంలో జరిగిన స్వదేశి ఖాదీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీక్ష-

'ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా కొత్త ఉత్తేజం వస్తుంది. పదిమందికి సేవ చేయాలనే దృక్పథం ఉన్న వారు పరిచయం అవుతారు. అలాంటి వారి నుంచి కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. ఎన్నో మంచి పనులు చేయవచ్చు' అంటుంది ప్రతీక్ష సోనీ.

కిచెన్ టిప్స్



- మినరల్ వాటర్ క్యాన్‌ను శుభ్రం చేయడం కొంచెం కష్టం. అయితే దానికో సులువైన చిట్కా ఉంది. క్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల రాళ్ల ఉప్పు, టీస్పూను బేకింగ్ సోడా, రెండు స్పూన్ల నిమ్మ రసం, కాసిని కొద్ది గోరు వెచ్చని నీళ్లు పోసి పదిహేను నిమిషాలు నానబెట్టాలి. తరువాత క్యాన్‌ను పైకి కిందకు బాగా గిలకొట్టాలి. పదినిమిషాలపాటు ఇలా గిలకొట్టి రెండుమూడుసార్లు నీటితో కడగాలి. తరువాత డిష్ వాష్ లిక్విడ్‌తో వాటర్ క్యాన్ బయటవైపు తోముకుంటే క్యాన్ మురికి వదిలి కొత్తదానిలా మెరుస్తుంది.
- బట్టల మీద పడిన ఇంక్ మరకలు పోవాలంటే...ఇంక్ మరకలపై కొద్దిగా నీళ్లు చల్లాలి. ఇప్పుడు టూత్ పేస్టును అప్లై చేసి బ్రష్‌తో రుద్ది నీటితో వాష్ చేస్తే ఇంక్ మరకలు ఇట్టే పోతాయి.

యూత్ పల్స్

**'బడ్జెట్ అంటే అంకెల వరుస కాదు. అంతకంటే ఎక్కువ. మన జీవితంతో ముడిపడి ఉన్న విషయం'
'బడ్జెట్ నవ్విస్తూనే ఏడిపిస్తుంది. ఏడిపిస్తూనే నవ్విస్తుంది'
... ఇలాంటి మాటలెన్నో బడ్జెట్‌కు ముందు, బడ్జెట్‌కు తరువాత వినిపిస్తూనే ఉంటాయి. యువతరం ఈ మాటలకు ఎంత ప్రాధాన్యత ఇస్తుందో తెలియదుగానీ 'బడ్జెట్ ప్రసంగం' వినడానికి మాత్రం తగిన ఆసక్తి ప్రదర్శిస్తోంది. సివిల్స్ కలలు కనే వారి నుంచి స్టార్టప్‌కు శ్రీకారం చుట్టాలనుకునే వారి వరకు, క్రిప్టో కరెన్సీపై ఆసక్తి చూపుతున్న వారి నుంచి లాంగ్-టర్మ్ సేవింగ్ కల్చర్‌లో భాగం అవుతున్న వారి వరకు యువతరంలో చాలామంది బడ్జెట్ తీరుతెన్నులు, విషయాలు, విశేషాలను తెలుసుకోవడానికి, తమదైన శైలిలో ఆసక్తి ప్రదర్శిస్తున్నారు...**



బడ్జెట్ బడిలో యువతేజం

కాలేజీలో చదువుతున్నవారు, మొన్న మొన్ననే కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు, ఉద్యోగం ఊసు ఎత్తకుండా స్టార్టప్ కలలు కనే యంగ్‌స్టర్స్‌కు బడ్జెట్ ప్రసంగం అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. 'క్యాపిటల్ బడ్జెట్ అంటే ఏమిటి? రెవెన్యూ బడ్జెట్ అంటే ఏమిటి? అసలు బడ్జెట్ అంటే ఏమిటి?'... రెండు సంవత్సరాల క్రితం బెంగళూరుకు చెందిన నిహారికకు తెలిసి ఉండకపోవచ్చు, తెలుసుకోవాలనే ఆసక్తి ఉండకపోవచ్చు... కాని ఇప్పుడు పరిస్థితి వేరు.

తానేమీ ఆర్థికశాస్త్ర విద్యార్థి కాకపోయినా బడ్జెట్ గురించి రకరకాల కోణాలలో తెలుసుకోవడం అనేది ఆమె ప్రధాన ఆసక్తిగా మారింది. దీనికి కారణం భవిష్యత్‌లో సివిల్స్ పరీక్ష రాయాలనుకోవడం.

'అన్ని విషయాలలో అవగాహన ఉంటేనే సివిల్స్‌లో సక్సెస్ అవుతాం. ఇష్టమైన సబ్జెక్ట్‌కు పరిమితమైతే కల కలగానే మిగిలిపోతుంది' అంటుంది నిహారిక.

యంగ్‌పీపుల్ బడ్జెట్ ప్రసంగం వినడానికి ఆసక్తి చూపడానికి గల కారణాలలో సివిల్స్‌లాంటి పరీక్షలు మాత్రమే కాదు 'ఏ రంగాలలో ఉపాధి అవకాశాలు ఉన్నాయి' అని తెలుసుకోవడం కూడా ఒకటి.

గత సంవత్సరం బడ్జెట్‌లో పద్నాలుగు పరిశ్రమలలో లక్షలాది ఉద్యోగ అవకాశాల గురించి ప్రస్తావించారు.

'ఈ సంవత్సరం పరిస్థితి ఏమిటి?' అనే ఆసక్తి సహజంగానే ఉంటుంది. ఆ ఆసక్తే వారిని బడ్జెట్‌పై ఆసక్తి కలిగేలా చేస్తుంది.

కంపెనీల లే ఆఫ్‌లతో ఉద్యోగం కోల్పోయిన వారు ప్రత్యామ్నాయాల గురించి ఆలోచిస్తున్నారు. 'మళ్లీ ఉద్యోగం వెదుక్కోవడం ఎందుకు? మనమే ఒక స్టార్టప్ స్టార్ట్ చేసి సక్సెస్ కావచ్చు కదా' అనుకునేవారు యువతరంలో చాలామందే ఉన్నారు.

'ఉద్యోగం చేయడం కంటే ఉద్యోగాలు సృష్టించండి' అని ప్రభుత్వం చెబుతున్న మాటను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నారు.

స్టార్టప్ మొదలుపెట్టాలనుకునేవారికి బడ్జెట్ గురించి తెలుసుకోవడం అనేది ముఖ్యం అయిపోయింది. అంకుర పరిశ్రమలకు పన్ను రాయితీ, ప్రోత్సాహకాలు... మొదలైనవి తెలుసుకోవడానికి బడ్జెట్ ప్రసంగం వినడం అనివార్యం అయింది.

> స్టార్టప్ మొదలుపెట్టాలనుకునేవారికి బడ్జెట్ గురించి తెలుసుకోవడం అనేది ముఖ్యం అయిపోయింది. అంకుర పరిశ్రమలకు పన్ను రాయితీ, ప్రోత్సాహకాలు... మొదలైనవి తెలుసుకోవడానికి బడ్జెట్ ప్రసంగం వినడం అనివార్యం అయింది.

హైబ్రిడ్ వర్కింగ్ మోడల్ (ఆఫీస్, ఇంటి నుంచి రెండు విధాలుగా పనిచేసే అవకాశం ఉన్నవారు) 'మా గురించి ఏమైనా ప్రస్తావన ఉందా!' అన్నట్లుగా బడ్జెట్‌పై ఒక కన్ను వేస్తున్నారు.

దీర్ఘకాలిక దృష్టితో పొదుపు చేయడం అనేది దేశ ఆర్థిక వృద్ధికి మాత్రమే కాదు, పొదుపు చేసే వారి మంచి భవిష్యత్‌కు కూడా కారణం అవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని లాంగ్-టర్మ్ సేవింగ్ కల్చర్‌ను యువతలో పెంపొందించడానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను ప్రకటిస్తోంది. వాటి గురించి తెలుసుకోవాలంటే బడ్జెట్ ప్రసంగం వినాల్సిందే.

సాంకేతిక నైపుణ్యవంతులైన యువతరం రకరకాల ఆర్థిక వనరులను, సాధనాలను వెలికి తీయడంలో ముందుంటుంది. ఈ క్రమంలో సహజంగానే వారి దృష్టి క్రిప్టో కరెన్సీపై ఉంది.

క్రిప్టో కరెన్సీకి సంబంధించి పన్నులు, నియంత్రణ అంశాలు... మొదలైనవి తెలుసుకోవడానికి బడ్జెట్ ప్రసంగం వింటున్నారు.

తమ ప్రయోజనాలకు సంబంధించి బడ్జెట్‌పై ఆసక్తి ఒక కోణం అయితే, సామాజిక కోణం అనేది రెండోది. ఇందుకు ఉదాహరణ దిల్లీకి చెందిన హిమవర్ష. డిగ్రీ రెండో సంవత్సరం విద్యార్థి అయిన హిమవర్షకు విద్యారంగం అనేది ఆసక్తికరమైన సబ్జెక్ట్.

'జాతీయ విద్యావిధానం విద్యారంగానికి తగినంత బడ్జెట్ కేటాయించమని చెబుతుంది. అయితే అవసరమైనదానిలో సగం బడ్జెట్‌ను మాత్రమే కేటాయిస్తున్నారు. మన దేశంలో విద్యారంగం అనేది వేగంగా వృద్ధి చెందుతున్న రంగం. ఈ బడ్జెట్‌లోనైనా సరిపడా నిధులు కేటాయిస్తారని ఆశిస్తున్నాను' అంటుంది హిమవర్ష.

ఆమె ప్రస్తావిస్తున్న మరో అంశం... డిజిటల్ యూనివర్శిటీ.

'డిజిటల్ యూనివర్శిటీ అనేది మన విద్యానాణ్యతను ప్రపంచస్థాయి ప్రమాణాలతో పెంచడానికి ఉపయోగపడుతుంది. గత సంవత్సరం బడ్జెట్‌లో డిజిటల్ యూనివర్శిటీ గురించి ప్రకటించారు. దీనికి సంబంధించి ఆశాజనకమైన విషయాలు ఈ బడ్జెట్‌లో ప్రస్తావిస్తారని ఆశిస్తున్నాను. ఏఆర్, వీఆర్, రోబోటిక్స్‌కు ప్రత్యేక కేటాయింపు ఉండాలి. డిజిటల్ ఎడ్యుకేషన్ సెక్టార్‌కు ప్రోత్సాహకాలు ఇవ్వాలి' అంటుంది హిమవర్ష.

'బడ్జెట్' అనే బడిపై యువతరం ఆసక్తి ప్రదర్శించడమే కాదు ఓనమాలు నేర్చుకొని, విషయ విశ్లేషణ చేస్తూ జ్ఞానపరిధిని పెంచుకొంటుంది. మంచిదే కదా!


'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 311

బుధవారం 1-2-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆఖరి ఆటకు సిద్ధం!

అహ్మదాబాద్‌లో నేడు భారత్, కివీస్ మధ్య మూడో టి20 మ్యాచ్. -12లో



ఐటీ దాడుల కలకలం

రాష్ట్రంలో ఐటీ శాఖ అధికారుల దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. -5లో



సుప్రీంకోర్టు జడ్జీలుగా..

ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను సుప్రీంకోర్టు జడ్జీలుగా ఎంపికచేయాలని కేంద్రానికి కొలీజియం సిఫార్సుచేసింది.


- వివరాలు 6లో▶



రేప్ కేసులో ఆశారామ్‌కు జీవితఖైదు

అత్యాచారం కేసులో ఆశారామ్ బాపూను దోషిగా తేల్చి జీవితఖైదు విధిస్తూ గాంధీనగర్ అదనపు సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది.

- వివరాలు 6లో▶



శాంతిభూషణ్ కన్నుమూత

న్యాయకోవిదుడు, కేంద్ర మాజీ న్యాయ శాఖ మంత్రి శాంతిభూషణ్ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు.

- వివరాలు 6లో▶



జార్ఖండ్‌లో 14 మంది అగ్నికి ఆహుతి

ధన్‌బాద్ జిల్లాలోని ఓ భవంతిలో జరిగిన అగ్నిప్రమాదంలో చిన్నారులు, మహిళలు సహా 14 మంది సజీవ దహనమయ్యారు.

- వివరాలు 6లో▶

భారత్‌దే ఈ దశాబ్దం

2025-26 నాటికి 5 ట్రిలియన్ డాలర్లకు జీడీపీ

వచ్చే ఏడాది వృద్ధి రేటు 6.8 శాతం ఉండొచ్చు

- ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో ఉపాధికి ఊతం
- తగ్గుతున్న నిరుద్యోగం.. సాగులో సంస్కరణలు అవసరం
- వడ్డీ రేట్ల పెరుగుదల పెట్టుబడులకు అవరోధం కాదు

వెల్లడించిన ఆర్థిక సర్వే 2023

- ప్రపంచం మనవైపు చూస్తోందన్న ప్రధాని నరేంద్ర మోదీ
- నివేదికను లోక్‌సభకు సమర్పించిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ఎన్నో సవాళ్ల మధ్య భారత ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరు చూపిస్తోందని.. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ మెరుగైన వృద్ధి రేటు నమోదు చేస్తుందని 2023 సంవత్సరం ఆర్థిక సర్వే అంచనా వేసింది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ అసాధారణ సవాళ్లను ఎదుర్కొంటుండటం మన ఎగుమతుల వృద్ధికి అవరోధంగా మారొచ్చని పేర్కొంది. కరోనా సృష్టించిన సవాళ్ల నుంచి ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయిలో కోలుకుని, ఎన్నో దేశాల కంటే ముందున్నట్టు తెలిపింది. ఆర్థిక వృద్ధి విషయంలో ఈ దశాబ్దం భారత్‌దేనని స్పష్టం చేసింది. 2023–24 సంవత్సరానికి 6–6.8 శాతం మధ్య జీడీపీ వృద్ధి నమోదు కావచ్చని అంచనా వేసింది. అమెరికా కేంద్ర బ్యాంకు చేపట్టే వడ్డీ రేట్ల ప్రభావమే మన రూపాయి క్షీణతకు కారణమని పేర్కొంటూ.. సమీప భవిష్యత్తులోనూ రూపాయి కదలికలను ఇదే అంశం నిర్ణయిస్తుందని స్పష్టం చేసింది. ఉపాధి కల్పన ప్రైవేటు పెట్టుబడులు పుంజుకోవడంపై ఆధారపడి ఉందని పేర్కొంది. సాగు రంగంలో యాంత్రీకరణ అవసరాన్ని తెలియజేసింది. పార్లమెంట్ ముందుకు మంగళవారం వచ్చిన ఆర్థిక సర్వే భవిష్యత్ ఆర్థిక పనితీరుపై స్పష్టతనిచ్చింది.

వివరాలు 13లో



''వచ్చే ఆర్థిక సంవత్సరంలో మన దేశ జీడీపీ వృద్ధి రేటు 6.8 శాతం నుంచి 6.5 శాతం మధ్య ఉండొచ్చు. అయినా కానీ, ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో వేగవంతమైన వృద్ధి రేటు మనదే అవుతుంది. కొనుగోలు శక్తి పరంగా భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. మారకం రేటు పరంగా ప్రపంచంలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ''

- ఆర్థిక సర్వే 2023



జనాకర్షకమేనా!

నేడే కేంద్ర బడ్జెట్

- ఐదోసారి ప్రవేశపెట్టనున్న నిర్మల
- లోక్‌సభ ఎన్నికల్లోపు చివరి పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే

6 లో



పేదరిక రహిత భారత్

- 2047కల్లా దీనిని సాకారం చేయడమే లక్ష్యం: రాష్ట్రపతి
- తొలిసారి ఉభయసభల్లో ప్రసంగం
- పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు షురూ

6 లో

కేంద్రంలో నిర్భీతితో కూడిన సుస్థిర, నిర్ణాయక ప్రభుత్వముంది. విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోంది. ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి అతి పెద్ద శత్రువైన అవినీతిపై రాజీలేని పోరాటం చేస్తోంది.



ప్రపంచానికి ఆశారేఖ

బడ్జెట్‌పై ప్రధాని నరేంద్ర మోదీ

అంతర్జాతీయంగా ప్రతికూల ఆర్థిక పరిస్థితులున్నా.. భారతదేశ బడ్జెట్ మాత్రం సామాన్య పౌరుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేలా ఉంటుంది. మన బడ్జెట్ ప్రపంచానికి ఆశారేఖ. ఇతర దేశాలు ఎన్నో ఆశలతో భారత్ వైపు చూస్తున్నాయి.

6 లో

మనకొచ్చేది ఎంత..?



అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ కేటాయింపులు ఎలా ఉంటాయోననే దానిపై తెలంగాణ ప్రభుత్వ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే కేంద్ర పన్నుల్లో వాటా తగ్గుదల, ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి, అమల్లోకి రాని నీతి ఆయోగ్, ఆర్థిక సంఘాల సిఫారసుల విషయంలో కేంద్రం ఏం చేస్తుందన్న దానిపై చర్చ జరుగుతోంది. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుల్లో ఒకదానికి జాతీయ హోదాతోపాటు విభజన హామీలపై కేంద్రం ఈ ఏడాదైనా సానుకూలంగా స్పందిస్తుందా అన్న చర్చ జరుగుతోంది.

- వివరాలు 2లో▶



రాష్ట్రపతికి మేం వ్యతిరేకం కాదు

- కేంద్రం వైఫల్యాలను ఎండగట్టేందుకే ముర్ము ప్రసంగాన్ని బహిష్కరించాం
- మోదీ సర్కారుపై మండిపడ్డ బీఆర్‌ఎస్ ఎంపీలు కేకే, నామా

2 లో

న్యూస్‌రీల్

పెట్టుబడులతో రండి



పరిశ్రమల స్థాపనకు అత్యంత అనువైన వాతావరణం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆహ్వానించారు. పరిశ్రమల ఏర్పాటులో అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. మంగళవారం ఢిల్లీలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సులో సీఎం జగన్ మాట్లాడారు.

- వివరాలు 10లో▶

టీఎస్‌ఎస్పీడీసీఎల్‌లో 1,661 పోస్టుల భర్తీ



దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో ఖాళీగా ఉన్న 1,553 జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం), 48 అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పోస్టులు కలిపి మొత్తం 1,661 పోస్టులను భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించి తక్షణమే నోటిఫికేషన్ జారీ చేయాలని విద్యుత్ శాఖ మంత్రి జీ.జగదీశ్‌రెడ్డి మంగళవారం అధికారులను ఆదేశించారు.

- వివరాలు 3లో▶



మసీదులు, సమాధులు కాదు.. అభివృద్ధికి పునాదులు తవ్వుదాం




- బీజేపీ రాష్ట్ర చీఫ్ బండికి మంత్రి కేటీఆర్ హితవు
- దేశప్రజలందరినీ మోసం చేసిన ప్రధాని మోదీ

11 లో

డ్రోన్ అంటే కెమెరా ఒక్కటే కాదు

కమలాపూర్ ఎంజేపీ విద్యార్థులతో కేటీఆర్ చిట్‌చాట్



అసెంబ్లీ సమావేశాలకు

గవర్నర్ సమ్మతి

- గత నెల 21 నాటి నోటిఫికేషన్ స్థానంలో మరో నోటిఫికేషన్
- 3న మధ్యాహ్నం 12.10 గంటలకు సమావేశాలు ప్రారంభం.. ప్రస్తుత సమావేశాల్లో మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నిక?
- గవర్నర్ ప్రసంగ పాఠంపై కసరత్తు.. కొనసాగుతున్న ఉత్కంఠ

11 లో



జూన్ 5 నుంచి గ్రూప్-1 మెయిన్స్

- పరీక్షల తేదీలను విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ
- మొదట జనరల్ ఇంగ్లిష్ పరీక్ష.. ఆపై వరుసగా ఆరు పేపర్లు
- ప్రతీ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..


3 లో

భారీగా ఐఏఎస్‌ల

బదిలీలు

- 16 జిల్లాల కలెక్టర్లకు స్థానచలనం
- 18 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు

వివరాలు 3లో



క్లుప్తంగా...

కేసీఆర్‌ది విధ్వంసకర మోడల్: కోదండరాం



సాక్షి, న్యూఢిల్లీ: కేసీఆర్ మోడల్ అంటే విధ్వంసకర మోడల్ అని, తెలంగాణలో ఏ సమస్యలను పరిష్కరించారని ఆయన జాతీయ రాజకీయాల గురించి మాట్లాడుతున్నారని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. సీఎం కేసీఆర్ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి దేశ రాజకీయాలను శాసించాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని ఆర్థిక సంక్షోభంలో తెలంగాణ రాష్ట్రం ఉందని కోదండరాం మండిపడ్డారు. టీజేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో 'తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలన-అభివృద్ధి-వాస్తవాలు'అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో కోదండరాం అధ్యక్షత వహించి ప్రసంగించారు. రైతు ఆత్మహత్యలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి వరుసలో ఉందని, ఆరోగ్యశ్రీ,, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు ఏళ్లుగా విడుదల కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని కోదండరాం విమర్శించారు. కేసీఆర్ పాలనలో అమలవుతున్న వ్యవసాయ విధానం గుప్పెడు మంది భూస్వాములకు లాభం చేకూరేలా ఉందని, దీని వల్ల చిన్న, సన్నకారు రైతులకు భరోసా లేకుండా పోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్లుగా కేసీఆర్ చేసిన అభివృద్ధి ఇదేనా? ఈ తెలంగాణ మోడల్‌నేనా ప్రస్తుతం కేసీఆర్ దేశవ్యాప్తంగా చర్చకు పెట్టింది? అని కోదండరాం ప్రశ్నించారు. సదస్సులో ఆర్థిక వేత్త డీఎల్ నర్సింహారెడ్డి, అజయ్, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కిరణ్, అజిత్ ఝా, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆశప్ప, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి కావాలి



సాక్షి, న్యూఢిల్లీ: మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని, దాని పనులు వేగవంతం చేయాలని రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కేంద్రమంత్రిని కలిసిన సందర్భంగా పెద్దపల్లికి సంబంధించిన పలు రైల్వే అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

8,9 తేదీల్లో పార్లమెంట్ వద్ద భారీ ప్రదర్శన: ఆర్.కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు పెట్టాలని కోరుతూ ఈ నెల 8,9 తేదీల్లో ఢిల్లీలో పార్లమెంట్ భవన్ వద్ద బీసీల భారీ ప్రదర్శన, జంతర్‌మంతర్ వద్ద బీసీల ధర్నా నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. బీసీల చలో ఢిల్లీ పోస్టర్‌ను మంగళవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు భూపేష్ సాగర్‌లతో కలిసి ఆయన కాచిగూడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బీసీల చలో ఢిల్లీ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల నుంచి బీసీలు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని అన్నారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమీలేయర్‌ను తొలగించాలని, బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీలం వెంకటేష్, కోల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, ఎస్సీలు, ఎస్టీలంటే కేసీఆర్‌కు చిన్నచూపు

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్‌కు మహిళలు, ఎస్సీలు, ఎస్టీలంటే గౌరవం లేదని బీజేపీ నేత ఎం.రవీంద్ర నాయక్ ధ్వజమెత్తారు. గతంలో రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్మును ఓడించేందుకు ప్రయత్నం చేసిన సీఎం కేసీఆర్.. ప్రస్తుతం తమ పార్టీ ఎంపీలతో ఆమె ప్రసంగాన్ని బహిష్కరింపజేశారని మండిపడ్డారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వెనకబడిన వర్గాల మహిళలు రాజకీయాల్లోకి రావడం చాలా అరుదని, అలాంటి మహిళా గవర్నర్‌ను కేసీఆర్ అనేక సార్లు అవమానించారని విమర్శించారు.

రెవెన్యూ భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించండి

సాక్షి, హైదరాబాద్: ప్రజల సౌకర్యం కోసం కొత్తగా సమీకృత కలెక్టరేట్లు నిర్మించినట్టుగానే డివిజన్, మండల కేంద్రాల్లో కొత్త మండల కార్యాలయాలు, ఆర్డీవో ఆఫీసుల నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) కోరింది. ఈ మేరకు ట్రెసా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్ రెడ్డి, గౌతమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు నిరంజన్ రావు మంగళవారం ఆర్థికమంత్రి హరీశ్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. శాశ్వత రెవెన్యూ భవనాల నిర్మాణంతో పాటు పాత రెవెన్యూ కార్యాలయాల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. కొత్త మండలాలు, డివిజన్లు, కలెక్టరేట్‌లలో కేడర్ స్ట్రెంగ్త్‌ను నిర్ధారించి సిబ్బంది నియామకాన్ని చేపట్టాలని కార్యాలయాల నిర్వహణకు రెగ్యులర్ బడ్జెట్ కేటాయించడంతో పాటు ఫర్నిచర్, కంప్యూటర్ కొనుగోళ్లకు నిధులివ్వాలన్నారు.

మనకొచ్చేది ఎంత?


ఎన్నికల ఏడాదిలోనైనా కేటాయింపులు ఉంటాయా? • తెలంగాణ ప్రభుత్వ వర్గాల్లో ఉత్కంఠ

- అప్పుల పరిమితుల సడలింపు, బకాయిల చెల్లింపు..
- పన్నుల్లో వాటాలు, గ్రాంట్ల పెంపు పైనే రాష్ట్రం ఆశలు
- సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా.. విభజన హామీల అమలు డిమాండ్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్ కేటాయింపులు ఎలా ఉంటాయోననే దానిపై తెలంగాణ ప్రభుత్వ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే కేంద్ర పన్నుల్లో వాటా తగ్గుదల, ఎఫ్ఆర్‌బీఎం పరిమితి, అమల్లోకి రాని నీతి ఆయోగ్, ఆర్థిక సంఘాల సిఫారసుల విషయంలో కేంద్రం ఏం చేస్తుందన్న దానిపై చర్చ జరుగుతోంది. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల్లో ఒకదానికి జాతీయ హోదాతోపాటు రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు వంటి రాష్ట్ర విభజన హామీల విషయంలో కేంద్రం ఈ ఏడాదైనా సానుకూలంగా స్పందిస్తుందా అన్న చర్చ జరుగుతోంది. అప్పులపై పరిమితులు, గ్రాంట్ల బకాయిలు, పన్నుల్లో వాటాల తగ్గింపు, సిఫారసులు అమలుకాని కారణంగా రాష్ట్రానికి ఇప్పటివరకు దాదాపు రూ.లక్ష కోట్లకు పైగా నష్టం జరిగిందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

వివిధ అంచనాల్లో ఆర్థికశాఖ..

మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఎలా ఉంటుందోనని ఆర్థిక శాఖ అధికారులు లెక్కలు వేసుకుంటున్నారు. రాష్ట్రానికి ప్రత్యేక కేటాయింపులు చేయకపోవడమే కాకుండా అప్పులు తెచ్చుకునే పరిమితుల కారణంగా రాష్ట్ర బడ్జెట్‌లో రూ.15వేల కోట్లకు పైగా లోటు వచ్చిందని.. ప్రత్యేక గ్రాంట్లు కూడా ఇవ్వకపోవడంతో ఈ ఏడాది దాదాపు రూ.30వేల కోట్ల వరకు నష్టపోయామని ఆ శాఖ అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో 'కార్పొరేషన్లకు పూచీకత్తు ఇచ్చి తీసుకునే రుణాలను రాష్ట్ర ప్రభుత్వ అప్పుల కింద ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి తీసుకురాకుండా వెసులుబాటు కల్పిస్తుందా? పన్నుల్లో వాటా కింద రాష్ట్రాలకు ఎంత ప్రతిపాదిస్తుంది? కేంద్ర ప్రాయోజిత పథకాల విషయంలో నిర్మలా సీతారామన్ పెద్ద మనసు చూపుతారా? ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణం, ఉపాధి హామీ, వెనుకబడిన జిల్లాలకు నిధుల కేటాయింపు, మహిళాశిశు సంక్షేమ పద్దులను పెంచడం ద్వారా పరోక్షంగానైనా రాష్ట్ర ప్రభుత్వానికి చేయూతనిస్తారా'అన్న కేంద్ర బడ్జెట్‌లో తేలిపోనుందని అంటున్నారు.



రాష్ట్ర ప్రభుత్వం చెప్తున్న మేరకు కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు, ఇతర నష్టాలు

- పన్నుల్లో వాటా తగ్గింపు కారణంగా రెవెన్యూ నష్టం: రూ.33,712 కోట్లు
- నీతి ఆయోగ్ మిషన్ భగీరథ సిఫారసులు: రూ.19,205 కోట్లు
- నీతి ఆయోగ్ మిషన్ కాకతీయ సిఫారసులు: రూ.5 వేల కోట్లు
- ఏపీ నుంచి ఇప్పించాల్సిన విద్యుత్ బకాయిలు: రూ.17,828 కోట్లు
- ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల కారణంగా 2022–23లో అప్పుల నష్టం: రూ.15,303 కోట్లు
- ఆంక్షలు అమలు చేయలేదంటూ జీఎస్‌డీపీలో 5 శాతం రుణ పరిమితితో నష్టం: రూ.6,104 కోట్లు
- 15వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన గ్రాంట్లు: రూ.5,374 కోట్లు
- వెనుకబడిన జిల్లాలకు నిధుల బకాయిలు: రూ.1,350 కోట్లు
- 14వ ఆర్థిక సంఘం సిఫారసుల బకాయిలు: రూ.817 కోట్లు
- 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన ప్రత్యేక నిధులు: రూ.723 కోట్లు
- ఏపీకి పొరపాటుగా బదిలీ అయిన సీసీఎస్ పథకాల నిధులు: రూ.495 కోట్లు
- 2020–21లో పౌష్టికాహార పంపిణీ కోసం ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన నిధులు: రూ.171 కోట్లు

'జల్‌జీవన్'తో వందశాతం | రక్షిత మంచినీరు

తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఆస్తిపన్ను, విద్యుత్ చార్జీలు పెంచినట్లు కేంద్ర ఆర్థిక సర్వేలో వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: జల్ జీవన్ మిషన్‌లో భాగంగా తెలంగాణ సహా నాలుగు రాష్ట్రాలు వంద శాతం మేర ప్రతీ ఇంటికి సురక్షిత మంచినీటిని అందించాయని కేంద్ర ఆర్థిక సర్వే తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ సహా పలు రాష్ట్రాలు ప్రజలపై పన్నులు మోపి ఆదాయాలు పెంచుకున్నాయని వెల్లడించింది. కోవిడ్–19 మహమ్మారితో రాష్ట్రాల రెవెన్యూలకు పెద్దఎత్తున తగిలిన ఎదురుదెబ్బతో కేంద్ర ప్రభుత్వం పలు రకాలుగా వాటిని ఆదుకుందని పేర్కొంది. అయితే పట్టణ ఆర్థిక వనరులపై ఇటీవల ఆర్బీఐ ఇచ్చిన నివేదికలో ఓఈసీడీ దేశాల కంటే భారత్‌లో ఆస్తిపన్ను వసూళ్లు చాలా తక్కువగా ఉన్నాయని ఎత్తిచూపింది. రాష్ట్రాలు వసూలు చేస్తున్న ఆస్తిపన్నుల్లో అసమానతలు ఎక్కువగా ఉన్నాయని, అందువల్ల ఆస్తిపన్ను విధానాల్లో పెద్దఎత్తున సంస్కరణలకు అవకాశం ఏర్పడుతుందని ఆర్బీఐ నివేదికలో పేర్కొందని ఆర్థిక సర్వే వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, హర్యానా, కేరళ, అసోం, పుదుచ్చేరి 2022–23 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ చార్జీలను సవరించాయని మంగళవారం పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక సర్వే 2022–23లో పేర్కొన్నారు. వీటితోపాటు 2022 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు అకాల భారీ వర్షాల కారణంగా పంటనష్టం, సరఫరాలో అంతరాయం కారణంగా కూరగాయల్లో అధిక ద్రవ్యోల్బణం నమోదైందన్నారు. ఈ కారణంగా టమోటాల ధరల పెరుగుదల ప్రభావం ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలపై పడిందని వెల్లడించారు.

పెరిగిన ద్రవ్యోల్బణం

గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హర్యానా సహా చాలా రాష్ట్రాల్లో కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (సీపీఐ-సీ) ద్రవ్యోల్బణం పెరిగిందనీ, దీనికి ఇంధనం, దుస్తులు ప్రధాన కారణమని ఆర్థిక సర్వే పేర్కొంది. ప్రసూతి మరణాల నిష్పత్తి(ఎంఎంఆర్) 2014–16లో లక్షకు 130 మంది ఉండగా, 2018–20లో లక్షకు 97గా నమోదైందని తెలిపింది. కాగా, 2030 నాటికి ప్రతి లక్ష సజీవ జననాలకు ప్రసూతి మరణాలరేటు(ఎంఎంఆర్) 70 కంటే తక్కువకు తగ్గించాలనే లక్ష్యాన్ని తెలంగాణ(43), ఆంధ్రప్రదేశ్(45) సహా ఎనిమిది రాష్ట్రాలు ఇప్పటికే సాధించాయని పేర్కొంది. ముఖ్యంగా, ప్రధానమంత్రి గతిశక్తి, కోవిడ్–19 నేపథ్యంలో లాజిస్టిక్స్ రంగంలోని ప్రస్తుత పరిణామాలను పరిగణనలోకి తీసుకొని విడుదల చేసిన లీడ్స్–2022 సర్వేలో తెలంగాణ 90 శాతం కంటే ఎక్కువ స్కోర్ సాధించి అచీవర్స్ జాబితాలో చేరిందని కేంద్ర ఆర్థిక సర్వే వెల్లడించింది.

రూ. 25 వేలిస్తే టోఫెల్‌లో టాప్ స్కోర్!

సాక్షి, హైదరాబాద్/హిమాయత్‌నగర్: అంతర్జాతీయ విద్యాసంస్థల్లో సీటు పొందడానికి విద్యార్థులకు ఉపకరించే టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాజ్ ఫారిన్ లాంగ్వేజ్ (టోఫెల్), గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎగ్జామినేషన్ (జీఆర్ఈ)తోపాటు ప్రాక్సిస్ పరీక్షల్లో భారీ స్థాయిలో మాల్ ప్రాక్టీస్ జరుగుతున్నట్లు పరీక్షల నిర్వహణ సంస్థ ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ (ఈటీఎస్) ఇండియా బయటపెట్టింది. దేశవ్యాప్తంగా ఎన్నో ముఠాలు ఈ తరహా మాల్ ప్రాక్టీస్‌లకు పాల్పడుతున్నాయని పేర్కొంది. హైదరాబాద్‌లో జరుగుతున్న మోసాన్ని స్టింగ్ ఆపరేషన్‌లో నిగ్గుతేల్చి ఆధారాలతో సహా హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి పోలీసులు పరారీలో ఉన్న గుణశేఖర్ అనే సూత్రధారితో పాటు ఇతర నిందితుల కోసం గాలిస్తున్నారు.

అధీకృత కేంద్రాలే అక్రమాలకు అడ్డగా...

ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలకు టోఫెల్, జీఆర్ఈ, ప్రాక్సిస్ పరీక్షలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. వాటిలో అభ్యర్థులు సాధించే స్కోర్ ఆధారంగానే సీటు, స్కాలర్‌షిప్ మొదలైనవి ఆధారపడి ఉంటాయి. ఈ నేపథ్యంలోనే ఏటా భారత్ సహా వివిధ దేశాలకు చెందిన లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షలు రాస్తుంటారు. భారత్‌లో ఈ పరీక్షలు నిర్వహించే ఈటీఎస్ ఇండియా... ఇందుకోసం కొన్ని అధీకృత కేంద్రాలను ఎంపిక చేసుకుంది. అయితే కొన్ని కేంద్రాల్లో అక్రమాలు జరుగుతున్నట్లు తెలుసుకొని దీన్ని నిర్ధారించుకొనేందుకు ఓ స్టింగ్ ఆపరేషన్ నిర్వహించింది. రూ. 25 వేలు చెల్లిస్తే నకిలీ టెస్ట్ టేకర్లు, హెల్పర్ల సాయంతో అసలైన అభ్యర్థికి టోఫెల్, ఇతర పరీక్షల్లో టాప్ స్కోర్ వచ్చేలా చేస్తానని ప్రచారం చేసుకుంటున్న గుణశేఖర్ అనే సూత్రధారిని ఓ టెస్ట్ టేకర్ ద్వారా ఈటీఎస్ ఇండియా సంప్రదించింది. ఆ టెస్ట్ టేకర్ రూ. 23 వేలు గూగుల్ పే ద్వారా గుణశేఖర్‌కు చెల్లించి పరీక్షకు సిద్ధమయ్యాడు.

మాల్ ప్రాక్టీస్ ఇలా...

పరీక్ష గదిలో.. ఒప్పందం చేసుకున్న టెస్ట్ టేకర్‌కు సమీపంలో గుణశేఖర్ అనుచరుడు కెమెరాలకు కనిపించకుండా దాక్కున్నాడు. కంప్యూటర్ తెరపై ప్రశ్న కనిపించగానే ఆ వ్యక్తి తన సెల్‌ఫోన్‌తో ఫొటో తీసి వాట్సాప్ ద్వారా బయట ఉన్న ముఠా సభ్యులకు షేర్ చేశాడు. వాళ్లు ఆ ప్రశ్నకు సమాధానాన్ని వాట్సాప్ ద్వారా తిప్పిపంపగానే దాన్ని టెస్ట్ టేకర్‌కు చెప్పాడు.

వైద్యరంగం స్తోమతను పెంచాలి: హరిప్రసాద్



సాక్షి, హైదరాబాద్: వైద్యరంగంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు వైద్య రంగం స్తోమతను పెంచేలా కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలుండాలని అపోలో గ్రూప్ ఆస్పత్రుల ప్రెసిడెంట్ కె.హరి ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ సగటుతో పోలిస్తే దేశంలో ప్రతి 1,000 మంది జనాభాకు 2.5 పడకల లోటు ఉందని, ఆ లోటు కూడా అసమాన పరిస్థితుల్లో ఉందన్నారు. ఈ అసమానతలను తొలగించి ప్రపంచ సగటుతో సమానంగానైనా దేశంలో ఆరోగ్య సౌకర్యాలు కల్పించేలా బడ్జెట్ అంచనాలుండాలని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలు, వృద్ధుల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించేందుకు వీలుగా ఈసారి బడ్జెట్ కేటాయింపులు ఉండాలని హరిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.

త్వరలో నీటిపారుదల సమీకృత చట్టం

- 18 వేర్వేరు చట్టాల స్థానంలో ఒకే చట్టం
- ఇప్పటికే ముసాయిదా సిద్ధం... తదుపరి అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు
- ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక నిబంధనలు
- నీటిపారుదల శాఖ ప్రత్యేక సీఎస్ రజత్‌కుమార్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖకు సంబంధించిన 18 వేర్వేరు చట్టాలను కలిపి కొత్తగా ఒక సమీకృత నీటిపారుదల చట్టాన్ని తెస్తున్నామని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే ముసాయిదా బిల్లును సిద్ధం చేశామని, బడ్జెట్ సమావేశాల్లో కాకుండా ఆ తర్వాత జరిగే సమావేశాల్లో ఈ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టే అవకాశముందన్నారు. నీటిపారుదలశాఖపై ఈఎన్‌సీ సి.మురళీధర్‌తో కలసి మంగళవారం ఆయన జలసౌధలో సమీక్ష నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నిజాం కాలం నాటి ఫసలి చట్టం 1935 అమల్లో ఉండగా రాష్ట్ర నీటిపారుదల రంగంలో సమూల మార్పులు రావడంతో కొత్త చట్టం అనివార్యమైందన్నారు. నీటిపారుదల శాఖ పునర్వ్యవస్థీకరణతోపాటు నీటి నిర్వహణ పద్ధతులు, ఆర్థికపరమైన అధికారాలు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ నిబంధనల్లో భారీ మార్పులు వచ్చాయని... నీటిపారుదల ఆస్తుల పరిరక్షణ, నీటి భద్రత, నిర్వహణ అంశాలు పాత చట్టాల్లో లేవని, కొత్త చట్టంలో వాటిపై కచ్చితమైన నిబంధనలను పొందుపరచనున్నట్లు రజత్‌కుమార్ వెల్లడించారు.

సెక్షన్–3పై వెనక్కి తగ్గలేదు..

ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపకాల కోసం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద చట్టం -1956లోని సెక్షన్ 3 కింద ట్రిబ్యునల్ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నామని రజత్‌కుమార్ తెలిపారు. కృష్ణా జలాల పంపిణీ బాధ్యతను కొత్త ట్రిబ్యునల్‌కు అప్పగించాలా లేక ఇప్పటికే మనుగడలో ఉన్న కృష్ణా ట్రిబ్యునల్–2 లేదా మరే ఇతర ట్రిబ్యునల్‌కు అప్పగించాలా? అనే అంశంపై న్యాయశాఖ సలహా మేరకు చర్యలు తీసుకుంటామని గత అపెక్స్ కౌన్సిల్ భేటీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. దీనిపై నెల రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని ఆ శాఖ అధికారులు గతేడాది డిసెంబర్‌లో హామీ ఇచ్చారని... అందువల్ల ఈ విషయమై మళ్లీ సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లాలనే భావనతో ఉన్నామని చెప్పారు. ఒకవేళ కేంద్రం నిర్ణయం తీసుకోకుంటే మళ్లీ సుప్రీంకోర్టుకు వెళ్తామని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల వాటా ఉండగా తెలంగాణకు 575 టీఎంసీలు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామని, ట్రిబ్యునల్ ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామన్నారు. గోదావరి జలాల విభజనకూ కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటును ఏపీ కోరడంపై స్పందిస్తూ తమకు ఎలాంటి అభ్యంతరం ఉండదన్నారు.

ఎనిమిది డ్యామ్‌ల మరమ్మతుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు..

ఆనకట్టల భద్రతా చట్టం కింద కడెం, మూసీ, స్వర్ణతోపాటు మొత్తం 8 డ్యామ్‌ల మరమ్మతుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్టు పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. సీతమ్మసాగర్ జలాశయం నిర్మాణంతో సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన పంపులు నీటమునగనున్నాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవంలేదని రజత్‌కుమార్ స్పష్టం చేశారు.



మంగళవారం రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించి బయటకు వచ్చిన అనంతరం విజయ్‌చౌక్ వద్ద నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీలు

రాష్ట్రపతికి మేము వ్యతిరేకం కాదు

- కేంద్రం వైఫల్యాలను ఎండగట్టేందుకే ద్రౌపదీ ముర్మ ప్రసంగాన్ని బహిష్కరించాం
- మోదీ సర్కారుపై మండిపడ్డ బీఆర్ఎస్ ఎంపీలు కేకే, నామా
- ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేశామని వెల్లడి
- దేశ సొమ్మంతా బడా వ్యాపారవేత్తలకు కట్టబెడుతున్నారని మండిపాటు
- కేంద్రం అదానీ చట్టం తీసుకొస్తే సరిపోతుందని ఎద్దేవా

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ మంగళవారం పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఉభయ సభలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని బహిష్కరించాం తప్ప రాష్ట్రపతికి తాము వ్యతిరేకం కాదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావు స్పష్టం చేశారు. అందుకే పార్లమెంటులో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపామన్నారు. గత ఎనిమిదేళ్లలో కేంద్రం ప్రజలకు ఏమీ చేయలేదని... ఎన్డీయే ప్రభుత్వం చేస్తున్న తప్పులను నిలదీయకపోతే ఎలా? అని ప్రశ్నించారు. దేశంలో ప్రజల సొమ్మును బడా వ్యాపారవేత్తలకు కట్టబెట్టేలా పాలన సాగుతోందని... అందుకే గౌతమ్ అదానీ పేరుతో కేంద్రం అదానీ చట్టాన్ని తేవాలని కేకే ఎద్దేవా చేశారు. రాష్ట్రపతి ప్రసంగాన్ని ఆమ్ ఆద్మీ పార్టీతో కలిసి బహిష్కరించిన అనంతరం విజయ్‌చౌక్‌లో బీఆర్ఎస్ ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, వెంకటేశ్ నేత, సంతోష్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర, సురేశ్‌రెడ్డి, కవిత, దామోదర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్, రాములు, పార్థసారథి రెడ్డి, లింగయ్య యాదవ్‌లతో కలిసి కేకే, నామా నాగేశ్వరరావులు మీడియాతో మాట్లాడారు.

నిరుద్యోగం ప్రస్తావన ఏదీ?: కేకే

రాష్ట్రపతి తన ప్రసంగంలో సామాజిక, గిరిజన, మహిళల అంశాలపై గొప్పగా పేర్కొన్నా అవన్నీ ఎక్కడా అమలులో లేవని కె. కేశవరావు విమర్శించారు. దేశంలో నిరుద్యోగం తీవ్రంగా ఉన్నా రాష్ట్రపతి ప్రసంగంలో కనీసం ఆ మాటే లేదని, విద్య, ఆరోగ్యం ప్రస్తావన ఎందుకు తీసుకురాలేదని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రం వీటన్నింటిపై దృష్టి పెట్టాలని సూచించారు. తెలంగాణలో గవర్నర్ కారణంగా బడ్జెట్ ఆమోదం కోసం కోర్టుల దాకా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ వ్యవహారంతో ఆప్ ప్రభుత్వం పడుతున్న ఇబ్బందులను చూస్తున్నామన్నారు. అలాగే కేరళ, తమిళనాడు సహా అనేక రాష్ట్రాల్లో గవర్నర్ల ద్వారా జరుగుతున్న పరిణామాలు దేశంలో అందరూ గమనిస్తున్నారని తెలిపారు. వీటన్నింటిపై ఇప్పటికైనా కేంద్రం దృష్టి సారించాలనే ఉద్దేశంతోనే రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించాలన్న నిర్ణయం తీసుకున్నామని కేకే తెలిపారు.

రాష్ట్ర అంశాలపై కేంద్రాన్ని నిలదీస్తాం: నామా

రాష్ట్రపతి ప్రసంగంలో మహిళల గురించి ప్రస్తావించినా మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి ప్రస్తావించలేదని ఎంపీ నామా నాగేశ్వరరావు మండిపడ్డారు. అలాగే పలుమార్లు అంబేడ్కర్ పేరును తలుచుకున్నా కొత్త పార్లమెంటు భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలన్న తమ డిమాండ్‌కు సంబంధించి ఎలాంటి ప్రస్తావన చేయలేదని విమర్శించారు. వీటితోపాటు రైతు సమస్యలు, దేశవ్యాప్తంగా రైతుబంధు అమలు, పంటలకు కనీస మద్దతు ధర, రైతులపై పెట్టిన కేసుల ఉపసంహరణ వంటి డిమాండ్లను ప్రస్తావించలేదని విమర్శించారు. దేశంలో ఇంటింటికీ సురక్షిత మంచినీరు ఇచ్చామని కేంద్రం రాష్ట్రపతి ప్రసంగంలో చెప్పుకుందని... అయితే తెలంగాణలో ఇంటింటికీ ఎప్పుడో ప్రక్రియను పూర్తి చేశామన్నారు. తెలంగాణ పథకాలను కాపీ కొడుతున్న కేంద్ర ప్రభుత్వం... రాష్ట్రాభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటోందని నామా ప్రశ్నించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రానికి సంబంధించిన అన్ని అంశాలపై కేంద్రాన్ని నిలదీస్తామని నామా స్పష్టం చేశారు.

మహిళలకు బీఆర్ఎస్ క్షమాపణలు చెప్పాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్

- రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించడమంటే గిరిజన మహిళలను అవమానించడమే..
- ఆదివాసీ మహిళ రాష్ట్రపతి కావడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందని ధ్వజం




సాక్షి, న్యూఢిల్లీ: ఆదివాసీ మహిళా రాష్ట్రపతి తొలిసారి పార్లమెంట్‌లో ప్రసంగిస్తుంటే జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ ఎంపీలు ఆమె ప్రసంగాన్ని బహిష్కరించారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం అనంతరం విజయ్‌చౌక్ వద్ద ఆ పార్టీ ఎంపీలు ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావులతో కలిసి సంజయ్ మీడియాతో మాట్లాడారు. మారుమూల ప్రాంతానికి చెందిన ఆదివాసీ మహిళ రాష్ట్రపతిగా ఎన్నికైన తరవాత పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి మొదటిసారి ప్రసంగిస్తున్న తరుణంలో బీఆర్ఎస్ పార్టీ బహిష్కరించడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం దేశానికి దిశా, దశ చూపేదిగా ఉందని పేర్కొన్నారు. దళిత, గిరిజన, బలహీన వర్గాల మహిళలంటే బీఆర్ఎస్‌కు అసహ్యమని, అందుకే ద్రౌపది ముర్ము రాష్ట్రపతి కాకుండా ఓడించేందుకు యత్నించారని ఆరోపించారు. కేసీఆర్ తొలి కేబినెట్‌లోనూ మహిళలకు చోటు కల్పించలేదని అన్నారు. తక్షణమే దళిత, గిరిజన, బలహీనవర్గాల మహిళలకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలని సంజయ్ డిమాండ్ చేశారు. మహిళాగవర్నర్‌ను అడుగడుగునా అవమానించడమే కాకుండా హైకోర్టుకు వెళ్లారని, కోర్టు చెంప చెళ్లుమన్పించడంతో తిరిగి గవర్నర్‌ను అసెంబ్లీ ప్రారంభ సమావేశాలకు పిలుస్తున్నారని అన్నారు. అసలు బీఆర్ఎస్‌కు సలహాలిచ్చే వాళ్లెవరోకానీ, ఆ పార్టీని ముంచేటట్టు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దేశంలో 3 కోట్ల మందికి ఇళ్లు ఇచ్చామని రాష్ట్రపతి చెప్పిన విషయంపై చర్చ జరిగితే తెలంగాణలో ఇళ్ల కోసం కేటాయించిన సొమ్మంతా దారి మళ్లించారనే అంశంతోపాటు ఇతర అనేక అంశాలు బయటికొస్తాయన్న భయం బీఆర్ఎస్ నేతలకు ఉందని విమర్శించారు. కేసీఆర్‌కు రాజ్యాంగమన్నా, గవర్నర్ అన్నా, కోర్టులన్నా లెక్కలేదని, తెలంగాణలో రాచరిక పాలన కొనసాగించాలను కుంటున్నారని మండిపడ్డారు.

మేం తలచుకుంటే బీఆర్ఎస్ నేతలు తిరగలేరు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ఏబీవీపీ కార్యకర్తలపై పోలీసులు, బీఆర్ఎస్ నేతల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సంజయ్ అన్నారు. తాము తలచుకుంటే బీఆర్ఎస్ నేతలెవరూ బయట తిరగలేరని హెచ్చరించారు. కేటీఆర్ పర్యటనను తాము అడ్డుకోవాలనుకుంటే ఆపడం ఎవరి తరం కాదన్నారు. పోలీసుల సమక్షంలోనే బీఆర్ఎస్ గూండాలు దాడులు చేస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం పర్యటిస్తుంటే,, ప్రజలు చెప్పులు నెత్తిన పెట్టుకుని పక్కకు పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఏబీవీపీ కార్యకర్తలను విడుదల చేయాలని, వాళ్లపై దాడులు చేసిన నాయకులను అరెస్ట్ చేయాలని సంజయ్ డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌కు మహిళలంటేనే చిన్నచూపు: కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ నాయకులకు మహిళలంటేనే చిన్నచూపు అని... వాళ్లు ఏ స్థాయిలో ఉన్నా వారిని అవమానించడమే పనిగా పెట్టుకున్నారని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. కేసీఆర్‌కు, బీఆర్ఎస్ నేతలకు మహిళలను అవమానించడం అలవాటుగా మారిందని విమర్శించారు. ఒక ఆదివాసీ మహిళ భారత రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత తొలిసారి పార్లమెంటులో ప్రసంగిస్తే బీఆర్ఎస్ ఎంపీలు బహిష్కరించడం ముమ్మాటికి ఆదివాసీ మహిళలను అవమానించడమేనని అన్నారు. ఒక ఆదివాసీ మహిళ దేశ అత్యున్నత పదవిని అలంకరిస్తే జీర్ణించుకోలేక బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ, మహిళ అయిన తెలంగాణ గవర్నర్ పట్ల కూడా బీఆర్ఎస్ నాయకులు అవమానకరంగా వ్యవహరిస్తున్నారని, తాజాగా రాష్ట్రపతిని కూడా అవమానించారని ధ్వజమెత్తారు.



ఇక బడ్జెట్‌లో ఏది పెరిగినా మనమీద ప్రభావం పడకుండా అన్నీ కొనుక్కొచ్చేశా!

క్లుప్తంగా...

ఇంటర్ బోర్డ్‌లోకి మధుసూదన్‌ను రానివ్వొద్దు

- ఉద్యోగులు మాట్లాడినా నేరమే
- ఇంటర్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ బోర్డ్‌లో సీసీ కెమెరాల ట్యాంపరింగ్‌కు పాల్పడటమే కాకుండా, వివిధ నేరారోపణలతో సస్పెండైన ప్రభుత్వ లెక్చరర్ పి.మధుసూదన్ రెడ్డికి ఇంటర్ సంస్థల కార్యాలయాల్లో అనుమతి నిషేధిస్తూ ఇంటర్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లోని స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ (విద్యా భవన్), కమిషనరేట్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ (ప్రొఫెసర్ జయశంకర్ విద్యా భవన్), నాంపల్లి కాలేజీ కాంప్లెక్స్‌ల్లోకి మధుసూదన్ రెడ్డి ప్రవేశిస్తే నేరంగానే పరిగణిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎవరైనా అతనితో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలు పెట్టుకున్నా క్రిమినల్ చర్యగానే గుర్తించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇంటర్ బోర్డ్ కార్యాలయంలోకి మధుసూదన్ రెడ్డి అక్రమంగా ప్రవేశించి, అక్కడి ఉద్యోగిని బెదిరించి సీసీ కెమెరాలను ట్యాంపర్ చేసినట్టు ఇంటర్ బోర్డ్ ఈ నెల 30న బేగంబజార్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం తెలిసిందే. ఒక మహిళా ఉద్యోగిని మధు సూదన్ రెడ్డి లైంగికంగా వేధించడంతో పాటు ఆయనపై ఉన్న పలు ఏసీబీ, క్రిమినల్ కేసులను నవీన్ మిత్తల్ తన ఆదేశాల్లో వివరించారు.

'నాపై నిషేధం ఆశ్చర్యంగా ఉంది..'

ఇంటర్మీడియెట్ కార్యాలయాల్లోకి తన ప్రవేశాన్ని నిషేధిస్తూ నవీన్ మిత్తల్ ఇచ్చిన ఉత్తర్వులపై ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది తన హక్కులను కాలరాయడమేనని వ్యాఖ్యానించారు.

'ఇంటర్' సూపరింటెండెంట్ సస్పెన్షన్

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్.మురళీ కృష్ణను సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 317 జీవో అమలు సందర్భంగా ఉద్యోగుల సీనియారిటీ జాబితాలో అవకతవకలకు మురళీ కృష్ణ బాధ్యుడిగా గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనుమతి పొందకుండా హైదరాబాద్ విడిచి వెళ్లకూడదని షరతు విధించారు.

వర్సిటీల్లో ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయండి

తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ ఫ్రంట్ డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగ ఫ్రంట్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం చైర్మన్, ఓయూ పరిశోధక విద్యార్థి చనగాని దయాకర్ మంగళవారం సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. ఎనిమిదేళ్లుగా నిధులు, నియామకాలు చేపట్టనందున వర్సిటీలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 3 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తెలంగాణలోని వర్సిటీలకు పెద్ద పీటవేయాలని, నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు, విద్యుత్తు కోసం సోలార్‌ప్లాంట్లు, వర్సిటీల భూముల పరిరక్షణకు ప్రత్యేక చట్టం, మహిళావర్సిటీకి సావిత్రి బాయిపూలే పేరుపెట్టాలని కోరారు. లేని పక్షంలో ప్రభుత్వ వర్సిటీల పరిరక్షణకు పెద్ద ఎత్తున పోరాడతామని హెచ్చరించారు.

'పోలీసు పరీక్ష పత్రాల్లో 13 తప్పులు'

సాక్షి, హైదరాబాద్: ఇప్పటికీ ఇంకా ఎస్‌ఐ, కానిస్టేబుల్ పరీక్ష పత్రాల్లో 13 తప్పులున్నాయని, వాటిని వెంటనే సరిదిద్దాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు భాను ప్రకాష్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పోలీస్ నియామకాల విషయంలో హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలని కోరినందుకు తమపై విచక్షణారహితంగా పోలీసులు దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేవైఎం పోరాటం వల్లే ప్రభుత్వం దిగొచ్చి ఎస్‌ఐ, కానిస్టేబుల్ నోటిఫికేషన్లలో 7మార్కులు కలిపిందని చెప్పారు. నియామక బోర్డ్ తప్పిదాల వల్ల విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు.

సివిల్ జడ్జి పోస్టులకు నేటి నుంచి దరఖాస్తులు

10 పోస్టుల భర్తీకి హైకోర్టు నోటిఫికేషన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర న్యాయ శాఖలో 10 పోస్టుల భర్తీకి హైకోర్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిలో 8 పోస్టులను నేరుగా, 2 పోస్టులను బదిలీ ద్వారా భర్తీ చేస్తామని రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను ఫిబ్రవరి 1 నుంచి మార్చి 1 వరకు స్వీకరిస్తామని తెలిపారు. హాల్‌టికెట్లు ఏప్రిల్ 1 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు. స్క్రీనింగ్ టెస్టు ఏప్రిల్ 23న ఉంటుందని, పూర్తి వివరాల కోసం హైకోర్టు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

కళ్ల ముందు... కదలాడుతూ..

సిద్దిపేట జిల్లాలో టెన్త్ విద్యార్థులకు యానిమేటెడ్ పాఠాలు

- క్యూఆర్ కోడ్ ఆధారంగా పాఠాలు
- పిల్లలు ఇష్టంగా చదివేలా రూపకల్పన
- కేసీఆర్ డిజిటల్ కంటెంట్ పేరుతో సర్కారు బడుల విద్యార్థులకు
- మంత్రి హరీశ్‌రావు సొంత ఖర్చులతో 11వేల మందికి పంపిణీ

సాక్షి, సిద్దిపేట

చదివిన దాని కన్నా చూసింది ఎక్కువగా గుర్తుంటుంది. అంతకుమించి బాగా అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో 2డీ, 3డీ యానిమేషన్ దృశ్యరూప విద్యాబోధన ప్రాచుర్యంలోకి వచ్చింది. 3డీ యానిమేషన్‌లో కళ్ల ముందు కదలాడుతున్నట్లుగా పదో తరగతి పాఠ్యాంశాలను అందిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో విద్య అందించి, మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంతో మంత్రి హరీశ్‌రావు సొంత ఖర్చులతో సిద్దిపేట జిల్లా సర్కారు బడుల్లోని టెన్త్ విద్యార్థులకు అందిస్తున్నారు.



వీడియో పాఠాల కోసం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తున్న విద్యార్థిని

మళ్లీ మొదటిస్థానం కోసం..

2021–22 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 97.85 శాతం ఉత్తీర్ణతతో సిద్దిపేట జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది. అదే స్ఫూర్తితో మొదటి స్థానాన్ని తిరిగి సాధించేందుకు మరింత కృషి అవసరమని గుర్తించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ డిజిటల్ కంటెంట్ పేరుతో హైదరాబాద్‌కు చెందిన మంత్ర లెర్నింగ్ అకాడమీ... 3డీ యానిమేటెడ్ పాఠాలు, స్టడీ మెటీరియల్ రూపొందించింది. మంత్రి హరీశ్‌రావు రూ.20లక్షలకు పైగా వెచ్చించి జిల్లా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించారు. జనవరి 24న సిద్దిపేటలో ఇందిరానగర్ జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు క్యూఆర్ కోడ్ స్కానింగ్ స్టడీ మెటీరియల్‌ను హరీశ్‌రావు అందించి ప్రారంభించారు.



కేసీఆర్ డిజిటల్ కంటెంట్ పుస్తకాలను అందజేస్తున్న మంత్రి హరీశ్ రావు(ఫైల్)

నాలుగు సబ్జెక్టులు..

గణితం, జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం నాలుగు సబ్జెక్టుల్లో ఉన్న అన్ని పాఠ్యాంశాలు 3డీ యానిమేషన్‌లో అందిస్తున్నారు. ఒక్కో పాఠ్యాంశానికి ఒక్కో క్యూఆర్ కోడ్ పొందుపరిచారు. 30 సెకన్ల నుంచి 5 నిమిషాల పాటు ఆ పాఠ్యాంశానికి సంబంధించిన వివరణ ఉంటుంది. తరగతి గదుల్లో గంటల వ్యవధిలో బోధించే పాఠాన్ని ఐదు నిమిషాల్లో అర్థం చేసుకునేలా రూపొందించారు. విద్యార్థులు ఇంటికి వెళ్లి మొబైల్ ఫోన్ల ద్వారా దృశ్య రూపంలో పాఠాలను సులువుగా అభ్యసించే అవకాశం ఉంది.

తల్లిదండ్రులకు హరీశ్ లేఖ..

'మీ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నాం. విద్యార్థుల జీవితంలో పదో తరగతి కీలకమైంది. వారి భవిష్యత్‌కు పునాదులు వేసే వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. టీవీలకు, వినోదాలకు దూరంగా ఉంచండి. పిల్లలు ఇంటి దగ్గర చదువుకునేలా ప్రోత్సహించండి' .. అంటూ తల్లిదండ్రులకు మంత్రి హరీశ్‌రావు లేఖలు రాశారు.

దృశ్యాలతో కళ్ల ముందు



మా పాఠశాలలో ఇప్పటికే అన్ని సబ్జెక్టుల సిలబస్ పూర్తయింది. ప్రస్తుతం రివిజన్ క్లాస్‌లు జరుగుతున్నాయి. స్టడీ మెటీరియల్లోని క్యూఆర్ కోడ్ స్కాన్‌తో 3డీ యానిమేషన్ ద్వారా పాఠ్యాంశాలు వస్తున్నాయి. వాటితో ఇంకా బాగా అర్థమవుతున్నాయి. బట్టీ పట్టకుండా నేర్చుకుంటున్నాం.

– అక్షయ, టెన్త్ విద్యార్థి, ఇందిరానగర్ జడ్పీ హైస్కూల్

సిద్దిపేటకు పేరు తేవాలి..

2021–22లో పదోతరగతిలో రాష్ట్రంలో సిద్దిపేట మొదటి స్థానంలో నిలిచింది. ఆ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు, విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు ఉచితంగా డిజిటల్ పాఠాలను అందిస్తున్నాం. తల్లిదండ్రుల ఫోన్‌లో ఉదయం, రాత్రి వేళల్లో డిజిటల్ పాఠాలు వింటూ మెళకువలు నేర్చుకోవాలి. బాగా చదివి తల్లిదండ్రులకు, జిల్లాకు పేరు తీసుకురావాలి.

– హరీశ్ రావు, ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి

పైరవీ 'సార్ల'దే రాజ్యం!

రూ.10 లక్షలిస్తే.. కోరుకున్న చోటుకు బదిలీ

- స్కూల్లో పోస్టు లేకున్నా బదిలీ ఆర్డర్
- హైదరాబాద్ పరిసరాల్లో యమ గిరాకీ

→ కరీంనగర్ నుంచి మేడ్చల్‌లోని ఓ స్కూల్‌కు ఓ టీచర్‌ను పైరవీతో బదిలీ చేశారు. నిజానికి ఆ టీచర్ సోషల్ సబ్జెక్టు చెప్పే టీచర్. కానీ ఆ స్కూల్లో ఆ సబ్జెక్టులో ఖాళీల్లేవు. ఇలాంటప్పుడు ఖాళీల్లేవని తిప్పి పంపాలి. కానీ ఖాళీ ఉన్న ఇంగ్లిష్ పోస్టులో ఇరికించేశారు. ఇదే జిల్లాలో మరో రెండు బడుల్లో సోషల్ సబ్జెక్టు పోస్టుల్లో ఇతర సబ్జెక్టు టీచర్లను తెచ్చారు.

→ బదిలీల షెడ్యూల్ వెలువడకుండానే రంగారెడ్డి జిల్లాలోని ఓ మారుమూల ప్రాంతానికి చెందిన టీచర్‌ను హయత్ నగర్ మండలానికి బదిలీ చేశారు. ఈ వ్యవహారంలో రూ.10 లక్షలు చేతులు మారినట్టు తెలిసింది. మరో టీచర్ నారాయణ పేట నుంచి మేడ్చల్ జిల్లాకు రూ.8 లక్షలు మధ్యవర్తి ద్వారా ఇచ్చి బదిలీ చేయించుకున్నట్టు చెప్పుకుంటున్నారు.

సాక్షి, హైదరాబాద్: బదిలీల్లో ఇలా పైరవీలకు పెద్దపీట వేయడం టీచర్లలో కలకలం రేపుతోంది. ఒకవైపు షెడ్యూల్ ప్రకారం దరఖాస్తులు స్వీకరిస్తూనే, మరోవైపు అడ్డగోలుగా పోస్టింగ్‌లు ఇవ్వడంపై గగ్గోలు పెడుతున్నారు. ఇది ప్రక్రియను అపహాస్యం చేయడమేనని టీచర్ల సంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పటివరకూ దాదాపు 200 మందిని నిబంధనలకు విరుద్ధంగా వాళ్లు కోరుకున్న స్కూళ్లకు పోస్టింగ్ ఇచ్చినట్టు సంఘాల నేతలు చెబుతున్నారు. నేరుగా ప్రభుత్వపెద్దల నుంచే సిఫార్సులు వస్తున్నాయని, వాటిని ఉన్నతాధికారులు సంబంధిత డీఈవోలకు పంపుతున్నారని అంటున్నారు. డీఈవోలు ఏకంగా పోస్టింగ్ ఆర్డర్లే ఇచ్చేస్తున్నారని టీచర్లు వాపోతున్నారు. ఈ వ్యవహారంపై అనేక ఆరోపణలు వచ్చినా ఉన్నతాధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇదిలాఉండగా, పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయంలోకి ఉపాధ్యాయ సంఘాల నేతలతోపాటు ఇతరులెవరినీ అనుమతించడం లేదు.



లక్షల్లో బేరసారాలు

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 24 శాతం హెచ్‌ఆర్‌ఏ ఉంటుంది. కాబట్టి ఈ ప్రాంతాల్లో పోస్టింగుల కోసం పోటీ ఎక్కువగా ఉంది. ఇదే అదునుగా మధ్యవర్తులు టీచర్లతో బేరాలు కుదుర్చుకుని ఒక్కో పోస్టుకు రూ. 8 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకూ తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. బేరం కుదిరిన వెంటనే టీచర్లకు మాత్రం కోరుకున్న ప్రాంతాల్లో పోస్టింగ్‌లు వస్తున్నాయని అంటున్నారు. వాస్తవానికి బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియ బుధవారంతో ముగుస్తుంది. కానీ కొంతమందికి షెడ్యూల్ విడుదల కాకముందే పోస్టింగ్‌లు వస్తే... మరికొంత మందికి బదిలీలకు దరఖాస్తు గడువు ముగియకుండానే పోస్టింగ్‌లు ఇస్తున్నారు. ఇప్పుడు బదిలీ చేసినా ఏప్రిల్ తర్వాతే రిలీవ్ చేస్తామని షెడ్యూల్లో స్పష్టంచేసినా... పైరవీల టీచర్లు మాత్రం కొత్త ప్రాంతాల్లో చేరిపోతున్నారు.

ఇందుకేనా 317 జీవో...

ప్రభుత్వం 317 జీవో ద్వారా దాదాపు 25 వేల మందిని మారుమూల ప్రాంతాలకు బదిలీ చేసింది. ఈ సందర్భంగా వారికి అన్యాయం జరిగినట్టు చెబుతున్నారు. స్థానికత ఎంపిక సందర్భంగా కొత్త జిల్లాల్లో అర్బన్ ప్రాంతాల్లో పోస్టులను చూపించకుండా జాగ్రత్త పడ్డారు. కనీసం వాటిని చూపించినా సీనియారిటీ ప్రకారం పట్టణ ప్రాంతాల్లోని స్కూళ్లను కొంతమంది టీచర్లు ఎంచుకునే వీలుంది. ఇప్పుడు బదిలీకి ఏ స్కూల్లోనైనా రెండేళ్లు పనిచేసి ఉండాలి. కాబట్టి 317 జీవో ద్వారా మారుమూల ప్రాంతాలకు వెళ్లిన వాళ్లు తిరిగొచ్చే అవకాశమే లేదు. పట్టణ ప్రాంతాల్లో బడులను బ్లాక్ చేయడంతో తిరిగి ఇప్పుడు నచ్చినవారికి పోస్టులు ఇచ్చుకునే వీలుకలుగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి.

గణతంత్ర దినోత్సవాన కూడా...

ప్రభుత్వ యంత్రాంగం మొత్తం జనవరి 26న రిపబ్లిక్ డే వేడుకల్లో నిమగ్నమై ఉన్న రోజు కూడా ఏకంగా ఏడు పైరవీ బదిలీలకు ఉత్తర్వులు వెలువడ్డాయి. వీళ్లంతా పట్టుమని 30 కి.మీ. దూరం కూడా లేని బడుల్లో పనిచేస్తున్నవారే కావడం గమనార్హం. మంత్రులు, ఎమ్మెల్సీల పైరవీలతో ఇవన్నీ జరిగినట్టు చెబుతున్నారు. దీంతో తామేమీ చేయలేకపోతున్నామని విద్యా శాఖ ఉన్నతాధికారులు అంటున్నారు. ఈ వ్యవహారంలో అధికారులకూ ముడుపులు ముడుతున్నాయని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

ఆ బదిలీలను రద్దు చేయాలి:
చావా రవి, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పైరవీలతో బదిలీలు చేయడమంటే ప్రక్రియను అపహాస్యం చేయడమే. నిబంధనలకు విరుద్ధంగా మంత్రులు, ఎమ్మెల్సీల పైరవీలను అనుమతిస్తే ఉపాధ్యాయ వృత్తికే కళంకం ఏర్పడుతుంది. ఈ బదిలీలను రద్దు చేయాలి.

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- 16 జిల్లాల కలెక్టర్లకు స్థానచలనం..
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా హరీశ్
- మేడ్చల్ జిల్లాకు అమోయ్‌కుమార్
- ఆయనకే హైదరాబాద్ జిల్లా అదనపు బాధ్యతలు..
- 18 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: జిల్లా కలెక్టర్ల స్థానాల్లో భారీ కుదుపు. రాష్ట్రంలోని 16 జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం స్థానచలనం కల్పించింది. ఈ మేరకు 18 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. చాలా మంది జిల్లా కలెక్టర్లను ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు బదిలీపై పంపించారు. దీంతోపాటు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, వయోజనుల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ భారతి హోళికేరిని బదిలీ చేశారు. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి క్రిస్టినా జెడ్.చొంగ్తును రిలీవ్ చేశారు. కీలకమైన రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న డి.అమోయ్ కుమార్‌ను మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. దీంతోపాటు హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా మెదక్ జిల్లా కలెక్టర్ ఎస్.హరీశ్‌ను నియమించారు. వికారాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్ల పోస్టుల నుంచి కె.నిఖిల, ముషర్రఫ్ అలీ ఫారూఖీలను తప్పించినప్పటికీ వారికి కొత్త పోస్టింగ్‌లు ఇవ్వలేదు.

అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
భారతి హోళికేరి	మంచిర్యాల	కమిషనర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ
రాజీవ్‌గాంధీ హనుమంతు	హనుమకొండ	నిజామాబాద్
డి.అమోయ్ కుమార్	రంగారెడ్డి	మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్ (ఎఫ్‌ఏసీ)
సిక్తా పట్నాయక్	ఆదిలాబాద్	హనుమకొండ
రాహుల్ రాజ్	కుమ్రంభీం	ఆదిలాబాద్
నారాయణ రెడ్డి	నిజామాబాద్	వికారాబాద్
షేక్ యాస్మీన్ బాషా	వనపర్తి	కుమ్రం భీం-ఆసిఫాబాద్
జి.రవి	జగిత్యాల	మహబూబ్‌నగర్
ఎస్.వెంకటరావు	మహబూబ్‌నగర్	సూర్యాపేట
ఎస్.హరీశ్	మెదక్	రంగారెడ్డి
బదావత్ సంతోష్	అదనపు కమిషనర్, జీహెచ్‌ఎంసీ	కలెక్టర్, మంచిర్యాల
రాజార్షి షా	అదనపు కలెక్టర్, సంగారెడ్డి	కలెక్టర్, మెదక్
తేజస్ నంద్‌లాల్ పవార్	అదనపు కలెక్టర్, మహబూబ్‌నగర్	కలెక్టర్, వనపర్తి
కర్నాటి వరుణ్ రెడ్డి	పీఓ, ఐటీడీఏ, ఉట్నూరు	కలెక్టర్, నిర్మల్
ఆర్వీ కర్ణన్	జిల్లా కలెక్టర్, కరీంనగర్	జగిత్యాల(ఎఫ్‌ఏసీ)

రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శిగా నవీన్ మిత్తల్

కళాశాల విద్య, సాంకేతిక విద్య శాఖ కమిషనర్‌గా, ఇంటర్ బోర్డు కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న నవీన్ మిత్తల్‌ను రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్యకార్యదర్శిగా ప్రభుత్వం బదిలీ చేసింది. భూపరిపాలన విభాగం ముఖ్య కమిషనర్ (సీసీఎల్‌ఏ)గా కూడా ఆయనకు అదనపు బాధ్యతలను అప్పగించారు. నవీన్ మిత్తల్ బదిలీతో ఖాళీ అయిన కళాశాల విద్య, సాంకేతిక విద్య శాఖ కమిషనర్, ఇంటర్ బోర్డు కార్యదర్శి, కమిషనర్ పోస్టుల్లో ఇంకా కొత్త అధికారులను నియమించలేదు.

టీఎస్‌ఎస్పీడీసీఎల్‌లో 1,661 పోస్టుల భర్తీ

తక్షణమే నోటిఫికేషన్ జారీచేయాలని మంత్రి జగదీశ్‌రెడ్డి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్‌ఎస్పీడీసీఎల్)లో ఖాళీగా ఉన్న 1,553 జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం), 48 అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పోస్టులు కలిపి మొత్తం 1,661 పోస్టుల భర్తీకి తక్షణమే నోటిఫికేషన్ జారీ చేయాలని విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరాపై మంగళవారం ఆయన మింట్ కాంపౌండ్‌లోని తన కార్యాలయంలో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డితో సమీక్ష నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఏడాదికేడాది విద్యుత్ డిమాండ్ పెరిగిపోతోందని, ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 6,666 మెగావాట్లు ఉన్న గరిష్ట విద్యుత్ డిమాండ్ గతేడాది యాసంగిలో 14,160 మెగావాట్లకు పెరిగిందన్నారు. వచ్చే వేసవిలో 15,500 మెగావాట్లకు మించనుందని, అందుకు తగ్గట్టు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎండీలను ఆదేశించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, గృహ వినియోగదారుల పెరుగుదల, వ్యవసాయ రంగానికి ఉచితవిద్యుత్ సరఫరాతో డిమాండ్ గణనీయంగా పెరిగిందన్నారు.

జూన్ 5 నుంచి గ్రూప్-1 మెయిన్స్

పరీక్షల తేదీలు విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 రాత (మెయిన్) పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. ఈ ఏడాది జూన్ 5 నుంచి వరుసగా ఏడు పరీక్షలు (కన్వెన్షియల్ విధానం) నిర్వహించనున్నట్లు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. మొదట జనరల్ ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించాక ఆ మర్నాటి నుంచి పేపర్–1 మొదలు పేపర్–6 పరీక్షలు వరుసగా నిర్వహించనుంది. దీనికి సంబంధించిన వివరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ప్రతి పరీక్షను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారు. ఒక్కోపరీక్షలో గరిష్ట మార్కులు 150 చొప్పున ఉంటాయి. గ్రూప్–1 రాత పరీక్షలను ఆంగ్లం, తెలుగు, ఉర్దూలలో ఏదో ఒక భాషను ఎంచుకుని అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఒక్కో పరీక్షను ఒక్కో భాషలో రాసేందుకు వీల్లేదని టీఎస్‌పీఎస్సీ స్పష్టం చేసింది. జనరల్ ఇంగ్లిష్ పరీక్ష ఎస్‌ఎస్‌సీ స్థాయిలో నిర్వహిస్తామని, ఈ పరీక్ష కేవలం అర్హతతో ముడిపడి ఉంటుందని, ఇందులో వచ్చే మార్కులను ర్యాంకింగ్‌లో పరిగణించబోమని టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. మెయిన్ పరీక్షలకు అర్హత సాధించిన అభ్యర్థులు ప్రతి పరీక్షనూ తప్పకుండా రాయాలని, ఒక్క పరీక్షకు గైర్హాజరైనా వారి అర్హత రద్దవుతుందని టీఎస్‌పీఎస్సీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

పరీక్ష కేటగిరీ	సమయం	మార్కులు	తేదీ
జనరల్ ఇంగ్లిష్ (క్వాలిఫైయింగ్ టెస్ట్)	3	150	05-06-2023
పేపర్-1 జనరల్ ఎస్సే	3	150	06-06-2023
పేపర్-2 హిస్టరీ, కల్చర్, జియోగ్రఫీ	3	150	07-06-2023
పేపర్-3 ఇండియన్ సొసైటీ, కాన్‌స్టిట్యూషన్, గవర్నెన్స్	3	150	08-06-2023
పేపర్-4 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్	3	150	09-06-2023
పేపర్-5 సైన్స్, టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్	3	150	10-06-2023
పేపర్-6 తెలంగాణ మూవ్‌మెంట్, స్టేట్ ఫార్మేషన్	3	150	12-06-2023

నేడు 'మనఊరు-మనబడి' స్కూళ్ల ప్రారంభం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రారంభించనున్న మంత్రులు కేటీఆర్, సబిత



సాక్షి, హైదరాబాద్: మన ఊరు–మన బడి పథకం కింద పనులు పూర్తి చేసిన స్కూళ్లను రాష్ట్రవ్యాప్తంగా బుధవారం మంత్రులు, ఎమ్మెల్యేలు లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, కె.తారక రామారావు రాజన్న సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట పాఠశాలలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. సంబంధిత నియోజకవర్గాల మంత్రులు, ఎమ్మెల్యేలు మొదటి విడతలో పూర్తయిన పాఠశాలలను ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించాలని ప్రభుత్వం ప్రజా ప్రతినిధులను కోరింది. రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మన ఊరు–మనబడి పథకాన్ని 3 దశల్లో చేపట్టాలని నిర్ణయించింది. పాఠశాలల్లో 12 రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేయడం, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దడం దీని ముఖ్య ఉద్దేశం. ఈ పథకానికి మొత్తంగా రూ.7,289 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశా రు. రాష్ట్రంలోని 26,055 స్కూళ్ల లో తొలి విడతలో 9,123 స్కూళ్లను ఎంపిక చేశారు. రూ.3,497.62 కోట్లను మొదటి విడతలో ఖర్చు చేయాలని నిర్ణయించారు. అయితే, ఇప్పటి వరకు 1,200 స్కూళ్లలో మాత్రమే పనులు పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. పాఠశాలల్లో భవనాలకు మరమ్మతులు చేపట్టడం, రంగులు వేయడం, కాంపౌండ్ వాల్స్ నిర్మించడం, విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం ఫర్నిచర్ అమర్చడం, డిజిటల్ తరగతులు, సోలార్ ప్యానెల్స్, అధునాతన వసతుల పాఠశాలలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేశారు. ఈ పథకం కింద పాఠశాలల్లో పరిశుభ్రమైన తాగునీరు, టాయిలెట్ల నిర్మాణం, అదనపు తరగతి గదులు, మంచి లైటింగ్ సదుపాయం, భోజనవసతి, గ్రీన్ బోర్డులు, డిజిటల్ తరగతులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

వలస కార్మికులపై దయచూపేనా..

ఐసీడబ్ల్యూఎఫ్ నిధులు కేటాయించాలని ఆయా సంఘాల వినతి
నేడు కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



మోర్తాడ్ (బాల్కొండ): కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో గల్ఫ్ ప్రవాసుల కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తేనే వలస కార్మికులకు ప్రయోజనం కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వలస కార్మికుల ద్వారా దేశానికి విదేశీ మారకద్రవ్యం భారీ మొత్తంలో అందుతున్నా ప్రభుత్వం మాత్రం వారి సంక్షేమంపై దృష్టి సారించలేకపోతుందనే విమర్శలు ఉన్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దయతలిస్తేనే వలస కార్మికులకు అండ లభిస్తుందని కార్మికుల పక్షాన ఆయా సంఘాలు కోరుతున్నాయి. యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, కువైట్, ఖతర్, ఒమాన్, ఇరాక్‌లాంటి గల్ఫ్ దేశాలతో పాటు మలేసియా, సింగపూర్ తదితర దేశాలకు కార్మికులుగా వలస వెళ్లిన వారికి న్యాయ సహాయంతో పాటు ఇతర సదుపాయాలను అందించాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఆయా దేశాల్లో ఉన్న మన రాయబార కార్యాలయాలకు ఇండియన్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఫండ్ (ఐసీడబ్ల్యూఎఫ్) కేటాయించకపోవడంతో వలస కార్మికులకు తగిన సేవలను అందించలేకపోతున్నారు. గల్ఫ్ దేశాలతో పాటు మలేసియాలో ఎవరైనా చట్ట విరుద్ధంగా ఉంటూ ఏదైనా కారణం చేత మరణిస్తే వారి మృతదేహాలను సొంతగడ్డకు పంపించడం కష్టసాధ్యమవుతోంది. ఐసీడబ్ల్యూఎఫ్ ద్వారా నిధులు కేటాయిస్తే పేదరికంతో బాధపడుతున్న కుటుంబాల వారికి ధీమా లభిస్తుందని వలస కార్మికుల సంఘాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా విదేశాల్లో ఉన్న మనవారికి న్యాయ సహాయం అవసరమైతే రాయబార కార్యాలయాలు సులభంగా అందించలేకపోతున్నాయి. రాయబార కార్యాలయాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతో సెస్ చార్జీల మాదిరిగా వసూలు చేసిన తక్కువ మొత్తం నిధులతోనే నెట్టుకురావాల్సి వస్తోంది.

అందరికి ప్రయోజనం కలిగేలా ప్రవాసీ బీమా యోజన..

విదేశాల్లో ప్రమాదవశాత్తు మరణించిన వలస కార్మికులకు వర్తింప చేస్తున్న ప్రవాసీ బీమా యోజన పథకంలో మార్పులు తీసుకువచ్చి పేద, మధ్య తరగతి కుటుంబాలకు భరోసానివ్వాలని వలస కార్మికుల సంఘాలు కోరుతున్నాయి. ప్రవాసీ బీమా యోజన పథకం ద్వారా కేవలం ప్రమాదవశాత్తు మరణించిన వలస కార్మికులకే ధీమా కల్పిస్తున్నారు. ఏ కారణం చేతనైనా విదేశాల్లో మరణించినవారికి ఈ బీమా పథకం వర్తింప చేయడానికి బడ్జెట్‌లో మార్పులు చేయాలని పలువురు కోరుతున్నారు.

హైదరాబాద్‌లో కాన్సులేట్‌లు...

తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులకు, లైసెన్స్‌డ్ ఏజెన్సీలకు సౌకర్యం కల్పించడానికి హైదరాబాద్‌లో యూఏఈ, సౌదీఅరేబియా, కువైట్ దేశాల కాన్సులేట్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొంటున్న తెలంగాణ ఎంపీలు ఈ కాన్సులేట్ కార్యాలయాల ఏర్పాటు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



ఈ ప్రపంచం శాశ్వతమా; ఆత్మ, శరీరం ఒకటా లాంటి వివాదాలకు వాస్తవ జీవితంతో సంబంధం లేదు. కామక్రోధాలు అధిగమించి, సదాచరణ, ఆత్మజ్ఞానం, ఆంతరంగిక మనశ్శాంతికి తోడ్పడేవి కావు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, ఫిబ్రవరి, 1

వేయాల్సిన అడుగులు ఎన్నో...

దాదాపు 5 నెలలు... 135 రోజులు... 12 రాష్ట్రాలు... 2 కేంద్ర పాలిత ప్రాంతాలు... 75 జిల్లాలు... 4 వేల కిలోమీటర్లు... దేశానికి దక్షిణపు కొస నుంచి ఉత్తరపు కొస దాకా పాదయాత్ర... కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' (బీజేవై)కు అనేక లెక్కలున్నాయి. అయిదు రాష్ట్రాల్లో ఎన్నికల్లో దెబ్బతిన్నాక, 2022 వేసవిలో ఉదయ్‌పూర్ 'చింతనా శిబిరం'లో ఆత్మవిమర్శలో పడ్డ కాంగ్రెస్ దూరమైన ప్రజలకు దగ్గర కావాలన్న 'నవ సంకల్పం'తో చేసుకున్న పాదయాత్ర ప్రతిపాదన ఎట్టకేలకు విజయవంతమైంది. విద్వేషాన్ని పెంచుతున్న బీజేపీకి విరుగుడు తామే అన్న పార్టీ చిరకాలపు మాటను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి తనకు తానే తరలిన ఆకాశంలా రాహుల్ నడక సాగించారు. కార్యకర్తల్లో ఉత్సాహంతో సారథిగా ఆయనను బలోపేతం చేసినా, సోనియా మార్కు పాత్తుల చతురత కనిపించని ఈ యాత్ర వచ్చే ఎన్నికల్లో ఏ మేరకు లాభిస్తుందన్నది ప్రశ్న. పార్టీ పునరుజ్జీవనానికి ఇదొక్కటీ సరిపోతుందా అన్నది అంతకన్నా కీలక ప్రశ్న.

2014 ఎన్నికల్లో కనిష్ఠంగా 44 సీట్లే గెలిచిన గ్రాండ్ ఓల్డ్ పార్టీకి 2017 డిసెంబర్‌లో అధ్యక్షుడై, ఆపైన 2019లో 52 సీట్లే తెగలిగిన నేతగా రాహుల్‌కు ఇది పరీక్షాకాలం. వదులుకున్న పార్టీ కిరీటాన్ని మరోసారి నెత్తినపెట్టాలని తల్లి సోనియా, సమర్థకులు ప్రయత్నించినా, యువరాజు దేశసంచారానికే మొగ్గుచూపారు. అసమ్మతి, పార్టీ నుంచి పెద్దల నిష్క్రమణలు పెరుగుతున్న నేపథ్యంలో పార్టీనీ, కార్యకర్తల్నీ ఒక్కతాటిపైకి తేవడానికీ, మరీ ముఖ్యంగా తన వెంట నడపడానికీ ఆయన అందుకున్న వ్యూహాత్మక అస్త్రం బీజేవై. ప్రాంతీయ పార్టీలు, మోదీ ప్రభంజనం మధ్య కాంగ్రెస్ నానాటికీ తీసికట్టుగా మారుతున్నప్పుడు ఆ పార్టీకి దశాబ్దాలుగా మూలస్తంభమైన కుటుంబానికి శ్రమదమాదులు తప్పవు. 'ఇది భారత్ జోడో కాదు, కాంగ్రెస్ జోడో' అని బీజేపీ ఆది నుంచి అల్లరి చేస్తున్నది అందుకే.

అయితే, మతం ఆసరాగా విభజన రాజకీయాలు విజృంభిస్తున్న వేళ... దేశమంతా 'కలసి పాడుదాం ఒకే పాట... కదలి సాగుదాం వెలుగుబాట' అంటూ ప్రేమ, సమైక్యతల రాగంతో రాహుల్ ముందుకు రావడం విస్మరించలేనిది. ఈ యాత్ర అనేక లోపాలతో నిండిన చిరు ప్రయత్నమే అయినప్పటికీ... వివిధ రాజకీయ, ఆర్థిక, సామాజిక వర్గాల్లో, నేతల్లో, మేధావుల్లో కాంగ్రెస్‌కు కొంత సానుకూలత తెచ్చింది. ప్రతి ఒక్కరితో సంభాషిస్తూ, పెరిగిన గడ్డంతో, సామాన్యుల్లో ఒకరిగా తిరుగుతున్న యువరాజుపై సదభిప్రాయమూ పెంచింది. విభజనకు అడ్డుకట్టగా భారతదేశపు మూలకందమైన భిన్నత్వంలో ఏకత్వపు ప్రేమను రాహుల్ భుజాన వేసుకోవడం దేశానికి చారిత్రక అవసరమనే భావన కలిగించింది. ఉనికి కోసం పోరాడుతున్న కాంగ్రెస్‌కీ ఇది అత్యవసరమే. అందుకే, సరైన సమయానికి భారత్ జోడో జరిగిందనుకోవాలి.

గత నాలుగేళ్ళలో మూడే అసెంబ్లీ ఎన్నికల్లో సొంతంగా గెలిచిన కాంగ్రెస్‌కు రానున్న ఎన్నికల్లో విజయం కీలకం. దాని మాటేమో కానీ, 75 ఏళ్ళ క్రితం భారత తొలి ప్రధాని నెహ్రూ శ్రీనగర్‌లోని లాల్ చౌక్‌లో తొలిసారి జాతీయ జెండా ఎగరేసినచోటే, పాదయాత్ర ఆఖరి రోజున రాహుల్ కూడా పతాకావిష్కరణతో చెప్పినమాట చేసిచూపారు. ప్రతీకాత్మకమే అయినా ప్రజాబాహుళ్యంలోకి కాంగ్రెస్ అనుకున్న సందేశాన్ని పంపడానికి ఇది పనికొచ్చింది. అధికార బీజేపీపై సమరానికి ప్రతిపక్షాలన్నీ ఏకమవుతాయని చెప్పాలనుకున్న బహిరంగ సభ వ్యూహం మాత్రం ఆశించిన లక్ష్యాన్ని అందుకోలేదు. ఏకంగా 21 పార్టీల నేతల్ని కాంగ్రెస్ ఆహ్వానించినా, భారీ హిమపాతం సహా కారణాలేమైనా వచ్చింది ఒకరిద్దరే. ఇది నిరాశాజనకమే. పైగా, ఆమధ్య ఢిల్లీలో, మళ్ళీ ఇప్పుడు ఇలాగే జరిగి, ప్రతిపక్ష ఐక్యత మిథ్యేనని తేలిపోవడం మరో దెబ్బ.

వ్యక్తిగతంగా మాత్రం రాహుల్‌కు ఈ పాదయాత్ర కలిసొచ్చింది. 'నాన్ సీరియస్ పొలిటీషియన్', 'పప్పు' లాంటి ఎకసెక్కపు మాటల ఇమేజ్‌ను ఈ యువనేత తుడిచేసుకోగలిగారు. నడకలో పదుగురితో మమేకమై, ప్రజా సమస్యలను లోతుగా అర్థం చేసుకొనే ప్రయత్నం చేశారు. అయితే, పాదయాత్ర చేసినంత మాత్రాన ఓటర్లు వరాల వర్షం కురిపిస్తారనీ, సారథ్యం స్థిరపడుతుందనీ అనుకుంటే పొరపాటు. ప్రత్యామ్నాయ అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్ళి, దేశానికి కొత్త దిశానిర్దేశం చేసినప్పుడే అవి సాధ్యం. సుదీర్ఘ యాత్రతో రాహుల్ మారిన మనిషయ్యారని ఒక విశ్లేషణ. ఆయన స్నేహశీలత జనానికి తెలియడమూ మంచిదే. హర్యానా సహా కొన్ని రాష్ట్రాల్లో ఆయన పాపులారిటీ పెరిగిందనీ సర్వేల సారం. కానీ, ఇప్పటికీ మోదీకి దీటుగా కాంగ్రెస్, రాహుల్ మారనే లేదన్నది నిష్ఠురసత్యం. దాన్ని సరిదిద్దుకొనేలా ఎలాంటి భవిష్యత్ కార్యాచరణ చేపడతారన్నది ఆసక్తికరం.

ప్రతిపక్ష కూటమికి దీర్ఘకాలం సహజ సారథి అయిన కాంగ్రెస్ ఇప్పుడు ఆ స్థానానికి కూడా పోటీని ఎదుర్కొంటోంది. మోదీకి ప్రత్యామ్నాయం తామేనని చిత్రించుకొనేందుకు పలువురు ప్రాంతీయ సారథులు తొందరపడుతున్నారు. తమలో తాము తోసుకుంటున్నారు. ఈ అనైక్యతతో చివరకు పిట్ట పోరు పిట్ట పోరు పిల్లి తీరుస్తుంది. ప్రతిపక్షాలు అది గ్రహించాలి. 2024 సార్వత్రిక ఎన్నికల లోగా ఈ ఏడాదే 9 రాష్ట్రాల అసెంబ్లీ పోరు ఉంది. ఈ ప్రయాణంలో పెద్దన్నగా కాంగ్రెస్ ఆచరణాత్మక దృక్పథంతో పట్టువిడుపులు చూపాలి. ప్రేమ పంచిన ప్రేమ వచ్చును అని కవి వాక్కు. 'మొహబ్బత్ కీ దుకాన్' పెట్టుకొని దేశం తిరిగిన పార్టీకీ, నేతకూ ఏం చేయాలో చెప్పనక్కర్లేదు. దేశం ఈ మూల నుంచి ఆ మూలకు ఒక పాదయాత్ర ముగిసిపోయి ఉండవచ్చు. కానీ, కాంగ్రెస్, రాహుల్‌లు నడవాల్సిన దూరం చాలానే ఉంది. వేయాల్సిన అడుగులు మిగిలే ఉన్నాయి.

పంపకంలో ప్రజలకు వాటా దక్కేనా?

విశ్లేషణ



డి. పాపారావు

నేడు దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నారు. దేశంలో నెలకొని ఉన్న దశాబ్దాల రికార్డు స్థాయి నిరుద్యోగం, పెరిగిపోతోన్న కటిక పేదల సంఖ్య, నింగినంటుతోన్న ధరలు, పడిపోతోన్న దేశీయ ఆర్థిక వృద్ధి రేటు వంటి సమస్యల వలన నేడు ప్రజల దృష్టి, ఈ సమస్యల పరిష్కారం కోసం బడ్జెట్ ఏమైనా చేయగలదా అనే దానిపై కేంద్రీకరించి ఉంది. ఏ బడ్జెట్ అయినా ఒక్కసారిగా, ఆ ఒక్క ఆర్థిక సంవత్సర కాలంలోనే సమస్యలన్నింటినీ పరిష్కరించేయలేదు. కానీ, అందుబాటులో ఉన్న వనరుల మేరకు ఆ దిశగా సాధ్యమైనంత మేరకు ప్రయత్నం చేయటం వీలయ్యేదే! ఆ పని తాజా బడ్జెట్ చేస్తుందా?

ఒక దేశం తాలూకా బడ్జెట్‌ను, ఆ దేశంలోని సంపదను సృష్టించే ఉద్యోగులు, కార్మికులు, రైతాంగం తదితర సామాన్య జనానికి మేలు చేసే విధంగానూ రూపొందించొచ్చు; ధనవంతులు, కార్పొరేట్లు లేదా ఆ దేశంలో పెట్టుబడులు పెట్టే విదేశీ మదుపుదారుల ప్రయోజనాల కోసమూ రూపొందించవచ్చు. మన దేశీయ బడ్జెట్లు ఇప్పటివరకూ ఏ తరహాలో రూపొందాయి? దీనికి జవాబు సరళం. గతంలో మన బడ్జెట్లు, ప్రభుత్వ విధానాలు అందుబాటులో ఉన్న సంపదలో అత్యధిక వాటా దానిని సృష్టించిన ప్రజలకు పంపిణీ చేసి ఉంటే, నేడు మన దేశంలో 'కె' (ఆంగ్లాక్షరం కె ఆకృతిలో; ధనవంతులు పైకి, పేదలు కిందికి) తరహా తీవ్ర ఆర్థిక అసమానతల పరిస్థితి ఉండేది కాదు. ఆర్థిక అసమానతలు తీవ్ర స్థాయిలో ఉన్నా మన దేశం పై స్థానంలో ఉండడం గమనార్హం. ఆర్థిక సంస్కరణల క్రమంలో సంపద సృష్టి జరిగింది. కానీ, ఆ సంపద సృష్టికర్తలకు చేతిలో మొబైల్ ఫోన్ మినహా దక్కిందేమీ లేదు. ఈ సంస్కరణలు తెచ్చిన ప్రైవేటీకరణ విధానాలు కనీస అవసరాలైన విద్య, వైద్యాలను ఖరీదైనవిగా మార్చేశాయి.

మొత్తంగా బడ్జెట్ల క్రమంలో లబ్ధి పొందింది – ఒక వైపున అంతర్జాతీయ (కొంతమేరకు దేశీయ) ఫైనాన్స్ పెట్టుబడిదారులు, మరోవైపున కార్పొరేట్ సంస్థలు మాత్రమే. ఈ రెండు తరహాల వారికీ మేలు చేసేందుకే – ప్రతీ బడ్జెట్‌లోనూ ద్రవ్యలోటును తగ్గించటం... అలాగే కార్పొరేట్లకు అనేకానేక రాయితీల వంటివి నిండుగా ఉంటాయి. ద్రవ్యలోటును ఆర్థిక వ్యవహారాలకు కేంద్ర బిందువుగా చేయటం ఎందుకోసం? సుమారుగా నాలుగు దశాబ్దాల క్రితం, అంటే 1980ల ముందర – ఈ ద్రవ్యలోటు అంశానికి అటు బడ్జెట్లలోనూ, ఇటు ఆర్థిక వ్యవహారాలలోనూ ప్రాధాన్యత లేదు. నాడు ప్రపంచంలోని మార్కెట్ ఆర్థిక వ్యవస్థలు అన్నింటిలోనూ – 'కీన్స్' సిద్ధాంతాల ప్రాతిపదికన నడిచిన సంక్షేమ రాజ్యానిదే పెద్దపీట. నాడు ప్రభుత్వాల ప్రధాన బాధ్యత– దేశంలోని ప్రజల బాగోగులు కోరి... అలాగే కార్పొరేట్ల మనుగడకు కూడా అనుకూలమైన విధంగా – జన సామాన్యం తాలూకా కొనుగోలు శక్తిని... అంటే మార్కెట్లో సరుకులు, సేవలకు డిమాండును కాపాడటం. ఈ పరిస్థితి 1980ల అనంతరం మారిపోయింది. సరుకులు, సేవలను ఉత్పత్తి చేసి లాభాలను పొందే కార్పొరేట్ సంస్థల ప్రాధాన్యత తగ్గి... గతంలో ఈ కార్పొరేట్ సంస్థల స్థాపనకూ, లేదా వాటి కార్యకలాపాల నిర్వహణకూ పెట్టుబడులను సరఫరా చేసే ఫైనాన్స్ పెట్టుబడులది పై చేయి అయ్యింది. అప్పటి వరకూ పారిశ్రామిక వ్యవస్థకు కేవలం వెన్నుదన్నుగా మాత్రమే ఉన్న ఫైనాన్స్ పెట్టుబడులు పూర్తిస్థాయిలో స్వతంత్రంగానూ... మరో మాటలో చెప్పాలంటే, ఉత్పాదక, పారిశ్రామిక పెట్టుబడుల కంటే శక్తిమంతంగానూ తయారయ్యాయి. ఈ క్రమంలోనే – షేర్ మార్కెట్లు, ఫైనాన్స్ వ్యాపారాలు (ప్రస్తుతం 'వెంచర్ క్యాపిటల్' అని పిలిచే



వాటితో సహా), రియల్ ఎస్టేట్ వంటి స్పెక్యులేటివ్ పెట్టుబడులది పై చేయి అయ్యింది. ఈ తరహా పెట్టుబడుల అవసరాల కోసం ముందుకు వచ్చిందే 'ద్రవ్యలోటు' ఉండరాదు అనే సూత్రీకరణ. దీనిలో భాగంగానే ప్రపంచంలోని దరిదాపు అన్ని దేశాల కేంద్ర బ్యాంకులకు ద్రవ్యోల్బణాన్ని ఒక నిర్దిష్ట స్థాయిలో అదుపులో ఉంచటం గురుతర బాధ్యత అయింది.

ద్రవ్యలోటు అధికంగా ఉండటమంటే, ప్రభుత్వం తాలూకా ఖర్చులు దాని ఆదాయం కంటే అధికంగా ఉండటం అని. ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా ఉంటే ఆ అదనపు ఖర్చుకు అవసరమైన డబ్బును ప్రభుత్వం ముద్రించవలసి రావచ్చు లేదా అప్పుగా తెచ్చుకోవాల్సి రావచ్చు. దీని వలన వాస్తవ ఆర్థిక వ్యవస్థలో డబ్బు చలామణీ పెరిగి– ద్రవ్యోల్బణం పెరుగుతుందనేది లెక్క. ద్రవ్యోల్బణం పెరగటమంటే... అనివార్యంగా ఆ దేశం తాలూకా కరెన్సీ విలువ తగ్గుదలే. ఈ కరెన్సీ విలువ తగ్గుదల ఆ దేశీయ షేర్ మార్కెట్లలో లేదా ఇతరత్రా స్పెక్యులేటివ్ వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టినవారి లాభాల తాలూకు నికర విలువ తగ్గుదలకు దారితీస్తుంది. కాబట్టి ఈ ఫైనాన్స్ పెట్టుబడిదారులు – మన కరెన్సీ విలువ తగ్గరాదని కోరుకుంటారు. ఇది వారి లాభాలను కాపాడుకోవటం కోసం. దీని కోసం వారు మన ప్రభుత్వం ప్రజల అవసరార్థం వ్యయాలను పెంచుకోవడాన్ని అంగీకరించలేరు. కాబట్టి ఈ ద్రవ్యలోటు సిద్ధాంతకర్తలు – వివిధ దేశాల ప్రభుత్వాలు పొదుపు చర్యలను పాటించాలనీ, సాధ్యమైనంతగా ప్రజలకు లభించే సంక్షేమ పథకాలపై కోతలు పెట్టాలనీ కోరుకుంటారు.

ఆర్థిక సంస్కరణలు ఆరంభమైన తర్వాత మన పాలకులు కూడా ఈ ద్రవ్యలోటును లక్ష్మణరేఖగా ఆమోదించుకొని, దానికి లోబడే తమ ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించుకుంటున్నారు. ఈ క్రమంలోనే నిరుద్యోగం, పేదరికం పెరగటం వంటి ఎన్ని సమస్యలు ఉన్నా మన ప్రభుత్వం సంక్షేమ పథకాలు, ఉపాధి కల్పనా కార్యక్రమాలపై పెట్టే ఖర్చులను ఇంకా తగ్గిస్తూనే పోతోంది. దీనిలో భాగంగానే నేడు ఆర్థిక మాంద్యం లేదా మందగమన పరిస్థితులు ఉన్నా – ప్రభుత్వం మాత్రం బడ్జెట్లో తన ఆర్థిక లోటు లక్ష్యాన్ని ప్రస్తుతం ఉన్న 6.4 శాతం నుంచి 2024 ఆర్థిక సంవత్సరం చివరికి 5.9 శాతానికి తగ్గించటంగా చేసుకుందనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఎరువుల సబ్సిడీలపై వేటు, ఆహార సబ్సిడీల కుదింపు వంటివి ఉండనున్నాయి. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ సబ్సిడీలకు పాలకులు ఇప్పటికే మంగళ హారతి పాడేశారు.

ఇక తరువాతిది కార్పొరేట్ పెట్టుబడిదారులకు రాయితీలు ఇవ్వటం. ఇది గత 8 సంవత్సరాల బీజేపీ హయాంలో మరింత నిర్మొహమాటంగా వేగం పుంజుకుంది. 2019లో కార్పొరేట్ ట్యాక్సును భారీగా 10 శాతం మేర తగ్గించేశారు. దీని వలన ప్రభుత్వానికి సాలీనా 1.45 లక్షల కోట్ల రూపాయల ఆదాయం తగ్గిపోయింది. అలాగే, కార్మిక సంస్కరణల పేరిట – ఉద్యోగులు, కార్మికులు, గిగ్ వర్కర్ల వంటివారిని పిండి పిప్పిచేసి తమ లాభాలను పెంచుకొనేందుకు కార్పొరేట్లకు మరిన్ని దారులను తెరుస్తున్నారు. ప్రొడక్టివిటీ లింక్డ్ ఇన్సెంటివ్ పేరిట – ఉత్పత్తిని తగిన మేరకు పెంచిన కార్పొరేట్లకు రాయితీల పేరు చెప్పి లక్షల కోట్ల రూపాయలను ధారాదత్తం చేస్తున్నారు. ఇంత చేసినా వాస్తవంలో ఈ కార్పొరేట్ల నుంచి – ఇటు కొత్త పెట్టుబడుల రూపంలో గానీ, అటు అదనపు ఉపాధి కల్పన రూపంలో గానీ ఫలితం ఏమీ దక్కడం లేదు. వాస్తవ ఆర్థిక వ్యవస్థలో ప్రజల చేతిలో డబ్బు లేదనీ లేదా వారికి కొనుగోలు శక్తి లేదనే విషయాన్ని విస్మరిస్తూ... బడ్జెట్ తర్వాత బడ్జెట్‌ను మూస తరహాలో వేస్తూనే పోతోంది ప్రభుత్వం. హరిత ఇంధనానికి ప్రోత్సాహం, మౌలిక వనరులకు ఊతం వంటి పేర్లేవి చెప్పినా... అదంతా అంతిమంగా కార్పొరేట్లకు రాయితీలు, కానుకలుగా మాత్రమే ఉండిపోగలదు.

స్థూలంగా కాకులను కొట్టి గద్దలకు వేసే సరళిలో సాగుతోన్న ప్రభుత్వ విధానాలు రానున్న ఎన్నికల నేపథ్యంలో కాస్తంత కరుకుదనాన్ని తగ్గించుకున్నా – అవి పెద్దగా మారి ప్రజానుకూలంగా సంపదను పంపిణీ చేసే సాహసానికి దిగలేవు. సంవత్సరానికి ఒక రోజు ముందుకు వచ్చే ఈ బడ్జెట్ రోజునైనా లేకుంటే మిగతా 364 రోజులైనా జరుగుతోంది ఒకటే... అది జనం మీద భారాలు... కార్పొరేట్లు, ధనవంతులకు నజరానాలు! కాదూ కూడదంటే ఈ దేశంలోని కూలీ జనం కులీనులూ లేదా పన్ను చెల్లింపుదారుల పైసలను 'ఉచితాలుగా' దిగమింగేస్తున్నారంటూ ఎదురుదాడులు! ధనికుల, ధనస్వామ్య ఆరాధనలో... వినిమయ సమాజపు వస్తు వ్యామోహంలో పడి వాస్తవాలను చూడలేని దుఃస్థితిలో జన సామాన్యం కొనసాగినంత కాలం ఈ దగాకూ, దాని మనుగడకూ ఢోకా లేదు.

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్: 98661 79615

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇది మోసమే!



మోకాలి నొప్పితో ఒక కార్పొరేట్ ఆస్పత్రి(ఢిల్లీ)కి వెళ్లాను. హిప్ ఫ్రాక్చర్ అయిందని డాక్టర్ చెప్పారు. కానీ ఎక్స్‌రే/సీటీ చూపించలేదు. టోటల్ హిప్ రీప్లేస్‌మెంట్ చేసుకునేలా ఒత్తిడి చేశారు. సెకండ్ ఒపీనియన్ తీసుకునే సమయం ఇవ్వలేదు. తర్వాత ఏ ఫ్రాక్చరూ లేదని తెలిసింది. నేను జనవరి 1న ఆరోగ్యంగా రన్నింగ్ చేస్తున్నాను. 31న నడవలేకపోయాను. ఆసుపత్రికి రూ.7,42,845 చెల్లించాను. ఈ డబ్బుతో వైకల్యం కొనుక్కున్నట్టు అయింది.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

పెంచిన ఫలితం



ఆత్మాహుతి బాంబుదాడి చాలా తీవ్రమైన చర్య. ఎవరో ఒకరు ప్రాణం ఇస్తారు. అలాంటి వ్యక్తులు ముస్లింలు కాదని వాదించడం పూర్తిగా తప్పు. యూఎస్ఎస్ఆర్‌తో యుద్ధానికి వ్యతిరేకంగా విత్తిన జిహాదీ సిద్ధాంతపు సహజ పరిణామం ఇది. అప్పుడు జిహాద్ అనేది రాజ్యం నుంచి పాఠశాలలకు ఔట్‌సోర్సు అయింది. ఇప్పుడు దాని ఫలితాలు కనబడుతున్నాయి.

– సయ్యద్ షబ్బార్ జైదీ, పాక్ ఆర్థికవేత్త

ద్వంద్వ వాదన



తాలిబన్లు అఫ్గానిస్తాన్‌ను బాంబులతో పేల్చుతున్నప్పుడూ, నిస్సహాయ అఫ్గాన్లను చంపుతున్నప్పుడూ వాళ్లు ఇస్లాం కోసం పోరాడుతున్న ముజాహిదీన్లు అని పాకిస్తానీయులు అనేవాళ్లు. అదే తాలిబన్లు పాకిస్తాన్ లోపల ఆత్మాహుతి దాడులు జరుపుతుంటే వాళ్లను కూలీ సైనికులనీ, ఇస్లాంతో వారికి ఏ సంబంధం లేదనీ అంటున్నారు. ఎంత కపటం!

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

నివారణా మార్గాలు



పోలీసులు నేరాలను నివారించలేరు. అవి జరిగిన తర్వాత వాళ్లు వస్తారు. నేరాల నివారణ అనేది సామాజిక కార్యక్రమాలకు నిధులు ఇవ్వడం, అవకాశాలను సృష్టించడం ద్వారా మాత్రమే జరుగుతుంది.

– మహమ్మద్ సఫా, యూఎన్ ప్రతినిధి

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

తెలుగులో చెప్పాల్సిందే! కానీ...

అభిప్రాయం



మంగారి రాజేందర్

అన్ని భారతీయ భాషల్లో సుప్రీంకోర్టు తీర్పులను అందుబాటులో ఉంచుతామని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ గత వారం ఓ సభలో అన్నారు. భాషా అవరోధాన్ని కృత్రిమ మేధస్సు ఆధారంగా, దాన్ని ఉపయోగించుకొని అధిగమిస్తామని కూడా ఆయన అన్నారు. 'బార్ కౌన్సిల్ ఆఫ్ మహారాష్ట్ర, గోవా' ఏర్పాటు చేసిన సన్మాన సభలో ప్రసంగిస్తూ భారత పౌరులు అర్థం చేసుకునే భాషలో తీర్పులు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.


సుప్రీం తీర్పులు ఇంగ్లిష్‌లో ఉండటం వల్ల ఆ తీర్పుల్లో ఏం రాశారో తెలుసుకోవటానికి చాలామంది దేశ ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. ప్రజలే కాదు చాలామంది యువ న్యాయవాదులు కూడా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కృత్రిమ మేధస్సు అనువాదాలూ, అదే విధంగా ప్రభుత్వ అనువాదకులు చేసే అనువాదాలు కృతకంగా ఉండి... ప్రాంతీయ భాషలో చదువుకోవడం కన్నా ఇంగ్లిష్‌లోనే చదువు కోవడం మంచిదన్న అభిప్రాయానికి ప్రజలు వచ్చే అవకాశం ఉంది. ఈ విషయాన్ని కూడా భారత ప్రధాని గ్రహించి ఈ అనువాదాలను సరిచూసేందుకు రిటైర్డ్ న్యాయమూర్తుల సహాయం తీసుకుంటామని కూడా అన్నారు.

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం 1960 లోని నిబంధన 3(2) ప్రకారం శాసన వ్యవస్థలో ప్రవేశపెట్టాల్సిన బిల్లులూ, జారీ చేసే ఆర్డినెన్స్‌లూ, నియమాలూ, రెగ్యులేషన్స్‌నూ తెలుగులో ప్రవేశపెట్టాలి. ఈ చట్టం రెండు రాష్ట్రాలకూ వర్తిస్తుంది. నాకున్న సమాచారం ప్రకారం ప్రభుత్వం అదే విధంగా శాసన సభల్లో ప్రవేశపెడుతుంది. రాజ పత్రంలో ప్రచురితమవుతాయి. కానీ అవి ప్రజలకి అందుబాటులో ఉండవు. ఒకవేళ ప్రభుత్వం వాటిని అందుబాటులోకి తెచ్చినా అవి ఎవరికీ అర్థం కాని విధంగా ఉంటాయి. గొట్టు భాషలో ఉంటాయి. తెలుగులో ప్రావీణ్యం ఉన్న వ్యక్తులు కూడా అర్థం చేసుకోలేరు. ఉదాహరణకి 'ద ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ ఏక్ట్, 1958' (The probation of offenders Act, 1958)ను తెలుగులో అనువదించి ప్రచురించారు. ఈ చట్టానికి తెలుగు అనువాదం 'అపరాధుల పరిరక్షణ చట్టం, 1958'. చట్టం పేరు వరకు అనువాదం ఫర్వాలేదు. కానీ ఈ చట్టంలో ఉన్న 19 నిబంధనలను అర్థం చేసుకోవడానికి చాలా శ్రమించాల్సి వస్తుంది.

ఈ చట్టం ప్రభుత్వం ప్రకటించిన తేదీ నుంచి అమల్లోకి వస్తుందని అనువాదం చేయడానికి అందులో చేసిన అనువాదం – "ఆ రాజ్య ప్రభుత్వం రాజ పత్రంలో అధిసూచన ద్వారా నియతం చేయు తేదీన అమలులోకి వచ్చును". అదే విధంగా 'నిర్దేశించిన' అంటే ఈ చట్టంలోని నియమాల ప్రకారం నిర్దేశించిన అని రాయాల్సిన దానికి... 'విహితపరచబడిన' అని అనువదించారు. అంటే ఈ చట్టం కింద చేయబడిన నియమావళి ద్వారా విహితపరచబడిన అని అర్థం. ఇది అర్థం చేసుకోవడానికి చాలా కష్టపడవలసి వస్తుంది. 'నిబంధన' అన్న పదాన్ని 'పరిచ్ఛేదము' అనీ, 'గతంలో శిక్షపడిన' అన్న పదానికి గాను "పూర్వపు దోష స్థాపన జరిగిన' అనీ అనువదించారు. ఇట్లా చెప్పుకుంటూ పోతే చాలా గొట్టు పదాలు కనిపించి ఆ తెలుగు అనువాదాన్ని చదవడం మానేస్తారు. గ్రాంథిక వాసన లేని సరళమైన అనువాదాల ఆవశ్యకత ఎంతో అవసరం. తీర్పులు ప్రాంతీయ భాషల్లో రావడం సంతోషించదగ్గ పరిణామమే అయినప్పటికీ తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తెలుగు తీర్పులు, అదీ ప్రాంతీయ భాషల్లో తీర్పులను తీసుకొని రావడాన్ని ప్రధాని మోదీ అభినందించారు. ఈ రెండు సంఘటనలు భాషాభిమానులకు సంతోషాన్ని కలుగజేశాయి. ఇది ఇలా ఉంటే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ చేపట్టిన ఈ చర్యల ద్వారా స్ఫూర్తి పొందిన ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మరో అడుగు ముందుకు వేశారు. మొన్న రిపబ్లిక్ డే సందర్భంగా మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పులను కూడా త్వరలో తెలుగులో అందించడానికి ప్రయత్నం చేస్తామని అన్నారు. సామాన్యుడు తీర్పులను అర్థం చేసుకునే విధంగా ప్రయత్నం చేస్తామని కూడా అన్నారు. సుప్రీంకోర్టు అడుగు జాడల్లో తాము నడుస్తామని కూడా ఆయన అన్నారు. ఇలాంటి భరోసా తెలంగాణ హైకోర్టు నుంచి రాలేదు. బహుశా వస్తుందని ఆశించవచ్చు.

ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రధాన న్యాయమూర్తులు గుర్తించాల్సిన అంశం ఏమిటంటే – హైకోర్టు తీర్పులు తెలుగులో అనువాదం చేయడం ఎంత ముఖ్యమో, అంతకన్నా ముఖ్యం – జిల్లా న్యాయ వ్యవస్థలో తెలుగులో న్యాయపాలన జరగడం. హైకోర్టులలో తెలుగు భాషా వినియోగానికి అవరోధాలు ఉన్నాయి కానీ జిల్లా కోర్టుల్లో తెలుగు వినియోగానికి ఎలాంటి అవరోధాలూ లేవు. ఎలాంటి



అవరోధాలు లేనప్పటికీ తెలుగులో న్యాయపాలన జరగడం లేదు. జిల్లా కోర్టుల్లో తెలుగులో న్యాయపాలన జరిగే విధంగా చర్యలు ఉభయ హైకోర్టులూ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయం పట్ల రెండు హైకోర్టులూ తమ దృష్టిని కేంద్రీకరిస్తాయని ఆశించడం అత్యాశ కాదు.

తెలుగులో న్యాయపాలన జరగాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టును సంప్రదించి ప్రభుత్వం రెండు జీవోలను జారీ చేసింది. ఆ జీవోల ప్రకారం... సివిల్, క్రిమినల్ కేసుల్లో తీర్పులను జిల్లాల్లో ఉన్న కోర్టులు వెలువరించవచ్చు. నాలాంటి ఒకరిద్దరు న్యాయమూర్తులు తెలుగులో తీర్పులను వెలువరించారు. నా తెలుగు తీర్పులకి వచ్చిన ప్రతిస్పందన చూసి మరికొందరు న్యాయమూర్తులు తెలుగులో తీర్పులను వెలువరించారు. నాలాంటి వ్యక్తులు పదవీ విరమణ చేసిన తరువాత ఆ స్ఫూర్తి పూర్తిగా కనుమరుగైపోయింది.

జిల్లా కోర్టుల్లో సాక్షుల విచారణ దాదాపుగా తెలుగులోనే జరుగుతుంది. వారు చెప్పిన విషయాలను ఇంగ్లిష్‌లోకి తర్జుమా చేస్తారు. ఆ తరువాత తీర్పులు ఇంగ్లిష్‌లో వస్తాయి. తాము కేసు ఎందుకు ఓడిపోయామో – అవతలి వ్యక్తి కేసు ఎందుకు గెలిచాడో తెలియని పరిస్థితి. దీని వల్ల కోర్టుల మీద విశ్వసనీయత తగ్గే అవకాశం ఉంది.

హైకోర్టు కన్నా, కింది కోర్టులే ప్రజలకి దగ్గరగా ఉంటాయి. ఆ కోర్టులకే ప్రజలు ఎక్కువగా వెళ్తుంటారు. అక్కడ న్యాయపాలన తెలుగులో జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఒక వ్యక్తి ఎన్ని భాషలు నేర్చుకున్నప్పటికీ మాతృ భాషలో ఉన్న వ్యక్తీకరణ ఇతర భాషల్లో ఉండదు. తెలుగులో హైకోర్టు తీర్పులు ఎంత అవసరమో జిల్లా కోర్టుల్లో తెలుగులో న్యాయపాలన జరగడం అంతకన్నా ముఖ్యం. భారత ప్రధాని, భారత ప్రధాన న్యాయమూర్తి ప్రాంతీయ భాషల్లో తీర్పులు వెలువరించడం గురించి శ్రద్ధ తీసుకుంటున్న సందర్భంలో ఉభయ రాష్ట్రాల్లోని ప్రధాన న్యాయమూర్తులు తెలుగులో న్యాయపాలన గురించి శ్రద్ధ తీసుకుంటారని ఆశిద్దాం.


తెలుగులో తీర్పులు చెప్పడంలో మొదట్లో కొన్ని ఇబ్బందులు ఉంటాయి. కానీ కాలక్రమంలో ఆ ఇబ్బందులను అధిగమించవచ్చు. జ్యుడీషియల్ అకాడమీ, అధికార భాషా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో 'తెలుగులో న్యాయపాలన' సదస్సు జరిగి ఫిబ్రవరి 13వ తేదీకి పది సంవత్సరాలు వస్తాయి. అయినా తెలుగులో న్యాయ పాలన విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

నేను జ్యుడీషియల్ అకాడమీకి గెస్టు లెక్చర్లు ఇవ్వడానికి వెళ్లినప్పుడల్లా నెలకి రెండు మూడు తీర్పులు వెలువరించమని కోరుతున్నప్పటికీ ఆ దిశగా పురోగతి కనిపించడం లేదు. ఈ దిశగా హైకోర్టుల సూచనలు అత్యంత అవసరం. ఇప్పుడున్న నేపథ్యంలో అది ఎంతో దూరం లేదని అనిపిస్తుంది.

వ్యాసకర్త మాజీ జిల్లా జడ్జి, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యులు । 94404 83001

ఎఱుక పిడికెడు ధనం

కార్యసాధనకు అంగబలం, అర్థబలం ఉండాలి అని చెపుతారు. ధనంతో సాధించేవి కొన్ని మాత్రమే. మనవాళ్ళు అనుకునే మనుషులు ఉంటే జరిగే పనులు ఎన్నో! మనుషులు ధనాన్ని సమకూర్చగలరు. ధనంతో మనుషులను కొనటం కష్టం. అందుకే 'ఎఱుక పిడికెడు ధనం' అనే మాట వాడుకలోకి వచ్చింది. ఏదైనా పని జరుపుకోటానికో, కొత్త ప్రదేశానికి వెళ్ళినప్పుడో విషయం తెలిసిన వారు... అంటే ఎఱుక కలిగినవారు ఎవరైనా ఉంటే బాగుండు అని అనుకుంటారు ఎవరైనా. కనీసం పరిచయస్తులు ఉంటే అదొక ధైర్యం. వారి నుండి ఆశించేది ఆర్థిక సహాయం కాదు. పని జరగటానికి కావలసిన



సులువు. అదే జ్ఞానం! అంటే ఎఱుక. ఇక్కడ ఎఱుక అంటే మనకి పరిచయం ఉన్నవారు అనీ, విషయ పరిజ్ఞానం ఉన్నవారు అనీ రెండు అర్థాలు. విషయ పరిజ్ఞానం ఉంటే ఇంకా పని ప్రారంభించక ముందే సగం కార్యాన్ని సాధించినట్టు. వైద్యరంగంలో దానినే 'నిదానమే ప్రధానం' అంటారు. నిదానం అంటే రోగ నిర్ధారణ. రోగం తెలిస్తే మందు ఇవ్వటం తేలిక. ఏ రంగం అయినా అంతే! ఇదంతా లౌకిక వ్యవహారం. అసలు విషయానికి వస్తే..

ఎఱుక అంటే జ్ఞానం, తెలిసి ఉండటం. ఏది తెలుసుకోవాలో అది జ్ఞానం. ఆ పై తెలుసుకోవలసినది మిగిలి ఉండదు. అదే ఆధ్యాత్మిక జ్ఞానం. ఏదైనా ఒక అంశాన్ని లోతుగా పరిశీలించుకుంటూ పోతే చేరేది భగవత్తత్త్వం దగ్గరకే. అదే వేదాంతం. అంటే వేదాలకి చివర ఉండేది. వేదాలు చిట్టచివరికి సారభూతంగా చెప్పేది దైవాన్ని గురించే. అందుకే ఏ రంగంలోనైనా విస్తృతంగా అధ్యయనం చేసి మూలాలకు వెళ్ళినప్పుడు ఇచ్చే డిగ్రీ 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ'. ఇక్కడ ఫిలాసఫీ అంటే తత్త్వశాస్త్రం. ఈ ఎఱుక పిడికెడు అంటే గుప్పెడు ధనం. మన శరీరంలో పిడికెడు ప్రమాణంలో ఉండేది గుండె. అది ప్రాణం రూపంలో దైవం ఉండే చోటు. అదే మాటను కృష్ణుడు చెప్పాడు కూడా. 'హృద్దేశే అర్జున తిష్ఠతి' అని భగవద్గీతలో కూడా చెప్పాడు. ఏ జీవికైనా అతి విలువైన ధనం ప్రాణమే కదా! ప్రమాణానికే కాదు పట్టుదలకూ, అందుబాటులో ఉండటానికీ కూడా పిడికిలిని ప్రతీకగా చెపుతారు.

– డాక్టర్ ఎస్. అనంత లక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: శు.ఏకాదశి ప.3.39 వరకు, తదుపరి ద్వాదశి నక్షత్రం: మృగశిర తె.4.43 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి ఆరుద్ర, వర్జ్యం: ఉ.8.58 నుండి 10.43 వరకు, దుర్ముహూర్తం: ప.11.50 నుండి 12.35 వరకు, అమృతఘడియలు: రా.7.16 నుండి 9.01 వరకు, భీష్మ ఏకాదశి; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.37, సూర్యాస్తమయం: 5.50.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

భూసేకరణతో ఆగిన గుండె

గుండెపోటుతో నిర్వాసితుని మృతి

భువనగిరి: రీజినల్ రింగ్ రోడ్డుకు భూమి కావాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో.. మనస్తాపానికి గురైన ఒక పేద కర్షకుడి గుండె ఆగిపోయింది. యాదాద్రి జిల్లా భువనగిరి మండలం బాలంపల్లి గ్రామానికి చెందిన భూ నిర్వాసితుడు మద్దూరి రఘునందన్‌రెడ్డి (60) భూమిని కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వకు ప్రభుత్వం తీసుకుంది. ఇప్పటికే రెండుసార్లు అతని భూమిని తీసుకున్న ప్రభుత్వం.. రీజనల్ రింగ్ రోడ్డు కోసం మూడోసారి భూమి తీసుకునేందుకు ప్రతిపాదించడంతో తీవ్ర అందోళనకు గురయ్యాడు. ఉన్న భూమి పోతే బతికేదెలా? అంటూ కొంతకాలంగా బాధపడుతున్నాడు. ఇటీవల ఆర్డీవో కార్యాలయంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని తన అభిప్రాయాన్ని సైతం తెలిపాడు. మనోవేదనతో గురైన రఘునందన్‌రెడ్డికి శనివారం గుండె పోటు రావడంతో.. కుటుంబ సభ్యులు అతన్ని హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

టీటీడీపీ మీడియా కో-ఆర్డినేటర్‌గా సురేష్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ టీడీపీ రాష్ట్ర మీడియా వ్యవహారాల కో–ఆర్డినేటర్‌గా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన బియ్యాని సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నియామక ఉత్తర్వులను అందజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని సురేష్ తెలిపారు.

తెలంగాణ రాజపత్రము
TELANGANA STATE GAZETTE
విశేష పత్రము
EXTRAORDINARY
అధికారిక ప్రకటన
PUBLISHED BY AUTHORITY

రాజపత్రము సంఖ్య : బి3/02/2023 భద్రాద్రి కొత్తగూడెం తేది : 20.01.2023 శుక్రవారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
భద్రాద్రి కొత్తగూడెం
ఫారం - 6
(కేంద్ర చట్టం 30ఎ/2017) యొక్క సెక్షన్ 11(1) మరియు
సబ్ రూల్ (1) ఆఫ్ రూల్ (19) అనుసరించి)

రూఢి ప్రకటన

రెవిన్యూ మండలాధికారి లేఖ సంఖ్య : డి/2169/2022 తేది : 06.1.2023
జిల్లా కలెక్టర్ గారి ఉత్తర్వులు సంఖ్య : జి/1802/2022 తేది : 17.01.2023
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజపత్రము సంఖ్య : బి3/02/2023 తేది : 20.01.2023

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం ఆదేశానుసారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సుజాతనగర్ మండలంలో సుజాతనగర్ గ్రామములో గల అదనపు విస్తీర్ణం ఎ. 1.27 1/4 గుంటలు ఈ దిగువ చూపిన భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా వేపలగడ్డ నుండి మంగపేట వరకు వెళ్ళు రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్.ఓ.బి.) లైన్ నిర్మాణం నిమిత్తం భూమి అవసరమైయున్నదని భావించినందున భూసేకరణలోని సముచిత పరిహారం మరియు పారదర్శకత పునరావాస పునరాశ్రయ చట్టం – 2013 (నం.30ఎ/2017)లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీ చేయనున్నది.

సుజాతనగర్ గ్రామములోని క్రింద షెడ్యూల్‌లో సూచించిన వేపల గడ్డ నుండి మంగపేట వరకు వెళ్ళు రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్.ఓ.బి.) లైన్ నిర్మాణం నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు శ్రీయుత కలెక్టర్ / జిల్లా మేజిస్ట్రేట్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారు ప్రకారము రెవెన్యూ డివిజనల్ అధికారి, కొత్తగూడెం గారిని భూసేకరణ అధికారిగా నియమించినారు.

కావున ఈ ప్రాజెక్టు క్రింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సుజాతనగర్ మండలంలో మరియు సుజాతనగర్ గ్రామములో భూమి విస్తీర్ణం ఎ. 1.27 1/4 గుంటలు భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

షెడ్యూల్

వేపలగడ్డ నుండి మంగపేట వరకు వెళ్ళు రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్.ఓ.బి.) లైన్ నిర్మాణము నిమిత్తం

గ్రామము : సుజాతనగర్ మండలం : సుజాతనగర్ జిల్లా : భద్రాద్రి కొత్తగూడెం

క్ర. సం.	సర్వే నంబరు (పహాణీ ప్రకారం)	సర్వే నంబరు (సబ్ డివిజన్ ప్రకారం)	భూమి స్వభావం	భూమి వర్గీకరణ	సేకరించే సర్వే విస్తీర్ణం	[illegible]				హద్దులు				చెట్లు/ కట్టడముల వివరములు
						పట్టాదారుని పేరు	కులం	అనుభవదారుని పేరు	కులం	తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15
1	173/ఆ1	173/2	పట్టా	మాగాణి	120.00 చ.గజా.	బానోతు మారు భర్త లక్ష్మీ	ఎస్.టి.	బొల్లా రామసుబ్బారావు తండ్రి రంగనాయకులు	ఓ.సి.	కాలువ	173/1	174	779	ఖాళీ
2	173/ఆ1	173/2	పట్టా	మాగాణి	65.00 చ.గజా.	బానోతు మారు భర్త లక్ష్మీ	ఎస్.టి.	కొల్లి జే భర్త బ్రహ్మయ్య	ఓ.సి.	కాలువ	173/1	174	779	ఖాళీ
3	173/ఆ1	173/2	పట్టా	మాగాణి	65.00 చ.గజా.	బానోతు మారు భర్త లక్ష్మీ	ఎస్.టి.	రాచోటు పావన భర్త ఉప్పల వెంకన్న	ఓ.సి.	కాలువ	173/1	174	779	ఖాళీ
4	173/ఆ1	173/2	పట్టా	మాగాణి	48.00 చ.గజా.	బానోతు మారు భర్త లక్ష్మీ	ఎస్.టి.	రోడ్		కాలువ	173/1	174	779	ఖాళీ
5	173/ఆ1	173/2	పట్టా	మాగాణి	120.00 చ.గజా.	బానోతు మారు భర్త లక్ష్మీ	ఎస్.టి.	బానోతు రాములు తండ్రి లక్ష్మీ	ఎస్.టి.	కాలువ	173/1	174	779	ఖాళీ
6	173/ఆ1	173/2	పట్టా	మాగాణి	60.00 చ.గజా.	బానోతు మారు భర్త లక్ష్మీ	ఎస్.టి.	వేముల అనసూర్య భర్త సాంబయ్య	ఓ.టి.	కాలువ	173/1	174	779	రేకులతో కూడిన ఇల్లు
7	173/ఆ1	173/2	పట్టా	మాగాణి	60.00 చ.గజా.	బానోతు మారు భర్త లక్ష్మీ	ఎస్.టి.	భుక్య కుంజీరామ్	ఎస్.టి.	కాలువ	173/1	174	779	ఖాళీ
8	173/ఆ2	173/2	పట్టా	మాగాణి	216.70 చ.గజా.	కాటిపల్లి విశ్వేశ్వరరావు తండ్రి లక్ష్మీనారాయణ	ఓ.సి.	అనిల్ జోలియ తండ్రి వర్ధమాన్ జోలియ	ఓ.సి.	కాలువ	173/1	174	779	పెట్రోల్ అవుట్‌లెట్
9	783/ఆ	783/1	పట్టా	మెట్ట	57.00 చ.గజా.	హాలోత్ జయరాం తండ్రి వాళ్య	ఎస్.టి.	మేకం ప్రభాకర్‌రావు తండ్రి తిరుపతయ్య	ఓ.సి.	783/2	783/1	782	784/1	ఖాళీ
10	783/ఆ	783/1	పట్టా	మెట్ట	57.00 చ.గజా.	హాలోత్ జయరాం తండ్రి వాళ్య	ఎస్.టి.	కోదూరి రమేష్ తండ్రి రాజయ్య	ఓ.సి.	783/2	783/1	782	784/1	ఖాళీ
11	783/ఆ	783/1	పట్టా	మెట్ట	57.00 చ.గజా.	హాలోత్ జయరాం తండ్రి వాళ్య	ఎస్.టి.	ఎలేటి పార్వతి భర్త ప్రదీప్ కుమార్	ఓ.సి.	783/2	783/1	782	784/1	ఖాళీ
12	783/ఆ	783/1	పట్టా	మెట్ట	57.00 చ.గజా.	హాలోత్ జయరాం తండ్రి వాళ్య	ఎస్.టి.	గద్ద కుమారస్వామి తండ్రి వెంకట రాములు	ఓ.సి.	783/2	783/1	782	784/1	ఖాళీ
13	783/ఆ	783/1	పట్టా	మెట్ట	46.50 చ.గజా.	హాలోత్ జయరాం తండ్రి వాళ్య	ఎస్.టి.	రోడ్		783/2	783/1	782	784/1	
14	783/ఆ	783/1	పట్టా	మెట్ట	60.00 చ.గజా.	హాలోత్ జయరాం తండ్రి వాళ్య	ఎస్.టి.	జీకట చంద్రకళ భర్త నరసింహారావు	ఓ.సి.	783/2	783/1	782	784/1	ఖాళీ
15	783/ఆ	783/1	పట్టా	మెట్ట	60.00 చ.గజా.	హాలోత్ జయరాం తండ్రి వాళ్య	ఎస్.టి.	దులగుంతల రాజేశ్వరమ్మ భర్త సీతారాములు	ఓ.సి.	783/2	783/1	782	784/1	ఖాళీ
16	784/ఆ	783/1	పట్టా	మెట్ట	137.00 చ.గజా.	హాలోత్ జయరాం తండ్రి వాళ్య	ఎస్.టి.	మాటేటి సైదమాబి భర్త పెద్ద రంగారావు	ఓ.సి.	కాలువ	755	కాలువ	783/1	ఖాళీ
17	781/ఆ/1	781/1	పట్టా	మాగాణి	60.00 చ.గజా.	హాలోత్ జయరాం తండ్రి వాళ్య	ఎస్.టి.	కారుమూరి సీతారత్నం భర్త సాంబశివరావు	ఓ.సి.	781/2	782	783/1	780	ఖాళీ
18					ఎ.1-16 గుం.	ప్రభుత్వ భూమి		ఐ.బి. ఎక్స్టింగ్ సింగబుపాలెం కాలువ	ఏటి					
		పూర్తి విస్తీర్ణం			ఎ.1.27 1/4									

క్ర.సం.	కట్టడములు మరియు చెట్ల వివరములు	సంఖ్య
1	రేకుల షెడ్ ఇల్లులు	01
2	పెట్రోలియం అవుట్‌లెట్	01
3	మొత్తం	02

ఇట్టి ప్రకటన భూసేకరణ భూ నిర్వాసితుల పునరావాసం మరియు పునరుద్ధరణ చట్టం 2013 (నం.30ఎ/2013)లోని సెక్షన్ 11(1) ప్రకారము, సంబంధిత భూ యజమానులకు సరైన భూ నష్ట పరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీచేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, కొత్తగూడెం వారి కార్యాలయములో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు, ఏదైనా పని దినములలో కార్యాలయాల పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/జిల్లా భద్రాద్రి కొత్తగూడెం వారు రెవెన్యూ డివిజనల్ అధికారి, కొత్తగూడెం వారు సిబ్బందికి ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్-12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదేని ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూ సేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరింపబడిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి కొనుగోలు, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయంలో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్నయెడల చట్టంలోని సెక్షన్-(15) ప్రకారం జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం / రెవెన్యూ డివిజనల్ అధికారి, కొత్తగూడెం గార్లకు ఇట్టి ప్రకటన జారీ చేసిన **(60) దినముల లోపల** వారి అభ్యంతరములు వ్రాతపూర్వకముగా తెలియజేయవలసియున్నది

సం/-	సం/-	సం/-
కె. స్వర్ణలత	కె. వెంకటేశ్వర్లు	అనుదీప్ దురిశెట్టి
భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి, కొత్తగూడెం	అదనపు కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం	జిల్లా కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం

DIPR RO No. 1168/LA-PP/Advt/Pub/2022-23

• పాతగుట్టలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



స్వామివారికి కంకణధారణ సందర్భంగా కంకణం చూపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం వార్షిక బ్రహ్మోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో విష్వక్సేన పూజ, స్వస్తివచనం, రక్షాబంధనం, పుణ్యాహవచనంతో ఉత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టారు. అనంతరం ప్రధానాలయం, ఉప ఆలయాలు, తిరువీధిలో కల్యాణమండపం వద్ద పవిత్రమైన శుద్ధజలంతో సంప్రోక్షణ నిర్వహించారు.

నేటి నుంచి మినీ మేడారం జాతర

మండమెలిగెతో ఉత్సవాలు షురూ.. పెరిగిన భక్తుల తాకిడి

సాక్షి ప్రతినిధి, వరంగల్: కోరిన కోర్కెలు తీర్చే సమ్మక్క–సారలమ్మ మినీ జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. ఆదివాసీ సంస్కృతీ సాంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా సమ్మక్క–సారలమ్మ పూజారులు బుధవారం మండమెలిగె పండుగ నిర్వహించనున్నారు. మేడారంలోని సమ్మక్క ఆలయం, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో మండమెలిగె పండుగ నిర్వహించేందుకు పూజారులు సిద్ధమయ్యారు. సమ్మక్క–సారలమ్మ ఆలయాలను పూజారులు శుద్ధి చేస్తారు. సమ్మక్క పూజారి సిద్దబోయిన మునీందర్ ఇంట్లో నుంచి పూజా సామగ్రిని సమ్మక్క గుడికి తీసుకెళ్తారు. గుడిలో పవిత్రమైన పుట్ట మట్టితో అలుకు పూతలు నిర్వహిస్తారు. ఆడపడుచులు ఆలయం లోపల, బయట ముగ్గులతో తీర్చిదిద్దుతారు. గ్రామ దేవతలకు, మైసమ్మకు పూజలు నిర్వహిస్తారు. అనంతరం మేడారం ప్రధాన ద్వారం అమ్మవార్ల గద్దెల ప్రవేశ మార్గం ముందు దొరటంబాలు (దిష్టి తగలకుండా ఏర్పాటు చేసే ద్వార స్తంభం) లేపుతారు. ద్వారానికి, మామిడి ఆకుల తోరణానికి అనక్కాయ, కోడిపిల్లలను కడతారు. మేడారంలోని మరో ప్రవేశం మార్గంలోనూ దొరటంబాలను ఏర్పాటు చేస్తారు. అనంతరం సమ్మక్క గుడిలో ప్రత్యేక పూజలు చేస్తారు. బుధవారం రాత్రి సమ్మక్క గుడి నుంచి పూజారులు అమ్మవారి రూపంలో పసుపు, కుంకుమలు, పూజ సామాగ్రిని తీసుకుని తల్లుల గద్దెల వద్దకు డోలివాయిద్యాలతో వెళ్తారు. గద్దెల వద్ద సమ్మక్క–సారలమ్మ పూజారులు కలుసుకుని రాత్రంతా సంబురాలతో జాగరణ చేస్తారు. కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలోనూ సారలమ్మ పూజారులు మండమెలిగె పండుగ పూజలు నిర్వహిస్తారు.

నాలుగు రోజుల జాతర

అమ్మవార్లకు ఇష్టమైన మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా మినీ జాతర నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1న మండమెలిగె, 2న సారలమ్మ గద్దె శుద్ధి, 3న సమ్మక్క గద్దె శుద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పూజారులు వెల్లడించారు. శుద్ధి కార్యక్రమాలు ముగిసిన తర్వాత భక్తులకు మొక్కులు చెల్లించుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు.

• చెర్వుగట్టులో ఘనంగా అగ్నిగుండాలు



అగ్ని గుండాల్లో నడిచేందుకు బారులుతీరిన భక్తులు

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజైన మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఓం నమఃశివాయా.. హరహర మహాదేవ–శంభో శంకర అని స్మరిస్తూ అగ్నిగుండంలోంచి నడుచుకుంటూ వెళ్లారు. బ్రహ్మోత్సవాలకు జిల్లా నుండే కాకుండా పరిసర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఐటీ దాడుల కలకలం

- ఫార్మా, రియల్ ఎస్టేట్ కంపెనీలపై ఫోకస్
- వసుధ ఫార్మాకెమ్, రాజ్‌పుష్ప లైఫ్‌స్టైల్ సిటీలోనూ సోదాలు
- మంగళవారం ఏకకాలంలో 50కిపైగా బృందాల తనిఖీలు

సాక్షి, హైదరాబాద్/రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో ఆదాయపన్ను(ఐటీ) శాఖ అధికారుల వరుస దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. హైదరాబాద్‌లోని కొన్ని ఫార్మా, రియల్ ఎస్టేట్ కంపెనీల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచే ఐటీ అధికారులు సోదాలు మొదలుపెట్టారు. హైదరాబాద్‌తోపాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. వసుధ ఫార్మాకెమ్ లిమిటెడ్, రాజపుష్ప లైఫ్‌స్టైల్ సిటీలకు చెందిన డైరెక్టర్లు, ఇతర కీలక వ్యక్తుల కార్యాలయాలు, ఇళ్లలో, వర్టెక్స్, గచ్చిబౌలిలోని ముప్పా రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఈ సోదాలు జరిగాయని సమాచారం. నగరానికి చెందిన వసుధ ఫార్మాకెమ్ లిమిటెడ్ కార్పొరేట్ కార్యాలయం, చైర్మన్, డైరెక్టర్ల ఇళ్లలో ఏకకాలంలో 30కిపైగా ఐటీ బృందాలు సోదాలు నిర్వహించినట్టు తెలిసింది. మాదాపూర్, వెంగళరావు నగర్‌లోని సదరు కంపెనీ కార్యాలయాల్లో పలు అకౌంట్స్, ఇతర వివరాలను పరిశీలించినట్టు తెలిసింది. జీడిమెట్ల, కుత్బుల్లాపూర్‌లోని వసుధ ఫార్మా కార్యాలయాల్లో, ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్ ప్రాంతంలో నాలుగుచోట్ల తనిఖీలు చేసినట్టు సమాచారం. కాగా, ఫార్మా కంపెనీ నిర్వాహకులు రియల్‌ఎస్టేట్ కంపెనీలను కూడా నడుపుతున్నట్టుగా గుర్తించినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ఆడిటర్లు, అకౌంటెంట్లతో కలిసి గత ఐదేళ్లకు సంబంధించిన బ్యాలెన్స్‌షీట్లు, ఎగుమతుల వివరాలపై ఆరా తీసినట్టు సమాచారం. జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని వసుధ కంపెనీల్లోనూ ఐటీ సోదాలు జరిపింది. మాదాపూర్, వెంగళరావునగర్‌లోని కార్పొరేట్ ఆఫీసుల్లో కీలకదాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా, సోదాల విషయాన్ని ఐటీ అధికారులు ధ్రువీకరించలేదు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి ఇంట్లోనూ తనిఖీలు

సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌మున్సిపాలిటీ పరిధిలోని రాజ్‌పుష్ప లైఫ్‌స్టైల్ సిటీలోనూ ఐటీ బృందాలు సోదాలు చేపట్టాయి. మొత్తం 50 బృందాలుగా విడిపోయిన అధికారులు తెల్లాపూర్‌తో పాటు పలుచోట్ల సోదాలు నిర్వహించినట్టు తెలిసింది. సిద్దిపేట జిల్లా మాజీ కలెక్టర్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి నివాసంతోపాటు ఆయన కుటుంబసభ్యుల ఇళ్లు, కార్యాలయాల్లోనూ ఈ సోదాలు సాగినట్టు సమాచారం. పన్నుఎగవేతకు సంబంధించిన ఆరోపణలపై ఈ సోదాలు చేపట్టినట్టు తెలిసింది. ఈ సందర్భంగా పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. రాజపుష్ప లైఫ్‌స్టైల్ సిటీలో బుధవారం సైతం ఐటీ తనిఖీలు కొనసాగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

జడ్చర్లలో పేలుడు పదార్థాల స్వాధీనం

- 2,500 ఎలక్ట్రానిక్ డిటోనేటర్‌లు, 2,750 జిలెటిన్‌స్టిక్స్‌ను పట్టుకున్న పోలీసులు



బాక్స్‌లలో పేలుడు పదార్థాలు

జడ్చర్ల: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో పోలీసులు భారీ ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. జన నివాస ప్రాంతాల్లో ఒక్కసారిగా పెద్దమొత్తంలో జిలెటిన్ స్టిక్స్ బయటపడటంతో స్థానికంగా కలకలం రేపింది. మంగళవారం జరిగి ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా పెబ్బేర్‌కు చెందిన రాజేశ్ అనే వ్యక్తి...జడ్చర్ల పట్టణంలోని విజయనగర్‌కాలనీలో వడ్డె బాలయ్యకు చెందిన గుడిసెలో భారీగా జిలెటిన్‌స్టిక్స్ నిల్వ చేశాడు. చాలాకాలంగా జిలెటిన్ స్టిక్స్‌ను ఇక్కడికి తీసుకొచ్చి..అవసరమైన ప్రాంతాలకు విక్రయించడంతో పాటు తాము స్వయంగా కంప్రెషర్‌లో గుట్టలు, తదితర బండరాళ్లను పేల్చేందుకు వినియోగిస్తున్నాడు. ఎవరికీ అనుమానం రాకుండా గుడిసెలో వాటిని నిల్వ చేసి తమ కార్యకలాపాలను సాగిస్తున్నాడు. కాగా, ఇక్కడ జిలెటిన్ స్టిక్స్ ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడి చేసి గుడిసెలో ఉన్న పేలుడు పదార్థాలను పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు రాజేశ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దాదాపుగా 2,500 ఎలక్ట్రానిక్ డిటోనేటర్లతో పాటు మరో 2,750 వరకు జిలెటిన్‌స్టిక్స్ ఉన్నట్లుగా అంచనా వేస్తున్నారు.

క్రైస్తవులు ఏకతాటిపైకి రావాలి

చర్చిలు, మసీదులు లేకుండా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మాట్లాడుతున్న తలసాని

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): కొంతకాలంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తుంటే.. కొన్ని వర్గాల వారు చర్చిలు, మసీదులు లేకుండా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. కానీ, రాష్ట్రంలో వారి పప్పులు ఉడకవని, ముఖ్యమంత్రి కేసీఆర్ అటువంటి వారిని ఉపేక్షించరన్నారు. రాష్ట్రంలోని క్రైస్తవులంతా ఒకే తాటిపైకి వచ్చి వారి హక్కులు, సంక్షేమ పథకాలు సాధించుకునేందుకు అవకాశాలను అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. మంగళవారం నారాయణగూడలోని బాప్టిస్టు చర్చిలో 'తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్'(టీయూసీపీఏ) ఆధ్వర్యంలో 33 జిల్లాల పాస్టర్‌ల సమావేశం జరిగింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలసి మంత్రి తలసాని హాజరయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. క్రైస్తవుల్లో ఐకమత్యం లోపిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి హైదరాబాద్ వరకు ప్రతి మండలానికి ఓ కమిటీని రూపొందించి ఈ కమిటీలన్నీ ఒకే గొడుగు కింద ఉండేలా కృషి చేయాలన్నారు. అందరూ ఏకతాటిపైకి వస్తే దక్కాల్సిన హక్కులు తప్పకుండా దక్కుతాయన్నారు. మైనార్టీలు అంటే క్రైస్తవులు కాదనే ఆలోచన నుంచి క్రైస్తవులు బయటకు రావాలని సూచించారు. క్రైస్తవుల కోసం షాదీముబారక్ పేరుమార్పు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. లోపాలను సరిదిద్దుకుని ముందుకువచ్చి హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని, అందరూ ఏకతాటిపైకి వచ్చి నిలబడితే ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నానని తలసాని ప్రకటించారు. రాష్ట్రంలో కోటిన్నర జనాభా కలిగిన క్రైస్తవులు డిసిషన్ మేకర్స్ అని ఎమ్మెల్యే దానం అన్నారు. కొంతకాలంగా కొన్ని వర్గాలపై ప్రణాళిక ప్రకారం దాడులు జరుగుతున్నాయని.. దానిని అధిగమించేందుకు క్రైస్తవులు ఏకతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.



ధర్నాలో రైతులు, కాంగ్రెస్ నాయకులు

ఏసీడీ పేరిట కేసీఆర్ పన్ను

- సీఎండీ ప్రభాకర్‌రావు పదవి నుంచి వైదొలగాలి
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం... జిల్లా కేంద్రంలో ధర్నా

జగిత్యాలటౌన్: విద్యుత్ సంస్థలోని నష్టాలు పూడ్చుకునేందుకే వినియోగదారుల నుంచి ముందస్తు వినియోగ ధరావతు (ఏసీడీ) చార్జీలు వసూలు చేస్తున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. సంస్థను నిర్వహించడంలో విఫలమైన సీఎండీ ప్రభాకర్‌రావు తన పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. ఏసీడీ చార్జీల పేరుతో వసూలు చేస్తున్న కేసీఆర్ పన్నును ఉపసంహరించుకోవాలని, వ్యవసాయానికి నిర్దిష్ట విద్యుత్ సరఫరా వేళలు ప్రకటించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ప్రగతిభవన్ ఎదుట మంగళవారం ధర్నా చేశారు. తొలుత ఇందిరాభవన్ నుంచి రైతులు, కాంగ్రెస్ శ్రేణులతో విద్యుత్ ప్రగతిభవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ...రాష్ట్రంలో ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలున్నాయని, సీఎం కేసీఆర్ ఇలాఖాలో ఏసీడీ చార్జీలు లేవని, కేటీఆర్ ప్రాతినిధ్యం వహించే ఉత్తర తెలంగాణ ప్రజలపైనే భారం ఎందుకని ప్రశ్నించారు. కమీషన్ల కోసమే యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మించిన ప్రభుత్వం..ప్రజలపై రూ.40వేల కోట్ల భారం మోపిందని ఆరోపించారు. అనంతరం ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి, నాయకులు గిరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందిని బంధించిన రైతులు

అప్రకటిత విద్యుత్ కోతలపై నిరసన

కోరుట్ల రూరల్: అప్రకటిత విద్యుత్ కోతలకు నిరసనగా ధర్మారం రైతులు మంగళవారం సబ్‌స్టేషన్ సిబ్బందిని కార్యాలయం గదిలో బంధించి తాళం వేశారు. అనంతరం సబ్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. వ్యవసాయ రంగానికి 24గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలతో నీళ్ల అందక వరి, మక్క పంటలతోపాటు కూరగాయలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కోరుట్ల–మల్లాపూర్ మార్గంలో వాహనాలు నిలిచిపోయాయి. మల్లాపూర్ ఏడీఈ శ్రీనివాసరావు చేరుకుని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో రైతులు సిబ్బందిని విడుదల చేసి ఆందోళన విరమించారు.



కరెంటు కోతలను నిరసిస్తూ కోరుట్లలో ఆందోళన చేస్తున్న రైతులు

పాఠశాల బస్సును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- 15 మంది విద్యార్థులకు గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- మెరుగైన వైద్యం అందించాలని మంత్రి కేటీఆర్ సూచన



రోదిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం ఉదయం విజ్ఞాన్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 15 మంది విద్యార్థులు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎల్లారెడ్డిపేటలోని విజ్ఞాన్ స్కూల్లో చదువుతున్న మండలంలోని అల్మాస్‌పూర్, రాజన్నపేట గ్రామాలకు చెందిన 22 మంది విద్యార్థులు స్కూల్‌బస్సులో ఉదయం 7.30 గంటల ప్రాంతంలో పాఠశాలకు వెళ్తున్నారు. ఎల్లారెడ్డిపేట శివారులోని రెండోబైపాస్ మూలమలుపు వద్ద కామారెడ్డి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు వెనుక నుంచి వచ్చి అతివేగంగా ఢీకొట్టింది. దీంతో స్కూల్ బస్సు వెనుకభాగం ధ్వంసమైంది. ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్ వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ ఘటనలో స్కూల్ బస్సులోని వెనుక సీట్లో కూర్చున్న విద్యార్థులు విహాన్, ఆదిత్య, దినేశ్, వినయ్, శివ, శివారెడ్డి, శ్రీనివాస్, తనుశ్రీ, మల్లికార్జున్, కావ్య, ధరణి, వర్షిణి, మణిసూదన్, మణిదీప్, సిద్దేశ్‌తోపాటు బస్సు క్లీనర్ అజయ్‌లు గాయపడ్డారు. రక్తం కారుతుండడంతో పిల్లలు భయాందోళనకు గురై రోదించారు. ప్రమాదం విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి తరలిరావడంతో అక్కడ పరిస్థితి రోదనలతో మిన్నంటింది.

ఫోన్‌లో ఆరా తీసిన మంత్రి కేటీఆర్

ప్రమాదం విషయం తెలుసుకున్న మంత్రి కేటీఆర్ వెంటనే కలెక్టర్ అనురాగ్ జయంతి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యలతో ఫోన్‌లో మాట్లాడారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. అవసరమైతే వెంటనే హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. ఈ ఘటనపై స్పందించిన కలెక్టర్ వెంటనే డీఈవో రాధాకిషన్‌ను అప్రమత్తం చేశారు. ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి చేరుకున్న డీఈవో రాధాకిషన్ ప్రమాద సంఘటనపై వివరాలు సేకరించి, విద్యార్థులను పరామర్శించారు.

మావోయిస్టులపై ఉమ్మడి నిఘా

- ప్రాణహిత తీరం వెంట కూంబింగ్
- తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నిర్ణయం

జైపూర్(చెన్నూర్): మావోయిస్టుల నియంత్రణపై నిరంతరం గట్టి నిఘా పెట్టి.. ప్రాణహిత నది తీరంవెంట ఎప్పటికప్పుడు కూంబింగ్ నిర్వహించాలని.. నిఘా వ్యవస్థలను కట్టుదిట్టం చేయాలని తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)లో మంగళవారం తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మావోయిస్టుల కదలికలు, కూంబింగ్ నిర్వహణ, అంతర్రాష్ట్ర పోలీసుల పరస్పర సహకారంపై సమీక్షించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు ఉదయం హెలికాప్టర్‌లో ఎస్టీపీపీకి చేరుకున్నారు. మావోయిస్టుల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై తెలంగాణ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులతో స్థానిక ప్రాణహిత అతిథి గృహంలో చర్చించినట్లు సమాచారం. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ప్రాణహిత నది ఉన్నందున మావోయిస్టులు రెండు రాష్ట్రాలకు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తూ తమ ఉనికిని పెంచుకుంటున్నారని అభిప్రాయపడినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చిపోయే వారిపై పూర్తిగా నిఘా ఉంచాలని నిర్ణయించినట్టు సమాచారం. కాగా సమావేశం సమాచారాన్ని పోలీసు అధికారులు పూర్తి గోప్యంగా ఉంచారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

పని పేరు: M/s. APTS (Konugolu), విజయవాడ ద్వారా TTD సెంట్రల్ హాస్పిటల్, తిరుపతి వద్ద లభించే ఇంట్రా ఆక్యులర్ లెన్సెస్ అమ్మకం. స్క్రాప్ మెటీరియల్స్ తనిఖీ 06-02-2023 & 07-02-2023 నుండి ప్రారంభం అవుతుంది మరియు ఇ-వేలం గడువు తేది: 09-02-2023న మ.2.00 గం.ల నుండి సా.5.00 గం.ల వరకు. నియమ నిబంధనలతో సహా తదుపరి వివరాల కోసం https://konugolu.ap.gov.in దర్శించండి.
Roc No.PR4/13950/Adv.No.372/PRO/2023, Dt. 31.01.2023 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

మహబూబాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం

ఇ-ప్రొక్యూర్‌మెంట్ & కొటేషన్ నోటీస్

E1/MHBD MPLTY/EPROC-32 & Qtn-05/2022-23 తేది: 31.01.2023

1) ఇ-ప్రొక్యూర్‌మెంట్ పనుల మొత్తం సంఖ్య: 02 నంబర్లు, రూ. 6.58 లక్షలు, 2) పని రకం: రోడ్ల నిర్మాణం, వరద వాటిక, 3) పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్, మల్టీమీడియా ప్రొజెక్టర్, హ్యాండ్ హెల్డ్ మెషిన్స్, శానిటేషన్ మెటీరియల్స్, సర్వేపల్లి విగ్రహం కొనుగోలు, ప్రత్యేక పారిశుధ్య పనుల కోసం కొటేషన్లు కోరబడుచున్నవి. 4) బిడ్ ప్రారంభ & ముగింపు తేదీ: 31-01-2023 (ఉ.11.00 గం॥) నుండి 03-02-2023 (ఉ.11.00 గం॥) వరకు వరద వాటిక & కొటేషన్ పనుల కోసం, 5) బిడ్ ప్రారంభ & ముగింపు తేదీ: 31-01-2023 (ఉ.11.00 గం॥) నుండి 06-02-2023 (సా. 5.00 గం॥) వరకు, 6) ధర బిడ్ / తెరుచు తేదీ: 06-02-2023న (సా.5.10 గం॥), సంప్రదించవలసిన అధికారి పేరు & చిరునామా: MAE (9849302581) మరియు http://tender.telangana.gov.in
సం/- కమిషనర్, మహబూబాబాద్ మున్సిపాలిటీ,
DIPR RO No.12014-PP/CL/Advt/1/2022-23, Dt 31.01.2023

పురపాలక సంఘ కార్యాలయము : బెల్లంపల్లి : జిల్లా : మంచిర్యాల

కొటేషన్ నోటీస్ తేది: 31.01.2023

[illegible] కోసం కొటేషన్లు కోరబడుచున్నవి. [illegible] 01. కొటేషను సమర్పించు చివరి తేదీ & సమయం: 07.02.2023 Up to 1.00 PM. [illegible] సెల్ నెం. 8712333442 నందు సంప్రదించగలరు.
సం/- కమిషనర్, బెల్లంపల్లి మున్సిపాలిటీ,
DIPR RO No.12008-PP/CL/Advt/1/2022-23, Dt: 31.01.2023

దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ)
SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LIMITED
"Energy saved is Energy produced"

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన - 24/2022-23

CGM / [illegible] 07/2022-23 (SPM) [illegible] 01.02.2023 14.00 గం॥ [illegible] 08.02.2023 14.00 గం॥ [illegible] 08.02.2023 14.30 గం॥ [illegible] 09.02.2023 14.00 గం॥ & 09.02.2023 15.00 గం॥ [illegible] 15.02.2023 15.00 గం॥ [illegible] www.tender.telangana.gov.in [illegible] www.tssouthernpower.com [illegible] ఫోన్ నం.040-23431473.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్, [illegible] TSSPDCL, [illegible] హైదరాబాద్
DIPR RO No.12002-PP/CL/Advt/1/2022-23, Dt. 31.01.2023

స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ & ట్రైనింగ్, తెలంగాణ, హైదరాబాద్

టెండరు ప్రకటన

టెండరు నం. SBTET-ES/3/2022-ESTABLISHMENT SECTION. తేది: 31.01.2023

స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, తెలంగాణ వారు SBTET కార్యాలయం, S.V భవన్, మాసాబ్‌ట్యాంక్, హైదరాబాద్ వద్ద హౌస్‌కీపింగ్ & సెక్యూరిటీ సర్వీస్‌లు అందించేందుకు అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీని నియమించాలని భావిస్తున్నారు. ఈ టెండరులో పాల్గొనగోరు కాగోరు ఏజెన్సీలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ https://tender.telangana.gov.in దర్శించవచ్చును. డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ: 01-02-2023న ఉ.10.00 గం.లు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో బిడ్లు దాఖలు చేయుటకు ఆఖరి తేదీ: 16-02-2023న మ.3.00 గం.లు
DIPR RO No.3344-DP/CL/Advt/1/2022-23, Dt. 31.01.2023 సం/- సెక్రటరీ

క్లుప్తంగా...

రేప్ కేసులో మరోసారి... ఆశారాంకు జీవితఖైదు



అహ్మదాబాద్: స్వయం ప్రకటిత బాబా ఆశారాం బాపూను 2013నాటి అత్యాచారం కేసులో దోషిగా తేల్చి జీవితఖైదు విధిస్తూ గాంధీనగర్‌లోని అదనపు సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. ఈ మేరకు మంగళవారం కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. బాధితురాలైన ఆశారాం మాజీ శిష్యురాలికి రూ.50,000 పరిహారం చెల్లించాలని జడ్జి డీకే సోనీ ఆదేశాలిచ్చారు. సూరత్‌కు చెందిన ఒక మహిళ మోతెరానిలోని ఆశారాం ఆశ్రమంలో శిష్యురాలిగా ఉండేది. 2001–2006 కాలంలో తనపై ఆశారాం పలుమార్లు అత్యాచారం చేశాడని 2013లో ఆమె కేసు వేసింది. ఈ కేసులోనే సోమవారం అయనను దోషిగా తేల్చిన కోర్టు తీర్పును మంగళవారానికి రిజర్వ్‌చేసిన విషయంతెల్సిందే. తీర్పును గుజరాత్ హైకోర్టులో సవాల్ చేస్తామని ఆశారాం తరఫు న్యాయవాదులు చెప్పారు. ఈ కేసులో ఆశారాం భార్య లక్ష్మీబెన్, ఆయన కుమార్తె, నలుగురు శిష్యులను నిర్దోషులుగా కోర్టు ప్రకటించింది. 2013లో రాజస్తాన్ ఆశ్రమంలో బాలికపై అత్యాచారం కేసులోనూ 81 ఏళ్ల ఆశారాంను దోషిగా తేల్చడంతో ఆయన ఇప్పటికే జోధ్‌పూర్ జైలులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నారు.

జార్ఖండ్‌లో ఘోర అగ్ని ప్రమాదం
14 మంది సజీవ దహనం

ధన్‌బాద్: జార్ఖండ్‌లోని ధన్‌బాద్ జిల్లాలోని ఓ బహుళ అంతస్తుల భవంతిలో జరిగిన అగ్ని ప్రమాదంలో చిన్నారులు, మహిళలుసహా 14 మంది అగ్నికి ఆహుతయ్యారు. మంగళవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. జోరాఫాటక్ ప్రాంతంలోని ఆశీర్వాద్ టవర్ రెండో అంతస్తులో అంటుకున్న అగ్నికీలలు వేగంగా విస్తరించడంతో వీరంతా సజీవదహనమయ్యారు. మరణించిన వారిలో ముగ్గురు చిన్నారులు, పది మంది మహిళలు ఉన్నారు. గాయపడిన 11 మందికి ఆస్పత్రిలో చికిత్సచేస్తున్నారు. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉందని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ సుఖ్‌దేవ్ సింగ్ చెప్పారు. మంటలు ఆర్పేందుకు 40 అగ్నిమాపక శకటాలు రంగంలోకి దిగాయి. అపార్ట్‌మెంట్‌లో ఇంకా కనీసం 50 మంది చిక్కుకుని ఉంటారని మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండీ ట్వీట్‌చేశారు. పరిస్థితిని జిల్లా డెప్యూటీ కమిషనర్ స్వయంగా ఘటనాస్థలికొచ్చి పర్యవేక్షిస్తున్నారు. యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చెప్పారు.

పేదరికరహిత భారత్

2047కల్లా సాకారమే ప్రభుత్వ లక్ష్యం: రాష్ట్రపతి

న్యూఢిల్లీ: ''కేంద్రంలో నిర్భీతితో కూడిన సుస్థిరమైన, నిర్ణాయక ప్రభుత్వముంది. మన ఘన వారసత్వాన్ని సమర్థంగా ముందుకు తీసుకెళ్తోంది. దేశాభివృద్ధికి, అన్ని వర్గాల వారి అభ్యున్నతికి నిష్పాక్షికంగా పాటుపడుతోంది. విప్లవాత్మక నిర్ణయాలతో ప్రతి విషయంలోనూ దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోంది'' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ఆమె తొలిసారి ప్రసంగించారు. 2047కల్లా పేదరికరహిత దేశంగా భారత్ స్వావలంబన సాధించేలా చూడటమే నరేంద్ర మోదీ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయానికి అతి పెద్ద శత్రువైన అవినీతిపై నిరంతరం రాజీ లేని పోరాటం చేస్తోందని గుర్తు చేశారు. ఫలితంగా అవినీతిపరులపై ఎలాంటి సానుభూతీ చూపొద్దన్న సామాజిక స్పృహ పెరుగుతోందన్నారు. ఆత్మనిర్భర భారతాన్ని సాకారం చేసేందుకు వచ్చే పాతికేళ్ల అమృత కాలంలో ప్రజలంతా తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వ విజయాలను రంగాలవారీగా గణాంకాల సాయంతో వివరిస్తూ రాష్ట్రపతి గంట పైగా ప్రసంగించారు. ముఖ్యాంశాలు...

- మోదీ సర్కారు తొమ్మిదేళ్ల పాలనలో ఎన్నో విజయాలు, సానుకూల మార్పులు సాధించింది. ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ఎంతగానో ఇనుమడింపజేయడం వాటిలో ముఖ్యమైనది.
- సమున్నత ఆకాంక్షలతో గొప్ప లక్ష్యాలను పెట్టుకుని వాటిని సాధించే దిశగా శరవేగంగా అడుగులు వేస్తోంది. నిజాయతీకి పెద్దపీట వేస్తోంది. భారీ కుంభకోణాలు, ప్రభుత్వ పథకాల అమలులో అంతులేని అవినీతికి మంగళం పాడాలన్న జనాకాంక్షలను నిజం చేసి చూపిస్తోంది.
- పేదల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి వారిని సాధికారపరిచేందుకు కృషి చేస్తోంది.
- ఇన్నోవేషన్, టెక్నాలజీలను ప్రజా సంక్షేమానికి సమర్థంగా వినియోగిస్తూ కనీవినీ ఎరగని వేగంతో దూసుకెళ్తోంది. ఫలితంగా పేదలకు రోజుకు 11 వేల ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. 55 వేల గ్యాస్ కనెక్షన్లు అందుతున్నాయి. ఒక్క ముద్రా పథకం ద్వారానే రోజూ రూ.700 కోట్లకు పైగా రుణాలందుతున్నాయి. 300 పై చిలుకు పథకాల ద్వారా లబ్ధిదారులకు ఖాతాల ద్వారా నేరుగా నగదు అందుతోంది.
- ప్రజలకు దశాబ్దాల పాటు కలగానే మిగిలిన మౌలిక సదుపాయాలెన్నో పరిపూర్ణంగా అందుతున్నాయి.
- అటు సాంకేతికంగా, ఇటు సాంస్కృతికంగా దేశంలో అద్భుతమైన ప్రగతి చోటుచేసుకుంటోంది. మన డిజిటల్ ప్రగతి అభివృద్ధి చెందిన దేశాలకూ ఆదర్శంగా మారింది.
- అవసరాలకు అనుగుణంగా సత్వరం విధానాలను, వ్యూహాలను సమూలంగా మార్చుకునే ప్రభుత్వ సంకల్ప శక్తికి సర్జికల్ దాడులు మొదలుకుని ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్‌ల రద్దు, ఉగ్రవాదంపై ఉక్కుపాదం, నియంత్రణ, వాస్తవాధీన రేఖల వద్ద శత్రువుల ప్రతి దుస్సాహసానికీ దీటుగా బదులివ్వడం వంటివన్నీ తార్కాణాలుగా నిలిచాయి. సైన్యాన్ని ఆధునీకరించేందుకు పెద్దపీట వేశాం.
- ఫలితంగా విధాన వైకల్యంతో కుంగిపోయే రోజులు పోయి శరవేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా రాణిస్తూ ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచింది.
- అంతర్జాతీయ వేదికపైనా తనదైన కీలక పాత్ర పోషించేందుకు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తోంది. సమస్యల పరిష్కారానికి ఇతర దేశాల వైపు చూసే స్థితి నుంచి ప్రతిష్టాత్మక జి–20 కూటమి సారథిగా ప్రపంచ సమస్యల పరిష్కారానికి నడుం బిగించే స్థాయికి ఎదిగింది.
- రక్షణ, వైమానిక రంగాల్లోనూ గొప్ప ప్రగతి సాధించాం. అగ్నివీర్ పథకం యువతకు దేశ సేవ చేసేందుకు గొప్ప అవకాశంగా మారింది.
- మహిళలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ రూపుమాపేందుకు ప్రభుత్వం ఎన్నో పథకాలు తెచ్చింది. ఫలితంగా సైన్యంతో పాటు అన్ని రంగాల్లోనూ మహిళలు సత్తా చాటుతున్నారు. తొలిసారిగా మహిళల జనాభా పురుషులను మించిపోయింది. పీఎం కిసాన్ లబ్ధిదారుల్లోనూ 3 లక్షలకు పైగా మహిళలే!



మంగళవారం బడ్జెట్ సమావేశాల తొలి రోజు రాష్ట్రపతి ముర్మును పార్లమెంట్‌కు తోడ్కొని వస్తున్న ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

- బంజారాలు, సంచార జాతుల సంక్షేమానికి తొలిసారిగా బోర్డు ఏర్పాటైంది.
- అటు అయోధ్యలో రామాలయ నిర్మాణం, ఇటు అత్యాధునిక పార్లమెంటు భవన నిర్మాణం శరవేగంగా సాగుతున్నాయి. ఆధ్యాత్మిక, యాత్రా స్థలాల అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతోంది.
- మన యోగ, ఆయుర్వేదం ప్రపంచమంతా విస్తరిస్తున్నాయి.
- శిలాజేతర వనరుల ద్వారా 40 శాతం విద్యుదుత్పాదన లక్ష్యాన్ని తొమ్మిదేళ్ల ముందే చేరుకున్నాం.
- ఉగ్రవాదంపై మనం తీసుకున్న కఠిన వైఖరిని ప్రపంచమంతా స్వాగతిస్తోంది.
- ఆయుష్మాన్ భారత్ ద్వారా జనాభాలో ఏకంగా 50 కోట్ల మందికి ఉచిత చికిత్స అందింది. ప్రజలకు రూ.80 వేల కోట్లు మిగిలాయి.

కొత్తదనం కొరవడింది
రాష్ట్రపతి ప్రసంగంపై ఖర్గే



బీజేపీ సర్కార్ ఎప్పుడూ చెప్పే విషయాలనే మళ్లీ రాష్ట్రపతి తన ప్రసంగం ద్వారా పునరుద్ఘాటించారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పెదవి విరిచారు. 'దేశం అద్భుతంగా పురోగమించిందని రాష్ట్రపతి ప్రసంగం ద్వారా కేంద్రం చెప్పించింది. అదే నిజమైతే అధిక ద్రవ్యోల్బణం, నిరుద్యోగంతో పేదలు ఇంకా ఎందుకు ఇబ్బందులు పడుతున్నారు? పథకాల ఫలాలు ఎందుకు అణగారిన వర్గాల దాకా చేరడం లేదు? కొత్త కాలేజీలు, స్కూళ్లన్నీ ప్రైవేటురంగంలో వచ్చినవే. వాటి భారీ ఫీజుల వల్ల పేదలకు ఎలాంటి లబ్ధిచేకూరలేదు' అని ఆరోపించారు. అవినీతి అంతమైతే ఒకే వ్యక్తి రూ.1 లక్ష కోట్ల విలువైన షేర్ల పెట్టుబడుల ద్వారా ఎల్‌ఐసీ/ఎస్‌బీఐలను ఎలా మభ్యపెట్టగలిగాడు? మోదీకి ఆప్తుడైన ఆ ఒక్కడి చేతిలోకే తమ పెట్టుబడులు తరలిపోయాయని 30 కోట్ల మంది గగ్గోలు పెడుతున్నారు'' అంటూ ఖర్గే విమర్శించారు.

జనాకర్షకమేనా..!

- నేడే కేంద్ర బడ్జెట్
- ఐదోసారి ప్రవేశపెట్టనున్న నిర్మల
- లోక్‌సభ ఎన్నికల లోపు చివరి పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే

న్యూఢిల్లీ: ఊరటలు, ఊరడింపులు, ఉపశమనాల కోసం ఉద్యోగులు మొదలుకుని ఆర్థిక నిపుణులు, పరిశ్రమ వర్గాల దాకా అందరూ ఏటా ఎదురు చూసే తరుణం మరోసారి రానే వచ్చింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ఉదయం 11 గంటలకు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ఆదాయ పన్ను ఊరటపై ఎప్పట్లాగే వేతన జీవులు మరోసారి ఆశలు పెట్టుకోగా, భయపెడుతున్న ద్రవ్యోల్బణం కట్టడికి తీసుకోబోయే చర్యలపై ఆర్థిక నిపుణులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జీడీపీ వృద్ధి 7 శాతానికి లోపే ఉంటుందన్న ఆర్థిక సర్వే అంచనాలు, ప్రపంచ మందగమన హెచ్చరికల నేపథ్యంలో కొన్నయినా కఠిన చర్యలు తప్పనిసరిగా కన్పిస్తున్నాయి. అలాగని వచ్చే ఏడాది కీలకమైన లోక్‌సభ ఎన్నికలున్నందున ప్రజలపై మరీ భారం మోపలేని పరిస్థితి. పైపెచ్చు ఎన్నో కొన్ని తాయిలాలు ప్రకటించాల్సిన అనివార్యత. వీటన్నింటినీ సంతృప్తి పరుస్తూ ఆర్థిక పద్దుకు రూపమివ్వడంలో నిర్మలా సీతారామన్ ఏ మేరకు నెగ్గుకొచ్చారో చూడాలి. వచ్చే ఎన్నికల ముందు ప్రవేశపెట్టే చివరి పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే కానుంది. ఉత్పత్తి రంగంతో పాటు కీలకమైన సరఫరా వ్యవస్థలను మరింతగా బలోపేతం చేసే దిశగా పలు చర్యలుంటాయని భావిస్తున్నారు. సంప్రదాయేతర విద్యుదుత్పాదన సామర్థ్యాన్ని ఇతోధికంగా పెంచేందుకు మరిన్ని పథకాలను ప్రకటించే అవకాశముంది. ఎన్నికల వేళ పేద, మధ్య తరగతి వర్గాలకు పలు తాయిలాలూ ఉంటాయంటున్నారు. ఆదాయ పన్ను శ్లాబులను తగ్గించకపోయినా ఉద్యోగులకు ఎంతో కొంత ఊరటనిచ్చేలా 80సి పన్ను మినహాయింపుల పెంపు వంటి చర్యలుండవచ్చని చెబుతున్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు వంటివాటిపై పలు వర్గాలు ఆశలు పెట్టుకున్నాయి. భారత్‌ను 10 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంతో పాటు పూర్తి ఆత్మనిర్భరత సాధించాలన్న మోదీ సర్కారు లక్ష్యాల సాధనకు ఎలాంటి రోడ్ మ్యాప్ ప్రకటిస్తారన్నది ఆసక్తికరం.

ప్రపంచానికి ఆశారేఖ: మోదీ



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ప్రతికూల ఆర్థిక పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ.. భారతదేశ బడ్జెట్ మాత్రం సామాన్య పౌరుల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చేలా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. మన బడ్జెట్ ప్రపంచానికి ఆశారేఖ అవుతుందని స్పష్టం చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. రాబోయే రోజుల్లో ఆర్థిక వృద్ధి పుంజుకోవడం ఖాయమని ప్రపంచ ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారని గుర్తుచేశారు. మన ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బుధవారం ప్రవేశపెట్టనున్న ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతోపాటు భారత్‌పై ప్రపంచం పెట్టుకున్న అంచనాలను అందుకునేలా ఉంటుందని పేర్కొన్నారు. ఇతర దేశాలు ఎన్నో ఆశలతో భారత్ వైపు చూస్తున్నాయని వ్యాఖ్యానించారు. భారత్‌లో ప్రపంచం చూసుకుంటున్న ఆశారేఖ మరింత వెలుగులీనుతుందని అన్నారు. అందరి ఆశలను నెరవేర్చేందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్ని ప్రయత్నాలూ చేస్తారని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు మోదీ చెప్పారు.

'భారత్ ప్రథమం.. పౌరులు ప్రథమం'

పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగం భారత రాజ్యాంగం, పార్లమెంటరీ వ్యవస్థ ఆత్మగౌరవానికి ప్రతిబింబమని ప్రధాని పేర్కొన్నారు. మహిళలను, ఘనమైన గిరిజన సంప్రదాయాలను గౌరవించుకోవడానికి లభించిన అవకాశమని వివరించారు. 'భారత్ ప్రథమం.. పౌరులు ప్రథమం' అనే ఏకైక లక్ష్యంతో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పనిచేస్తోందని మోదీ తేల్చి చెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అదే స్ఫూర్తి కనిపించనుందని తెలిపారు. ఈ సమావేశాల్లో ప్రతిపక్షాలు సహకరిస్తాయని, అర్థవంతమైన చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. దేశానికి ఉపయోగపడే విధానాల రూపకల్పన కోసం చక్కటి చర్చలు జరగాలన్నారు. మంగళవారం ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 13 వరకూ జరుగుతాయి. మార్చి 12న మళ్లీ ప్రారంభమై, ఏప్రిల్ 6న ముగుస్తాయి.



పెన్షన్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ మంగళవారం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో కార్మికుల భారీ ర్యాలీ

సుప్రీం జడ్జీలుగా అలహాబాద్, గుజరాత్ హైకోర్టు సీజేలు

సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజేశ్ బిందాల్, గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్‌లను సుప్రీంకోర్టులో జడ్జీలుగా ఎంపికచేయాలని కేంద్రప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం కొలీజియం సిఫార్సుచేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియంలో జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ సంజీవ్ ఖన్నా సభ్యులుగా ఉన్నారు. కొత్త జడ్జీల ఎంపిక కోసం డిసెంబర్ 13న కొలీజియం సమావేశమై ఆ తర్వాత తుది తీర్మానం చేసి ఆ వివరాలను తాజాగా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. రాజస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పంకజ్ మిట్టల్, పట్నా హైకోర్టు సీజే జస్టిస్ సంజయ్ కరోల్, మణిపూర్ హైకోర్టు సీజే జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, పట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అసనుద్దీన్ అమానుల్లా, అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ మనోజ్ మిశ్రాల పేర్లనూ కొలీజియం సిఫార్సుచేసింది. అన్ని రాష్ట్రాల హైకోర్టులకు సుప్రీంకోర్టులో ప్రాతినిధ్యం ఉండేలా, జడ్జీలుగా సుదీర్ఘ అనుభవం, హైకోర్టుల్లో వారి సీనియారిటీ, భిన్న వర్గాలకు సముచిత స్థానమిస్తూ వీరిని జడ్జీలను ఎంపికచేసినట్లు కొలీజియం తీర్మానం స్పష్టంచేసింది. నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టులో సీజేఐతో కలుపుకుని గరిష్టంగా 34 మంది జడ్జీలు ఉండవచ్చు. ప్రస్తుతం కోర్టులో 27 మంది జడ్జీలు కొనసాగుతున్నారు.


కొలీజియంలోకి కేంద్ర నామినీలా: స్టాలిన్

చెన్నై: న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన కొలీజియంలోకి కేంద్ర ప్రభుత్వం తరఫున నామినీలు ఉండాలన్న వాదనలను తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే పార్టీ చీఫ్ ఎంకే స్టాలిన్ తప్పుబట్టారు. ' న్యాయవ్యవస్థ(జడ్జీలుగా)లో సమాజంలోని అన్ని వర్గాలవారికి ప్రాధాన్యత దక్కాలనేది అందరి చిరకాల వాంఛ. కొలీజియంలో కేంద్రం కలగజేసుకోవడమంటే న్యాయవ్యవస్థ స్వతంత్రతలో జోక్యం చేసుకోవడమే. కొలీజియం సిఫార్సులను ఆమోదించకపోవడం, న్యాయ మంత్రి కిరెణ్ రిజిజు వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతికాదు' అని అన్నారు.

సిబ్బందిని తిడుతూ, అర్ధనగ్నంగా తిరుగుతూ...
విమానంలో మహిళ వీరంగం

ముంబై: అబుదాబి నుంచి ముంబైకి వస్తున్న విస్తారా ఎయిర్‌లైన్స్ విమానంలో ఇటలీకి చెందిన 45 ఏళ్ల మహిళ హంగామా సృష్టించారు. సోమవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఎకానమీ క్లాస్ టికెట్ తీసుకున్న ఇటలీ దేశస్తురాలు పావోలా పెరుసియో తన ఎకానమీ సీటులో కూర్చోకుండా బిజినెస్ క్లాస్ సీటులో కూర్చునేందుకు ప్రయత్నించింది. విమాన సిబ్బంది అడ్డుకోవడంతో పట్టరాని ఆగ్రహంతో ఊగిపోయింది. అడ్డొచ్చిన సిబ్బందిని బూతులు తిట్టడం మొదలుపెట్టింది. ఒకరి ముఖంపై కొట్టింది. మరొకరిపై ఉమ్మేసింది. అర్ధనగ్నంగా తిరుగుతూ తోటి ప్రయాణికులను ఇబ్బందికి గురిచేసింది. ముంబై ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే పోలీసులు ఆమెను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరిచారు.

మాజీ న్యాయ మంత్రి శాంతిభూషణ్ కన్నుమూత



న్యూఢిల్లీ: న్యూఢిల్లీ: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న న్యాయ కోవిదుడు, కేంద్ర మాజీ న్యాయ శాఖ మంత్రి శాంతి భూషణ్(97) మంగళవారం ఢిల్లీలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన కుమారులు జయంత్, ప్రశాంత్ భూషణ్ సైతం న్యాయవాదులుగా పేరొందారు. అణగారిన వర్గాల గొంతుకగా నిలిచిన భూషణ్‌జీ చిరస్మరణీయులంటూ ప్రధాని నరేంద్ర మోదీ ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 1971 లోక్‌సభ ఎన్నికల్లో నాటి ప్రధాని ఇందిరాగాంధీ రాయ్‌బరేలీ స్థానంలో అక్రమాలకు పాల్పడి గెలిచారని అలహాబాద్ హైకోర్టులో కేసు వేసి నెగ్గిన రాజ్ నారాయణ్ తరఫున శాంతి భూషణ్ వాదించారు. ఆ కేసులో ఇందిరాగాంధీ ఓడిపోవడం, ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీకి అనర్హురాలిగా కోర్టు ప్రకటించడంతో దేశంలో ఎమర్జెన్సీ విధించడం తెల్సిందే.

100కు చేరిన 'పెషావర్' మృతులు

పెషావర్: పాకిస్తాన్‌లోని పెషావర్ నగరంలో మసీదులో ఆత్మాహుతి దాడి ఘటనలో మృతుల సంఖ్య మంగళవారం 100కు చేరుకుంది. దాడికి పాల్పడింది తామేనని నిషేధిత ఉగ్రవాద సంస్థ తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్తాన్(టీటీపీ) ప్రకటించింది. పాక్‌లో ఉగ్రవాదానికి శాశ్వత సమాధి తప్పదని అధ్యక్షుడు అరీఫ్ అల్వీ, ప్రధాని షెహబాజ్ షరీఫ్ అన్నారు.

'వ్యభిచారానికి పాల్పడితే సైనికాధికారులపై చర్యలు'

న్యూఢిల్లీ: నీతి తప్పిన సైనికులు ఉంటే సైన్యంలో క్రమశిక్షణ దెబ్బతింటుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పై అధికారులు వ్యభిచారానికి పాల్పడితే చర్యలు తీసుకొనే అధికారం సైనిక దళాలకు ఉందని తేల్చిచెప్పింది. వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. వ్యభిచారం నేరం కాదంటూ చెబుతూ ఐపీసీ సెక్షన్ 497ను కొట్టివేస్తూ 2018లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. కానీ తప్పుడు పనిచేసిన అధికారులపై చర్యలు తీసుకోకుండా ఈ తీర్పు అడ్డుకోలేదని జస్టిస్ కేఎం జోసెఫ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం వెల్లడించింది.

మోదీకి విధేయులుగా గవర్నర్లు: ఖర్గే

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ పట్ల విధేయతను నిరూపించుకోవడానికి గవర్నర్లు పోటీ పడుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. గవర్నర్ల వ్యవహార శైలితోపాటు గౌతమ్ అదానీ అక్రమాలు, సరిహద్దుల్లో చైనా నుంచి చొరబాట్లను పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో లేవనెత్తుతామని, కేంద్రాన్ని నిలదీస్తామన్నారు.

తొలి విడతకు ముందుగానే ముగింపు?

న్యూఢిల్లీ: పార్లమెంట్ సమావేశాల తొలి దఫా బడ్జెట్ సమావేశాలను ఫిబ్రవరి 13కు బదులు 10వ తేదీనే ముగించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను పలు పార్టీలు కోరాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. ''లోక్‌సభ సభా కార్యకలాపాల సలహా కమిటీ భేటీలో స్పీకర్ వద్ద వారీ విషయాన్ని ప్రస్తావించారు. వారి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుంటానని స్పీకర్ హామీ ఇచ్చారు'' అని చెప్పారు.

నాగాలు ఎటువైపు?

శాంతి ఒప్పందం చుట్టూ ఎన్నికలు ● నాగా సమస్య పరిష్కారం బీజేపీకి అగ్ని పరీక్ష

నాగాలాండ్‌లో అంతా ఒకటే పక్షం. అదే అధికార పక్షం. ప్రస్తుతం అక్కడ ప్రతిపక్షం ఊసే లేదు. అభివృద్ధే లక్ష్యంగా రెండేళ్ల క్రితం రాజకీయ పక్షాలన్నీ ఏకమై కొత్త సంప్రదాయానికి తెరతీశాయి. అయినా ఈ సారి ఎన్నికల్లో అదే పాత సమస్య నాగాల శాంతి చర్చలే ప్రధాన అంశంగా మారింది.

నాగాలాండ్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలు ఈ ఏడాది శాంతి ఒప్పందం చుట్టూనే తిరుగుతున్నాయి. నాగాల చిరకాల డిమాండ్లు నెరవేర్చకపోవడంతో అధికార నేషనలిస్ట్ డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ)–బీజేపీ ప్రభుత్వానికి ఈ ఎన్నికలు అగ్నిపరీక్షగా నిలుస్తున్నాయి. 2018 ఎన్నికలకు ముందు నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) చిరకాల మిత్రుత్వాన్ని వదులుకున్న బీజేపీ ఎన్‌డీపీపీతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఎన్‌డీపీపీకి చెందిన నిఫూయి రాయ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. కేంద్రంలో అధికార బీజేపీ నాగాలు ఆశిస్తున్నట్టుగా ప్రత్యేక జెండా, రాజ్యాంగం ఇవ్వడానికి సిద్ధంగా లేకపోవడంతో వారంతా కాషాయ కూటమికి వ్యతిరేకంగా పని చేయడానికి సిద్ధమయ్యారు. దశాబ్దాల తరబడి వేర్పాటు వాదుల హింసాకాండతో రక్తమోడుతున్న రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి నడిపించాలన్న లక్ష్యంతో 2021లో రాజకీయ పార్టీలన్నీ చేతులు కలిపి యునైటెడ్ డెమొక్రాటిక్ అలయెన్స్ (యూడీఏ) ఏర్పాటయ్యాయి. అధికారంలో ఉన్న నేషనలిస్ట్ డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ), బీజేపీ కూటమిలో ప్రతిపక్ష నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) చేరడం రాజకీయంగా కొంత పుంతలకు దారి తీసింది.

ఎన్‌డీపీపీ–బీజేపీ కలసికట్టుగా పోటీ

రెండేళ్లగా అభివృద్ధి ప్రయత్నాలు ముందుకు కదలకపోగా నాగా వేర్పాటు వాద సమస్య తీవ్రతరం కావడంతో ఫిబ్రవరి 27న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌పీఎఫ్ ఒంటరి పోరాటానికి సిద్ధమైంది. గత ఎన్నికల్లో 26 సీట్లలో నెగ్గిన ఎన్‌పీఎఫ్ ఈ సారి అధికారంలోకి వచ్చేలా వ్యూహాలు రచిస్తున్నట్టుగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అచ్చుబెమొ కికోన్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల తర్వాత ఎవరితోనైనా పొత్తుకు సిద్ధమని తెలిపారు. ఈ సారి ఎన్నికల్లో ఎన్‌డీపీపీ- బీజేపీ కలసి కట్టుగా పోటీ చేయనున్నాయి.మొత్తం 60 అసెంబ్లీ స్థానాలున్న రాష్ట్రంలో 40 సీట్లలో ఎన్‌డీపీపీ, 20 స్థానాల్లో బీజేపీ పోటీ చేయనున్నాయి. కాంగ్రెస్ పార్టీకి గత ఎన్నికల్లో ఒక్క స్థానం రాకపోయినా ఈ సారి 60 స్థానాల్లోనూ పోటీకి దిగుతోంది. ఎన్నికల తర్వాత ఎన్‌పీఎఫ్‌తో పొత్తు పెట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ఆమ్ ఆద్మీ పార్టీ కూడా వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. గత ఎన్నికల్లో ఒక్క స్థానంలో నెగ్గిన జేడీ(యూ) ఈసారి నాగ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చింది. దీంతో బీజేపీ నుంచి జేడీ(యూ)లోకి భారీగా వలసలు మొదలయ్యాయి.

ఏమిటీ నాగాల సమస్య

నాగాల వివాదం ఇప్పటిది కాదు. దశాబ్దాల తరబడి భారత నేలపై రక్త చరిత్ర రాస్తూనే ఉంది. బ్రిటీష్ కాలంలో మొదలైన ఈ సమస్యపై ఇప్పటికీ నాగాలు పోరాటం చేస్తూనే ఉన్నారు. 1881లో నాగా తెగలు నివసించే నాగా హిల్స్ ప్రాంతాన్ని బ్రిటీష్ ఇండియాలో భాగం చేశారు. దీనిని నాగా తెగలు తీవ్రంగా వ్యతిరేకించాయి. తమ భవిష్యత్ తామే నిర్ణయించుకుంటామని స్వతంత్ర నాగా దేశాన్ని ఏర్పాటు చేసుకుంటామంటూ పలు ఉద్యమాలు నడిపాయి. తమకు సొంత జెండా, రాజ్యాంగం కావాలంటూ 1946లోనే నాగా నేషనల్ కౌన్సిల్ (ఎన్‌ఎన్‌సీ) ఏర్పాటై వేర్పాటు వాదం దిశగా అడుగులు వేసింది. నాగా ఫెడరల్ ఆర్మీ (ఎన్‌ఎఫ్‌ఏ) పేరుతో ఏర్పాటైన తీవ్రవాదులు భారీగా హింసకు పాల్పడేవారు. దీంతో వారిని అణిచివేయడానికి 1958లో నాటి కేంద్ర ప్రభుత్వం సైనిక దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని తెచ్చింది. అప్పట్నుంచి కేంద్రం, నాగాల మధ్య విభేదాలు ముదురుతూనే ఉన్నాయి. ఈ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్‌లు ఇప్పటికీ నాగాలు గట్టిగా చేస్తున్నారు. నాగాలు నివసించే ప్రాంతాన్ని అంతటినీ కలిపి 1963లో కేంద్రం నాగాలాండ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసింది. 1975లో ఎన్‌ఎన్‌సీలో ఒక వర్గంతో షిల్లాంగ్ శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ప్రస్తుతం ఈ సమస్యపై ఎన్‌ఎన్‌సీలో చీలిక వర్గమైన ఎన్‌ఎస్‌సీఎన్ (ఐఎం) బలంగా తన వాణి వినిపిస్తోంది. ఇరుగుపొరుగు రాష్ట్రాలతో పాటు మయన్మార్‌లో నాగాలు అధికంగా ఉన్న ప్రాంతాలన్నీ కలిపి గ్రేటర్ నాగాలాండ్ ఏర్పాటు చేసి సొంత రాజ్యాంగం, జెండా కావాలని గట్టిగా డిమాండ్ చేస్తోంది. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015లో ఎన్‌ఎస్‌సీఎన్ (ఐఎం) శాంతి ఒప్పందం కుదుర్చుకొని అప్పటి గవర్నర్ ఆర్.ఎన్.రవిని మధ్యవర్తిగా నియమించింది. అయినా చర్చలు ముందుకు సాగలేదు. దీంతో నాగాల శాంతి చర్చలే ఈ సారి అతి పెద్ద ఎన్నికల అంశంగా మారింది.

\- సాక్షి, నేషనల్ డెస్క్



మొత్తం అసెంబ్లీ స్థానాలు	మొత్తం ఓటర్లు	పోలింగ్ తేదీ	ఎన్నికల ఫలితాలు
60	12.83 లక్షలు	ఫిబ్రవరి 27	మార్చి 2

ప్రస్తుత అసెంబ్లీలో బలా బలాలు

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
ఎన్‌పీఎఫ్	26	38.8
ఎన్‌డీపీపీ	18	25.3
బీజేపీ	12	15.3
కాంగ్రెస్	0	2.1
ఇతరులు	4	18.5

ఎన్నికల్లో ప్రభావం చూపించే అంశాలు

- ప్రత్యేక జెండా, రాజ్యాంగం కోరుతూ గ్రేటర్ నాగాలాండ్ డిమాండ్ కోసం దశాబ్దాలైనా నాగా తెగలు గట్టిగా పట్టుపట్టడం
- ఏడు ఆదివాసీ సంస్థలతో కూడిన ఈస్టర్న్ నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఈఎన్‌పీఓ) రాష్ట్రంలోని 16 జిల్లాలతో కూడిన ప్రత్యేక రాష్ట్రాన్ని డిమాండ్ చేయడం. ఈ డిమాండ్‌తో 2010 నుంచి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం సెగలు పుట్టిస్తోంది.
- 500 కి.మీ. పొడవైన సరిహద్దుని పంచుకుంటున్న అసోం, నాగాలాండ్ మధ్య నెలకొన్న సరిహద్దు సమస్యలు. అసోంలో ఉన్న కొంత భూభాగం తమదేనని, రాష్ట్రంలో కలిపేయాలంటూ డిమాండ్లు ఉన్నాయి.
- దాదాపుగా 22 లక్షల జనాభా కలిగిన నాగాలాండ్‌లో 90 వేల మంది యువత నిరుద్యోగులుగా ఉన్నారు. వారికి ఉపాధి అవకాశాల కల్పన అతి పెద్ద సవాల్‌గా మారింది.
- నాసిరకం రోడ్లు, మౌలికసదుపాయాల కొరత, విద్య, ఆరోగ్యం కూడా ఎన్నికల్లో ప్రభావం చూపించనున్నాయి.

సాక్షి కరీంనగర్

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



కొండపై పూజలు

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ పెరిగింది. స్వామివారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



బద్దిపోచమ్మకు మొక్కులు

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కు చెల్లించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం, కల్లుసాక సమర్పించారు.

గరిష్టం/కనిష్టం
31.0/18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉండి, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రులు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు తదితరులు

హుజూరాబాద్ అభివృద్ధి మీ చేతుల్లో..

- ఆగం కావొద్దు.. సానుభూతికి కరగొద్దు
- ఈటల, బండి చేసిన అభివృద్ధి ఎక్కడ..?
- ఆలోచించి ఓటేయాలని మంత్రి కేటీఆర్ పిలుపు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్/హుజూరాబాద్/జమ్మికుంట: 'ఈ ప్రాంతం అభివృద్ధి మీ చేతుల్లోనే ఉంది.. అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ ప్రగల్భాలు పలికిన ఈటల రాజేందర్, బండి సంజయ్ ఎక్కడున్నారు' అని మంత్రి కేటీఆర్ హుజూరాబాద్ ప్రజలను ప్రశ్నించారు. మంగళవారం సాయంత్రం జమ్మికుంటలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఎమ్మెల్సీ పాడికౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు రమణ, ఎమ్మెల్యేలు రవిశంకర్, రసమయి బాలకిషన్, వొడితెల సతీశ్‌కుమార్, తాటికొండ రాజయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ కనుమల్ల విజయ-గణపతి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీను, గాయకుడు, బివరేజెస్ చైర్మన్ సాయిచంద్, జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ రామక్రిష్టారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వేదికపై మంత్రి కేటీఆర్ బీజేపీ పాలనపై నిప్పులు చెరిగారు.

- 14 నెలల కింద సానుభూతి మాటలు, కేంద్ర నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. రూ.3,000 పింఛన్ ఇస్తామని, అమిత్‌షా సాయంతో ప్రత్యేక అభివృద్ధి చేస్తామన్న మాటలు ఏమయ్యాయి? అని నిలదీశారు. అందుకే.. మరోసారి తప్పు చేయవద్దని, సానుభూతి మాటలకు ఆగం కావొద్దని హుజూరాబాద్ ప్రజలను అప్రమత్తం చేశారు. హుజూరాబాద్, రాష్ట్రం అభివృద్ధికి ఎవరు పాటుపడుతున్నారో గుర్తించి, గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.
- అంతకుముందు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. గత ఉప ఎన్నికల్లో 83 వేల ఓట్లు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.
- జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో హుజూరాబాద్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు.
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. 2001లో ఉద్యమ పార్టీగా ప్రస్థానం ప్రారంభించిన టీఆర్ఎస్ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి బంగారు తెలంగాణ చేసి చూపించిందన్నారు.
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చూసిన ఉత్తమ సీఎం కేసీఆర్ అని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రానికి ముందు పాత కమలాపూర్, వరంగల్ జిల్లా ప్రజలు నీటి కోసం తరచూ గోస పడిన రోజులను గుర్తు చేసుకున్నారు.
- మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. పేదింటి బీసీల చదువులకు సీఎం కేసీఆర్ తెచ్చిన గురుకులాలు వరంగా మారాయన్నారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న ఏకైక నేత కేసీఆర్ అని, కేంద్రంలో బీసీ శాఖకు మంత్రిని కేటాయించేలా ఈ పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రంపై ఎమ్మెల్యే ఈటల రాజేందర్, ఎంపీ బండి సంజయ్ ఒత్తిడి తేవాలని సవాల్ విసిరారు.
- కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. హుజూరాబాద్ మహిళా సంఘాల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని, జమ్మికుంట, హుజూరాబాద్ క్రీడా మైదానాలను మినీ స్టేడియాలుగా మార్చేందుకు ప్రతీ స్టేడియానికి రూ.10 కోట్ల చొప్పున కేటాయించాలని కోరారు. శ్రీరామ నవమికి ఇల్లందకుంట రామాలయానికి రావాలని మంత్రి కేటీఆర్‌ను కోరారు.



సభకు హాజరైన జనం



సర్క్యూట్ రెస్ట్‌హౌజ్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం..

సర్క్యూట్ రెస్ట్‌హౌజ్, ఎమ్మెల్యే క్వార్టర్ ప్రారంభం

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ కరీంనగర్ పర్యటన విజయవంతంగా సాగింది. హైదరాబాద్ నుంచి నేరుగా ఉదయం 11 గంటలకు స్పోర్ట్స్ స్కూల్ వద్ద నున్న హెలిప్యాడ్ గ్రౌండ్‌కు మంత్రి కేటీఆర్‌తోపాటు మంత్రులు ఎర్రబెల్లి, గంగుల, కొప్పుల, వినోద్‌కుమార్ చేరుకున్నారు. వీరికి జిల్లా నేతలు, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తదితరులు ఘనస్వాగతం పలికారు. కరీంనగర్ పట్టణంలో రూ.12.99 కోట్ల వ్యయంతో నిర్మించిన కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ (కేసీఆర్), రూ.4 కోట్లతో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని మంత్రి కేటీఆర్ మంత్రులు, మేయర్ వై.సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం గెస్ట్ హౌజ్‌లోని గదులను మంత్రి పరిశీలించారు. జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కలెక్టర్‌తో చర్చించారు. జిల్లా పట్టణ ప్రగతి పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు.

కాంగ్రెస్ నేతల ముందస్తు అరెస్టులు

మంత్రి కేటీఆర్ కరీంనగర్ పర్యటనలో భాగంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మేన్నేని రోహిత్‌రావు, వైద్యులు అంజనీకుమార్‌తో పాటు అనుబంధ విభాగాల నాయకులను పోలీసులు సోమవారం రాత్రి నుంచే అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో మంత్రి కేటీఆర్ పర్యటనను కొనసాగించడం ప్రభుత్వ దమన నీతికి నిదర్శనమని కాంగ్రెస్, ఏబీవీపీ నాయకులు వేర్వేరు ప్రకటనల్లో విమర్శించారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో కాన్వాయ్ ముట్టడికి యత్నం..

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెస్ట్‌హౌజ్ వద్ద మంత్రి కేటీఆర్ కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో కాసేపు గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పుకొని పోలీసుల కళ్లు గప్పి అక్కడే ఉన్న ఏబీవీపీకి చెందిన విద్యార్థి నాయకులు ఒక్కసారిగా నాటకీయ ఫక్కీలో ఏబీవీపీ కండువాలు చేతబూని మంత్రి కేటీఆర్‌కు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు అడ్డుకొని అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ మల్యాల రాకేశ్, రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారబోయిన రంజిత్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్లు అజయ్, రాపాక సాయి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూసల విష్ణు, నందు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అనిల్ కుమార్



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అనిల్‌కుమార్

కరీంనగర్: జిల్లా గ్రంథాలయ సంస్థను మరింత అభివృద్ధి చేయాలని గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు పొన్నం అనిల్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా గ్రంథాలయంలో సంస్థ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులు, అభివృద్ధికి అనుగుణంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో సరిపడా నిధులను సమకూర్చుకోవాలని అన్నారు. శానిటేషన్ నిర్వహణకు స్వయం సహాయక సంఘాల నుంచి సిబ్బందిని ఏర్పాటు చేసుకోవడానికి, వేతనం చెల్లించడానికి, గ్రంథాలయానికి తెప్పించిన పుస్తకాలకు చెల్లింపులు, కొత్త పుస్తకాలను తెప్పించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య, సంస్థ కార్యదర్శి ఎ.సరిత, సభ్యుడు కొడగోటి మొగిలి, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు పుస్తకం బహూకరణ

'టాప్ విజనరీస్ హు చేంజ్డు ది వరల్డ్' పుస్తకాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు చైర్మన్ పొన్నం అనిల్ అందజేశారు. మంగళవారం కేటీఆర్ కరీంనగర్ పర్యటనలో భాగంగా ఆయనకు పుస్తకం ఇచ్చి స్వాగతం పలికారు.

దరఖాస్తుల గడువు పొడగింపు

కరీంనగర్: 2023–24 విద్యాసంవత్సరానికిగాను జిల్లాలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలల, కళాశాలల సీట్లకు ప్రవేశానికి ఈనెల 15 వరకు గడువు పొడగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మధుసూదన్ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌లలో, ఒకేషనల్ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్) కోర్సుల్లో మొదటి సంవత్సరం సీట్ల కోసం విద్యార్థులు tmreis.telangana.gov.in ఆన్‌లైన్‌లో లేదా టీఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. టీఎంఆర్ఈఐఎస్ ప్రవేశాల్లో 75 శాతం మైనార్టీలకు(ముస్లింలు, క్రిస్టియన్స్, పార్శులు, జైనులు, సిక్కులు, బుద్ధిస్టులు), 25 శాతం నాన్ మైనార్టీస్‌లకు సీట్లు రిజర్వు చేయబడ్డాయని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షా 50 వేలకు మించరాదన్నారు. మరిన్ని వివరాలకు 82475 06232, 91600 48786 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

కేశవపట్నం పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



శంకరపట్నం(మానకొండూర్): కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం కేంద్ర వైద్య బృందం రెండో రోజు సందర్శించింది. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలను జిల్లా వైద్యాధికారి జువేరియా వివరించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు జ్యోతిసిమ్లాట్, అబ్దుల్‌హఫీజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, సిబ్బంది ఉన్నారు.

వైద్య సిబ్బందిపై ఆగ్రహం

కేశవపట్నం పీహెచ్‌సీ సందర్శనకు కేంద్ర వైద్య బృందం రాగా విడివిడిగా వైద్యసిబ్బందితో జిల్లా వైద్యాధికారి జువేరియా మాట్లాడారు. కొత్తగట్టు గ్రామంలో ఏఎన్‌సీ టార్గెట్ ఎంత? ఎన్ని చేశారో వివరాలు ఉన్నాయా అని సూపర్‌వైజర్ సరోజనను ప్రశ్నించారు. వివరాలు చెప్పకుండా మౌనంగా ఉండడంతో మందలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు.

మహిళా లెక్చరర్‌కు డాక్టరేట్



శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో కాంట్రాక్టు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఎం.కల్పనకు రాజస్తాన్ జున్‌జునులోని ఎస్‌జేజేటీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. 'ఏ దీప్ లర్నింగ్ సెంటిమెంట్ బేస్డ్ ఇంటెలిజెంట్ ప్రొడక్ట్ రికమండేషన్ సిస్టం' అంశంపై పరిశోధన పత్రం సమర్పించినందుకు డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా కల్పనను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి అభినందించారు. అధ్యాపకులు లావణ్య, పీడీ గంధ్ర శ్రీధర్‌రావు, చక్రవర్తి, సంగీతారాణి, రజనీ, శ్రీనివాస్, సతీష్‌కుమార్‌తో పాటు ఇతర అధ్యాపకులు సన్మానించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల క్యాలెండర్ ఆవిష్కరణ



కరీంనగర్‌క్రైం: ఉమ్మడి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సంబంధించి 2023 క్యాలెండర్‌ను జిల్లా జడ్జి బి.ప్రతిమ మంగళవారం ఆవిష్కరించారు. దీనిలో రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అధికారులు, ఉమ్మడి జిల్లా ప్రాసిక్యూటర్ల ఫొటోలు, వివరాలతో పాటు సెలవులు, పని దినాలను పొందుపరిచారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ (పబ్లిక్ ప్రాసిక్యూటర్)వి.వెంకటేశ్వర్లు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పీవీ రాజ్‌కుమార్, కనుకుల సంజీవరెడ్డి, తుమికి పవన్‌కుమార్, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, లక్ష్మీపతి, రంజిత్ పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: 2023–24 విద్యా సంవత్సరానికిగాను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) పథకం కింద ఉత్తమ పాఠశాలల ఎంపికకు జిల్లాలోని ప్రైవేట్ ఆంగ్లమాధ్యమ స్కూళ్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నేతానియల్ ప్రకటనలో తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రెసిడెన్షియల్ పథకంలోని విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, భోజన వసతికి గాను ప్రతీ విద్యార్థికి రూ.42 వేల చొప్పున, నాన్ రెసిడెన్షియల్‌లో ట్యూషన్ గాను ప్రతీ విద్యార్థికి రూ.28 వేల చొప్పున చెల్లించబడునని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాల కోసం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని, ఈనెల 25 లోపు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

పత్తి క్వింటాల్ ధర రూ.7,950

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7,950 పలికింది. మంగళవారం మార్కెట్‌కు 115 వాహనాల్లో 1,406 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,950, మోడల్ ధర రూ.7,850, కనిష్ట ధర రూ.7,300 చెల్లించారు. గన్నీ సంచుల్లో 24 మంది రైతులు 43 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,550, మోడల్ ధర రూ.7,500, కనిష్ట ధర రూ.6,800 పలికింది.

సబ్‌స్టేషన్ ఎదుట అన్నదాతల ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

కొత్తపల్లి(కరీంనగర్): వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కొత్తపల్లి మండలంలోని బద్దిపల్లి సబ్‌స్టేషన్ ఎదుట రైతులు మంగళవారం ధర్నా చేపట్టారు. త్రీ ఫేజ్ కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియడం లేదన్నారు. పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడే కరెంటు పరిస్థితి ఇలా ఉంటే వేసవిలో ఎలా ఉంటుందని ప్రశ్నించారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

ఉమెన్స్ కాలేజీలో టాస్క్ శిక్షణ

శాతవాహనయూనివర్సిటీ(కరీంనగర్): కరీంనగర్‌లోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ), టాస్క్ ఆధ్వర్యంలో మంగళవారం 'క్యాంపస్ టూ కార్పొరేట్ స్కిల్స్' అంశంపై శిక్షణ అందించారు. ట్రైనర్ రమా మనోజ్ ఉద్యోగ సాధనకు కావాల్సిన స్కిల్స్‌ను విద్యార్థులకు నేర్పించారు. కోర్సులు పూర్తి చేసుకునే లోపు వివిధ రకాల నైపుణ్యాలు నేర్చుకుంటే తొందరగా ఉద్యోగాలు వస్తాయని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలక్ష్మి, సీహెచ్.శోభారాణి, డాక్టర్ ఎం.సంపత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

హనుమత్ వాహన సేవలో భక్తులు



- నేడు మహా పూర్ణాహుతి.. పుష్పయాగం

కరీంనగర్‌కల్చరల్: వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం యాగశాలలో మూలమంత్ర సుదర్శన, మహాలక్ష్మీ హవనాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం బలిహరణం, తీర్థగోష్టి నిర్వహించారు. శ్రీవారు హనుమత్ అవతారంలో హనుమత్ వాహనంపై ఆలయ మాడ వీధుల గుండా విహరించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, కళాభారతి, బస్టాండ్, సీపీ కార్యాలయం, కలెక్టర్ బంగ్లా మీదుగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. ఈవో ఉడుతల వెంకన్న, ధర్మకర్తలు చకిల శ్రీనివాస్, చకిలం గంగాధర్, గంప రమేశ్, మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులు పూజలు చేసి ప్రారంభించారు. విశేషాలంకరణతో శ్రీవారు ఆలయ మాడ వీధుల్లో సింహవాహనంపై విహరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

గోగుల ప్రసాద్ నేతృత్వంలో కీర్తనలు, రవి బృందం బోయినపల్లి వారితో భజనలు, శ్రీ వాసుదేవర బృందంతో కీర్తనలు, కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. సినీ నేపథ్య గాయని సునీత భక్తి కీర్తనలు అలరించాయి.




పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



గానం చేస్తున్న సునీత

కేంద్ర పథకాలు ప్రజలకు అందకుండా చేస్తున్న ద్రోహి కేసీఆర్

- రాష్ట్రంలోనూ వచ్చేది బీజేపీ ప్రభుత్వమే
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్
- గుమ్లాపూర్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశాలు



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

చొప్పదండి: ఫసల్ బీమా అమలు చేయకపోవడంతో పంటలు నష్టపోయి ఆత్మహత్య చేసుకున్న రైతులకు పరిహారం అందడం లేదని, కేంద్ర పథకాలను అందకుండా చేస్తున్న దుర్మార్గుడు సీఎం కేసీఆర్ అని మాజీ మంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విమర్శించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్‌లో మంగళవారం జిల్లా స్థాయి బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ ఆదాయం 23 జిల్లాలను సాదితే, ఇప్పుడు పది జిల్లాలకే పంచుతున్నారన్నారు. రాజ్యాంగబద్ధంగా కేంద్రం నుంచి రాష్ట్రాలకు 42 శాతం వాటా వస్తోందని కేటీఆర్‌కు తెలియదా అని విమర్శించారు. ఒక లీటరు పెట్రోల్‌పై రాష్ట్రానికి రూ.41.50 పన్ను కడితే, కేంద్రానికి రూ.19.50 పన్ను కడుతున్నారని, రాష్ట్రంలో గద్దెనెక్కిన కేసీఆర్ మోసం చేస్తున్నారన్నారు. బస్సులు పెట్టి రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు చూపించారని, ఇప్పుడు మోటార్లు మునిగి నెలలు గడిచినా ముఖం చాటేశారని ఎద్దేవా చేశారు. కేంద్రం ఎరువుల సబ్సిడీ ద్వారా వరికి ఎకరాకు ఏడాదికి రూ.12 వేలు, పత్తికి రూ.6 వేలు ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం డబ్బులున్న వారికి రైతుబంధు పేరుతో రూ.10 వేలు ఇస్తోందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి మాట్లాడుతూ స్వార్థ రాజకీయాల కోసమే బీఆర్ఎస్ పుట్టిందని, తెలంగాణలో ఇక కేసీఆర్ పని అయిపోయిందని, కేసీఆర్ సర్కార్‌ను గద్దె దించే వరకు బీజేపీ శ్రేణులు విశ్రమించవద్దన్నారు. కార్యవర్గ సమావేశంలో పదిహేను తీర్మానాలను ప్రవేశ పెట్టి ఆమోదించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మంత్రి దేవయ్య, మాజీ ఎమ్మెల్యే శోభ, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీసీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న రాకేశ్

కరీంనగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈనెలలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం సంఘ కార్యాలయంలో మాట్లాడారు. దేశంలో అధిక శాతం జనాభా కలిగిన బీసీలను ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, ఇది చాలా బాధాకరమైన విషయం అని వాపోయారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు దుంపటపల్లి మురళి, మనోజ్‌కుమార్, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



బహుమతులు గెలుచుకున్న క్రీడాకారులు

చొప్పదండి: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్రీగాధ సంతోశ్ తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో జనవరి 29 నుంచి మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో జిల్లా క్రీడాకారులు రెండు బంగారు, నాలుగు రజత, ఏడు కాంస్య పతకాలు సాధించారు. ఆర్.హవిత్ర రాఘవ, ఎస్.మన్విత్ బంగారు పతకాలు సాధించారు. మంత్రి మల్లారెడ్డి, శాట్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్‌లు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా క్రీడాకారులను గంధె సంతోశ్, కోల గంగారావు, రాజేందర్, లహరి, శ్రీజ, నాగమణి, కావ్య, రమ్య, సిరిచందన, సంతోశ్ అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

గంగాధర(చొప్పదండి): మండలంలోని మోడల్ స్కూల్‌కు చెందిన బొద్ల హర్షిణి, చిప్ప ప్రణవి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గోల్డీ బల్బీర్ కౌర్ తెలిపారు. టెల్లింగ్ కాంపిటీషన్స్‌లో హర్షిణి, స్పెల్ వీజార్డ్ కాంపిటీషన్‌లో ప్రణవి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అభినందించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



చిగురుమామిడిలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి(హుస్నాబాద్): ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మండలంలోని ఉల్లంపల్లి, బొమ్మనపల్లి, కొండాపూర్, నవాబుపేట్, సుందరగిరి, చిగురుమామిడి, లంబాడిపల్లి, సీతారాంపూర్, చిన్నముల్కనూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ సంబంధ భూసమస్యలు అనేకం ఉన్నాయని, ధరణి పోర్టల్‌లో అనేక తప్పులు దొర్లుతున్నాయని, వీటన్నింటిని ప్రభుత్వం తక్షణమే పరిష్కారం చేయాలని కోరారు. పాలకులు ప్రజల మధ్య ఉండి వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా తమ స్వలాభం కోసం అధికారాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై దృష్టిసారించకపోవడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ప్రభుత్వం పక్కా ఇండ్లు మంజూరు చేయాలని, రూ.మూడు లక్షలు కాకుండా రూ.ఐదు లక్షలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సహాయ కార్యదర్శులు అందె చిన్నస్వామి, జీల సంపత్, సర్పంచులు శ్రీమూర్తి రమేశ్, నాగెల్లి వకుళ, గోలి బాపురెడ్డి, మాజీ ఎంపీటీసీ కరుణశ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ముద్రకోల రాజయ్య, బూడిద సదాశివ, తేరాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చనందున నిలదీస్తారని పోలీసులచే ముందస్తు అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 24 గంటలు నల్లా నీళ్లు ఇస్తామని అట్టహాసంగా మంత్రి కేటీఆర్‌చే ప్రారంభించి 10 నెలలు అవుతుందని, అది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉందని పేర్కొన్నారు. నగరంలో ఏ ఒక్కరికీ డబుల్ బెడ్రూం ఇళ్లిచ్చిన పాపాన పోలేదన్నారు. రోడ్లు భవనాల అతిథి గృహాన్ని కూల్చివేసి ఆ శాఖకు సంబంధం లేకుండా చేసి ముఖ్యమంత్రిని ప్రసన్నం చేసుకోవడానికి కేసీఆర్ పేరు వచ్చేలా కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌజ్ అని పేరు పెట్టారని ఆరోపించారు. గెస్ట్ హౌస్‌ను కమర్షియల్‌గా కాకుండా అందరికీ అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, లింగపల్లి బాబు, ఎండీ చాంద్, పొరండ్ల రమేష్, కీర్తి కుమార్, మామిడి సత్యనారాయణరెడ్డి, కమల్, సోహెల్ ఉన్నారు.

కాంగ్రెస్ నేతల అరెస్ట్ దుర్మార్గం

కరీంనగర్‌టౌన్: మంత్రి కేటీఆర్ కరీంనగర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గమని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లాకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా జిల్లాలో అడుగుపెడితే అడ్డుకుంటామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం రాత్రి నుంచే జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్‌లలో నిర్బంధించడాన్ని ఖండించారు. అణచివేత చర్యలకు పాల్పడితే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. కాగా వన్‌టౌన్‌లో నాయకులు అబ్దుల్ రహెమాన్, ఇమ్రాన్, ఖలీం, సలీం, ఆసిఫ్, మురారి, టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు మేనేని రోహిత్ రావుతో పాటు జిల్లా స్థాయి నాయకులను, త్రీటౌన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వైద్యుల అంజన్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులను అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్‌టౌన్: గ్రామాల అభివృద్ధికి సర్పంచులు పాటు పడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం వారికి నిధులు విడుదల చేయడం లేదని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి ప్రకటనలో ఆరోపించారు. సర్పంచులు గ్రామాల్లో వీధి లైట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైపు లైన్ల రిపేర్లకు అప్పులు తెచ్చి పనులు చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 5 నెలల నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదని మండిపడ్డారు. దీంతో ప్రతీ సర్పంచ్ మానసికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రామ పంచాయతీ ఖాతాల్లో డబ్బు ఉండి కూడా తీసుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా సర్పంచుల బాధలు అర్థం చేసుకొని గ్రామ పంచాయతీ ఖాతాల ఫ్రీజింగ్‌లను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు 10 రోజుల్లో పరిష్కరించకుంటే జిల్లా మహిళ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు.

పెళ్లి సందడి

విద్యానగర్(కరీంనగర్): జనవరి 25 నుంచి శుభ ముహూర్తాలు ప్రారంభమైనట్లు కరీంనగర్ నగర వైదిక పురోహితులు మంగళంపల్లి శ్రీనివాస శర్మ తెలిపారు. ఈ నెలలో 1,8,9,10,11,12,15,16,22,23,24, 25 తేదీల్లో పెళ్లి ముహూర్తాలున్నాయని పేర్కొన్నారు. అలాగే మార్చిలో 1,5,8,9,10,11,15,17,18,22,23,24,25,26 తేదీల్లో మంచి రోజులున్నాయని వివరించారు. ఏప్రిల్‌లో గురు మౌఢ్యమితో శుభ ఘడియాలు లేవని, మళ్లీ మే, జూన్ నెలల్లో మంచి రోజులుంటాయని పేర్కొన్నారు.

గీత కార్మికుడి ఆత్మహత్య

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో మార్క తిరుపతి(58) అనే గీత కార్మికుడు అనారోగ్య బాధలు భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై సుధాకర్ తెలిపారు. రెండేళ్ల క్రితం తిరుపతికి పక్షవాతం రావడంతో మందులు వాడుతున్నాడు. నయం కాకపోవడంతో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పై కప్పునకు ఉరేసుకున్నాడు. కూలీ పనులకు వెళ్లిన భార్య భాగ్యలక్ష్మి ఇంటికి రాగా, ఇంట్లో తలుపులు వేసి గడియపెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడడంతో దూలానికి వేలాడుతూ కనిపించాడు. చట్టుపక్కల వారిని పిలిచి బలవంతంగా తలుపులు తెరిచి చూడగా మృతిచెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తల్వార్ తిప్పిన ఇద్దరిపై కేసు

గోదావరిఖని(రామగుండం): రౌడీషీటర్ మంథని సుమన్ శవయాత్రలో తల్వార్ తిప్పిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐలు రమేష్‌బాబు, ప్రసాద్‌రావు ప్రకటనలో తెలిపారు. పొడవాటి కత్తిని తిప్పుతూ రోడ్లపై వెళ్తున్న ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేసిన స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఎండీ జాకీర్, రాంనగర్‌కు చెందిన మారంగుల రమేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. చట్టవ్యతిరేక కార్యకపాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు.

విద్యార్థులకు రాజీవ్‌గాంధీ పురస్కార్ అందజేత



అవార్డులు అందజేసిన నాగి శేఖర్ తదితరులు

గంగాధర(చొప్పదండి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రాజీవ్‌గాంధీ విద్యార్థి పురస్కార్ అవార్డులు అందజేసి సన్మానించారు. కార్యక్రమానికి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను ప్రోత్సహించేందుకు అవార్డులు అందించి సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థులు రాహుల్, మనోజ్, అనూష, అఖిల, రక్షిత, ప్రమోద్, ప్రవళిక, జయశీలకు అవార్డులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీల, కాంగ్రెస్ నాయకులు పెద్దెల్లి అంజయ్య, కొలిపాక స్వామి, గుడ్ల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం పదోన్నతులు చేపట్టాలి

కరీంనగర్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం పదోన్నతులు చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు ప్రకటనలో అన్నారు. తెలంగాణ స్టేట్ సబ్ ఆర్డినెట్స్ రూల్స్1996, 35వ నిబంధన మేరకు ఒక ఉద్యోగి యొక్క క్లాస్ కేటగిరీ లేదా గ్రేడ్‌లో చేరిన మొదటి నియామక తేదీ నుంచి పరిగణనలోకి తీసుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ మందిని నియామకం చేస్తే రిజర్వేషన్లు, ర్యాంకులు పరిగణనలోకి తీసుకొని సీనియార్టీ నిర్ణయించాలన్నారు. రూల్ 34 నిబంధన మేరకు ఒక క్లాసు కేటగిరీ లేదా గ్రేడ్ వేర్వేరు యూనిట్లకు సంబంధించి నియామకమైతే ఆ యూనిట్ల సర్వీసును పరిగణనలోకి తీసుకొని ఇంటిగ్రేటెడ్ సీనియార్టీని తయారుచేసి, దాని ద్వారా ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. కానీ అధికారులు ఈ జీవోకు పూర్తి విరుద్ధంగా తమకు ఇష్టం వచ్చిన రీతిలో సీనియార్టీ లిస్టు తయారుచేసి పదోన్నతులు కల్పిస్తున్నారని అన్నారు. వెంటనే ప్రకటించిన పదోన్నతుల లిస్టులు అన్ని రద్దు పరచి ప్రభుత్వ జీవో ప్రకారం తయారు చేయాలని డిమాండ్ చేశారు.

రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా జగ్గారెడ్డి



జగ్గారెడ్డి



గోపాల్‌రెడ్డి



మధుకర్‌రెడ్డి

కరీంనగర్: రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి విజ్ఞాన పరిషత్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెడ్డి సంఘం ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. గత పాలక వర్గంలోని తాజా మాజీ అధ్యక్షుడు మూల ప్రభాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి పోటీపడ్డారు. రెండు వర్గాలుగా రెండు ప్యానళ్లు ఏర్పడగా వారికి కేటాయించిన పదవుల కోసం 34 మంది పోటీపడ్డారని ఎన్నికల అధికారి పెండ్యాల కేశవరెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా జగ్గారెడ్డి 1,407 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. ఉపాధ్యక్షులుగా ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, కసిరెడ్డి రాణిరెడ్డి, గన్ను మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా దాసరి రాంరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ట్రెజరరీ కాసర్ల మధుకర్‌రెడ్డి, ఈసీ మెంబర్లుగా ఎనిమిది మంది గెలుపొందారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, దారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్‌క్రైం: లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడడంతో పాటు ఆర్థిక పరిస్థితులు బాగాలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసుల వివరాలు.. జగిత్యాల జిల్లా మల్యాల గ్రామానికి చెందిన పోచంపల్లి అంజయ్య(36) కరీంనగర్‌లోని హైమద్‌పురలో ఒక రేకుల రూంలో ఉంటూ లాండ్రీషాప్ నడుపుకుంటున్నాడు. దీంతో పాటు ఆర్టీసీ వర్క్‌షాపులో వంట కూడా చేస్తుంటాడు. గతంలో విదేశాలకు పని నిమిత్తం వెళ్లినప్పుడు అప్పులు అయ్యాయి. లివర్‌కు సంబంధించిన వ్యాధితో రెండేళ్ల నుంచి బాధపడుతున్నాడు. మనోవేదన చెందిన అంజయ్య మంగళవారం రేకుల రూంలో ఉరేసుకొని మృతిచెందాడు. ఎంతకీ తలుపులు తీయకపోయేసరికి ఇంటి యజమాని వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. వెంటనే మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి విషయం చెప్పగా వారు కరీంనగర్‌కు చేరుకున్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ సీజన్ –4

- ప్రారంభించనున్న మంత్రి గంగుల కమలాకర్
- జూనియర్స్, సీనియర్స్ విభాగంలో మ్యాచ్‌లు

కరీంనగర్‌స్పోర్ట్స్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) సీజన్–4 ప్రారంభం కానుంది. తెలంగాణలోని ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో జూనియర్, సీనియర్స్ కేటగిరీలలో క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో మ్యాచ్‌లు జరుగనుండగా, ఉదయం పోటీలను రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. కాగా ప్రతి రోజూ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు జరుగనున్నాయి. పోటీలకు హాజరయ్యే జట్లు ముందుగా నిర్వాహకులు సూచించిన షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలి. కరోనా దృష్ట్యా క్రీడాకారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ కోవిడ్ నిబంధనలు పాటించాలని నిర్వాహకులు తెలిపారు. కాగా ఎస్‌పీఎల్ సీజన్– 4కు సుధాకర్ పైప్స్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు.

నియమ నిబంధనలు..

- ఆయా కళాశాలల జట్లు తమ మ్యాచ్‌లు సూచించిన సమయానికి, మ్యాచ్ జరిగే తేదీన గంట ముందు నిర్వాహకులకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.
- మ్యాచ్ సమయంలో ఇరు జట్ల క్రీడాకారులు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్), వయసు ధ్రువీకరణకు సంబంధించిన పదో తరగతి మార్కుల మెమో (ఒరిజినల్)ను నిర్వాహకులకు చూపించాలి.
- క్రీడాకారులు సొంత కిట్‌ను వెంట తెచ్చుకోవాలి. మ్యాచ్‌లలో పాల్గొనే క్రీడాకారులు వైట్ డ్రెస్ తప్పనిసరిగా ధరించాలి. వైట్ డ్రెస్ లేనివారు మ్యాచ్‌లు ఆడేందుకు అనర్హులు.
- మ్యాచ్ జరిగే సమయంలో బ్యాట్స్‌మెన్, వికెట్ కీపర్ తప్పని సరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్‌గార్డ్స్, హ్యాండ్ గ్లౌజ్స్ ధరించాలి.
- ఒక కళాశాల జట్టు తరుఫున ఆడి మళ్లీ ఇతర కళాశాలకు ఆడరాదు. అలా ఆడితే ఆ కళాశాల జట్టును టోర్నమెంట్ నుంచి తొలగించడం జరుగుతుంది.
- ఎస్‌పీఎల్ సీజన్–4కు సంబంధించిన తుది నిర్ణయం నిర్వాహకులదే.

ఖేలో ఇండియా కబడ్డీ పోటీలకు సాయిప్రియ



కరీంనగర్‌స్పోర్ట్స్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు జరుగనున్న ఖేలో ఇండియా కబడ్డీ పోటీలకు కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న జి.సాయిప్రియ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం సాయిప్రియ హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ఖేలో ఇండియా జట్టు శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతుంది. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీధర్‌రావుతో పాటు అరుణ, స్వరూప, వెంకటరమణ, సతీష్‌కుమార్ అభినందించారు.

అవినీతి కేసులో మాజీ ఉద్యోగికి నాలుగేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: విధి నిర్వహణలో లంచం తీసుకుంటూ పట్టుబడిన ప్రభుత్వ ఉద్యోగికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.12 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి పి.లక్ష్మీకుమారి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం.. ఎల్కతుర్తి మండలం బావుపేట గ్రామానికి చెందిన వేల్పుల వెంకన్న తండ్రి ద్వారా సంక్రమించిన ఆస్తిని విరాసత్ చేయాల్సిందిగా తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. జమాబంది నిమిత్తం బావుపేట గ్రామానికి చెందిన వీఆర్వో పొంరాజ్ మధుసూదన్‌రావును కలవాల్సిందిగా ఆయన సూచించారు. ఈక్రమంలో పట్టాదార్ పాస్‌బుక్ ఇచ్చిన వీఆర్వోను టైటిల్ డీడ్‌లు ఇవ్వాలని అడుగగా రూ.25,000 లంచం ఇస్తేనే టైటిల్ డీడ్ ఇస్తానని డిమాండ్ చేశాడు. దీంతో వెంకన్న ఏసీబీ అధికారులకు 2010 అక్టోబర్ 9 ఫిర్యాదు చేశాడు. నవంబర్ 1న తహసీల్దార్ ఆఫీసులో వెంకన్న నుంచి వీఆర్వో లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ జైపాల్ సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. సీఐ రమణమూర్తి కేసు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కిషోర్ వాదించారు. న్యాయమూర్తి పి.లక్ష్మీకుమారి సాక్ష్యాధారాలు పరిశీలించి మధుసూదన్‌రావుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జైలు శిక్ష పడ్డ మధుసూదన్‌రావు ఉద్యోగ విరమణ పొందాడు.

ఫిర్యాదుదారుకు కోర్టు నోటీసులు

ఈ కేసులో ఫిర్యాదుదారుగా ఉన్న వెంకన్న కోర్టుకు హాజరై నిందితుడికి అనుకూలంగా సాక్ష్యం ఇవ్వడంతో, 'నీ పై చర్యలు ఎందుకు తీసుకోరాదో కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలి' అని ఏసీబీ కోర్టు నోటీసులు జారీ చేసింది.

ఐక్య ఉద్యమాలతోనే సింగరేణి పరిరక్షణ

- ఐఎఫ్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేశ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామగిరి(మంథని): సింగరేణి పరిరక్షణ కార్మిక సంఘాల ఐక్య ఉద్యమాలతోనే సాధ్యమవుతుందని తెలంగాణ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(ఐఎఫ్టీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేశ్ పేర్కొన్నారు. సెంటినరీకాలనీలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం 11వ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. బొగ్గు పరిశ్రమలు కార్పొరేట్ శక్తుల ఆధిపత్యంలోకి వెళ్లాయని, ప్రభుత్వ రంగంలో ఉన్న సదుపాయాలు, హక్కులు ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంలో కుదరవని తెలిపారు. దీంతో పని గంటలు, పని భారం పెరగడంతో పాటు ప్రస్తుతం అనుభవిస్తున్న హక్కులు కూడా ఉండవని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సింగరేణిలో అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్మించామని, బలమైన ఐక్య కార్మిక ఉద్యమం సంఘటితంగా నిర్మాణయుతంగా కొనసాగితే ప్రైవేటీకరణను అడ్డుకోవచ్చని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అసంఘటిత రంగంలో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల జీతభత్యాల పెంపుదల, ప్రభుత్వ జీవోలను అమలు పరచడం లేదని, దీంతో కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలు అతి దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికులు ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈనెల 4న గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న 11వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న, నాయకులు రాయమల్లు, మొగిలి, మనోజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు సన్మానం



సన్మానిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని(రామగుండం): ఆర్జీ–2 ఏరియాలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన అధికారులను మంగళవారం ఆర్జీ–2 జీఎం ఘనంగా సన్మానించారు. సర్వే అధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ప్రసాదరావు, సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందిన జగన్మోహన్‌రెడ్డిలను శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, ఎస్‌ఓటూ జీఎం అబ్దుల్‌సలీం, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

దేహ, అవయవ దానానికి అంగీకారం

ఉద్యోగ విరమణ రోజే అవయవ, దేహ దానం చేసేందుకు అంగీకరించి ఆదర్శంగా నిలిచారు. ఆర్జీ–2 ఏరియాలో సీనియర్ సెక్యూరిటీ అధికారిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణపొందిన ముస్కుల జగన్మోహన్‌రెడ్డి అంగీకార పత్రాలపై సంతకం చేసి సదాశయ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈసందర్భంగా జీఎం మనోహర్ వీరిని అభినందించారు. కార్యక్రమంలో సదాశయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి లక్ష్యాల సాధనలో దూకుడుగా ముందుకు

- ఆర్జీ–1 జీఎం కె.నారాయణ



మాట్లాడుతున్న జీఎం కె.నారాయణ

గోదావరిఖని(రామగుండం): వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో దూకుడుగా ముందుకెళ్తున్నామని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈఆర్థిక సంవత్సరంలో జనవరి చివరినాటికి 31.71లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికిగాను 36.59 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాల సాధనలో 115 శాతంలో నిలిచినట్లు వెల్లడించారు. ఉత్పత్తితో పాటు సంక్షేమంలో కూడా రాజీలేకుండా ముందుకు సాగుతున్నామన్నారు. వ్యర్థ జలాల శుద్ధి కోసం సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ భూమిపూజ పూర్తి చేసి నిర్మాణ పనులు ఊపందుకున్నాయని, మరో రెండేళ్లలో పనులు పూర్తి కానున్నాయని వివరించారు. గోదావరినదిలోని నీటిని శుద్ధి చేసేందుకు నదిలో ఏర్పాటు చేసిన ఇంటెక్‌వెల్‌లను శుభ్రం చేస్తున్నామని, మరో 15రోజుల పాటు ఈప్రక్రియ కొనసాగుతుందన్నారు. జీడీకే–5 ఓసీపీ సమీప గ్రామాలకు దుమ్ము సమస్య లేకుండా చర్యలు చేపట్టామని, పూర్తయ్యే సరికి కొంత సమయం పడుతుందన్నారు. సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం రామ్మోహన్, అధికారులు రామ్మూర్తి, రామక్రిష్ణ, చిలక శ్రీనివాస్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జీడీకే-5 ఓసీపీని సందర్శించనున్న డీడీఎంఎస్‌లు

గోదావరిఖని(రామగుండం): జీడీకే–5 ఓసీపీ బ్లాస్టింగ్‌ల మూలంగా ఏర్పడుతున్న ఇబ్బందులపై డీడీఎంఎస్‌లు సనత్‌కుమార్, కమలేష్‌కుమార్‌శర్మ బుధవారం సదరు ప్రాంతాన్ని సందర్శించనున్నారు. బ్లాస్టింగ్ సమయంలో వైబ్రేషన్స్ తనిఖీ చేయనున్నట్లు 11వ డివిజన్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విని తెలిపారు. బ్లాస్టింగ్‌ల మూలంగా ప్రజలు ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని, ఇళ్లు దెబ్బ తింటున్నాయని తాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు వాస్తవాలు పరిశీలించడానికి డీడీఎంఎస్‌లుఇక్కడకు వస్తున్నారని కార్పొరేటర్ వెల్లడించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

■I, ETTEDI CHINNA BHUMANNA (Old name) H.No:2-77, Jagityal. Hence Changed my Name as ITTEDI CHINNA BHUMANNA S/o.RAMULU (New Name) [Z-0992591]

■I, ETTEDI SAIAMMA (Old name) H.No: 2-77, Komatikondapur, Jagityal. Hence Changed my Name as ITTEDI SAYAMMA, W/o. ITTEDI CHINNA BHUMANNA (NewName) [Z-0992594]

■I, ETTEDI THIRUPATHI REDDY (Old name) Jagityal. Hence Changed my Name as ITTEDI THIRUPATHI REDDY, S/o. ITTEDI CHINNA BHUMANNA (New Name) [Z-0992592]

■I, ETTEDI RADHA (Old name) H.No: 2-77/1, Jagityal. Hence Changed my Name as ITTEDI PRATIBHA, W/o. ITTEDI THIRUPATHI REDDY (New Name) [Z-0992593]

BUSINESS OFFER

■ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034974058 [H-792913]



WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059508586 [G-779863]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోర్ డ్రైవర్స్-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]

■ వరంగల్‌లోని చికెన్ సెంటర్‌లో పని చేయుటకు అనుభవం గల చికెన్ కట్టర్ కావలెను. జీతం 18000+రూం+ భోజనం ఫ్రీ. సంప్ర॥ 6281342090, 9949857816. [WA-6469]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190562]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

క్లుప్తంగా

మైనార్టీ గురుకులాల్లో చేర్పించాలి



ప్రచారం చేస్తున్న ఎంఐఎం కార్పొరేటర్లు

విద్యానగర్: ముస్లిం పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్న మైనార్టీ గురుకులాల్లో చేర్పించాలని ఎంఐఎం పార్టీ కో–ఆప్షన్ సభ్యురాలు రఫియా సుల్తానా, కార్పొరేటర్ షకీరా అంజుమ్ కోరారు. మంగళవారం కరీంనగర్‌లోని మైనార్టీ గురుకులం బాలికల–2 పాఠశాల ప్రిన్సిపాల్ నీలవేణితో కలిసి, నగరంలోని 47వ డివిజన్ పరిధిలో ప్రచారం చేశారు. తల్లిదండ్రులకు మైనార్టీ గురుకులాల్లో వసతులు, సౌకర్యాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



సామూహిక హోమాలు చేస్తున్న భక్తులు

కరీంనగర్‌కల్చరల్: విద్యానగర్‌లోని నవీన కుర్మవాడ శ్రీ బాల భక్తాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. జ్యోతిష్య, వాస్తు పండితుడు నమిలకొండ రమణాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠ, మూర్తులకు 27 కలశాలతో స్నాపనం, పూర్ణాహుతి, భక్తులచే సామూహిక హోమాలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. బుధవారం శ్రీరామ కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తిరువరంగం భరతాచార్యులు, కోదుమగుళ్ల వెంకటరమణ, రామకృష్ణమాచార్యులు, చిట్యాల భరత్‌కుమార్ స్వామి, రామాచార్యులు, దేవనపల్లి రమేశ్ స్వామి, ఆలయ అర్చకుడు రమేశ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో అలరించిన 'భగవతి' విద్యార్థులు



సప్తగిరికాలనీ: స్థానిక భగత్‌నగర్‌లోని భగవతి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఈశాంత్ సాయి, వినయలు కరీంనగర్‌లో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో తమ కీర్తనలు, నృత్యాలతో అందరినీ అలరించారని విద్యాసంస్థల చైర్మన్ బి.రమణారావు తెలిపారు. అతిథులచే ప్రశంసాపత్రాలు అందుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారిని మంగళవారం చైర్మన్‌తోపాటు కరస్పాండెంట్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



షేక్ జావీద్



రఫియొద్దీన్

విద్యానగర్: షహరీ జమాయత్ అహల హదీస్ కరీంనగర్ శాఖ నూతన కార్యవర్గాన్ని నగరంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ జావీద్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ఇస్మాయిల్, మహమ్మద్ ఫారూఖ్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ రఫియొద్దీన్, సంయుక్త కార్యదర్శులుగా మహమ్మద్ యూసుఫ్, అబ్దుల్ సత్తార్, కోశాధికారిగా సయ్యద్ జావీద్ ఎన్నికయ్యారు.

పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం

చొప్పదండి: ఏసీడీ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం మోపుతోందని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. విద్యుత్ వినియోగదారుల నుంచి ఏసీడీ చార్జీల వసూల్ చేయడాన్ని నిరసిస్తూ నాయకులు చొప్పదండి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించి, ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ప్రభుత్వం 24 గంటల కరంట్ అని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అమలుకావడం లేదని విమర్శించారు. ఏసీడీ చార్జీలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, పులి అంజనేయులుగౌడ్, వెన్నం రాజమల్లయ్య, అశోక్, గంగయ్య, రాజేశం, రమేశ్, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'సేంద్రియ' లక్ష్యం.. ఆచరణలో నిర్లక్ష్యం



దుబ్బపల్లిలో నిరుపయోగంగా కంపోస్టు షెడ్డు



పక్కన పడేసిన చెత్త

- తడి, పొడి చెత్త వేరు చేయట్లే..
- నిర్వహణ గాడితప్పి, అలంకారప్రాయంగా కంపోస్టు షెడ్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- కరీంనగర్ రూరల్ మండలంలో పరిస్థితి

కరీంనగర్‌రూరల్: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతిలో కార్యక్రమంలో భాగంగా కంపోస్టు షెడ్లు నిర్మించింది. ఉపాధిహామీ పథకంలో ఒక్కో షెడ్డుకు రూ.2.50 లక్షలు ఖర్చు చేశారు. గ్రామాల్లో ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను పంచాయతీ సిబ్బంది సేకరించి, కంపోస్టు షెడ్లకు తరలిస్తున్నారు. అక్కడ చెత్త వేరు చేయాల్సి ఉండగా సిబ్బంది కొరతతో చేయడం లేదు. కరీంనగర్ రూరల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో షెడ్ల నిర్వహణ గాడి తప్పడంతో అలంకారప్రాయంగా మారాయి.

అవగాహనాలోపం.. సిబ్బంది కొరత

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గ్రామాల్లో డంపింగ్‌యార్డులతోపాటు కంపోస్టు షెడ్లను నిర్మించింది. చెత్త తరలించేందుకు ప్రతీ పంచాయతీ ట్రాక్టర్ కొనుగోలు చేసింది. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరించేందుకు ఇంటింటికీ చెత్త బుట్టలు పంపిణీ చేశారు. అయితే ప్రజలకు అవగాహన లేకపోవడంతో తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో వేయడం లేదు. కొంతమంది ఒకే బుట్టలో వేస్తుండగా మరికొందరు బుట్టలను ఇతర పనులకు ఉపయోగిస్తున్నారు.

డంపింగ్‌యార్డులకు చెత్త..

కొన్ని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ట్రాక్టర్‌లో చెత్త సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది దాన్ని కంపోస్టు షెడ్లలో వేరు చేయకుండా డంపింగ్‌యార్డుల్లో పోస్తున్నారు. మరికొన్ని పల్లెల్లో సిబ్బంది కొరత కారణంగా చెత్త నుంచి ప్లాస్టిక్ సామగ్రి, సీసాలు తదితర వస్తువులను వేరు చేయడం లేదు. ప్రత్యేక అరల్లో చెత్త నిల్వ చేసి, సేంద్రియ ఎరువులను తయారు చేయాల్సి ఉండగా చేయడం లేదు.

పంచాయతీలకు ఆదాయమేదీ?

కంపోస్టు షెడ్లలో సేంద్రియ ఎరువుల తయారీ ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్న సర్కారు లక్ష్యం ఆచరణలో నీరుగారుతోంది. పారిశుధ్య సిబ్బంది కొరత, అధికారుల ఉదాసీన వైఖరి, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో పలు గ్రామాల్లో సేంద్రియ ఎరువుల తయారీ కాగితాలకే పరిమితమవుతోంది. ఉన్నతాధికారుల ఒత్తిళ్ల మేరకు పలు గ్రామాల్లో తయారు చేసిన సేంద్రియ ఎరువును కొనుగోలు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు.

సేంద్రియ ఎరువు మొక్కలకు వినియోగం

అధికారుల లెక్కల ప్రకారం 17 గ్రామాల్లో తయారు చేసిన 31,639 కిలోల సేంద్రియ ఎరువును హరితహారం మొక్కలకు ఉపయోగించారు. బొమ్మకల్‌లో 80, చేగుర్తిలో 55, చెర్లభూత్కూర్‌లో 60, గోపాల్‌పూర్‌లో 10, ఇరుకుల్లలో 20, తాహెర్ కొండాపూర్‌లో 180 కిలోలు మొత్తం 405 కిలోలను విక్రయించడం ద్వారా రూ.2,540 ఆదాయం వచ్చింది. 1,696 కిలోల డ్రై వేస్టేజీ విక్రయించడం ద్వారా రూ.21,892 ఆదాయం సమకూరింది.

రైతులకు అవగాహన కల్పించాలి



కంపోస్టు షెడ్డులో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నాం. రైతులకు అవగాహన లేకపోవడంతో కొనుగోలుకు ముందుకు రావడం లేదు. వారికి అధికారులు చైతన్య సదస్సులు నిర్వహించాలి. తయారు చేసిన ఎరువును మొక్కలకు ఉపయోగిస్తున్నాం.

– ఊరడి మంజుల, సర్పంచ్, గోపాల్‌పూర్

ఎరువు తయారీకి చర్యలు



తడి, పొడి చెత్తను కలిపి ఇస్తుండటంతో వేరు చేయడంలో కొన్ని సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం అన్ని గ్రామాల్లోని షెడ్లలో కొంతమేరకు సేంద్రియ ఎరువు తయారవుతోంది. ఇకనుంచి పూర్తిస్థాయిలో తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో, కరీంనగర్‌రూరల్ మండలం

చిత్ర కథ: ప్రహరీ కూలి ఆర్నెల్లు.. పట్టించుకునేవారేరీ?



కరీంనగర్ మండలంలోని చామనపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రహరీ నిర్మించడంలో వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గతేడాది జూలై 6న ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ఆరోగ్య కేంద్రం వెనకవైపు ఉన్న ప్రహరీ కూలిపోయింది. మరుసటి రోజు ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య పరిశీలించి, పునఃనిర్మాణానికి మండల పరిషత్ నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్నెల్లు గడుస్తున్నప్పటికీ ప్రహరీ నిర్మించకపోవడంతో వైద్యసిబ్బంది తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారు. పశువులు, కుక్కలు, పందులు లోపలికి వస్తున్నాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్

ఎస్సీ, ఎస్టీ టీచర్ల వివరాలు పొందుపర్చాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: పదోన్నతులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ టీచర్ల సీనియారిటీ జాబితా విడుదల చేసినప్పటికీ అడెక్వసీ వివరాలు ప్రకటించలేదని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందుకూరి దయానంద్, పీఆర్ శ్రీనివాస్, శనిగరపు రవి అన్నారు. వెంటనే డీఈవో కరీంనగర్ సైట్‌లో పొందుపర్చాలని కోరుతూ మంగళవారం డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్టా రవీంద్రాచారి, పిన్నింటి తిరుపతిరావు పాల్గొన్నారు.

టీజీసీటీఏ ఆధ్వర్యంలో సన్మానం



భిక్షపతిని సన్మానిస్తున్న ప్రతినిధులు

శాతవాహన యూనివర్సిటీ: తెలంగాణ ప్రభుత్వ కళాశాలల అధ్యాపక సంఘం(టీజీసీటీఏ) ఆధ్వర్యంలో ఎస్సారార్ కళాశాలలో మంగళవారం పలువురిని సన్మానించారు. వాణిజ్య విభాగంలో గైడ్‌షిప్ పొందిన విజయగిరి భిక్షపతి, డాక్టర్ ఓదెలుకుమార్, రెసెర్చ్ గైడ్‌షిప్ పొందిన సతీశ్‌కుమార్, టీజీసీటీఏ ఈసీ మెంబర్‌గా ఎన్నికైన ముత్తన్నను సత్కరించారు. సంఘం ప్రతినిధులు భిక్షపతి, జి.కిశోర్‌కుమార్, ఎం.శోభారాణి, భాస్కర్, అర్చన, పి.విశ్వప్రసాద్, కె.సురేందర్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్కారు బడి.. సరికొత్త ఒరవడి

- మన ఊరు – మన బడి కార్యక్రమంలో పాఠశాలలకు కొత్త రూపు
- నేడు నగునూరు, చింతకుంట ప్రైమరీ స్కూళ్లను ప్రారంభించనున్న అధికారులు



ప్రారంభానికి సిద్ధమైన నగునూరు ప్రాథమిక పాఠశాల

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించి, ప్రైవేట్ బడులకు దీటుగా నాణ్యమైన విద్యనందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పలు పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయి. కొన్నింట్లో పూర్తవగా ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

నియోజకవర్గంలో 35 పాఠశాలల ఎంపిక

కరీంనగర్ నియోజకవర్గంలో మొదటి విడతలో 35 పాఠశాలలను మన ఊరు–మన బడి కార్యక్రమం కింద అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు. కరీంనగర్‌రూరల్ మండలంలో 10 బడులకు రూ.62.55 లక్షలు, అర్బన్‌లో 14 పాఠశాలలకు రూ.26.15 లక్షలు, కొత్తపల్లి మండలంలో 11 స్కూళ్లకు రూ.20.31 లక్షలు మంజూరయ్యాయి. గతేడాది మే నెల నుంచి ఆయా పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్లు, సర్పంచుల ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ముందుగా మండలానికో పాఠశాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి, పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు, అర్బన్‌లో ఆరెపల్లి, కొత్తపల్లి మండలంలో చింతకుంట, కొత్తపల్లి మున్సిపాలిటీలో కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. బుధవారం నగునూరు, చింతకుంట స్కూళ్లను ప్రారంభించనున్నట్లు మండల విద్యాధికారి మధుసూదన్ తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలని ఆయన కోరారు.

ముగిసిన జిల్లాస్థాయి గ్రామీణ క్రీడా పోటీలు



విజేతలకు ట్రోఫీ అందించిన అతిథులు

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో యువశక్తి యూత్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి గ్రామీణ క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి కరీంనగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజు, నెహ్రూ యువకేంద్రం కో–ఆర్డినేటర్ ఎం.వెంకట రాంబాబులు విజేతలకు ట్రోఫీలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయన్నారు. యువత ఆటలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. యువశక్తి ప్రతినిధులు తొర్తి శ్రీనివాస్, అరవింద్, జయంత్, శివ, చందు, కమల్ తదితరులు పాల్గొన్నారు. పలువురు క్రీడాకారిణులు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

రెండేళ్ల తర్వాత ఆడాను



కరోనా కారణంగా రెండేళ్ల తర్వాత అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ఆడాను. జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో రాణించాలన్నది నా లక్ష్యం. ఆ దిశగా బాగా ప్రాక్టీస్ చేస్తా.

– టి.పూర్ణిమ, కరీంనగర్

చాలా ఆనందంగా ఉంది



జిల్లాస్థాయి పోటీల్లో తొలిసారి పాల్గొన్నాను. మా జట్టు మొదటిస్థానంలో నిలిచింది. చాలా ఆనందంగా ఉంది. వచ్చే ఏడాది మరింత ప్రాక్టీస్ చేసి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతా.

– ఎ.వెన్నెల, పొత్తూరు

కబడ్డీ అంటే ఇష్టం



కబడ్డీ క్రీడ అంటే చాలా ఇష్టం. ఇప్పటివరకు రెండు సార్లు జాతీయ పోటీల్లో పాల్గొన్నాను. భవిష్యత్‌లో ఇండియా తరఫున అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో ఆడాలని ఉంది.

– బి.మంజుల, కరీంనగర్

కబడ్డీ, ఖోఖో ఆడతా



రెండు రోజులపాటు జరిగిన గ్రామీణ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నాను. నేను ఖోఖో, కబడ్డీ రెండూ ఆడతాను. చాలా రోజుల తర్వాత కబడ్డీ ఆడాను. సంతోషంగా ఉంది.

– జి.రుచిత, కరీంనగర్

హజ్ హౌస్ నిర్మాణానికి నిధులివ్వండి



కమిటీ సమావేశంలో గులాం అహ్మద్ హుస్సేన్

విద్యానగర్: కరీంనగర్‌లో మినీ హజ్ హౌస్ నిర్మాణానికి నిధులివ్వాలని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు. మంగళవారం హైదరాబాద్ హజ్ హౌస్‌లో హజ్ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కరీంనగర్‌తోపాటు ముస్లింలు మెజారిటీగా ఉన్న జిల్లా కేంద్రాల్లో మినీ హజ్ హౌస్‌ల నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలన్నారు. కమిటీ చైర్మన్ సలీం, వక్ఫ్ బోర్డు చైర్మన్ మసిఉల్లా హ్ ఖాన్, ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మేరాజ్, కౌసర్ మొహియుద్దీన్, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, ఈవో బాబా షఫీయుల్లా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శికి పరామర్శ



ఆంజనేయులను పరామర్శిస్తున్న నగేశ్, కుమార్

కొత్తపల్లి: వైఎస్సార్‌టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తండ్రి ఇటీవల మృతిచెందారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్, జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్, మహిళా అధ్యక్షురాలు వి.రజితారెడ్డి, పి.శ్రీనివాస్‌లు మంగళవారం కరీంనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి, పరామర్శించారు.

బీఆర్ఎస్ నాయకులకేనా దళితబంధు?

శంకరపట్నం(మానకొండూర్): బీఆర్ఎస్ నాయకులకే దళితబంధు ఇస్తున్నారని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్ ఆరోపించారు. కేశవపట్నంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పథకాన్ని ఎమ్మెల్యే అనుచరులకే మంజూరు చేస్తున్నారని, నిరుద్యోగభృతి అమలుకు నోచుకోలేదని, పేదలకు డబుల్‌బెడ్‌రూం, మూడెకరాల భూ పంపిణీ అమలు చేయలేదన్నారు. నియోజకవర్గంలో అగ్రవర్ణ ప్రజాప్రతినిధులు దందాలు చేస్తున్నారని, మానకొండూర్ మండలంలో ఇసుకదందా కొనసాగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దళితబంధు పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సహాయ కార్యదర్శి తిరుపతి, సాగర్, అనిల్ కుమార్, సంపత్, వంశీ, మున్న, హరీశ్ పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతు దృష్ట్యా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ మహాశక్తి దేవాలయం ఫీడర్ పరిధి సంతోష్‌నగర్, బాలాజీ సూపర్ మార్కెట్, శ్రీరామ కల్యాణమండపం, విద్యానగర్, సెయింట్ జాన్స్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ సుధీర్‌కుమార్ తెలిపారు. స్మార్ట్‌సిటీ పనులున్నందున 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ అల్కాపురి ఫీడర్ పరిధి అల్కాపురి, కోతిరాంపూర్, హనుమాన్‌నగర్, గణేశ్‌నగర్‌లలో సరఫరా ఉండదన్నారు.

కాలువ సర్వే పనులు నిలిపివేయాలి

గన్నేరువరం(మానకొండూర్): మిడ్‌మానేరు ప్రాజెక్టు కుడికాలువకు అనుసంధానంగా ఉపకాలువ 7 నిర్మాణానికి చేపడుతున్న సర్వే నిలిపివేయాలని కోరుతూ ఖాసీంపేట, పారువెల్ల గ్రామ రైతులు మంగళవారం తహసీల్దార్ బావ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ భూముల్లో సంబంధిత అధికారులు చేపట్టిన సర్వేపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నల్లరేగడి భూములు కావడంతో ఇప్పటికే అధిక వర్షపాతం కారణంగా పంటలు పండించలేని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. భూముల పైభాగాన చెరువు, కుంట ఉందని, మళ్లీ కాల్వ నిర్మాణం చేపడితే భూములు జాలువారుతాయని వాపోయారు. ఇటీవల వడ్లూరు గ్రామస్తులు సైతం కాలువ నిర్మాణంపై అభ్యంతరం చెప్పారని, రైతుల విన్నపాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. మల్లారెడ్డి, బుచ్చిరెడ్డి, రాజిరెడ్డి, సంపత్ తదితరులున్నారు.

కంటి వెలుగు శిబిరం తనిఖీ

గన్నేరువరం(మానకొండూర్): గన్నేరువరంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో వినీత తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎంత మందికి పరీక్షలు చేశారని తెలుసుకున్నారు. 1,225 మందికి పరీక్షలు చేసి, 202 మందికి కళ్లద్దాలు అందజేశామని, 266 మందికి ఇవ్వాల్సి ఉందని డాక్టర్ సందీప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నగేశ్, అంజన్‌గౌడ్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న సంక్షేమ అధికారి సబిత

రామడుగు(చొప్పదండి): ప్రతి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి సబిత కోరారు. రామడుగు మండల కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం చిన్నపిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కలిగేటి కవిత, తహసీల్దార్ రాజుకుమార్, సీడీపీవో కస్తూరి, సర్పంచ్ పంజాల ప్రమీల, వైద్యులు రజిత, రమేశ్, ఏపీఎం ప్రభాకర్, సూపర్‌వైజర్ జయప్రద, పంచాయతీ కార్యదర్శి రేవంత్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా: 9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్: రాజశేఖర్ - 9618304759
చొప్పదండి: మొండయ్య - 7997958217
మానకొండూర్: మహేశ్ - 9573106760
హుజూరాబాద్: ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899

పెట్టుబడులతో రండి

పెట్టుబడులకు ఏపీ అత్యంత అనువైన రాష్ట్రం: సీఎం వైఎస్ జగన్ ● సులభతర వాణిజ్యంలో గత మూడేళ్లుగా నంబర్ వన్

- ఎలాంటి అసౌకర్యం కలిగినా ఒక్క ఫోన్‌కాల్ దూరంలో ఉంటాం
- ఢిల్లీలో పారిశ్రామికవేత్తలతో సన్నాహక సదస్సులో సీఎం భరోసా
- మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్


గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, నాస్కామ్ అధ్యక్షురాలు దేబ్జానీ ఘోష్, అసోచామ్ అధ్యక్షుడు సుమంత్ సిన్హా, భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు సుచిత్ర ఎల్లా, మంత్రి అమర్‌నాథ్

సాక్షి, న్యూఢిల్లీ: పరిశ్రమల స్థాపనకు అత్యంత అనువైన వాతావరణం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆహ్వానించారు. పరిశ్రమల ఏర్పాటులో అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. మంగళవారం ఢిల్లీలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సన్నాహక సదస్సులో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. వివిధ దేశాల దౌత్యాధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఉన్నతాధికారులతోపాటు మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్ సన్నాహక సదస్సుకు హాజరయ్యారు.

అత్యుత్తమ సౌకర్యాలు

'విశాఖపట్నంలో మార్చి 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. దీనికి అందరినీ ఆహ్వానిస్తున్నాం. పరిశ్రమల ఏర్పాటులో మీకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇస్తున్నాం. ఏ పారిశ్రామికవేత్తకైనా ఎలాంటి అసౌకర్యం కలిగినా కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉంటామని కూడా హామీ ఇస్తున్నాం' అని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రారంభోపన్యాసంతో పాటు సదస్సు చివరలో ఏపీలో పెట్టుబడులకు గల సానుకూలతలను సీఎం వివరించారు.

శరవేగంగా అనుమతులు..

పరిశ్రమలకు అనుమతుల విషయంలో రాష్ట్రంలో సింగిల్ డెస్క్ పోర్టల్ విధానం అమలులో ఉందని సీఎం జగన్ తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు 21 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నామని, శరవేగంగా అనుమతులివ్వడం ద్వారా పారిశ్రామికవేత్తల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత అనుకూలంగా ఉందన్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

11.43 శాతం జీఎస్‌డీపీతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా, అగ్రగామిగా నిలిచింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గత మూడేళ్లుగా ఏపీ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉంది. పరిశ్రమల స్థాపనకు మేం చేస్తున్న కృషితో పాటు పారిశ్రామికవేత్తలు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తోనే నంబర్‌వన్ స్థానంలో స్థిరంగా కొనసాగుతున్నాం. తద్వారా పరిశ్రమల స్థాపనకు, పారిశ్రామికవేత్తలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంత అనుకూలంగా ఉందో స్పష్టమవుతోంది.

> విశాఖపట్నం త్వరలో కార్యనిర్వాహక రాజధాని కాబోతుంది. రానున్న కొద్ది నెలల్లో నేను కూడా విశాఖకు షిఫ్ట్ అవుతున్నా. విశాఖలో నిర్వహించే సదస్సుకు హాజరు కావాలని మీ అందరినీ కోరుతున్నా. మీతో పాటు మీ సహచరులు, ఇతర కంపెనీల ప్రతినిధులను కూడా సదస్సుకు తోడ్కొని వచ్చి ఏపీలో పరిశ్రమల స్థాపన, వ్యాపారం ఎంత సులభతరమో తెలియచేయాలి.
>
> \- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

ఏప్రిల్ లోపే విశాఖ నుంచి పాలన

- అనేక ప్రభుత్వ భవనాలు అందుబాటులో ఉన్నాయి
- అవసరమనుకుంటే ప్రైవేట్ భవనాలు లీజ్‌కు తీసుకుంటాం
- న్యాయపరమైన చిక్కులు తొలగిన మరుక్షణమే విశాఖ నుంచి పరిపాలన
- నవీన్‌కు సీబీఐ నోటీసులు అవాస్తవం
- మీడియాతో టీటీడీ చైర్మన్, రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం: ఏప్రిల్ లోపే విశాఖ నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించనున్నారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. మూడు రాజధానులను అడ్డుకునేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని, న్యాయపరమైన చిక్కులు తొలగిన మరుక్షణమే విశాఖ నుంచి పరిపాలన కొనసాగుతుందని చెప్పారు. మంగళవారం సింహాచలంలోని గోశాలలో ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖను పరిపాలన రాజధాని చేయడం ద్వారా దశాబ్దాలుగా వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధి చెందుతుందన్నారు. రాజధాని ఏర్పాటుకు భవనాల సమస్య రాదన్నారు. విశాఖలో ఎక్కువగా ప్రభుత్వ కార్యాలయాలున్నాయని, అదేవిధంగా వీఎంఆర్‌డీఏ భవనాలు కూడా చాలా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అవసరమైతే ప్రైవేట్ భవనాలను కూడా లీజ్‌కి తీసుకుంటామన్నారు. ఐటీ కంపెనీలు లిమిటెడ్‌గానే ఉన్నాయి కాబట్టి ఆ బిల్డింగ్స్‌ను కూడా అవసరమైతే రాజధానికి ఉపయోగించుకుంటామన్నారు. ఎన్నికలకు వెళ్లేలోపు పరిపాలనా వికేంద్రీకరణ అనేది జరిగి తీరుతుందన్నారు. కాగా, ముఖ్యమంత్రి నివాసంలో కీలకంగా ఉండే నవీన్ అనే వ్యక్తితో పాటు పలువురికి సీబీఐ నోటీసులు ఇచ్చిందనేది పూర్తిగా అవాస్తవమని వైవీ సుబ్బారెడ్డి తేల్చి చెప్పారు. సీఎం జగన్ ఇంట్లో గత 12 ఏళ్లుగా నవీన్ అనే వ్యక్తి పనిచేస్తున్నారని తెలిపారు. సీఎం సతీమణి భారతమ్మతో మాట్లాడాలన్నా.. లేదా ఆమె ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవాలన్నా.. తానే కాకుండా తమ కుటుంబ సభ్యులందరూ నవీన్‌కే ఫోన్ చేస్తుంటామని వెల్లడించారు. దాన్ని ఈనాడు రామోజీరావు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ ఎందుకు భూతద్దంలో పెట్టి చూపిస్తున్నారో అర్థం కాలేదని మండిపడ్డారు.

సీబీఐ విచారణ చేయాలి..

అవినాశ్‌రెడ్డిని సీబీఐ విచారణ చేస్తున్న సమయంలో గదిలో అధికారులు మాత్రమే ఉంటారని, అలాంటప్పుడు లోపల జరిగిన సంభాషణ, విచారణ ఇదే అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు ఎలా రాశాయన్నారు. లోపల జరిగిన విచారణ విషయాలను ఈ పత్రికలకు ఎవరు చెప్పారని ప్రశ్నించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

జనవరిలో శ్రీవారి హుండీ ఆదాయం రూ.123 కోట్లు

తిరుమల: జనవరిలో తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.100 కోట్లు దాటింది. జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు తిరుమల శ్రీవారికి హుండీలో రూ.123 కోట్లను భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. జనవరి 2 తేదీన శ్రీవారికి రూ.7.68 కోట్ల హుండీ ఆదాయం లభించింది. టీటీడీ చరిత్రలోనే ఇది అత్యధిక ఆదాయాల్లో రెండోది. గత ఏడాది నుంచి తిరుమల శ్రీవారి ఆదాయం ప్రతి నెలా రూ.వంద కోట్లు దాటుతుండడం గమనార్హం.

కర్ణాటక సంగీత కళాకారిణి లలిత చంద్రన్ కన్నుమూత

ఆమె బొంబాయి సిస్టర్స్‌లో ఒకరు

తమిళ సినిమా: ప్రఖ్యాత కర్ణాటక సంగీత కళాకారుల ద్వయంలో ఒకరైన లలితా చంద్రన్ (70) మంగళవారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆమె సోదరి సి.సరోజిని. వీరు కేరళలోని తిరుచ్చూర్‌కు చెందినవారు. తల్లిదండ్రులు ముకుందమ్ భాయ్, చిదంబరం అయ్యర్. తండ్రి ఉద్యోగరీత్యా లలితా చంద్రన్, సరోజిని ముంబైలో పుట్టి పెరిగారు. కర్ణాటక క్లాసికల్ సంగీతంలో ప్రావీణ్యం సాధించడంతో వీరికి బొంబాయి సిస్టర్స్ అనే విశేష గుర్తింపు దక్కింది. తర్వాత వారు చెన్నైలోని అడయార్‌లో స్థిరపడ్డారు. దేశవ్యాప్తంగా కర్ణాటక సంగీత కార్యక్రమాలను నిర్వహించి పేరు గడించారు.

ఏపీలో విద్యారంగం అద్భుతం

- ప్రభుత్వ పాఠశాలల తీరుతెన్నులపై ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ ప్రశంసల జల్లు
- గుంటూరులోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల సందర్శన
- విద్యారంగ పురోగతికి వైఎస్ జగన్ మార్గదర్శకుడు అంటూ ప్రశంస


విద్యార్థినితో మాట్లాడుతున్న నిక్ వుజిసిక్

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులు ఆంగ్లంలో మాట్లాడుతున్న తీరు.. అందులో స్పష్టత, వారు అడుగుతున్న ప్రశ్నలకు అంతర్జాతీయ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ మంత్రముగ్ధులయ్యారు. 'ప్రపంచం మొత్తానికి నేను ప్రేరణగా నిలిచి ఉండవచ్చు.. కానీ, ఈ ప్రాంతం నాకు ఎంతో ప్రేరణనిచ్చింది' అంటూ ఆయన ఫిదా అయ్యారు. గుంటూరు నగరంలోని చౌత్రా సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను నిక్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థినులకు లక్ష్యసాధన, దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఆ తర్వాత సాయంత్రం బీఆర్ స్టేడియంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతో పాటు నగరంలోని వివిధ మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన వేలాది మంది టెన్త్ విద్యార్థులనుద్దేశించి చేసిన ప్రసంగంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులు, చేపడుతున్న కార్యక్రమాలపై మరోమారు ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. ఎంతో అంకితభావం ఉన్న ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఉండటం అభినందనీయమంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నానన్నారు. అలాగే, 'నేను ప్రపంచవ్యాప్తంగా 78 దేశాలలో పర్యటించా. కానీ ఏ దేశంలో లేని అనుభూతి, ప్రత్యేకతను నేను గుంటూరులో పొందాను. అది నా అదృష్టంగా భావిస్తున్నా. ప్రపంచంలో ఎంతోమంది నన్ను హీరో అని పిలిచి ఉండవచ్చు.. కానీ, అంతకంటే ఎక్కువ ఆనందాన్ని ఇక్కడ పొందాను. వెలకట్టలేని విద్యకు, విజ్ఞానానికి అధిక ప్రాధాన్యమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. ఎంతో మంచి పాలకుడు మీకు ఉన్నారు. అంకితభావం ఉన్న ప్రభుత్వం ఇక్కడ ఉంది. గుంటూరు ప్రాంతం విజ్ఞానం, విద్య పరంగా ఎంతో సామర్థ్యం ఉన్న ప్రాంతం. ప్రపంచవ్యాప్తంగా ఎందరినో కలిశాను. కానీ ఆంధ్రప్రదేశ్ సీఎంతో కలవబోవడం ఎంతో ప్రత్యేకానుభూతిగా ఉంది'.. అంటూ నిక్ తన అనుభూతిని పంచుకున్నారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఇవీ..

ఇది సామాన్యమైన విషయం కాదు..

ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఇంత గొప్పగా మాట్లాడుతారా? ప్రభుత్వ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులు తాను మాట్లాడిన ఫారిన్ ఇంగ్లిషు భాషాశైలిని అర్థంచేసుకుని, అంతేస్థాయిలో ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడిన తీరు అద్భుతం. ఏపీలో ప్రభుత్వ పాఠ శాలలు ఇంత గొప్పగా ఉంటాయని నేను ఊహించలేదు. కార్పొరేట్‌ను తలదన్నే రీతిలో ఒక ప్రభుత్వ పాఠశాల సకల హంగులతో ఉండటం ఎంతో ఆశ్చర్యంగా ఉంది. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థినులను ఇంత గొప్ప ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దడం సామాన్య విషయం కాదు.

నా జీవితగాథపై పాఠ్యాంశమా!? జగన్ దేశంలోనే బెస్ట్ సీఎం

రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన 10వ తరగతి ఇంగ్లిషు టెక్ట్స్‌బుక్‌లోని మొదటి పాఠ్యాంశంగా ఉన్న పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌లో 'ఆటిట్యూడ్ ఆల్టిట్యూడ్' పేరుతో నా జీవితగాథను ముద్రించడం ఆశ్చర్యకరం. పాఠ్యాంశంగా నాకు చోటు కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మీ పాఠ్య పుస్తకంలో రాసిన నా జీవితం గురించి చదివారా? (మీ గురించి చదివామని విద్యార్థులు చెప్పగా, ఆయన ఆంతులేని ఆనందానికి లోనయ్యారు.) ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడిన పలువురు విద్యార్థినులు.. నాడు–నేడు ద్వారా సీఎం జగన్ ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారని, ఆయన చలువతో అన్ని రకాల వసతులతో చదువుకుంటున్నామని చెప్పారు. ఇక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో విజన్ కలిగిన నాయకునిగా దేశంలోనే బెస్ట్ సీఎంగా నిలిచారని ఈ సందర్భంగా నిక్ వుజిసిక్ అన్నారు.

ఏసీబీకి చిక్కిన 'ఎంప్లాయ్‌మెంట్' అధికారులు

- రూ.2.25లక్షలు తీసుకుంటూ పట్టుబడిన వైనం
- రిమ్స్‌లో పేషెంట్ కేర్ సిబ్బంది నియామక ఉత్తర్వుల కోసం


ఏసీబీకి చిక్కిన జిల్లా ఉపాధి కల్పన అధికారులు, రిమ్స్ జూనియర్ అసిస్టెంట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా ఉపాధికల్పన శాఖ అధికారులతోపాటు రిమ్స్ జూనియర్ అసిస్టెంట్ ఏసీబీ వలలో చిక్కారు. రిమ్స్‌లో పేషెంట్‌కేర్ సిబ్బందిగా 24 మందిని నియమించాల్సి ఉండగా, దీనికి సంబంధించిన ఉత్తర్వులు జిల్లా ఉపాధికల్పన శాఖ అధికారి ఇవ్వాల్సి ఉంటుంది. దీనికోసం దుర్గం ఎస్సీ లేబర్ కాంట్రాక్ట్ కోఆపరేటీవ్ సొసైటీ డైరెక్టర్ దుర్గం శేఖర్ నుంచి జిల్లా ఉపాధికల్పన అధికారి కిరణ్ రూ.3లక్షలు డిమాండ్ చేశారు. కాగా ఆ సొసైటీ డైరెక్టర్ రూ.2.25లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ విషయమై దుర్గం శేఖర్ ఈ నెల 25న ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. మంగళవారం ఉపాధి కల్పన శాఖ కార్యాలయంలో సొసైటీ డైరెక్టర్ డబ్బులు ఇస్తున్న సమయంలో జిల్లా ఉపాధి కల్పన అధికారులను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రిమ్స్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తేజ సొసైటీ డైరెక్టర్ శేఖర్ నుంచి డబ్బులు తీసుకొని ఉపాధి కల్పన కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి విజయలక్ష్మికి అందజేశాడు. అయితే ముందుగానే డబ్బులపై కెమికల్స్ వేసిన ఏసీబీ అధికారులు డబ్బులను ఆ శాఖ అధికారులు తీసుకున్నట్లు నిర్ధారించారు. ఏ–1 జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి కిరణ్‌కుమార్, ఏ–2 రిమ్స్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ తేజ, ఏ–3గా జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి విజయలక్ష్మిలను కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ కె.భద్రయ్య తెలిపారు. దీనికి సంబంధించి వివరాలను వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అడెల్లి మహాపోచమ్మను దర్శించుకున్న హంపీ పీఠాధిపతి


ఆలయ ప్రాంగణంలో మాట్లాడుతున్న స్వామీజీ

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధ అడెల్లి మహాపోచమ్మ ఆలయాన్ని హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి మంగళవారం సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, పాలకమండలి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యారణ్య భారతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీర్వాదంతో ఈ ప్రాంతమంతా ప్రశాంతంగా ఉందని స్వామీజీ తెలిపారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణంపై ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మండల నాయకులు స్వామీజీతో మాట్లాడారు. ఆలయం పూర్తిగా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో అమ్మవారి విగ్రహం తొలగించి ఓపక్కనపెట్టి నిర్మాణం చేయాలని విద్యారణ్య భారతి సూచించారు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. విగ్రహాన్ని కదపకుండానే నిర్మాణం చేయాలని పట్టుపట్టారు. విద్యారణ్యస్వామి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆలయాన్ని పరిపూర్ణ అభివృద్ధి చేస్తున్న తరుణంలో అమ్మవారి విగ్రహం తీసివేస్తేనే బాగుంటుందని తెలిపారు. గ్రామస్తులు అంగీకరించలేదు. దీంతో స్వామీజీ తన పూజాకార్యక్రమాలు ముగించుకుని వెళ్లిపోయారు. సర్పంచ్ సుచరిత, కౌట్ల(బి) పీఏసీఎస్ అధ్యక్షుడు అయిర నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు రాజ్‌మహ్మద్, నాయకులు రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.



ఇదీ 'మన బడి'

సర్కారు బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మన ఊరు- మన బడి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో 37 పాఠశాలలను ఎంపిక చేయగా తొలివిడతగా 18 బడులు కార్పొరేట్ స్థాయి వసతులతో సిద్ధమయ్యాయి. విద్యార్థులు గతంలో నేలపై కూర్చుని చదువుకునేవారు. తాజాగా చేకూరిన వసతులతో అధునాతన టేబుళ్లు అందుబాటులోకి వచ్చేశాయి. తరగతి గది కార్పొరేట్ శోభను సంతరించుకుంది. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మారిన తీరిది.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



స్పౌజ్ బదిలీల లక్ష్యం నెరవేరేనా?

- 2,572 దరఖాస్తులకు కేవలం 615 అప్పీళ్లు పూర్తి
- ఇంకా పూర్తి కావాల్సిన దరఖాస్తులు 70శాతం పైనే
- బదిలీ అయ్యేవారిలో కొందరికి త్వరలో పదోన్నతి, ట్రాన్స్‌ఫర్
- ప్రభుత్వ ఉద్దేశాన్ని నీరుగార్చేలా టీచర్ల తీరు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వ టీచర్లుగా వేరువేరు చోట్ల పనిచేస్తోన్న దంపతులను ఒకే చోటకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం తలపెట్టిన స్పౌజ్ బదిలీల దరఖాస్తుల లక్ష్యం నెరవేరేలా కనిపించడం లేదు. ఓ వైపు దరఖాస్తుల పరిష్కారంలో ప్రభుత్వ జాప్యం, మరోవైపు ప్రభుత్వ టీచర్ల వ్యవహార శైలి వల్ల బదిలీల ప్రక్రియ లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరేలా లేదు. గతేడాది 317 జీవో అమలులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తోన్న ప్రభుత్వ టీచర్లలో భర్త ఒక జిల్లాకు, భార్య ఒక జిల్లాకు అలాట్ అయ్యారు. సీఎం అసెంబ్లీలో ఇచ్చిన హామీ మేరకు.. భార్యాభర్తలు ఇద్దరూ ఒకే చోట పనిచేయాలని.. ఈ రెండు మూడురోజులు సుమారుగా 615 స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లోగల ఉపాధ్యాయులకు భార్య లేదా భర్త దగ్గరికి అధికారులు బదిలీ చేసి పంపించారు. రాష్ట్రవ్యాప్తంగా వేరువేరుప్రాంతాల్లో పనిచేస్తోన్న దాదాపు 2,572 స్పౌజ్ దరఖాస్తులు ప్రభుత్వానికి వచ్చాయి. వాటిలో కేవలం 615 అప్పీళ్లు మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. మిగిలిన 1,800 పైచిలుకు అప్పీళ్లు.. 70 శాతం స్పౌజ్ కేసులు పరిష్కారానికి నోచుకోలేదు. వాటిని ఎంతసమయంలోగా పరిష్కరిస్తారన్న స్పష్టత లేదు. ప్రభుత్వం భార్యాభర్తలను ఒకచోటకు చేర్చాలన్న ఆలోచన బాగున్నా.. క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందుల వల్ల ఆ ఉద్దేశం నెరవేరడం లేదు.

ఈ కింది ఇబ్బందుల వల్ల..

- 1. స్పౌజ్‌లో 615 మందిని బదిలీ చేసినప్పటికీ.. వారి స్పౌజ్ (భర్త/భార్య) అదే స్థానంలో ఉంటారన్న గ్యారెంటీ లేకుండాపోయింది. త్వరలో జరగబోయే పదోన్నతుల్లో దంపతుల్లో ఒకరికి పదోన్నతి వస్తే.. జిల్లా కాదు.. ఏకంగా జోనే మారే అవకాశం ఉంది. అలాంటి వారికి ఈ సమయంలో స్పౌజ్ బదిలీ కింద పోస్టింగ్ ఇచ్చి ప్రయోజనం లేకుండా పోతుంది.
- 2. దంపతులిద్దరు ఉపాధ్యాయులు లాంగ్ స్టాండింగ్ (ఒకేజిల్లాలో) ప్రకారం.. బదిలీ అయ్యే సందర్భంలో వారిలో ఒకరికి 10 పాయింట్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇక్కడే అసలు కథ మొదలవుతుంది. 10 పాయింట్లు తీసుకున్న దంపతులు ఇద్దరూ ఒకే మండలం ఎంచుకోవడం లేదు. దంపతుల్లో ఒకరు.. జిల్లా కేంద్రానికి సమీపంలో.. మరొకరు జిల్లాకు దూరంగా బదిలీ అవుతున్నారు. అలా ఎందుకు అంటే.. జిల్లా కేంద్రాల్లో విద్య, వైద్య సదుపాయాలు చూపి తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటున్నారు. అలా బదిలీలో ఉన్న ఈ అవకాశాన్ని పథకం ప్రకారం.. వారికి అనుకులంగా మార్చుకుంటున్నారు. అందువల్ల బదిలీల్లో అసలు ఉద్దేశం నెరవేరడం లేదు.
- 3. భార్యాభర్తల్లో ఒకరు జీహెచ్‌ఎంలకు 5 ఏళ్లు మిగితా ఉపాధ్యాయులకు 8 సంవత్సరాల లాంగ్‌స్టాండింగ్ దాటితే.. వారంతా స్పౌజ్ కేటగిరికి సంబంధించి పాయింట్లు వినియోగించుకునేందుకు అవకాశం పొందుతారు. వీటిని వాడుకుని భర్త దగ్గరికి భార్య లేదా భార్య దగ్గరికి భర్త వెళ్లేందుకు అవకాశం ఇచ్చారు. అయితే, ఈ అవకాశాన్ని ప్రభుత్వ టీచర్లు దుర్వినియోగపరిచి, వాళ్ల ఇష్టారాజ్యంగా ఆప్షన్లు పెట్టుకుని బదిలీ అవుతున్నారు. భార్యభర్తల ఇరువురిని జియోట్యాగ్ చేసి ఒకే దగ్గరికి వెళ్లే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. గతంలో ఇలాంటి బదిలీల్లో తప్పిదాలు జరిగినా.. ప్రస్తుతం టెక్నాలజీ యుగంలో జియో ట్యాగ్ భార్యాభర్తలకు ఇరువురికీ జియోట్యాగ్ చేసి ఇద్దరూ ఒకే మండలం/ ఒకే ప్రాంతంలో పనిచేసేలాప్రభుత్వం చర్యలు చేపట్టాలి.
- 4. రివర్స్ స్పౌజ్: స్పౌజ్ బదిలీల్లో భార్యాభర్తలు ఇద్దరిలో భర్త పనిచేసే జిల్లాకి లేదా భర్త పనిచేసే జిల్లాకు భార్యని పంపిస్తే సరిపోతుంది. కానీ, వారు మాత్రం తాము కోరుకున్నట్లుగా ఫోకల్ (పాత జిల్లా కేంద్రం)జిల్లాకు పంపివ్వమని అప్పీల్ చేసుకుంటున్నారు. దంపతులిద్దరూ కొత్త లేదా పాత జిల్లాకేంద్రాల్లో పనిచేస్తున్నపుడు అందులో ఒకరిని మరొకరి వద్దకు బదిలీ చేయవచ్చు. కానీ, స్పౌజ్ టీచర్లంతా ఫోకల్ జిల్లానే కావాలని పట్టుబడుతుండటంతో ఫోకల్ జిల్లాలో ఖాళీ పోస్టులు త్వరగా నిండి.. ఇతరులకు పదోన్నతులకు అవకాశం లేకుండా పోతోంది.
- 5. పై సమస్యలన్నింటినీ పరిగణలోకి తీసుకుని అవతవకల నివారణకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించాలి. లేదా ప్రత్యక్ష కౌన్సెలింగ్ నిర్వహించి ఒకే చోట పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో త్వరలో పదోన్నతులు వచ్చే స్పౌజ్ గుర్తించి, వారికి పదోన్నతి తరువాత సర్దుబాటు చేసుకోవాలి.

14 జిల్లాల్లో పెండింగ్..!

స్పౌజ్ బదిలీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ బదిలీ ప్రక్రియ పూర్తి అయింది. కానీ, కింద 14 జిల్లాల్లో స్పౌజ్ కేసులకు సంబంధించిన బదిలీలు నిలిచిపోయాయి. ఆయా జిల్లాల్లో మొత్తం 2572 దరఖాస్తులు రాగా.. అందులో 615 అప్పీళ్ల పరిష్కారమయ్యాయి.

జిల్లా	దరఖాస్తులు
ఆదిలాబాద్	82
హనుమకొండ	354
హైదరాబాద్	06
కరీంనగర్	329
ఖమ్మం	164
మహబూబ్‌నగర్	298
మంచిర్యాల	97
మేడ్చల్–మల్కాజిగిరి	169
నిజామాబాద్	164
రంగారెడ్డి	332
సంగారెడ్డి	77
సిద్దిపేట	240
సూర్యాపేట	57
వరంగల్	203
మొత్తం	2,572

రాష్ట్రస్థాయి యువజన పార్లమెంట్‌కు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘీక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి యువజన పార్లమెంట్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి.శ్రీహరి తెలిపారు. దుర్గం దీప్తి, వల్లపు సుమశ్రీ, వేముల తేజస్విని, బెజ్జారపు రోహిణి ఆన్‌లైన్‌లో జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనపరిచి ఎంపికయ్యారు. ఈనెల 4న జరిగే రాష్ట్ర స్థాయి యువజన పార్లమెంట్ ఉపన్యాస పోటీల్లో పాల్గొంటారు. ఈసందర్భంగా విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ సమత, స్టాఫ్ సెక్రెటరీ రోజారమణి, ఎన్ఎస్ఎస్ పీవో లావణ్య తదితరులు అభినందించారు.

క్లుప్తంగా...

బానిస మంత్రులు ఏం చెబుతారు?: రేవంత్



సాక్షి, హైదరాబాద్: ఊరి బాగు కోసం అప్పు చేసి మరీ అభివృద్ధి చేసిన పాపానికి నిజామాబాద్ జిల్లా నందిపేట సర్పంచ్ దంపతులు కలెక్టరేట్ ముందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 'హైదరాబాద్ ఏసీ రూమ్‌లలో కూర్చుని సర్పంచ్‌లకు ఒక్క రూపాయి బాకీ లేదని సిగ్గు లేకుండా ప్రకటించే బానిస మంత్రులు దీనికి ఏం సమాధానం చెప్తారు?' అని ఆ ట్వీట్‌లో రేవంత్ ప్రశ్నించారు.

ఏమీ ఇవ్వని మోదీ దేవుడా?



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో బీజేపీ అధికారం మూణ్నాళ్ల ముచ్చటేనని, దేశానికి కాబోయే ప్రధాని కేసీఆర్ మాత్రమేనని పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి అన్నారు. దేశానికి ఏమీ ఇవ్వని ప్రధాని మోదీని బీజేపీ నేతలు దేవుడు అంటున్నారని, ప్రజలకు అన్నీ ఇస్తున్న కేసీఆరే నిజమైన దేవుడని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, యెగ్గే మల్లేశంతో కలిసి జీవన్‌రెడ్డి మంగళవారం బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆదానీ మరో హర్షద్ మెహతాలా తయారయ్యారని, మోదీ ప్రోద్బలంతోనే అదానీ దేశ సంపదను ఆవిరి చేస్తున్నారని జీవన్‌రెడ్డి మండిపడ్డారు. పసుపు బోర్డు తెస్తానంటూ బాండ్ పేపర్ రాసిచ్చి మోసగించిన అరివింద్‌పై ప్రజలు తిరగబడతారని ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం హెచ్చరించారు.

హరీశ్‌కు దమ్ముంటే హామీల అమలుపై చర్చకు రావాలి

ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి



సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావుకు దమ్ముంటే ఎన్నికల హామీల అమలుపై తమతో చర్చకు రావాలని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హరీశ్ ఓ ఫెయిల్యూర్ మంత్రి అని విమర్శించారు. కొత్తపేట పండ్ల మార్కెట్ సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం నిమ్స్ ఆస్పత్రిని నిర్మిస్తానని చెప్పిన స్థలాన్ని పరిశీలించిన అనంతరం మంగళవారం గాంధీభవన్‌లో ఏలేటి మీడియాతో మాట్లాడారు. 'వైద్యరంగంలో ప్రభుత్వ వైఫల్యాలపై కాంగ్రెస్ పార్టీ చార్జిషీట్ విడుదల చేసిన తర్వాత హైదరాబాద్ చుట్టూ 3 మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మాణంలో ఉన్నాయని హరీశ్‌రావు ప్రకటించారు. ఆ నిర్మాణం ఎంత వరకు వచ్చిందో తెలుసుకునేందుకు కొత్తపేట వెళ్లామని, అక్కడ పండ్ల మార్కెట్‌ను పూర్తిగా తొలగించారే తప్ప ఆస్పత్రికి సంబంధించిన ఎలాంటి నిర్మాణం ప్రారంభం కాలేదు' అని మహేశ్వర్‌రెడ్డి చెప్పారు.

ఇంటింటికీ టీడీపీని విజయవంతం చేయాలి

టీటీడీపీ అధ్యక్షుడు కాసాని పిలుపు



సాక్షి, హైదరాబాద్: త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్న 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమాన్ని గ్రామంలోని ప్రతి వార్డుకు తీసుకెళ్లి విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్టీఆర్ భవన్ నుంచి ఆయన వివిధ జిల్లాల్లోని టీడీపీ శ్రేణులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి టీడీపీ కరపత్రాలను పంపిణీ చేయాలని, సభ్యత్వ నమోదు కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. గ్రామ, వార్డు, మండల, డివిజన్ స్థాయిల్లో అన్ని కమిటీలను పూర్తి చేయాలని కాసాని ఆదేశించారు.

కాసానికి మాతృవియోగం



సాక్షి, హైదరాబాద్: టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ తల్లి కౌసల్య (93) మంగళవారం మృతి చెందారు. వృద్ధాప్య ఆరోగ్య సమస్యలతో ఆమె నెల రోజులుగా చికిత్స పొందుతున్నారు. కౌసల్య బాచుపల్లి సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మాతృమూర్తిని కోల్పోయిన కాసానికి మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు బాచుపల్లిలో కౌసల్య అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఆప్‌కు ఇందిర రాజీనామా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కోర్ కమిటీ సభ్యురాలు ఇందిరా శోభన్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పదవులకు మంగళవారం రాజీనామా చేశారు. త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని, ప్రజా జీవితంలోనే ఉంటానని ఒక ప్రకటనలో ఆమె తెలిపారు.

యాచించిన చేతులు.. సాయానికొచ్చాయి!

రోగుల సహాయకులుగా ట్రాన్స్‌జెండర్లు

వారిది అర్ధనారీశ్వర జననం
సొంత ఊరులేని... సొంత ఇల్లు లేని
చివరకు అద్దె ఇల్లు కూడా
దొరకని దైన్యం

వారిది మాతృత్వం లేని స్త్రీత్వం
మోడువారిన జీవితం
అయినా మానవత్వం
మూర్తీభవించిన వ్యక్తిత్వం

ఆడామగా కాకపోతేనేం మనసున్న మనుషులు వాళ్లు. వెలివేసిన సమాజంలోనే సేవాగుణం చాటుతూ మానవతా పరిమళాలు వెదజల్లుతున్నారు. నిన్నటి వరకు యాచించిన ఆ చేతులు ఇప్పుడు సాయం చేసేందుకు ముందుకొస్తున్నాయి. సమాజ సేవలో మేముసైతం అంటూ శభాష్ అనిపించుకుంటున్న ట్రాన్స్‌జెండర్లపై ప్రత్యేక కథనమిదీ..



ఇన్నర్‌వీల్ ప్రతినిధులతో శిక్షణపూర్తి చేసుకున్న ట్రాన్స్‌జెండర్లు

- తొలివిడత 15 మందికి శిక్షణ
- పలు ఆసుపత్రుల్లో ప్రారంభమైన సేవలు
- సమాజంలో వివక్ష దూరం చేయడమే లక్ష్యం
- ఫలిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ కృషి

సికింద్రాబాద్: వైద్యరంగ సేవల్లో మేము సైతం అంటూ ముందడుగు వేస్తున్నారు అర్ధనారీశ్వరులు. ప్రస్తుతం అనేక రంగాల్లో ప్రతిభ చాటుతున్న హిజ్రాలను వైద్య సహాయకులుగా తీర్చిదిద్దే పనిని సికింద్రాబాద్ ఇన్నర్ వీల్ క్లబ్ చేపట్టింది. మంచాన పడిన రోగుల బాగోగులు చూసుకునేలా వీరికి ఉచితంగా శిక్షణ ఇస్తోంది. తొలి విడత ప్రయోగాత్మకంగా 15 మంది ట్రాన్స్‌జెండర్లకు శిక్షణ ఇచ్చి ఆసుపత్రుల్లో రోగుల సహాయకులుగా నియమించింది. కొంతమందికి వారి వారి ఆసక్తి మేరకు ఇతర రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు చూపిస్తోంది.

బ్యాచ్‌కు 15 మంది చొప్పున..

- పంజగుట్ట ప్రాంతంలోని ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థ భవనంలో శిక్షణ ఇచ్చారు. బీపీ చెక్ చేయడం, ధర్మామీటర్‌లో టెంపరేచర్ చూడటం, గ్లూకోజ్ టెస్టులు చేయడంలో శిక్షణ ఇచ్చారు. అలాగే, రోగులకు చంటిపాపల్లా స్నానపానాదులు చేయించడం లోనూ తర్ఫీదు ఇచ్చారు.
- గత ఏడాది ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు మాత్రమే శిక్షణ ఇచ్చిన ఇన్నర్‌వీల్ క్లబ్ తాజాగా 15 మందితో కూడిన బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చింది. ఉస్మానియా ఆసుపత్రితోపాటు నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో ట్రాన్స్‌జెండర్లు రోగుల సహాయకులుగా విధుల్లో చేరారు.
- వైద్యసేవకులుగా మరింత మంది హిజ్రాలకు శిక్షణ ఇచ్చేందుకు ఇన్నర్‌వీల్ క్లబ్ రెండో జట్టును సిద్ధం చేసింది. 15 మందితో కూడిన ఈ బృందానికి వారం రోజుల్లో శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి.
- మూడు నెలలకోమారు 15 మంది చొప్పున హిజ్రాలను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. వారిని క్రమేణా వైద్య సేవకులుగా మార్చేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

గర్వంగా ఉంది: స్మిత, ట్రాన్స్‌జెండర్

సమాజంలో ట్రాన్స్‌జెండర్లు అంటేనే చిన్నచూపు. ఉపాధి కోసం సమాజం చీదరించుకునే వృత్తుల్లో చేరక తప్పని పరిస్థితులు ఉండేవి. విద్యావంతులైన హిజ్రాలు పెద్ద ఉద్యోగాల్లో చేరుతున్నారు. పాఠశాల విద్యకే పరిమితమైన హిజ్రాలు రోగుల అటెండర్లుగా చేరడం గర్వంగా ఉంది.

గౌరవం చేకూర్చాలన్నదే లక్ష్యం



సమాజానికి దూరంగా బతకడంతోపాటు, సమానత్వాన్ని పొందలేకపోతున్న ట్రాన్స్‌జెండర్స్‌కు గౌరవం చేకూర్చేందుకే వైద్యసేవల్లో శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి అంకురార్పణ చేశాం. యాచకత్వం, సెక్స్ వృత్తులకు వారిని దూరం చేసి సేవాతత్పరతతో కూడిన వృత్తిని అందించాలన్న ఆశయంతో చేపట్టిన ప్రయోగం సత్ఫలితాలను ఇస్తోంది. క్రమేణా ఎక్కువ సంఖ్యలో ట్రాన్స్‌జెండర్లను ఈ వైద్య సేవల్లోకి తేవాలన్నదే మా లక్ష్యం.

– జయంతీకన్నన్, ఇన్నర్‌వీల్స్ క్లబ్ అధ్యక్షురాలు

నష్టం వాటిల్లదు: రోజీ, ట్రాన్స్‌జెండర్

రోగుల సేవకులే కాకుండా వివిధ వృత్తుల్లో చేరి ఉపాధి మార్గాలు ఎంచుకునేందుకు ఎక్కువ మంది ట్రాన్స్‌జెండర్లు ముందుకు వస్తున్నారు. కానీ వారి సేవలను వినియోగించుకునే సమాజం కావాలి. ట్రాన్స్‌జెండర్ల సేవలు వినియోగించుకోవడం ద్వారా ఎటువంటి నష్టం వాటిల్లదన్న విషయంపై సమాజంలో అవగాహన కలిగించాలి.

త్వరలో రుణమాఫీ



సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకుంటారు: మంత్రి నిరంజన్‌రెడ్డి

తాండూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఎక్కడా రాజీపడబోదని, రైతుల రుణమాఫీ విషయమై త్వరలోనే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు త్వరలో నిర్ణయం తీసుకుంటారని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. వికారాబాద్ జిల్లా తాండూరులో కంది పప్పుకు అంతర్జాతీయ స్థాయిలో భౌగోళిక గుర్తింపునకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని మంగళవారం శాస్త్రవేత్తలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..తాండూరు కంది పప్పును ప్రపంచ వాణిజ్య మార్కెట్‌లో జీఐ ట్యాగింగ్‌తో అమ్ముకునే అవకాశం లభించడం అభినందనీయమన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ఆరు అంశాలు భౌగోళిక గుర్తింపునకు ఎంపికయ్యాయన్నారు. తాండూరు కందిని పాఠ్యపుస్తకాల్లో చేర్చేలా చర్యలు తీసుకొంటామని, కంది బోర్డును ఏర్పాటు చేసే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాల వాటాను కేటాయించడంలో కేంద్రం విఫలం చెందిందని విమర్శించారు. రంగారెడ్డి- పాలమూరు ఎత్తిపోతల పను లు శరవేగంగా జరుగుతున్నాయన్నారు.

గవర్నర్ ప్రసంగంలోనైనా వాస్తవాలు చెప్పాలి: ప్రభాకర్

సాక్షి, హైదరాబాద్: ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ చేసే ప్రసంగంలోనైనా రాష్ట్ర ప్రభుత్వం వాస్తవాలను ప్రతిబింబించేలా చూడాలని బీజేపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదన్న వాస్తవాలను ప్రభుత్వం ఒప్పుకోవాలన్నారు. ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించినట్లు గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించాలన్నారు. ఆర్థిక పరిస్థితి గాడి తప్పింది, వేతనాలు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందని ప్రభుత్వం ఒప్పుకోవాలని డిమాండ్‌చేశారు.





బహిరంగసభలో మాట్లాడుతున్న పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ . చిత్రంలో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

మసీదులు, సమాధులు కాదు.. అభివృద్ధికి పునాదులు తవ్వుదాం

బండి సంజయ్‌కు మంత్రి కేటీఆర్ హితవు

- దేశం అప్పులు ఆకాశంలో.. రూపాయి విలువ పాతాళంలో..
- దేశప్రజలందరినీ మోసం చేసిన ప్రధాని మోదీ
- ధరాఘాతంతో జనం బెంబేలు.. చేనేతపై జీఎస్టీ వేసిన దుర్మార్గుడు
- ప్రజల కోసం అవసరమైతే దేవుడితోనైనా కొట్లాడుతామని వ్యాఖ్య

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ''అమలుకాని వాగ్దానాలతో గద్దెనెక్కిన మోదీ పాలనలో ధరాఘాతంతో దేశ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ద్రవ్యోల్బణం పెరిగింది. అప్పులు ఆకాశాన్ని తాకుతుంటే.. రూపాయి పాతాళంలోకి జారిపోయింది. మతం పేరిట చిచ్చురేపడం మినహా బీజేపీ చేసేదేం లేదు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మసీదులు, సమాధులు తవ్వుదామంటూ రెచ్చగొడతారు. తవ్వాల్సింది మసీదులు, సమాధులు కాదు.. హుజూరాబాద్‌లో కాలువలు, డబుల్ బెడ్రూం ఇళ్లకు పునాదులు తవ్వుదాం రా..'' మంత్రి కె.తారకరామారావు సవాల్ విసిరారు. మంగళవారం మధ్యాహ్నం కరీంనగర్ జిల్లాలో 'కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌజ్, ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రారంభించిన కేటీఆర్.. సాయంత్రం జమ్మికుంట డిగ్రీ కాలేజీ మైదానంలో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. తమ పార్టీ పేరు మాత్రమే మారిందని.. డీఎన్‌ఏ, జెండా, ఎజెండా మారలేదని.. ప్రజల కోసం అవసరమైతే దేవుడితోనైనా కొట్లాడుతామని పేర్కొన్నారు.

సమాధులు కాదు.. పునాదులు తవ్వుదాం!

ప్రధాని మోదీ ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయారని.. దేశ ప్రజలందరి ఖాతాలో రూ.15 లక్షలు, రైతుల ఆదాయం రెట్టింపు, ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు, సొంతిళ్లు అంటూ పలికినవన్నీ ప్రగల్భాలేనని మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఎంపీ బండి సంజయ్ మోదీని దేవుడనడంపై విస్మయం వ్యక్తం చేశారు. ''రూ.400 ఉన్న సిలిండర్‌ను రూ.1,200 చేసినందుకా..? నిత్యావసరాల ధరలు పెంచినందుకా? రూ.70 ఉన్న పెట్రోల్‌ను రూ.110 చేసినందుకా? పెట్రో ఉత్పత్తుల ధరల పెంపుతో జనాల నుంచి రూ.30 లక్షల కోట్లు వసూలు చేసినందుకా? దేనికి మోదీ దేవుడు అయ్యాడు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 14 మంది ప్రధానులు రూ.56 లక్షల కోట్లు అప్పు చేస్తే.. కేవలం 8 ఏళ్లలో మోదీ ఒక్కడే 100 లక్షల కోట్లు అప్పు చేసినందుకా? చేనేతలపై 5 శాతం జీఎస్టీ విధించినందుకా? గిరిజన రిజర్వేషన్లు కల్పించనందుకా? 30 ఏళ్లలో ఎన్నడూ చూడని నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వచ్చినందుకు మోదీ దేవుడు అయ్యాడా?'' అని ప్రశ్నించారు.

ఎవరి పాలనతో అరిష్టం?

'రైతుబంధుతో 66 లక్షల మంది రైతులకు రూ.65 వేల కోట్లు ఇచ్చిన కేసీఆర్ పాలన అరిష్టమా? లేక 700 మంది రైతుల ప్రాణాలు పోయేందుకు కారణమైన మోదీ పాలన అరిష్టమా? అని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. ''ప్రజలు ఆగం కావొద్దు. మళ్లీ పొరపాటు చేయవద్దు. సానుభూతి మాటలకు మోసపోవద్దు. హుజూరాబాద్‌లో గెలిచిన వ్యక్తి ఇక్కడ లేకుండా పోయారు. కానీ గెల్లు శ్రీనివాస్ యాదవ్, పాడి కౌశిక్‌రెడ్డి ప్రజల్లోనే ఉంటున్నారన్న సంగతి గుర్తించాలి. వారి వినతి మేరకు రూ.100 కోట్లను మహిళా సంఘాలకు, రూ.10 కోట్ల చొప్పున జమ్మికుంట, హుజూరాబాద్ క్రీడామైదానాలను మినీస్టేడియాలుగా మార్చేందుకు నిధులు ఇస్తున్నాం. త్వరలోనే డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తాం'' అని చెప్పారు. ఈసారి పాడి కౌశిక్‌రెడ్డికి తప్పకుండా ప్రజల ఆశీర్వాదం ఉంటుందని వ్యాఖ్యానించారు. పరోక్షంగా ఆయనను ఎమ్మెల్యేగా అభ్యర్థిగా ప్రకటించడంతో అనుచరులు, నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సభలో మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

ఈటలకు రాజకీయ భిక్ష పెట్టింది కేసీఆరే..

హుజూరాబాద్ ఉప ఎన్నికలో ఇది చేస్తాం అది చేస్తామంటూ ఈటల రాజేందర్ ప్రగల్భాలు పలికారని, గెలిచాక ఒక్క పైసా పని చేశాడా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పాలన రాష్ట్రానికి అరిష్టమని అంటున్న ఈటల తీరు తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినట్టేనని మండిపడ్డారు. 33 మంది సీనియర్లను కాదని 2004లో ఈటలకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి రాజకీయ భిక్ష పెట్టింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు.

అసెంబ్లీ సమావేశాలకు గవర్నర్ సమ్మతి

- గత నెల 21 నాటి నోటిఫికేషన్ స్థానంలో మరో నోటిఫికేషన్
- 3న మధ్యాహ్నం 12.10 నిమిషాలకు సమావేశాలు ప్రారంభం
- ప్రస్తుత సమావేశాల్లో మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నిక?



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ, శాసన మండలి సమావేశాలు ఈ నెల 3న మధ్యాహ్నం 12.10 గంటలకు ప్రారంభమవుతాయి. ఉభయ సభల సమావేశాలకు సంబంధించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పక్షాన అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నర్సింహాచార్యులు సోమవారం రాత్రి నోటిఫికేషన్ విడుదల చేశారు. 3న ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. మరుసటి రోజు 4న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. 6న ఉభయసభల్లో రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెడుతుంది. ఈ నెల 14వరకు సమావేశాలు జరిగే అవకాశముండగా, 3న జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పూర్తి స్పష్టత రానుంది. ఫిబ్రవరి 3 నుంచే అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని గత నెల 21న అసెంబ్లీ కార్యదర్శి నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం లేకపోవడంపై వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో హైకోర్టు సాక్షిగా సోమవారం రాజీ కుదిరిన విషయం తెలిసిందే. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 176 (1) ప్రకారం ఏటా తొలిసారిగా జరిగే అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగించాలనే నిబంధన ఉండటంతో గత నెల 21న జారీ చేసిన నోటిఫికేషన్ స్థానంలో మరో నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే గత సెప్టెంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాలను ప్రొరోగ్ చేసిన తర్వాతే తాజా నోటిఫికేషన్ జారీ చేశారా అనే అంశంపై స్పష్టత లోపించింది.

మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నిక?

ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నిక నోటిఫికేషన్ కూడా వెలువడే అవకాశమున్నట్లు తెలిసింది. ప్రస్తుతం శాసన మండలిలో డిప్యూటీ చైర్మన్‌తోపాటు ప్రభుత్వ చీఫ్ విప్, మరో రెండు విప్ పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి సంబంధించిన ప్రక్రియ ప్రస్తుత సమావేశాల్లో పూర్తవుతుందని భావిస్తున్నారు. మరోవైపు గత రెండు సమావేశాల్లో బీజేపీ శాసనసభ్యులను సభ నుంచి సస్పెండ్ చేయగా, ప్రస్తుత సమావేశాల్లో వారికి అవకాశం దక్కుతుందా లేదా అనే కోణంలో చర్చ జరుగుతోంది. కాగా మునుగోడు ఉప ఎన్నికలో గెలుపొందిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో సభలోకి అడుగుపెట్టనున్నారు.

గవర్నర్ ప్రసంగంపై ఉత్కంఠ

ఉభయసభలనుద్దేశించి గవర్నర్ తమిళిసై ప్రసంగించనుండటంతో ఆమె ప్రసంగ పాఠంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గవర్నర్ ప్రసంగంలో ఉండాల్సిన అంశాలపై కసరత్తు చేస్తున్న ప్రభుత్వం తొమ్మిదేళ్లలో వివిధ రంగాల్లో సాధించిన విజయాలకు అద్దం పట్టేలా రూపొందిస్తున్నట్లు తెలిసింది.

గవర్నర్ ప్రసంగం సాఫీగా సాగుతుందని ఆశిస్తున్నా..

- ప్రభుత్వం, రాజ్‌భవన్, అసెంబ్లీ కలిసి పనిచేస్తేనే అభివృద్ధి
- చనిపోయిన టీడీపీని బతికించడం ఎవరితరం కాదు
- పవన్‌కల్యాణ్ ప్రభావం ఎంతమాత్రం ఉండబోదు: గుత్తా

సాక్షి, హైదరాబాద్: తమిళనాడు అసెంబ్లీలో అక్కడి గవర్నర్ ప్రసంగం తరహాలో బడ్జెట్ సమావేశాల ప్రారంభంలో తెలంగాణ గవర్నర్ ప్రసంగం ఉండదని భావిస్తున్నట్లు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. కేంద్రం చెప్పినట్లు రాష్ట్రాల గవర్నర్లు వ్యవహరిస్తున్నారని, గవర్నర్ ప్రసంగం సాఫీగా జరగాలని ఆశిస్తున్నానన్నారు. శాసనమండలి ఆవరణలో మంగళవారం గుత్తా సుఖేందర్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం, గవర్నర్ నడుమ వివాదం సర్దుకుంటుందని తానే ముందే చెప్పానని, గవర్నర్‌తో విభేదాలు రావడం, పోవడం సహజమని వ్యాఖ్యానించారు. గవర్నర్, ప్రభుత్వం, అసెంబ్లీ పరస్పర సంబంధం కలిగి ఉంటాయని, ఇందులో ఏ ఒక్కరిదో విజయం అంటూ ఉండదని పేర్కొన్నారు. అన్ని వ్యవస్థలు కలిసి పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విపక్ష సభ్యులకు సభలో మాట్లాడేందుకు తగిన సమయం ఇస్తామని, సభ్యుల సంఖ్య తక్కువగా ఉండటంతో వారికి కేటాయించే సమయం తక్కువగా ఉంటోందని చెప్పారు. ఫిబ్రవరి 3న ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాలు 14వ తేదీ వరకు కొనసాగే అవకాశముందన్నారు.



బీఆర్‌ఎస్‌కు జాతీయ స్థాయిలో ఆదరణ

బీఆర్‌ఎస్‌కు జాతీయస్థాయిలో ఆదరణ ఉంటుందని, కొన్ని రాష్ట్రాల్లోని రాజకీయ శూన్యత బీఆర్‌ఎస్‌కు కలిసి వస్తుందని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. రాజకీయ నాయకులు ఎన్నడూ తెరమరుగు కారని, వారి పని అయిపోయిందని భావించకూడదని, సమయం వచ్చినపుడు సత్తా చూపుతారన్నారు. ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన ఒడిశా మాజీ సీఎం గిరిధర్ గమాంగ్ చాలా సీనియర్ నేత అనే విషయాన్ని గుర్తు చేస్తూ నీలం సంజీవరెడ్డి చాలా ఏళ్ల పాటు క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండి తర్వాతి కాలంలో ఎంపీగా, లోక్‌సభ స్పీకర్‌గా, రాష్ట్రపతిగా పదవులు చేపట్టారన్నారు. చనిపోయిన టీడీపీకి తెలంగాణలో జీవ గంజి పోసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నా అది సాధ్యం కాదన్నారు. పవన్ కల్యాణ్ వంటి వారి ప్రభావం ఎంతమాత్రం ఉండబోదని చెప్పారు.

జగదీశ్‌రెడ్డితో విభేదాల్లేవు

ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాల్లో మంత్రి జగదీశ్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని, పంచాయతీలు, వ్యవహారాల్లో తలదూర్చను అని గుత్తా సుఖేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్ మంచి ఫలితాలు సాధిస్తుందని, వామపక్షాలతో పొత్తు కలిసి వస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని తన కుమారుడు అనుకుంటున్నా, తుది నిర్ణయం పార్టీదే అని చెప్పారు.

డ్రోన్ అంటే కెమెరా ఒక్కటే కాదు!

- భద్రత కోసం వాడొచ్చు.. పొలాల్లో పురుగు మందులూ చల్లొచ్చు
- కమలాపూర్ గురుకుల విద్యార్థులతో మంత్రి కేటీఆర్ ముచ్చట్లు
- ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని సూచన
- నాన్‌వెజ్ బందు చేశానని.. పప్పు, చారు, పెరుగుతో ముగిస్తున్నానని వెల్లడి

సాక్షిప్రతినిధి, వరంగల్: ''పిల్లలూ డ్రోన్ ఎలా పనిచేస్తుందో మీకు తెలుసా? డ్రోన్ అంటే కెమెరా ఒక్కటే కాదు.. దానితో పొలాల్లో పురుగుమందు స్ప్రే చేయవచ్చు.. అమ్మాయిల భద్రత విషయంలో చర్యలు తీసుకోవచ్చు. గుట్టలు, చెరువులు, కుంటల సరిహద్దులను నిర్ధారించవచ్చు. సరిహద్దుల్లో ఎవరు చొరబడకుండా చూడవచ్చు. భవిష్యత్‌లో మనుషులను తీసుకెళ్లే వాహనం కూడా అవుతుంది'' అంటూ గురుకుల విద్యార్థులతో మంత్రి కేటీఆర్ చిట్‌చాట్ చేశారు. మంగళవారం హుజూరాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్, గూడూరు శివారులో మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ బాలుర, బాలికల గురుకుల పాఠశాల భవనాలను కేటీఆర్ ప్రారంభించారు. తర్వాత విద్యార్థులతో కలిసి ముచ్చటిస్తూ భోజనం చేశారు. ఈ సందర్భంగా కవరేజ్‌లో భాగంగా ఆ వైపు వచ్చిన డ్రోన్‌ను చూసిన కేటీఆర్ దానివల్ల ఏమేం చేయొచ్చో విద్యార్థులకు వివరించారు. చదువుకుని ఏమవుతారని, ఉద్యోగం చేస్తారా? అని ప్రశ్నించారు. ఉద్యోగం చేయడమే కాకుండా పది మందికి ఉద్యోగం కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. ఇక్కడ పదో తరగతి, ఇంటర్మీడియెట్ చదివే పిల్లలను హైదరాబాద్‌లోని టీ-హబ్‌కు తీసుకువెళ్లి చూపించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. తాను నాన్‌వెజ్ బంద్ చేశానని.. అందుకే పప్పు, చారు, పెరుగుతో ముగిస్తున్నానని విద్యార్థులకు చెప్పారు.

భారీగా అభివృద్ధి పనుల ప్రారంభం

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు, కమలాపూర్ గ్రామాల్లో రూ.49 కోట్ల అంచనాలతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. అంతకుముందు మంత్రులు గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద శిలాఫలకాలను ఆవిష్కరించారు. తర్వాత కుల సంఘాల భవన సముదాయాన్ని ప్రారంభించారు. కాగా.. మంత్రి కేటీఆర్ పర్యటన సమయంలో ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు కాన్వాయ్‌లోకి చొరబడి నల్లచొక్కాలతో నిరసన తెలిపారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి కేటీఆర్



టాప్ ర్యాంక్‌కు చేరువలో దీప్తి శర్మ

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల టి20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ మూడో ర్యాంక్ నుంచి రెండో ర్యాంక్‌కు చేరుకుంది. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న ముక్కోణపు టి20 టోర్నీలో దీప్తి 9 వికెట్లు పడగొట్టింది. అగ్రస్థానంలో ఉన్న సోఫీ ఎకిల్‌స్టోన్ (ఇంగ్లండ్)కు దీప్తికి కేవలం 26 రేటింగ్ పాయింట్ల వ్యత్యాసమే ఉంది. రేపు దక్షిణాఫ్రికాతో జరిగే ఫైనల్లో భారత స్పిన్నర్ తన జోరు కొనసాగిస్తే టాప్ ర్యాంక్ సాకారమయ్యే చాన్స్ ఉంది. టాప్-10లో మరో ఇద్దరు భారత బౌలర్లు రేణుక (7వ), స్నేహ్ రాణా (10వ) ఉన్నారు.

తొమ్మిదో ర్యాంక్‌లో సింధు

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య తాజా ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ పీవీ సింధు తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఇండియా ఓపెన్ తర్వాత ఏ టోర్నీలో ఆడని ఆమె మహిళల సింగిల్స్‌లో ఎనిమిది నుంచి తొమ్మిదో ర్యాంక్‌కు పడిపోయింది. సైనా నెహ్వాల్ రెండు స్థానాలు ఎగబాకి 26వ ర్యాంక్‌కు చేరింది. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ 16వ ర్యాంక్‌కు పడిపోగా, ప్రణయ్ 9వ ర్యాంక్‌లోనే కొనసాగుతున్నాడు. లక్ష్యసేన్ ఒక ర్యాంక్ మెరుగుపర్చుకొని 11వ స్థానానికి చేరాడు.



'లక్నో' క్యురేటర్‌పై వేటు

న్యూఢిల్లీ: భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన రెండో టి20కి నాసిరకం పిచ్‌ను తయారు చేసినందుకు క్యురేటర్‌పై వేటు పడింది. ఈ పిచ్ తనను షాక్‌కు గురి చేసిందని, టి20లకు ఇలాంటి పిచ్ పనికి రాదని భారత కెప్టెన్ హార్దిక్ పాండ్యా బహిరంగంగా తన అసంతృప్తిని వ్యక్తం చేయడంతో ఉత్తరప్రదేశ్ క్రికెట్ సంఘం (యూపీసీఏ) ఈ చర్య తీసుకుంది. 'ఏకనా స్టేడియం పిచ్ క్యురేటర్‌ను తొలగించి అతని స్థానంలో సంజీవ్ అగర్వాల్‌ను ఎంపిక చేశాం. అనుభవజ్ఞుడైన సంజీవ్ రాబోయే మ్యాచ్‌ల కోసం సరైన పిచ్‌ను తయారు చేయగలడు. ఈ మైదానంలోని పిచ్‌లన్నింటినీ దేశవాళీ మ్యాచ్‌ల కోసం వరుసగా ఉపయోగించడంతో అవి ఇలా నాసిరకంగా తయారయ్యాయి. కనీసం రెండు పిచ్‌లను వాడకుండా అంతర్జాతీయ మ్యాచ్ కోసం క్యురేటర్ సిద్ధంగా ఉంచాల్సింది' అని యూపీసీఏ అధికారి ఒకరు వెల్లడించారు. మ్యాచ్‌లో ముందుగా కివీస్ 99 పరుగులకే పరిమితం కాగా, కేవలం ఒక బంతి మిగిలి ఉండగా భారత్ లక్ష్యాన్ని ఛేదించింది.

భారత పర్యటనలో 'వార్మప్' ఆడకపోవడం సరైందే: స్మిత్



సిడ్నీ: భారత పర్యటనలో వార్మప్‌తో కాకుండా నేరుగా టెస్టు సిరీస్‌తోనే ఆట మొదలు పెట్టడం సరైన నిర్ణయమేనని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ అన్నాడు. భారత్‌లో తమకు సవాల్ స్పిన్‌తో ఉంటే వార్మప్ మ్యాచ్ పేస్ వికెట్‌పై ఏర్పాటు చేయడం జట్టుకు ఏమాత్రం మేలు చేయదని ఈ సీనియర్ బ్యాటర్ అభిప్రాయపడ్డాడు. నాలుగు టెస్టుల పూర్తిస్థాయి సిరీస్ ఆడేందుకు రానున్న కంగారూ జట్టు కనీసం ఒక్క ప్రాక్టీస్ మ్యాచ్ కూడా ఆడకపోవడం ఆశ్చర్యపరిచింది. దీనిపై అతను ఆస్ట్రేలియన్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'గత పర్యటనలో మేం గ్రీన్‌టాప్ (పేస్ పిచ్)పై సన్నాహక మ్యాచ్ ఆడాం. కానీ మాకు సిరీస్‌లో ఎదురైంది స్పిన్ ట్రాక్‌లు. అలాంటపుడు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడటం దండగ! దీనికంటే స్పిన్ పిచ్‌లపై సన్నద్ధమయ్యేందుకు నెట్స్‌లో స్పిన్ బౌలింగ్‌తో ప్రాక్టీస్ చేయడమే ఉత్తమం. మా బోర్డు (క్రికెట్ ఆస్ట్రేలియా) ఈసారి వార్మప్ వద్దని మంచి పనే చేసింది' అని అన్నాడు. భారత పర్యటనలో తమకు కఠిన సవాళ్లు తప్పవన్నాడు. ఈ నెల 9 నుంచి నాగ్‌పూర్‌లో జరిగే తొలి టెస్టుతో ద్వైపాక్షిక సిరీస్ మొదలవుతుంది.



హార్దిక్ పాండ్యా బృందం

ఫెర్గూసన్, సాన్‌ట్నర్

ఆఖరి ఆటకు సిద్ధం!

- నేడు భారత్, న్యూజిలాండ్ మూడో టి20
- గెలిచిన జట్టు ఖాతాలో సిరీస్
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఇప్పటికే మూడు టి20 సిరీస్‌లు గెలుచుకున్న భారత జట్టు ఇప్పుడు మరో సిరీస్‌లో తుది సమరానికి సన్నద్ధమైంది. ఏకపక్షంగా సాగిన వన్డేలతో పోలిస్తే రెండు టి20ల్లోనూ న్యూజిలాండ్ నుంచి టీమిండియా గట్టి పోటీ ఎదుర్కొంది. దాంతో సిరీస్ ఫలితం చివరి మ్యాచ్‌కు చేరింది. ఈ ఏడాది వన్డే వరల్డ్ కప్ కారణంగా మున్ముందు కొన్ని నెలల పాటు భారత జట్టు టి20 మ్యాచ్‌లు ఆడే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో మన జట్టు విజయంతో ముగిస్తుందా లేక కివీస్ తన సత్తా చాటి సిరీస్ సాధిస్తుందా చూడాలి.

అహ్మదాబాద్: సొంతగడ్డపై శ్రీలంకను చిత్తు చేసి రెండు ఫార్మాట్‌లలోనూ సిరీస్ గెలుచుకున్న భారత జట్టు న్యూజిలాండ్‌తోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేయాలని పట్టుదలగా ఉంది. వన్డేల్లో విజేతగా నిలిచిన టీమిండియా, టి20ల్లో సిరీస్ అందుకునే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. మరోవైపు న్యూజిలాండ్ కూడా ఈ అవకాశాన్ని వదిలి పెట్టరాదని పట్టుదలగా ఉంది. ఇరు జట్లు చెరో మ్యాచ్ గెలిచి సిరీస్ 1–1తో సమంగా ఉన్న స్థితిలో నేడు జరిగే చివరి టి20 మ్యాచ్‌లో భారత్, న్యూజిలాండ్ తలపడనున్నాయి. తాజా ఫామ్, జట్లను చూస్తే మ్యాచ్ హోరాహోరీగా సాగడం ఖాయం.

ఉమ్రాన్‌కు చాన్స్...

రోహిత్, రాహుల్, కోహ్లిల గైర్హాజరులో భారత్ టాప్-3 ఈ సిరీస్‌లో పెద్దగా ప్రభావం చూపలేదనేది స్పష్టం. గిల్, ఇషాన్, రాహుల్ త్రిపాఠి అంచనాలకు అనుగుణంగా ఆడలేకపోయారు. ఈ మ్యాచ్‌లోనైనా వీరు మెరుగ్గా రాణిస్తే మ్యాచ్‌లో భారత్ భారీ స్కోరుకు అవకాశం ఉంటుంది. చాలా కాలం తర్వాత టీమ్‌లోకి ఎంపికైన పృథ్వీ షాకు ఆడే అవకాశం రాకుండానే సిరీస్ ముగిసిపోయేలా కనిపిస్తోంది. బౌలింగ్‌లో భారత తుది జట్టులో ఒక మార్పు జరగవచ్చు. లక్నోలాంటి టర్నింగ్ పిచ్ కాకపోవడంతో మళ్లీ చహల్ స్థానంలో ఉమ్రాన్ జట్టులోకి రావచ్చు.

అరుదైన అవకాశం...

న్యూజిలాండ్ జట్టు 2012లో చెన్నైలో జరిగిన ఏకైక టి20లో భారత్‌ను ఓడించింది. అది మినహా 1955 నుంచి ఏ ఫార్మాట్‌లో కూడా మన గడ్డపై ఆ జట్టు సిరీస్ గెలవలేకపోయింది. అయితే తాజా ఫామ్‌ను బట్టి చూస్తే తమ జట్టు ఆ అరుదైన ఘనత అందుకోగలదని కివీస్ ఆశిస్తోంది. టీమ్ తుది జట్టులో కూడా ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చు. కాన్వే జోరు మీదుండగా, ఇతర ఆటగాళ్ల నుంచి కూడా తగిన సహకారం అందుతోంది. అలెన్, ఫిలిప్స్ బ్యాటింగ్‌లో కీలకం కానుండగా, ఆల్‌రౌండర్లు బ్రేస్‌వెల్, మిచెల్ కూడా ఆకట్టుకున్నారు. స్పిన్నర్లు సాన్‌ట్నర్, ఇష్ సోధి భారత లైనప్‌ను కట్టిపడేయగల సమర్థులు. వ్యక్తిగతంగా గొప్ప ఘనతలు లేకపోయినా... సమష్టిగా తమ జట్టు బలమైందని ఎన్నోసార్లు నిరూపించిన న్యూజిలాండ్ మళ్లీ అదే పట్టుదలను చూపిస్తే సంతోషంగా తిరిగి వెళ్లవచ్చు.

పిచ్, వాతావరణం: నరేంద్ర మోదీ స్టేడియంలోని పిచ్ మొదటి నుంచీ బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. ఇక్కడ జరిగిన అన్ని మ్యాచ్‌లలో భారీ స్కోర్లు నమోదయ్యాయి. మ్యాచ్ రోజు వర్ష సూచనలేదు. పశ్చిమ భారత్‌లో పెద్దగా మంచు ప్రభావం లేదు.

55 గత పదేళ్లలో భారత జట్టు సొంత గడ్డపై మూడు ఫార్మాట్‌లలో కలిపి 55 సిరీస్‌లు ఆడింది. ఇందులో 47 సిరీస్‌లు గెలవడం విశేషం. ఒక్క ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మాత్రమే భారత్‌ను ఓడించగలిగాయి.

రికీ భుయ్ సెంచరీ: ఆంధ్ర 262/2

- శతకం దిశగా కరణ్ షిండే
- మధ్యప్రదేశ్‌తో రంజీ క్వార్టర్ ఫైనల్



రికీ భుయ్



కరణ్ షిండే

ఇండోర్: తొలిసారి సెమీఫైనల్ బెర్త్ దక్కించుకోవాలనే లక్ష్యంతో మధ్యప్రదేశ్‌తో రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో బరిలోకి దిగిన ఆంధ్ర జట్టు తొలి రోజు నిలకడగా ఆడింది. స్థానిక హోల్కర్ స్టేడియంలో మంగళవారం మొదలైన ఈ ఐదు రోజుల మ్యాచ్‌లో... తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 88 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 262 పరుగులు సాధించి భారీ స్కోరు దిశగా సాగుతోంది. రికీ భుయ్ (200 బంతుల్లో 115 బ్యాటింగ్; 12 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ సాధించగా... కరణ్ షిండే (222 బంతుల్లో 83 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్) శతకం దిశగా అడుగులు వేస్తున్నాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 190 పరుగులు జోడించడం విశేషం. అంతకుముందు డిఫెండింగ్ చాంపియన్ మధ్యప్రదేశ్ జట్టు కెప్టెన్ ఆదిత్య శ్రీవాస్తవ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా... ఆంధ్ర జట్టు ఓపెనర్లు అభిషేక్ రెడ్డి (21 బంతుల్లో 22; 3 ఫోర్లు), సీఆర్ జ్ఞానేశ్వర్ (48 బంతుల్లో 24; 5 ఫోర్లు) దూకుడుగా ఆడారు. ఎనిమిదో ఓవర్లో అభిషేక్ రెడ్డిని... 16వ ఓవర్లో జ్ఞానేశ్వర్‌ను గౌరవ్ యాదవ్ పెవిలియన్‌కు పంపించాడు. అవేశ్ ఖాన్ వేసిన బౌన్సర్ ఆంధ్ర కెప్టెన్ హనుమ విహారి (37 బంతుల్లో 16 రిటైర్డ్ హర్ట్; 3 ఫోర్లు) ఎడమ చేయికి బలంగా తాకింది. దాంతో నొప్పి భరించలేక విహారి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. అనంతరం రికీ భుయ్, కరణ్ షిండే పట్టుదలతో ఆడి మధ్యప్రదేశ్ బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. మరో వికెట్ పడకుండా రోజును ముగించారు.

భారత్‌లో వాలీబాల్ క్లబ్ ప్రపంచ చాంపియన్‌షిప్



న్యూఢిల్లీ: భారత్‌లో వరుసగా రెండేళ్లపాటు వాలీబాల్ క్లబ్ ప్రపంచ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. ఈ ఏడాది, వచ్చే ఏడాది రెండు సీజన్లు చాంపియన్‌షిప్ జరుగుతుందని అంతర్జాతీయ వాలీబాల్ సమాఖ్య (ఎఫ్ఐవీబీ) తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో జరిగే వాలీబాల్ లీగ్ టోర్నీల్లోని విజేతలతో ఈ ప్రపంచ చాంపియన్‌షిప్ నిర్వహిస్తారు. ఒకప్పుడు మనదేశంలో చాంపియన్స్ లీగ్ టి20 క్రికెట్ (ఇప్పుడు లేదు)లాంటిదే ఈ వాలీబాల్ టోర్నీ. భారత్‌లో జరుగుతున్న ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) విజేత వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుంది. ఈ ఏడాది చివర్లో డిసెంబర్ 6 నుంచి 10 వరకు జరుగుతుందని... వేదిక తదితర వివరాలను పీవీఎల్ నిర్వాహకులు ప్రకటిస్తారని ఎఫ్ఐవీబీ అధ్యక్షుడు అరి గ్రా తెలిపారు. భారత్‌లో పురుషుల క్లబ్ వాలీబాల్ టోర్నీ జరగనుండటం ఇదే తొలిసారని ఆయన చెప్పారు. ముందుగా ఈ సీజన్ పీవీఎల్ ఈ నెల 4న బెంగళూరులో ప్రారంభమవుతుంది.

తొలి రౌండ్‌లోనే ఓడిన గాయత్రి–ట్రెసా జోడీ

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రోజు భారత క్రీడాకారులకు నిరాశాజనక ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్ విభాగంలో మూడో సీడ్, ప్రపంచ 19వ ర్యాంక్ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) ద్వయం తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 9–21, 10–21తో రెనా మియారా–అయాకో సకురామోటో (జపాన్) ద్వయం చేతిలో ఓడిపోయింది. మరో మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో (భారత్) 15–21, 18–21తో తాన్ నింగ్–జియా యు టింగ్ (చైనా)ల చేతిలో ఓడిపోయారు. మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో బరిలోకి దిగిన కెయుర మోపాటి, నీలూరి ప్రేరణ, ఉన్నతి హుడా... పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్‌లో ఆడిన కార్తికేయ, సతీశ్ కుమార్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లోనే ఓడిపోయి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయారు.



సినిమా



వెంకటేశ్, సుర్వీన్ చావ్లా, రానా

హాలీవుడ్ వెబ్... బాలీవుడ్ హబ్

విదేశీ కథల్లో దేశీ తారలు

హాలీవుడ్ చిత్రాలు బాలీవుడ్‌లో రీమేక్ కావడం కొత్తేం కాదు. అయితే కరోనా తర్వాత మొదలైన వెబ్ సిరీస్‌ల హవా వల్ల ఇప్పుడు బాలీవుడ్ హబ్‌గా పలు హాలీవుడ్ సిరీస్‌లు కూడా రీమేక్ అవుతున్నాయి. విదేశీ కథలతో దేశీ తారలు చేస్తున్న ఈ వెబ్ సిరీస్‌ల గురించి తెలుసుకుందాం.

దగ్గుబాటి హీరోలు వెంకటేశ్, రానా నటించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. సుపర్ణ్ వర్మ, కరణ్ అన్షుమాన్ తెరకెక్కించిన ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. అమెరికన్ క్రైమ్ డ్రామా సిరీస్ 'రే డొనవన్'కు రీమేక్‌గా 'రానా నాయుడు' రూపొందింది. ఈ సిరీస్ స్ట్రీమింగ్ తేదీపై త్వరలో ఓ స్పష్టత వస్తుంది. నేర ప్రపంచంలో సెటిల్మెంట్స్ చేసి డబ్బు సంపాదిస్తుంటాడు ఓ వ్యక్తి. అయితే అతని తండ్రి విడుదలైన తర్వాత కొన్ని సమస్యలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఈ తండ్రీ కొడుకుల కథ ఏంటి? అన్నదే 'రానా నాయుడు' ప్రధాన కథాంశం. 2013లో మొదలైన 'రే డొనవన్' సిరీస్ ఏడుసీజన్లుగా 19 జనవరి 2020 వరకూ సాగింది. మరోవైపు నైట్ మేనేజర్‌గా వెబ్ వీక్షకుల ముందుకు వస్తున్నారు యువ హీరో ఆదిత్యారాయ్ కపూర్. అనిల్ కపూర్, శోభితా ధూళిపాళ కీలక పాత్రలు పోషించిన ఈ సిరీస్‌కు సందీప్ మోది దర్శకుడు. బ్రిటిష్ క్రైమ్ డ్రామా 'ది నైట్ మేనేజర్'కు రీమేక్‌గా రూపొందిన ఈ వెబ్ సిరీస్ ఈ నెలలో స్ట్రీమింగ్ కానుంది. ఓ స్టార్ హోటల్‌లో పని చేసే ఓ నైట్ మేనేజర్ అదే హోటల్‌కు గెస్ట్‌గా వచ్చిన ఓ యువతిని ఇష్టపడతాడు. అయితే అనుకోకుండా అతను ఆయుధాలను అక్రమ రవాణా చేసే ఓ ముఠా నాయకుడి చేతిలో చిక్కుకుంటాడు. అప్పుడు ఆ నైట్ మేనేజర్ ఏం చేశాడు? అన్నదే కథ. ఇక అమెరికన్ క్రైమ్ డ్రామా 'రివెంజ్' సిరీస్ హిందీలో రీమేక్ కానుంది. ఇందులో లీడ్ రోల్‌ను రవీనా టాండన్ చేయనున్నారు. త్వరలో షూటింగ్ ఆరంభం కానుంది. 'రివెంజ్' కథ విషయానికి వస్తే... తన తండ్రి మరణానికి కారకులైన ప్రభుత్వ ఉన్నతాధికారులపై ఒక సాధారణ యువతి ఏ విధంగా పగ తీర్చుకుంది? అన్నదే కథాంశం. ఇంకోవైపు మరో అమెరికన్ సైన్స్ ఫిక్షన్ డ్రామా 'సిటా డెల్' హిందీలో రీమేక్ అవుతోంది. హిట్ సిరీస్ 'ది ఫ్యామిలీ మేన్' దర్శకులు రాజ్ అండ్ డీకే 'సిటా డెల్' ఇండియన్ వెర్షన్‌ను తెరకెక్కిస్తున్నారు. ఇందులో వరుణ్ ధావన్, సమంత లీడ్ రోల్స్ చేస్తున్నారు. దేశరక్షణ కోసం ఓ గూఢచారి ఎలాంటి సాహసాలు చేయాల్సి వస్తుంది? అనే నేపథ్యంలో ఈ సిరీస్ సాగుతుంది. కాగా మరికొన్ని ఫారిన్ సిరీస్ లకు దేశీ వెర్షన్ రానుంది. వీటికి సంబంధించిన అధికారిక ప్రకటన రావడమే ఆలస్యం.



అనిల్ కపూర్, శోభిత, ఆదిత్యా రాయ్ కపూర్



రాశీ, అజయ్



వరుణ్, సమంత



రవీనా



సుష్మిత

సోనాలీ బింద్రే

ప్రస్తుతం కొన్ని ఫారిన్ వెబ్ సిరీస్‌లు హిందీలో రీమేక్ అవుతుండగా ఆల్రెడీ కొన్ని సిరీస్‌లు ఇండియాలో రీమేక్ అయ్యాయి. జర్నలిజం నేపథ్యంలో రూపొందిన బ్రిటిష్ సిరీస్ 'ప్రెస్' హిందీ రీమేక్ 'ది బ్రోకెన్ న్యూస్'లో సోనాలీ బింద్రే ఓ లీడ్ రోల్ చేశారు. ఇజ్రాయెల్ సిరీస్ 'హోస్టేజెస్' అదే పేరుతో హిందీలో రీమేక్ కాగా ఇందులో రోనిత్ రాయ్, టిస్కా చోప్రా లీడ్ రోల్స్ చేశారు. అలాగే బ్రిటిష్ సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ 'లూథర్' హిందీ రీమేక్ 'రుద్ర: ది ఎడ్జ్ ఆఫ్ డార్క్‌నెస్'లో అజయ్ దేవగన్, రాశీ ఖన్నా ప్రధాన పాత్రలు చేశారు. ఇదే కోవలో డచ్ (నెదర్లాండ్) డ్రామా సిరీస్ 'పెనోజా' ఆధారంగా 'ఆర్య' హిందీలో రాగా, ఇందులో సుష్మితా సేన్ ప్రధాన పాత్రధారి. అలాగే అమెరికన్ సిరీస్‌లు 'క్రిమినల్ జస్టిస్' (మూడు సీజన్లు), 'ది ఆఫీస్'(రెండు సీజన్లు) నెట్టింటి వీక్షకుల ముందుకు వచ్చాయి.



నాని, చిరంజీవి

నాని 30 షురూ

హీరో నాని నటిస్తున్న 30వ చిత్రం షురూ అయింది. శౌర్యువ్ దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై చెరుకూరి మోహన్, డాక్టర్ విజయేందర్ రెడ్డి, మూర్తి కలగర నిర్మిస్తున్న ఈ సినిమా మంగళవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన హీరో చిరంజీవి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. నిర్మాత సి. అశ్వినీదత్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకులు బుచ్చిబాబు, కిశోర్ తిరుమల, హను రాఘవపూడి, వశిష్ఠ, వివేక్ ఆత్రేయ తొలి సన్నివేశానికి దర్శకత్వం వహించారు. ఎంపీ, రచయిత విజయేంద్ర ప్రసాద్ మేకర్స్‌కి స్క్రిప్ట్‌ను అందించారు. ''అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రమిది. నేటి నుంచి హైదరాబాద్‌లో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సాను జాన్ వర్గీస్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఈవీవీ సతీష్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: భాను ధీరజ్ రాయుడు.



భరత్, జాహ్నవి, దివ్యాంశ, సందీప్ కిషన్, నాని, వరుణ్ సందేశ్, రంజిత్, రామ్మోహన్ రావు

నాపై వచ్చిన విమర్శలకు సమాధానమే మైఖేల్

– సందీప్ కిషన్

''నేను, నాని మా కెరీర్ ప్రారంభం నుంచి ఫ్రెండ్స్. కానీ, నా సినిమా వేడుకల్లో నాని పాల్గొన్న తొలి ఈవెంట్ ఇదే. ఒక సినిమా కోసం ఎంత చేయగలనో 'మైఖేల్' కోసం అంత చేశా. నాపై వచ్చిన విమర్శలకు ఈ సినిమానే సమాధానం'' అన్నారు సందీప్ కిషన్. రంజిత్ జయకొడి దర్శకత్వంలో సందీప్ కిషన్, దివ్యాంశ కౌశిక్ జంటగా తెరకెక్కిన చిత్రం 'మైఖేల్'. నారాయణ్ దాస్ కె.నారంగ్ సమర్పణలో భరత్ చౌదరి, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నాని మాట్లాడుతూ– ''సినిమా ఇండస్ట్రీలో కష్టం, అదృష్టం, ప్రతిభ ఉంటే చాలా పైస్థాయికి చేరుకుంటారు.. సందీప్‌లో నాకు కష్టం, ప్రతిభ కనిపించింది.. కానీ అదృష్టం కనిపించలేదు.. అది 'మైఖేల్'తో తనకి మొదలవుతుంది. 'మైఖేల్' టీజర్, ట్రైలర్ చూసినప్పుడు ఈ మూవీతో ఓ కొత్త ఒరవడి ప్రారంభం కానుందని తెలుస్తోంది. 'శివ' సినిమా వచ్చినప్పుడు కొత్తగా ఉందనిపించింది.. అలాంటి ఓ సినిమా 'మైఖేల్' కావాలని కోరుకుంటున్నాను. సునీల్, రామ్మోహన్, భరత్‌గార్లకు ఈ సినిమా ఒక మైలురాయిగా నిలవాలి'' అన్నారు. ''మైఖేల్'ని ఇండియాలో 1500 థియేటర్లలో రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు పుస్కూర్ రామ్మోహన్ రావు. ''యూనివర్సల్ సబ్జెక్ట్ ఇది.. నిర్మాతలుగా మేము సంతోషంగా ఉన్నాం'' అన్నారు భరత్ చౌదరి. ''నాది చెన్నై.. నేను హైదరాబాద్ వచ్చి సినిమా తీస్తున్నాను అనే అనుభూతి నాకు కలగకుండా నాదీ హైదరాబాదే అనేలా చూసుకున్న ఈ చిత్ర నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు రంజిత్ జయకొడి.

ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు – మధుబాల



శైలేష్, మధుబాల, శ్రీకాంత్

''ప్రేమదేశం' వంటి మంచి సినిమాలో నటించడం అదృష్టంగా భావిస్తున్నాను. శ్రీకాంత్ సిద్ధం చెప్పిన కథ, నా పాత్ర నచ్చి ఈ సినిమా చేశా'' అన్నారు నటి మధుబాల. త్రిగున్, మేఘా ఆకాష్, మధుబాల ప్రధాన పాత్రల్లో శ్రీకాంత్ సిద్ధం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రేమదేశం'. శిరీష సిద్ధం నిర్మించిన ఈ సినిమా ఈ నెల 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, 'హిట్ 1, 2' డైరెక్టర్ శైలేష్ కొలను అతిథులుగా హాజరయ్యారు. మధుబాల మాట్లాడుతూ– ''మా నాన్న నన్ను డాక్టర్‌గా చూడాలనుకున్నారు. అయితే నాకు 'ఫూల్ ఔర్ కాంటే' సినిమాకి చాన్స్ రావడం, అది హిట్టవడంతో వెనక్కి తిరిగి చూసుకోలేదు'' అన్నారు. ''ఈ చిత్రాన్ని షార్ట్ ఫిలింగా తీద్దామనుకున్నాను. అయితే నా ఫ్రెండ్స్ సపోర్ట్ చేయడంతో పెద్ద సినిమా అయింది'' అన్నారు శ్రీకాంత్ సిద్ధం.

సూపర్ న్యాచురల్ సుందరి



జయప్రద

జయప్రద, పూర్ణ, సాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ చిత్రం 'సువర్ణసుందరి'. సురేంద్ర మాదారపు దర్శకత్వంలో ఎం.ఎల్. లక్ష్మీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ట్రైలర్ అండ్ డిజిటల్ టికెట్‌ను నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. చిత్రదర్శకుడు సురేంద్ర మాట్లాడుతూ – ''మంచి టెక్నికల్ వేల్యూస్‌తో రూపొందించిన మా చిత్రం ప్రేక్షకులకు చక్కని అనుభూతినిస్తుందని ఆశిస్తున్నాం'' అని అన్నారు. ఈ సినిమాకు సమర్పణ: డాక్టర్ ఎమ్‌వికె రెడ్డి, సహనిర్మాత: శ్రీకాంత్ పండుగల, సంగీతం: సాయి కార్తీక్.

చక్కని ప్రేమ



విశ్వ కార్తికేయ, హ్రితికా

విశ్వ కార్తికేయ హీరోగా, నటి ఆమని మేనకోడలు హ్రితికా శ్రీనివాస్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'అల్లంత దూరాన'. చలపతి పువ్వల దర్శకత్వం వహించారు. కోమలి సమర్పణలో ఎన్. చంద్రమోహన రెడ్డి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించారు. ఈ నెల 10న ఈ చిత్రం తెలుగులో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఎన్. చంద్రమోహన రెడ్డి మాట్లాడుతూ– ''కథ, కథనాలకు ప్రాధాన్యమిస్తూ తీసిన సినిమా ఇది. తెలుగులో రిలీజ్ చేసిన తర్వాత మంచి డేట్ చూసుకుని తమిళంలో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ''చక్కని ప్రేమకథా చిత్రమిది. నిర్మాత సహకారంతో ఓ మంచి చిత్రం తీయగలిగాం'' అన్నారు చలపతి పువ్వల.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲ 49	59,550	
నిఫ్టీ ▲ 13	17,662	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,517	▲	125
డోజోన్స్	33,872	▲	148
ఎఫ్‌టీఎస్ఈ 100	7,772	▼	13
డాక్స్	15,128	▲	2
షాంఘై	3,256	▲	14
నికాయ్	27,327	▲	106

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,865	▼	214
బంగారం (99.5 స్వచ్ఛత)	56,637	▼	213
వెండి (కిలో)	67,671	▼	478

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.85	82.52
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	87.06	90.16
€	యూరో	ఒకటి	99.23	102.58
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	61.72	63.75
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	56.39	58.76
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.15	63.19
SAR	సౌదీ రియాల్	ఖాతాపరమైన	20.85	22.52
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతాపరమైన	21.24	23.20
¥	చైనా యువాన్	ఖాతాపరమైన	11.00	13.08

ఈ దశాబ్దం భారత్‌దే..!

వటిష్టంగానే ఆర్థిక వృద్ధి • 6.8 శాతం వరకు నమోదు కావచ్చు

సవాళ్లతో ప్రపంచం సతమతం • రూపాయి, ద్రవ్యోల్బణంపై వీటి ప్రభావం


2025–26 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి జీడీపీ

2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్లు • 2023 ఆర్థిక సర్వే వెల్లడి

న్యూఢిల్లీ: ఆర్థిక సర్వే 2023ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన మంగళవారం సభ ముందుంచారు. ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ సూచనల మేరకు కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని ఆర్థిక వ్యవహారాల విభాగం దీన్ని రూపొందించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23)తో పోలిస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో (2023–24) జీడీపీ వృద్ధి కొంత నిదానించే అవకాశాల్లేకపోలేదని అంచనా వేసింది. అయినా కానీ, 6–6.8 శాతం మధ్య నమోదు కావచ్చని పేర్కొంది. సాధారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు, చేపట్టాల్సిన చర్యలు, భవిష్యత్ అంచనాలను ఆర్థిక సర్వే తేటతెల్లం చేస్తుంది. ''2020 నుంచి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మూడు షాక్‌లు తగిలాయి. కరోనా రాకతో ప్రపంచ ఉత్పత్తికి బ్రేక్ పడింది. తర్వాత రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచవ్యాప్తంగా కమోడిటీ ధరలను పెంచేసింది. ఫలితంగా ద్రవ్యోల్బణం ఎగిసింది. దీనికి కట్టడి వేసేందుకు ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు కీలక వడ్డీ రేట్ల పెంపును చేపట్టాయి. యూఎస్ ఫెడ్ రేట్లను భారీగా పెంచడంతో పెట్టుబడులు అమెరికా మార్కెట్‌కు తరలేలా చేసింది. దీంతో ఎన్నో కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలపడింది. ఫలితంగా మన దేశ కరెంటు ఖాతా లోటు విస్తరించింది. నికర దిగుమతి దేశమైన భారత్ వంటి వాటిపై ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు దారితీసింది. అయినప్పటికీ 2021–22లో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కోలుకుంది. అమెరికా కేంద్ర బ్యాంకు ఇక ముందూ రేట్లను పెంచే అవకాశాల నేపథ్యంలో రూపాయిపై ఒత్తిడి కొనసాగుతుంది. అంతర్జాతీయంగా కమోడిటీ ధరలు గరిష్ట స్థాయిలోనే ఉన్నందున పెరిగిన కరెంటు ఖాతా లోటు (క్యాడ్) అదే స్థాయిలో కొనసాగొచ్చు'' అని సర్వే వివరించింది.

జీడీపీకి ఢోకా లేదు..

దేశ జీడీపీ 2022–23లో 7 శాతం మేర ఉండొచ్చు. 2022–23లో నమోదైన 8.7 శాతం కంటే తక్కువ. 2023–24 ఆర్థిక సంవత్సరానికి 6–6.8 శాతం మధ్య ఉండొచ్చు. అంతర్జాతీయంగా ఆర్థిక, భౌగోళిక రాజకీయ పరిణామాల ప్రభావం దీనిపై ఉంటుంది. కరోనా మహమ్మారి నుంచి ఆర్థిక వ్యవస్థ వేగంగా కోలుకుంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో వృద్ధి అన్నది బలమైన డిమాండ్, మూలధన పెట్టుబడులు పుంజుకోవడంపై ఆధారపడి ఉంటుంది. ప్రైవేటు మూలధన నూతన చక్రం స్పష్టంగా కనిపిస్తోంది. కొనుగోలు శక్తి పరంగా భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. మారకం రేటు పరంగా ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ. ప్రైవేటు వినియోగం పెరగడం, మూలధన పెట్టుబడులు అధికంగా ఉండడం, కార్పొరేట్ల బ్యాలన్స్ షీట్లు బలంగా మారడం, చిన్న వ్యాపార సంస్థలకు రుణ లభ్యత, వృద్ధికి మద్దతునిచ్చే అంశాలు. 2022–23 మొదటి ఎనిమిది నెలల్లో కేంద్ర సర్కారు మూలధన **వ్యయాలు 63.4 శాతం పెరిగాయి. వృద్ధికి ఇది కూడా మద్దతునిచ్చే అంశం. దేశ ఆర్థిక వ్యవస్థ** 2025–26 లేదా 2026–27 నాటికి 5 ట్రిలియన్ డాలర్లకు (రూ.410 లక్షల కోట్లు), 2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్లకు (రూ.574 లక్షల కోట్లు) చేరుకోవచ్చు. దీని ప్రకారం ఆర్థిక వృద్ధి విషయంలో ఈ దశాబ్దం భారత్‌దేనని ఆర్థిక సర్వే తేల్చిచెప్పింది.



ద్రవ్యోల్బణం/రూపాయి

ద్రవ్యోల్బణం రేటు 2022 ఏప్రిల్‌లో 7.8 శాతానికి పెరిగింది. ఆర్‌బీఐ గరిష్ట పరిమితి 6 శాతానికంటే ఎక్కువ. అయినప్పటికీ ప్రపంచంలో అతి తక్కువ ద్రవ్యోల్బణం దేశాల్లో భారత్ ఒకటి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ ద్రవ్యోల్బణ అంచనా 6.8 శాతం అన్నది గరిష్ట పరిమితి కంటే ఎక్కువ. కానీ వడ్డీ రేట్లు పెరుగుదల అన్నది ప్రైవేటు వినియోగాన్ని దెబ్బతీసేంత స్థాయిలో లేదు.



సర్వేను విడుదల చేస్తున్న నాగేశ్వరన్ తదితరులు

ఎగుమతులు: 2021–22లో దేశ ఎగుమతులు 422 బిలియన్ డాలర్ల ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరినప్పటికీ.. తదనంతర పరిస్థితులు ఎగుమతుల వృద్ధికి అవరోధం కలిగిస్తున్నాయి. ఎగుమతి దేశాలను విస్తరించుకోవడం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా ఈ బలహీనతను అధిగమించొచ్చు.

సమగ్ర రూపం



భారత వృద్ధి పథం, భారత్ పట్ల ప్రపంచ దేశాల్లో నెలకొన్న ఆశావాదం, మౌలిక రంగంపై దృష్టి, సాగులో వృద్ధి, పరిశ్రమలు, భవిష్యత్ రంగాలపై దృష్టిని ఆర్థిక సర్వే సమగ్రంగా తెలియజేసింది.
– ప్రధాని మోదీ

కరెన్సీ, చమురుపైనే..

2025–26 లేదా 2026–27 నాటికి 5 ట్రిలియన్ డాలర్లకు మన ఆర్థిక వ్యవస్థ చేరుకోవచ్చు. 2030 నాటికి 7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. కరెన్సీ మారకం రేట్లపైనే ఈ లక్ష్యాలను చేరుకోవడం ఆధారపడి ఉంటుంది. చమురు ధరలపై అంచనాలు ఇవ్వడం కష్టం. ఆర్‌బీఐ చెప్పినట్టు బ్యారెల్ 100 డాలర్లకు దిగువన ఉంటే, సర్వేలో పేర్కొన్న వృద్ధి గణాంకాలను చేరుకోవడం సాధ్యపడుతుంది. చమురు 100 డాలర్లకు దిగువన ఉన్నంత కాలం మన వృద్ధి లక్ష్యాలకు విఘాతం కలగదు.
– అనంత నాగేశ్వరన్, ముఖ్య ఆర్థిక సలహాదారు

సర్వే ఇంకా ఏం చెప్పింది

- భారత్ ఇప్పటికే ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. మార్చి నాటికి 3.5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుంటుంది.
- భారత్‌కు చెందిన స్టార్టప్‌లకు సులభతర పన్నుల విధానం, ప్రక్రియలు అవసరం.
- పీఎం గతిశక్తి (మౌలిక సదుపాయలు విస్తరణకు ఉద్దేశించినది), నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ, పీఎల్‌ఐ ప్రోత్సాహకాలు ఆర్థిక వృద్ధిని బలోపేతం చేస్తాయి. అంతర్జాతీయంగా జీడీపీలో రవాణా వ్యయాలు 8 శాతంగా ఉంటే, మనదేశంలో 14–18 శాతం మధ్య ఉన్నాయి.
- దేశ ఫార్మాస్యూటికల్ మార్కెట్ 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు విస్తరిస్తుంది. 2021 నాటికి 41 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2024 నాటికి 65 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. కరోనా సంవత్సరం 2020–21లో ఈ రంగం 24 శాతం వృద్ధిని చూసింది.
- షిప్పింగ్ కార్పొరేషన్, ఎన్‌ఎండీసీ స్టీల్, బీఈఎంఎల్, హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్, కాంకర్, వైజాగ్ స్టీల్, ఐడీబీఐ బ్యాంక్ ప్రస్తుతం ప్రైవేటీకరణ దశలో ఉన్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చాలా వరకు వీటి ప్రైవేటీకరణ పూర్తవుతుంది.
- ఫిజికల్, డిజిటల్ సదుపాయాల సమన్వయం భారత భవిష్యత్‌ను నిర్ణయించనుంది. కొత్త సేవలకు డిజిటల్ మాధ్యమం విస్తరించినందున తగిన నియంత్రణలు అవసరం. ఆధార్, యూపీఐ తదితర విజయవంతమైన విధానాలను సర్వే ప్రస్తావించింది.
- 5జీ మొబైల్ సేవల విస్తరణతో నూతన ఆర్థిక అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. స్టార్టప్‌లు, మరిన్ని వ్యాపార ఆవిష్కరణలు ఊపందుకుంటాయి.
- భారత ఆర్థికాభివృద్ధి, ఇంధన భద్రతకు గ్రీన్ హైడ్రోజన్ కీలకంగా మారనుంది.

ఉపాధి కల్పన.. ఓకే

రియల్ ఎస్టేట్ రంగం పుంజుకోవడం, నిర్మాణ రంగ కార్యకలాపాలు పెరగడం ఉపాధి అవకాశాలను పెంచినట్టు ఆర్థిక సర్వే పేర్కొంది. కరోనా సమయంలో లాక్‌డౌన్‌లతో పట్టణాల నుంచి వలసపోయిన కార్మికులు తిరిగి వచ్చేలా చేశాయి. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో నేరుగా ఉపాధి అవకాశాల కల్పన జరుగుతోంది. పీఎం కిసాన్, పీఎం గరీబ్ కల్యాణ్ యోజన దేశంలో ఆహార భద్రతకు తోడ్పడుతున్నాయి. పట్టణాల్లో నిరుద్యోగం 7.2 శాతానికి తగ్గింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) రుణాల వృద్ధి 2022 జనవరి–నవంబర్ మధ్య 30.6% ఉంది. దీనికి అత్యవసర రుణ హామీ పథకం తోడ్పడింది. దేశంలో 6 కోట్లకు పైగా ఎంఎస్‌ఎంఈలు ఉండగా, 12 కోట్ల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

ఈవీ విక్రయాలు @ కోటి..

2030 నాటికి ఏటా 1 కోటి విద్యుత్ వాహనాలు అమ్ముడవుతాయని ఎకనమిక్ సర్వే తెలిపింది. దీనితో ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 కోట్ల పైచిలుకు ఉద్యోగాల కల్పన జరగగలదని పేర్కొంది. 2022–2030 మధ్య ఈవీల మార్కెట్ వార్షికంగా 49 శాతం వృద్ధి చెందగలదని వివరించింది. పరిశ్రమ వర్గాల ప్రకారం 2022లో సుమారు 10 లక్షల విద్యుత్ వాహనాలు అమ్ముడయ్యాయి. వాహన విక్రయాలపరంగా డిసెంబర్‌లో జపాన్, జర్మనీలను అధిగమించి భారత్ మూడో స్థానానికి చేరింది.

ఆరోగ్యం.. మెరుగు

ప్రభుత్వం తీసుకున్న పలు చర్యల వల్ల ప్రతీ వ్యక్తి ఆరోగ్యం కోసం తన పాకెట్ నుంచి చేసే ఖర్చు 2013–14లో 64.2 శాతంగా ఉంటే, 2018–19 నాటికి 48.2 శాతానికి తగ్గింది. శిశు మరణాల రేటు కూడా క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2023 జనవరి 6 నాటికి 220 కోట్ల కరోనా టీకా డోస్‌లు ప్రజలకు ఇవ్వడం పూర్తయింది. 2023 జనవరి 4 నాటికి ఆయుష్మాన్ భారత్ పథకం కింద 22 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు.

వ్యవసాయం.. సవాళ్లు

సాగు రంగం మెరుగైన పనితీరు చూపిస్తున్నప్పటికీ.. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొంటోంది. అలాగే, పెరిగిపోతున్న సాగు వ్యయాలు కూడా సవాలుగా మారాయి. సాగులో యంత్రాల వినియోగం తక్కువగా ఉండడం, తక్కువ ఉత్పాదకత సవాళ్లుగా ఉన్నాయి. కనుక ఈ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గడిచిన ఆరు సంవత్సరాలుగా సాగు రంగం వార్షికంగా 4.6 శాతం చొప్పున వృద్ధి సాధించింది. కానీ, 2020–21లో 3.3 శాతం, 2021–22లో 3 శాతమే వృద్ధి చెందింది.

ప్రపంచ తయారీ కేంద్రంగా..

ప్రపంచ తయారీ కేంద్రంగా మారేందుకు భారత్ ముందు ప్రత్యేక అవకాశం ఉంది. కరోనా అనంతరం ఎదురైన సవాళ్ల నేపథ్యంలో విదేశీ కంపెనీలు తమ తయారీ, సరఫరా వ్యవస్థలను బలంగా మార్చుకోవాలని కోరుకుంటున్నాయి. ప్రస్తుతం దేశ జీడీపీలో తయారీ వాటా 15–16%గా ఉంటే, రానున్న సంవత్సరాల్లో 25%కి చేరుకుంటుంది. భారత్‌లో తయారీ 2.0 కోసం 27 రంగాలపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే పీఎల్‌ఐ పథకాన్ని ప్రారంభించింది. ఇప్పటికి 14 రంగాలకు పీఎల్‌ఐ పథకాలను ప్రకటించారు.

భవిత
• ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

తపాలా శాఖలో 40,889 గ్రామీణ డాక్ సేవక్ పోస్టులు

దేశవ్యాప్తంగా వివిధ పోస్టల్ సర్కిళ్లలో గ్రామీణ డాక్ సేవక్(జీడీఎస్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 40,889
- **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్–2480, తెలంగాణ–1266.
- **పోస్టులు:** గ్రామీణ డాక్ సేవక్స్–బ్రాంచ్ పోస్టు మాస్టర్/అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టు మాస్టర్/డాక్ సేవక్.
- **సర్కిల్ వారీగా ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్–2480, అసోం–407, బీహార్–1461, ఛత్తీస్‌గఢ్–1593, ఢిల్లీ–46, గుజరాత్–2017, హర్యానా–354, హిమాచల్ ప్రదేశ్–603, జమ్మూ–కశ్మీర్–300, జార్ఖండ్–1590, కర్ణాటక–3036, కేరళ–2462, మధ్యప్రదేశ్–1841, మహారాష్ట్ర–2508, నార్త్ ఈస్టర్న్–923, ఒడిశా–1382, పంజాబ్–766, రాజస్థాన్–1684, తమిళనాడు–3167, తెలంగాణ–1266, ఉత్తరప్రదేశ్–7987, ఉత్తరాఖండ్–889, పశ్చిమ బెంగాల్–2127.
- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. మ్యాథ్స్, ఇంగ్లిష్, స్థానిక భాష తప్పనిసరిగా ఉండాలి. అంటే ఏపీ, తెలంగాణకు చెందినవారు తెలుగు సబ్జెక్టు పదో తరగతి వరకు చదవడం తప్పనిసరి. కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు సైకిల్ తొక్కడం వచ్చి ఉండాలి.
- **వయసు:** 16.02.2023 నాటికి 18 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ట వయసులో సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు బీపీఎం పోస్టులకు రూ.12,000 నుంచి రూ.29,380, ఏబీపీఎం/డాక్ సేవక్ పోస్టులకు రూ.10,000 నుంచి రూ.24,470 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** అభ్యర్థులు పదో తరగతిలో సాధించిన మార్కుల మెరిట్ ప్రకారం నియామకాలు జరుగుతాయి. ఎంపికైన వారికి ఎస్ఎంఎస్/ఈమెయిల్/పోస్టు ద్వారా అందుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.02.2023.
- **దరఖాస్తు సవరణ ప్రారంభతేది:** 17.02.2023
- **దరఖాస్తు సవరణ చివరితేది:** 19.02.2023.
- **వెబ్‌సైట్:** www.indiapostgdsonline.gov.in

ఎన్‌ఎండీసీ లిమిటెడ్, హైదరాబాద్‌లో 42 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎన్‌ఎండీసీ లిమిటెడ్ వివిధ రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి డిపార్ట్‌మెంట్/ఎక్స్‌టర్నల్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 42
- **పోస్టుల వివరాలు:** అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఫైనాన్స్–అకౌంట్స్) ట్రైనీ–11, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(మెటీరియల్స్–పర్చేజ్)ట్రైనీ–16, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(పర్సనల్–అడ్మినిస్ట్రేషన్) ట్రైనీ–15.
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ, సీఏ(ఇంటర్)/ఐసీడబ్ల్యూఏ–సీఎంఏ(ఇంటర్), బీఈ, బీటెక్, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 32 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.37,000 నుంచి రూ.1,30,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.02.2023
- **వెబ్‌సైట్:** www.nmdc.co.in

స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, న్యూఢిల్లీలో 27 నాన్‌టీచింగ్ పోస్టులు

న్యూఢిల్లీలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ వివిధ నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 27
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ రిజిస్ట్రార్–01, సెక్షన్ ఆఫీసర్–01, వర్క్‌షాప్ సూపరింటెండెంట్–01, టెక్నికల్ అసిస్టెంట్(మోడల్స్)–01, టెక్నికల్ అసిస్టెంట్–01, పర్సనల్ అసిస్టెంట్–06, హిందీ ట్రాన్స్‌లేటర్–01, అసిస్టెంట్–02, స్టెనోగ్రాఫర్–01, ఎస్టేట్ సూపర్‌వైజర్–01, జూనియర్ లైబ్రరీ–ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–03, డ్రైవర్–01, ప్లంబర్–01, ఎలక్ట్రీషియన్–03, కార్పెంటర్–01, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్–01, మెకానిక్–01.
- **అర్హత:** పదో తరగతి, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డిప్యూటీ రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, 4, బ్లాక్–బి, ఇంద్రప్రస్థ ఎస్టేట్, న్యూఢిల్లీ చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 27.02.2023.
- **వెబ్‌సైట్:** www.spa.ac.in

స్టాఫ్ నర్స్ కొలువుకు పిలుపు

బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం (జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ) అభ్యర్థులకు.. శుభవార్త! ఈ అర్హతలతో తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్స్‌లుగా కొలువుదీరొచ్చు!! తెలంగాణ రాష్ట్ర మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ తాజాగా స్టాఫ్ నర్స్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. స్టాఫ్ నర్స్ పోస్టల వివరాలు, ఎంపిక విధానం, అర్హతలు తదితర వివరాలు..



» తెలంగాణలో 5,204 స్టాఫ్ నర్స్ పోస్టల భర్తీకి నోటిఫికేషన్
» బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం ఉత్తీర్ణులకు చక్కటి అవకాశం
» ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ
» రాత పరీక్ష, సర్వీస్ అనుభవం ఆధారంగా ఎంపిక
» ప్రారంభ వేతన శ్రేణి రూ.36,570–రూ.1,06,990
» అకడమిక్ నైపుణ్యాలతో రాత పరీక్షలో విజయం

రాష్ట్రంలో వేల సంఖ్యలో అభ్యర్థులు నర్సింగ్, జీఎన్ఎం కోర్సులు పూర్తి చేసి.. ప్రైవేట్ హాస్పిటల్స్‌లో నర్స్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి వారందరికీ ప్రభుత్వ కొలువు సొంతం చేసుకునే మార్గంగా తాజా నోటిఫికేషన్ నిలుస్తోంది. దీన్ని సద్వినియోగం చేసుకుంటే నర్సింగ్ కోర్సుల ఉత్తీర్ణులకు సుస్థిర భవిష్యత్తు ఖాయం అంటున్నారు నిపుణులు.

తొమ్మిది శాఖలు-5,204 పోస్టులు

తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న స్టాఫ్ నర్స్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ద్వారా.. వైద్య, ఆరోగ్య శాఖ సహా మొత్తం తొమ్మిది శాఖల్లో 5,204 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. వైద్య, ఆరోగ్య శాఖతో పాటు.. తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాల్లోనూ అక్కడి విద్యార్థులకు వైద్య సేవలు అందుబాటులో ఉంచే ఉద్దేశంతో వాటిలోనూ స్టాఫ్ నర్స్‌లను నియమించనున్నారు.

అర్హతలు

- బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం అండ్ మిడ్‌వైఫరీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** జూలై 1, 2022 నాటికి 18–44 ఏళ్లు(ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు).
- **వేతన శ్రేణి:** రూ.36,570–రూ.1,06, 990

ఎంపిక విధానం

- తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్.. నర్సింగ్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో భాగంగా.. రాత పరీక్ష, అప్పటికే అభ్యర్థులు పొందిన సర్వీస్(పని అనుభవం) ఆధారంగా తుది విజేతలను ఖరారు చేయనుంది.
- రాత పరీక్షను 80 మార్కులకు నిర్వహించనున్నారు.
- మరో 20 మార్కులకు అభ్యర్థుల పని అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని.. గిరిజన ప్రాంతాల్లో ఆరు నెలల సర్వీస్‌కు 2.5 పాయింట్లు చొప్పున, గిరిజనేతర ప్రాంతాల్లో ఆరు నెలల సర్వీస్‌కు 2 పాయింట్లు చొప్పున కేటాయిస్తారు. ఇలా.. ప్రతి ఆరు నెలల సర్వీస్‌కు పాయింట్లు కేటాయించే విధానంలో.. గరిష్టంగా 20 మార్కులను పని అనుభవానికి వెయిటేజీ కల్పిస్తారు.
- పని అనుభవం విషయంలో నిర్దిష్ట నిబంధనలను రూపొందించారు. అభ్యర్థులు ప్రభుత్వ ఆస్పత్రులు లేదా ఇన్‌స్టిట్యూట్స్, లేదా ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి విభాగాల్లో.. కాంట్రాక్ట్ లేదా ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తుండాలి. వారికే సర్వీస్ పాయింట్స్ వెయిటేజీ కల్పిస్తారు.
- అదే విధంగా సర్వీస్ అనుభవం పాయింట్లు పొందాలనుకునే వారు స్టాఫ్ నర్స్ హోదాలోనే విధులు నిర్వర్తించి ఉండాలి. దీంతోపాటు.. వారు పని చేసిన విభాగాల అధీకృత అధికారుల నుంచి సర్వీస్ సర్టిఫికెట్‌ను నిర్దేశిత నమూనాలో దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది.

రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియలో కీలకంగా నిలిచే రాత పరీక్షను 80 ప్రశ్నలతో 80 మార్కులకు నిర్వహిస్తారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష పూర్తిగా ఆఫ్‌లైన్ విధానంలో ఓఎంఆర్ షీట్ ఆధారంగా జరుగుతుంది.

అకడమిక్ నైపుణ్యాలు

80 మార్కులకు నిర్వహించే రాత పరీక్షలో విజయం సాధించడానికి అభ్యర్థులు అకడమిక్ నైపుణ్యాలపై పట్టు సాధించాలి. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ స్థాయిలో చదివిన అంశాలు, ప్రాక్టికల్స్‌కు సంబంధించిన విషయాలను అవలోకనం చేసుకోవాలి. వైద్య,ఆరోగ్య రంగాలకు సంబంధించి సమకాలీన పరిస్థితులపైనా అవగాహన పెంచుకోవాలి. వీటిని సబ్జెక్ట్ అంశాలతో సమ్మిళితం చేసుకుంటూ.. బేరీజు వేసుకుంటూ అభ్యసనం చేస్తే మంచి మార్కులు సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

ప్రశ్న పత్రాల సాధన

స్టాఫ్ నర్స్ పోస్టలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు.. ప్రిపరేషన్‌లో భాగంగా ఇతర ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది. ఎయిమ్స్, జిప్‌మర్ వంటి సంస్థలు చేపట్టిన నియామక పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం ద్వారా ప్రశ్నల తీరుపై అవగాహన లభిస్తుంది.

ప్రిపరేషన్ ఇలా

- స్టాఫ్ నర్స్ పోస్టల అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో ప్రధానంగా దృష్టి సారించాల్సిన అంశాల వివరాలు..
- అనాటమీ అండ్ ఫిజియాలజీ; మైక్రో బయాలజీ;సైకాలజీ;సోషియాలజీ; ఫండమెంటల్స్ ఆఫ్ నర్సింగ్; ప్రథమ చికిత్స(ఫస్ట్ ఎయిడ్); కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్; ఎన్విరాన్‌మెంటల్ హైజీన్; హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్; న్యూట్రిషన్, మెడికల్ సర్జికల్ నర్సింగ్–1; మెడికల్ సర్జికల్ నర్సింగ్–2, మెంటల్ హెల్త్ నర్సింగ్; చైల్డ్ హెల్త్ నర్సింగ్; మిడ్‌వైఫరీ అండ్ గైనకాలజికల్ నర్సింగ్; కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్–2; నర్సింగ్ ఎడ్యుకేషన్; నర్సింగ్ రీసెర్చ్; ప్రొఫెషనల్ ట్రెండ్స్ అండ్ అడ్జస్ట్‌మెంట్; నర్సింగ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వార్డ్ మేనేజ్‌మెంట్.
- ఈ అంశాలకు సంబంధించి నిర్వచనం మొదలు నిర్వహణ ప్రక్రియల వరకు అన్నింటిపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.
- కమ్యూనిటీ హెల్త్ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. దేశంలో ఆరోగ్య వ్యవస్థ, హెల్త్ ప్లానింగ్, నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్, హెల్త్ ఏజెన్సీస్ వంటి అంశాలతో ఆయా విభాగాల్లో నర్స్‌ల పాత్ర గురించి తెలుసుకోవాలి.
- సర్జికల్ నర్సింగ్‌కు సంబంధించి శస్త్ర చికిత్స నిర్వహణ పద్ధతులు, నర్సింగ్ టెక్నిక్స్, రోగుల విషయంలో అనుసరించాల్సిన నిబంధనలు వంటి అంశాలను ప్రత్యేక శ్రద్ధతో చదవాలి.
- హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌కు కూడా ప్రిపరేషన్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి. రోగులతో వ్యవహరించాల్సిన విధానాలు, కౌన్సెలింగ్, హెల్త్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన పద్ధతులపై అవగాహన పొందాలి.
- ఎన్విరాన్‌మెంటల్ హైజీన్.. ఇది కూడా పరీక్షలో కీలకంగా నిలిచే విభాగం అని చెప్పొచ్చు. పరిపుష్టమైన ఆరోగ్యానికి దోహదం చేసే పర్యావరణ అంశాలపై దృష్టి పెట్టాలి.
- అన్నిటికంటే ముఖ్యంగా నర్సింగ్‌లో ప్రాథమిక భావనలపై పూర్తి అవగాహనతో అడుగులు వేయాలి. రోగుల విషయంలో నర్సింగ్ కేర్ ప్రాధాన్యం, రోగుల పరిస్థితిని సమీక్షించడం, క్లినికల్ ఫార్మకాలజీ, థెరపటిక్ నర్సింగ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.
- సోషియాలజీకి సంబంధించి వ్యక్తులు, కుటుంబం, సమాజం, కమ్యూనిటీ అంశాలను అభ్యసనం చేయాలి.
- సైకాలజీకి సంబంధించి మానవ ప్రవర్తన శైలి/తత్వం, లెర్నింగ్, థింకింగ్, రీజనింగ్, అబ్జర్వేషన్, వ్యక్తిత్వం, ఇంటెలిజెన్స్ అంశాలపై అవగాహన ఉపయుక్తంగా ఉంటుంది.
- కోర్ అంశాలుగా భావించే అనాటమీ అండ్ ఫిజియాలజీ విషయంలో రక్త ప్రసరణ వ్యవస్థ, మానవ శరీర నిర్వహణ, రెస్పిరేటరీ సిస్టమ్, డైజెస్టివ్ సిస్టమ్, నెర్వస్ సిస్టమ్, సెన్స్ ఆర్గాన్, స్కెలెటెన్, కండరాల వ్యవస్థలపై పూర్తి స్థాయి అవగాహన ఏర్పరచుకోవాలి.
- మైక్రో బయాలజీకి సంబంధించి రోగ నిరోధకత, మైక్రోబ్స్ నియంత్రణ /నిర్మూలన, ఇన్‌ఫెక్షన్, మైక్రో ఆర్గానిజమ్స్‌పై దృష్టి పెట్టాలి.
- అదే విధంగా గైనకాలజికల్ సిస్టమ్‌కు సంబంధించి అన్ని అంశాలను అభ్యసనం చేయాలి.
- ఇలా కోర్ అంశాలు మొదలు కమ్యూనిటీ హెల్త్ వంటి సమకాలీన అంశాల వరకు అన్నింటిపై పట్టు సాధిస్తే.. రాత పరీక్షలో విజయావకాశాలను మెరుగు పరచుకోవచ్చు.

హెడ్ నర్స్, సూపరింటెండ్ స్థాయికి

స్టాఫ్ నర్స్‌గా కెరీర్ ప్రారంభించిన వారు.. భవిష్యత్తులో సర్వీస్ నియమావళిని అనుసరించి.. నర్స్ నుంచి సూపరింటెండ్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. తొలుత స్టాఫ్ నర్స్, ఆ తర్వాత హెడ్ నర్స్, క్లినికల్ నర్స్ స్పెషలిస్ట్, ఓటీ హెడ్ వంటి హోదాలు పొందొచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 25 – ఫిబ్రవరి 15
- **రాత పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://mhsrb.telangana.gov.in

క్లుప్తంగా...

త్వరలో విద్యుత్ పీఆర్సీ ప్రకటన

మంత్రి జగదీశ్‌రెడ్డి హామీ



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగులకు త్వరలోనే పీఆర్సీ ప్రకటిస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీశ్ రెడ్డి హామీ ఇచ్చారని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ ఎన్.శివాజీ తెలిపారు. జేఏసీ నేతలు మంగళవారం మంత్రి జగదీశ్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసిన అనంతరం ఓ ప్రకటన విడుదల చేశారు. పీఆర్సీ, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కి మార్పు, హెచ్‌ఆర్‌ఏ, ఏపీ ఉద్యోగుల రాకతో రివర్షన్లు పొందిన 166 మంది తెలంగాణ ఉద్యోగుల సమస్యలపై మంత్రితో చర్చించగా, ఈ అంశాలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. మంత్రిని కలిసిన వారిలో జేఏసీ నేతలు కరెంట్‌రావు, మాతంగి శ్రీనివాస్, ఆరోగ్య రాణి, నాసర్ షరీఫ్ తదితరులున్నారు.

ఫైర్ ఆడిటింగ్ షురూ..!

సాక్షి, హైదరాబాద్: అగ్ని ప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు అగ్నిమాపకశాఖ ఫైర్ ఆడిటింగ్ ప్రారంభించింది. సికింద్రాబాద్‌లోని డెక్కన్ మాల్‌లో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద ఘటన తర్వాత ఫైర్ సేఫ్టీ అంశంపై ప్రత్యేకంగా మంత్రి కేటీఆర్ అధ్యక్షతన మంత్రులు మహమూద్‌అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. మంగళవారం హైదరాబాద్ నగరంలోని ఎల్బీనగర్ జోన్ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా ఫైర్ ఆడిటింగ్‌ను అధికారులు ప్రారంభించారు. అగ్నిమాపకశాఖ, విద్యుత్, జీహెచ్‌ఎంసీ అధికారుల బృందాలు ఈ మేరకు ఆ ప్రాంతంలోని వాణిజ్య సముదాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాయి. ప్రతి దుకాణానికి, షాపింగ్ మాల్‌కు వెళ్తున్న అధికారుల బృందం అక్కడి ఫైర్ సేఫ్టీ అంశాలను పరిశీలిస్తోంది. ప్రధానంగా ఎలక్ట్రిక్ అంశాల్లో భద్రత సరిగా ఉందా? లేదా? అన్నది పరిశీలించి వివరాలు నమోదు చేస్తోంది. దుకాణ యజమానులు, భవన సముదాయాల యజమానులు పూర్తి వివరాలు, వారి ఫోన్ నంబర్లు, విద్యుత్ మీటర్ల కనెక్షన్ల నంబర్లు ఇలా ప్రతి అంశాన్ని నమోదు చేస్తున్నారు. పూర్తి వివరాల సేకరణ తర్వాత వాటి ఆధారంగా విశ్లేషించి అగ్నిమాపకశాఖ భద్రతకు సంబంధించిన చర్యలపై అధికారులు తగిన చర్యలు తీసుకోనున్నారు. ప్రమాణాలు పాటించకుండా ఉన్న భవనాల యాజమాన్యాలపై చట్టపరంగా ఏ చర్యలు తీసుకోవాలన్నది కూడా వారు ఈ ఆడిట్ ఆధారంగా నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిసింది.

జిల్లాకు ఒక మినీ హజ్ హౌస్ నిర్మాణం

ఈనెల 15 వరకు 2023 హజ్ యాత్ర షెడ్యూల్ విడుదల

సాక్షి, హైదరాబాద్: ప్రతి జిల్లా కేంద్రంలో హజ్ హౌస్ నిర్మించాలని హజ్ కమిటీ నిర్ణయించింది. రూ.కోటి అంచనా వ్యయంతో ఈ భవనాలను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ మేరకు మంగళవారం జరిగిన హజ్ కమిటీ పాలకమండలి సమావేశం తీర్మానించింది. ఇప్పటికే సిద్దిపేటలో మినీ హజ్ హౌస్ అందుబాటులోకి రాగా.. జహీరాబాద్‌లో నిర్మాణ దశలో ఉంది. ఈ నేపథ్యంలోనే మిగతా జిల్లాల కేంద్రాల్లోనూ హజ్ హౌస్‌లను నిర్మించాలని తాజాగా జరిగిన సమావేశంలో తీర్మానించినట్లు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ సలీం వెల్లడించారు. ఈనెల 15 వరకు 2023 హజ్ యాత్ర షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముందని, హజ్ యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీవుల్లా, ఎమెల్యే నాంపల్లి మేరాజ్ హుస్సేన్, ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి షఫీవుల్లా పాల్గొన్నారు.

3న బీసీల ఛలో ఢిల్లీ: దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల సాధనకై (మొదటి దశలో 27 శాతం) కేంద్ర ప్రభుత్వం చేపట్టాల్సిన రాజ్యాంగ సవరణ కోసం ఈనెల 3న ఢిల్లీ వేదికగా నిర్వహించే బీసీల ఛలో ఢిల్లీ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు, బీసీ నాయకులు కలిసి రావాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ పిలుపునిచ్చారు. వివిధ పార్టీల్లో వివక్షను ఎదుర్కొంటున్న బీసీ నాయకులు చట్టసభల్లో బీసీ రిజర్వేషన్లను సాధించుకోగలిగినప్పుడే అవకాశాలు మెరుగుపడతాయని, తద్వారా తమ ప్రజలకు చేరువై సేవ చేసే అవకాశం లభిస్తుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్తగా ఆరుగురికి కరోనా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మంగళవారం 4112 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ఆరుగురు వైరస్ బారిన పడినట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు తెలిపారు. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరిందని వెల్లడించారు. ఒక్కరోజులో కరోనా నుంచి ఇద్దరు కోలుకోగా, ఇప్పటి వరకు కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరిందని వివరించారు. ప్రస్తుతం 25 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు.

పెట్రోల్ వాసన పీల్చేస్తున్నారు!

మత్తులో మునిగితేలుతున్న విద్యార్థులు ● డ్రగ్స్‌కు ప్రత్యామ్నాయంగా వైట్‌నర్, జిగురు, పెయిన్ కిల్లర్ల వినియోగం

హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 12 ఏళ్ల విద్యార్థి రాత్రిళ్లు సరిగా నిద్రపోకపోవటం, తరచూ ఒంటరిగా ఉండటాన్ని గమనించిన తల్లిదండ్రులు ఓ రిహాబిలిటేషన్ (పునరావాస) కేంద్రానికి తీసుకెళ్లారు. విద్యార్థిని పరిశీలించిన నిపుణులు.. ఆ అబ్బాయి పెట్రోల్ వాసనకు బానిసయ్యాడని చెప్పారు. దాంతో వారు విస్తుపోయారు. పెట్రోల్ వాసన పీల్చడమేంటని ప్రశ్నించగా.. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన ఆ అబ్బాయి డ్రగ్స్‌కు ప్రత్యామ్నాయంగా పెట్రోల్ వాసన పీల్చుతున్నట్లు చెప్పారు. రోజూ ఖర్చీఫ్‌లో ఐదారు చుక్కల పెట్రోల్‌ను పోసుకొని అవసరమైనప్పుడల్లా పీల్చుతూ.. మత్తులో జోగుతున్నట్లు తేల్చేశారు.



- చాక్లెట్లు, వేఫర్ల రూపంలోని ఎడిబుల్ డ్రగ్స్ వాడకం
- రిహాబిలిటేషన్ కేంద్రాలలో 100 మందికి పైగా బాధితులు
- బాలికల్లోనూ పెరుగుతున్న డ్రగ్స్ కల్చర్
- తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలంటున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: పాఠశాల విద్యార్థుల్లో మాదక ద్రవ్యాల వినియోగం పెరుగుతోంది. ముఖ్యంగా 8, ఆపై తరగతి పిల్లల్లో ఈ దురలవాటు ఎక్కువగా కనిపిస్తోంది. కొందరు మాదకద్రవ్యాలకు ప్రత్యామ్నాయంగా పెట్రోల్‌తో పాటు నొప్పి తగ్గించే కొన్ని నూనెలు, మందులు (పెయిన్ కిల్లర్స్), జిగురు, వైట్‌నర్ వంటివి వాడుతున్నారు. కొందరు ఎడిబుల్ (తినదగిన) డ్రగ్స్ వినియోగిస్తున్నారు. ఈ విధంగా మాదక ద్రవ్యాలకు బానిసలైన వందకు పైగా విద్యార్థులు ప్రస్తుతం రిహాబిలిటేషన్ కేంద్రాలలో చికిత్స పొందుతున్నారు. వీరిలో పలువురు బాలికలు కూడా ఉండటం గమనార్హం.

తల్లిదండ్రుల అప్రమత్తతే కీలకం

పిల్లలకు పాకెట్ మనీ ఇవ్వటం మాత్రమే కాదు దాన్ని ఎలా వినియోగిస్తున్నారో చూడటం కూడా తల్లిదండ్రుల బాధ్యత. కరోనా తర్వాతి నుంచి స్కూల్ విద్యార్థులలో స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరిగింది. అయితే వీరు ఇంటర్నెట్‌లో ఎక్కువగా ఎలాంటి సైట్లను చూస్తున్నారు? ఏ సమాచారాన్ని తెలుసుకుంటున్నారో తల్లిదండ్రులు గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు. క్రెడిట్, డెబిట్ కార్డులతో ఏ వస్తువులు కొనుగోలు చేస్తున్నారో పర్యవేక్షించాలని అంటున్నారు. ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడితే ఏ తరహా ఆటలాడుతున్నారో తెలుసుకోవాలని సూచిస్తున్నారు. లేకపోతే పిల్లలు చెడిపోయేందుకు అన్ని విధాలుగా అవకాశం ఇచ్చినట్టేనని స్పష్టం చేస్తున్నారు.

సొంతంగా ఎడిబుల్ డ్రగ్స్ తయారీ, విక్రయం!

గచ్చిబౌలిలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన మాజీ విద్యార్థిని ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. అతన్ని విచారిస్తే విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇంటర్నెట్ మీద మంచి పట్టున్న ఈ విద్యార్థి.. సొంతంగా హాష్ ఆయిల్, గంజాయితో ఎడిబుల్ (తినదగిన) డ్రగ్స్‌ను తయారు చేయడం నేర్చుకున్నాడు. చాక్లెట్లు, వేఫర్ల వంటి బేకరీ ఉత్పత్తులను కరిగించి హాష్ ఆయిల్‌ను కలిపి ఎండబెట్టి తిరిగి చాక్లెట్ల లాగా తయారు చేసి, ప్యాకింగ్ చేస్తున్నాడు. గేటెడ్ కమ్యూనిటీలలోని గ్రూపులు, వివిధ సామాజిక మాధ్యమాల గ్రూప్‌ల్లో చేరి, అందులోని స్కూల్ విద్యార్థులకు వీటి గురించి ప్రచారం చేస్తూ విక్రయిస్తున్నాడు. ఇల్లు, పాఠశాల ఆవరణలో ఈ చాక్లెట్లను తింటే తల్లిదండ్రులు, టీచర్లు గమనిస్తారని.. బాస్కెట్‌బాల్, స్కేటింగ్ వంటి క్రీడల శిక్షణ సమయంలో పిల్లలు వీటిని వినియోగిస్తున్నారని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ర్యాపిడో, డుంజో వంటి బైక్ సర్వీస్‌ల ద్వారా బుకింగ్ చేసి తెప్పించుకుంటున్నారని చెప్పారు. ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులైతే పార్టీ మూడ్‌ను మరింత పెంచేందుకు, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం వినియోగిస్తున్నట్లు విచారణలో బయటపడింది.

ఈ లక్షణాలుంటే అనుమానించాల్సిందే..

- ఒక్కసారిగా హైపర్ యాక్టివ్ అవుతారు. ఒక్కసారిగా బిగ్గరగా అరుస్తుంటారు.
- రాత్రివేళ సరిగ్గా నిద్ర పోరు. ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతుంటారు.
- శరీర బరువుగా క్రమంగా తగ్గుతుంటుంది. కళ్లు ఎర్రగా మారతాయి. తరచుగా కంటి చుక్కల మందులు వినియోగిస్తుంటారు.
- ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలలో చాలా ఉత్సాహంగా ఉంటారు.
- కోడ్ లాంగ్వేజ్‌లో మాట్లాడుతుంటారు. సోషల్ మీడియాలో చాటింగ్ చేస్తుంటారు.

చాక్లెట్లయితే హాని చేయవనుకుంటున్నారు..



ధూమపానం ద్వారా అయితే గాలి లోపలికి పీల్చుకోవాలి. అదే ఎడిబుల్ చాక్లెట్లయితే ఎలాంటి హాని ఉండదని విద్యార్థులు భావిస్తున్నారు. మత్తు పదార్థాలు ఏ రూపంలో అయినాసరే మెదడుపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. ప్రస్తుతం మా దగ్గర 15 మంది విద్యార్థులు కౌన్సెలింగ్ తీసుకుంటున్నారు. వీరిలో పలువురు బాలికలు కూడా ఉన్నారు.

– డాక్టర్ కె.దేవికారాణి, డైరెక్టర్, అమృత ఫౌండేషన్

6వ అంతస్తులోకి నో ఎంట్రీ!

- కొత్త సచివాలయంలో భద్రతకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- 6వ అంతస్తు మినహా ఇతర అంతస్తుల్లో సందర్శకులకు పరిమిత అనుమతి
- ప్రత్యేక గుర్తింపుకార్డులతో వారి కదలికలపై పర్యవేక్షణ
- 300 సీసీటీవీ కెమెరాలతో నిఘా ఏర్పాటు
- భద్రతాఏర్పాట్లపై సమీక్షలో సీఎస్ శాంతికుమారి ఆదేశం



ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: మరో 17 రోజుల్లో కొత్త సచివాలయ భవనం ప్రారంభంకానుంది. 8 అంతస్తులున్న ఈ భవనంలోని ఆరో అంతస్తు మినహా మిగిలినవాటిలోకి సందర్శకులను పరిమితంగా అనుమతించనున్నారు. ఈ చాంబర్‌లో ముఖ్యమంత్రి కొలువుదీరనున్న దృష్ట్యా అధికారులు భద్రతాపరమైన ఆంక్షలు విధించారు. హైదరాబాద్‌లో ఈ నెల 17న ప్రారంభించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయ భవనసముదాయంలో 300 సీసీ టీవీ కెమెరాలతో భద్రతను పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. సీసీటీవీలతోపాటు ఇతర భద్రతాచర్యల పర్యవేక్షణకు ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయ సందర్శకులకు కార్పొరేట్ కార్యాలయాల తరహాలో ప్రత్యేకంగా గుర్తింపుకార్డులను జారీ చేసి, వారి కదలికలను కనిపెట్టాలని సూచించారు. సీఎం చాంబర్ ఉండే 6వ అంతస్తు మినహా అన్ని అంతస్తుల్లో సందర్శకులను పరిమితంగా అనుమతించాలని నిర్ణయించారు. కొత్త సచివాలయంలో భద్రతా ఏర్పాట్లతోపాటు ఫిబ్రవరి 11న జరగనున్న ఫార్ములా ఈ–రేసింగ్ ఏర్పాట్లపై మంగళవారం ఆమె డీజీపీ అంజనీకుమార్‌తో కలిసి బీఆర్‌కేఆర్ భవన్‌లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

5 నుంచి రోడ్ల మూసివేత!

ఫిబ్రవరి 11న ఫార్ములా ఈ–రేస్ జరగనున్న నేపథ్యంలో తెలుగుతల్లి ఫ్లైఓవర్ నుంచి ఖైరతాబాద్ బ్రిడ్జి, మింట్ కాంపౌండ్ నుంచి ఐ–మాక్స్ వరకు రోడ్లను ఫిబ్రవరి 5 నుంచి మూసివేయాలని సమీక్షలో నిర్ణయించారు. ప్రత్యామ్నాయ మార్గాలపై నగరవాసులకు అవగాహన కల్పించాలని సీఎస్ ఆదేశించారు. ఫార్ములా ఈ–రేస్ సందర్భంగా సచివాలయ పనులకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఉన్నతస్థాయి సమీక్షలోని నిర్ణయాలు

- ఫిబ్రవరి 17న ప్రారంభించనున్న కొత్త సచివాలయానికి విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి.
- పోలీస్, రోడ్లు, భవనాలు, జీఏడీ, తెలంగాణ స్పెషల్ పోలీస్, ఐటీ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలి.
- 3 కంపెనీల తెలంగాణ స్పెషల్ పోలీస్, 300 మంది సిటీ పోలీస్ అధికారులతో భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి.
- సిటీ ట్రాఫిక్ విభాగం నుంచి 22 మంది ట్రాఫిక్ అధికారుల కేటాయింపు
- భద్రతలో భాగంగా బ్యాగేజ్, వెహికిల్, బాడీ స్కానర్లు, ఇతర పరికరాలను సమకూర్చుకోవాలి.
- మొత్తం 28 ఎకరాల్లో 9.42 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ నూతన సచివాలయంలో 560 కార్లు, 900పైగా ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు సదుపాయం
- సచివాలయం చుట్టూ ఆరు సెంట్రీ పోస్టులు
- 34 సిబ్బందితో రెండు ఫైరింజన్ల ఏర్పాటు. సచివాలయ భవనంలో ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు,
- దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఇప్పటికే జలమండలి ద్వారా నీటి సరఫరాకు చర్యలు. సీవరేజ్ పనుల పురోగతి.

‘కంటి వెలుగు’కు అనూహ్య స్పందన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న ‘కంటి వెలుగు’కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నాటికి 14,92,450 మంది కంటి పరీక్షలు చేయుంచుకున్నారు. మంగళవారం ఒక్క రోజే 2,11,184 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా...42 వేల మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 3,38,608 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు.

జనవరి 19 నుంచి రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం

జనవరి 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమైంది. కంటి వెలుగు వైద్య శిబిరాలు స్థానిక ప్రజా ప్రతినిధుల సమన్వయంతో సందడిగా ఉన్నాయి. క్యాంపుల నిర్వహణకు జిల్లా అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడంతో ఎక్కడ ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదు.

ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు..

ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరాలు కంటి పరీక్షలు చేస్తున్నాయి. వైద్య శిబిరాల్లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సహాయంతో కంటి పరీక్షలు చేస్తున్నారు. డీఈవో, ఏఎన్‌ఎంలు ట్యాబ్‌ల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారాన్ని నమోదు చేస్తున్నారు. కంటి పరీక్షల తర్వాత అదే వైద్య శిబిరంలో అవసరమైతే అక్కడికక్కడే రీడింగ్ గ్లాసులు పంపిణీ చేస్తున్నారు. దీంతో కంటి వైద్య శిబిరాల నిర్వహణపై ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ప్రభుత్వ సిబ్బందికి సంబంధిత కార్యాలయాలలో, పత్రిక విలేకరులకు ఆయా ప్రెస్‌క్లబ్‌ల వద్ద, పోలీస్ బెటాలియన్ సిబ్బందికి వారి కార్యాలయాల్లోనే ప్రత్యేకంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

హైదరాబాద్‌లో శాండోస్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్

దశలవారీగా 1,800 మందికి ఉద్యోగాలు ● మంత్రి కేటీఆర్‌తో శాండోస్ ప్రతినిధులు భేటీ



సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ కంపెనీ కార్యకలాపాలకు ‘విజ్ఞానపరమైన సేవలు’ (నాలెడ్జ్ సర్వీసెస్) అందించేందుకు హైదరాబాద్‌లో ‘గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్’ను ఏర్పాటు చేస్తున్నట్లు లైఫ్ సైన్సెస్ దిగ్గజ కంపెనీ ‘శాండోస్’ ప్రకటించింది. హైదరాబాద్‌లో ఏర్పాటయ్యే ఈ కేంద్రంలో ఆరంభంలో 800 మంది ఉద్యోగులు పనిచేస్తారని, దశలవారీగా ఈ సంఖ్య 1,800కు పెరుగుతుందని శాండోస్ ప్రకటించింది. కంపెనీ సీఈఓ రిచర్డ్ సెయినోర్ నేతృత్వంలోని శాండోస్ ప్రతినిధి బృందం మంగళవారం ప్రగతిభవన్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో సమావేశమైంది. ఇప్పటికే హైదరాబాద్ జీనోమ్ వ్యాలీలో ఉన్న తమ ఆధునిక పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని మరింత బలోపేతం చేస్తామని, ఆటోమేషన్‌తో పనిచేసే ప్రపంచస్థాయి ప్రయోగశాలను ఏర్పాటుచేస్తామని సంస్థ సీఈఓ ప్రకటించారు. హైదరాబాద్‌లో లైఫ్ సైన్సెస్ రంగానికి ఉన్న అనుకూలత వల్లే గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేయికి పైగా మాలిక్యూల్స్‌ను కలిగిన తమ సంస్థ 10 బిలియన్ డాలర్ల ఆదాయం పొందుతోందని శాండోస్ సీఈఓ తెలిపారు.

నోవార్టిస్ స్థాయిలో శాండోస్ కార్యకలాపాలు: కేటీఆర్

హైదరాబాద్‌లోని వ్యాపార అనుకూలత, మానవ వనరుల లభ్యతతో లైఫ్ సైన్సెస్ రంగం మరింత వృద్ధి సాధిస్తుందని శాండోస్ ప్రతినిధులతో భేటీ సందర్భంగా మంత్రి కేటీ రామారావు వ్యాఖ్యానించారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ప్రపంచ దిగ్గజ సంస్థ నోవార్టిస్ హైదరాబాద్‌లో రెండో అతిపెద్ద కార్యాలయం కలిగి ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ శాండోస్ కూడా అదేస్థాయిలో కార్యకలాపాలు విస్తరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. లైఫ్ సైన్సెస్ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, భవిష్యత్తు ప్రణాళికలపై శాండోస్ ప్రతినిధి బృందానికి మంత్రి కేటీఆర్ వివరాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న హైదరాబాద్ ఫార్మాసిటీ శాండోస్ తరహా కంపెనీల పెట్టుబడికి గమ్యస్థానంగా ఉంటుందని, ఫార్మాసిటీలో తయారీ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలు పరిశీలించాలని కేటీఆర్ కోరారు. ఈ భేటీలో శాండోస్ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ క్లేర్ డిబ్రూ హేలింగ్, డాక్టర్ వందనాసింగ్, నవీన్ గుల్లపల్లి, ఐటీ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, రాష్ట్ర లైఫ్ సైన్సెస్ డైరక్టర్ శక్తి నాగప్పన్ పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్య పథకానికి అనారోగ్యం

నగదు రహిత వైద్యం అందక ఉద్యోగుల గగ్గోలు

- ప్రైవేట్ ఆసుపత్రులకు సర్కారు రూ. 450 కోట్లు పెండింగ్
- దీంతో డబ్బులు చెల్లిస్తేనే వైద్యం అందిస్తామంటున్న ఆస్పత్రులు



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్)లో నగదు రహిత వైద్య సేవలు అందడం లేదు. దీంతో ఉద్యోగులు, పింఛన్‌దారుల్లోని రోగులు గగ్గోలు పెడుతున్నారు. నగదు రహిత ఆరోగ్య కార్డుతో వైద్యం చేయడానికి ప్రైవేట్ ఆసుపత్రులు ఏమాత్రం ఆసక్తి చూపడంలేదు. డబ్బులు చెల్లించనిదే లోపలికి ప్రవేశం కూడా కల్పించడం లేదు. దీంతో గత్యంతరం లేక ఉద్యోగులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వైద్యం పొందుతున్నారు. ఆరోగ్య పథకంతో తమకు ఏమాత్రం మేలు జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆసుపత్రులకు రూ. 450 కోట్ల బకాయిలు..

ఈ పథకం పరిధిలో దాదాపు 5.50 లక్షల మంది ఉద్యోగులు, పింఛన్‌దారులు ఉన్నారు. వారి కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 20 లక్షల మంది ఈ పథకం పరిధిలోకి వస్తారు. ఈహెచ్‌ఎస్‌తో రాష్ట్రంలో 236 ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులు, 96 ప్రభుత్వ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉద్యోగులకు సేవలందించాలి. వీటికితోడు మరో 67 డెంటల్ నెట్‌వర్క్ ప్రైవేటు ఆసుపత్రులు కూడా ఉన్నాయి. అంటే డెంటల్‌తో కలిపి ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు 303 ఉన్నాయి. ఆయా ఆసుపత్రుల్లో ప్రభుత్వం పేర్కొన్నట్లుగా దాదాపు 900 రకాల వ్యాధులకు వైద్యం చేయాలి. అందులో దాదాపు 300 నుంచి 400 రకాల వ్యాధులకు వివిధ రకాల ఆపరేషన్లు కూడా చేయాలి. ఈహెచ్‌ఎస్ కార్డు చూపిస్తే, ఎలాంటి ఫీజు లేకుండా వెంటనే అడ్మిషన్ ఇచ్చి వైద్యం చేయాలనేది ఈ పథకం ఉద్దేశం. ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆసుపత్రులు ప్రభుత్వ ఉద్యోగుల వినతులను పెడచెవిన పెడుతున్నాయి. దీంతో ఆసుపత్రుల తీరుపై ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఉద్యోగ సంఘాల నేతల లెక్కల ప్రకారం దాదాపు రూ. 450 కోట్లు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇంత సొమ్ము పెండింగ్‌లో ఉండటంతో నగదు రహిత వైద్యం చేయడానికి ఆసుపత్రులు విముఖత వ్యక్తం చేస్తున్నాయి.

రీయింబర్స్‌మెంట్‌తో మరో నరకం

ప్రభుత్వం ఈహెచ్‌ఎస్ పథకంతోపాటుగా రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కూడా అమలు చేస్తుంది. అంటే ఉద్యోగులు కానీ, వారి కుటుంబ సభ్యులు కానీ ఎవరైనా జబ్బు పడితే ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో సొంత డబ్బుతో చికిత్స చేయించుకోవాలి. ఆ తర్వాత ఆసుపత్రి నుంచి బిల్లులను తీసుకొని ప్రభుత్వానికి సమర్పిస్తే తిరిగి ఆ సొమ్ము వెనక్కు వస్తుంది. అయితే ఈహెచ్‌ఎస్ పథకం విఫలం కావడంతో ఉద్యోగులు మొత్తం రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడాల్సి వచ్చింది. కానీ రీయింబర్స్‌మెంట్ పథకంతో నరకయాతన పడుతున్నామని ఉద్యోగులు అంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వైద్య చికిత్స బిల్లులకు, అధికారులు చెల్లిస్తున్న సొమ్ముకు భారీ తేడా ఉండటమే దానికి కారణం. ముఖ్యంగా వయసు మీదపడిన పింఛన్‌దారులైతే లక్షలాది రూపాయలు ఆస్పత్రులకు చెల్లించి లక్ష రూపాయలలోపే రీయింబర్స్‌మెంట్ పొందుతున్నారు. దీంతో వారి పింఛన్ కాస్తా వైద్య ఖర్చులకే పోతుంది. ఇలా భార్యాభర్తలకు ఏదైనా జబ్బు వస్తే రిటైర్‌మెంట్ వయస్సులో ఇతర ఖర్చులకు కూడా డబ్బులు ఉండటంలేదు. వచ్చే రీయింబర్స్‌మెంట్ సొమ్ము కూడా ఆరు నెలల నుంచి ఏడాది కాలం వరకు పడుతుంది. ఇక 2005లో అప్పటి ప్రభుత్వం ఆనాటి ధరలకు అనుగుణంగా వివిధ చికిత్సలకు అయ్యే ఖర్చులను నిర్ధారించి ప్యాకేజీలను సిద్ధం చేసింది. 2007లో కొన్ని వ్యాధులకు ప్యాకేజీలను కూడా పెంచింది. బైపాస్ సర్జరీ, డబుల్ వాల్వ్ రిప్లేస్‌మెంట్, కిడ్నీ మార్పిడి, కేన్సర్, న్యూరో సర్జరీ వంటి వాటికి రూ. 2 లక్షల వరకు పెంచారు. వాటికి మినహా ఇతర అన్ని వ్యాధులకు 2005 ప్యాకేజీ ప్రకారమే రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారు. ఈహెచ్‌ఎస్ పథకం విజయవంతంగా అమలైతే రీయింబర్స్‌మెంట్ పద్ధతిని ఎత్తివేయాలన్నది యోచన.

కంట్రిబ్యూటరీ స్కీంకు ఉద్యోగుల సై...

ఈహెచ్‌ఎస్ పథకం కింద నగదు రహిత చికిత్స అంటే ఆసుపత్రులు లెక్క చేయడంలేదని, రీయింబర్స్‌మెంట్ కింద ఆర్థికంగా నష్టపోతున్నామని, కాబట్టి తాము ఒక శాతం వాటా చెల్లిస్తామని ఉద్యోగులు ముందుకు వచ్చారు. ప్రభుత్వం కూడా దీనిపై సుముఖంగా ఉన్నా, ఇంకా దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన జారీకాలేదు. ఒక శాతం వాటాతో రూ. 350 కోట్లు వసూలవుతాయి. అంతేమొత్తం ప్రభుత్వం జమ చేసి ఒక కార్పస్ ఫండ్‌ను పెట్టాలనే విషయంపై తర్జనభర్జన కొనసాగుతుంది.

ఈహెచ్‌ఎస్ స్కీం అమలుకావడంలేదు

ఉద్యోగులు, పింఛన్‌దారుల నగదు రహిత ఆరోగ్య పథకం పూర్తిస్థాయిలో అమలుకావడంలేదు. రీయింబర్స్‌మెంట్ కింద చికిత్సకు అయిన పూర్తి స్థాయి సొమ్ము కూడా రావడం లేదు. రూ. 10 లక్షల బిల్లులకు కూడా రూ. 2 లక్షలకు లోపే చెల్లిస్తున్నారు. దానికి కూడా ఆరు నెలల సమయం పడుతోంది.

– మామిళ్ల రాజేందర్, అధ్యక్షులు, టీఎన్‌జీవో

త్వరలో మటన్ క్యాంటీన్లు: దూదిమెట్ల

ఫిష్ క్యాంటీన్ల ఆదరణతో ఈ నిర్ణయమని వెల్లడి



సంపుటిని ఆవిష్కరిస్తున్న తలసాని, బాలరాజు

సాక్షి, హైదరాబాద్: గొర్రెల, మేకల ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో మటన్ క్యాంటీన్లు ప్రారంభిస్తామని గొర్రెల, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ వెల్లడించారు. ఫిష్ క్యాంటీన్ల ఆదరణతో వినియోగదారులకు అన్ని రకాల మటన్ ఉత్పత్తులుండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. సంస్థ చైర్మన్ దూదిమెట్ల ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో గొర్రెల, మేకల ఫెడరేషన్ వార్షిక పురోగతి సంపుటిని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దూదిమెట్ల మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి తలసాని ఆధ్వర్యంలో గొర్రెల పంపిణీ పథకానికి దేశవ్యాప్తంగా మంచి పేరు వచ్చిందన్నారు. గొర్రెల పెంపకందారుల సమస్యలు తెలుసుకోవడానికి పల్లెనిద్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బాలరాజ్ వెల్లడించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్, గొర్రెల, మేకల ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ రామ్‌చందర్, తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో మంజువాణి పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.